కాళిదాసు

# రఘువంశం



మహాకవి కాళిదాసు

# రఘువంశం

# రఘువంశం

వచన రచన :

**రెంటాల గోపాలకృష్ణ**

**జయంతి పబ్లికేషన్స్**

**కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.**

# RAGHU VAMSAM

By :

**RENTALA GOPALA KRISHNA**

**JAYANTHI PUBLICATIONS**

KARL MARX ROAD

VIJAYAWADA - 520 002.

Ph : **0866 - 2577828**

Mobile : **8978261496**

© **PUBLISHER**

Edition :

**2013**

PRICE **: ₹ 65-00**

D T P :

**SRI SRINIVASA GRAPHICS**

VIJAYAWADA - 521 108.

Ph : 9440397989

Printers :

**NAGENDRA ENTERPRISES**

VIJAYAWADA - 3.

# ఆముఖమ్

కాళిదాసు కావ్యాలలో రఘువంశం అనేక విధాల గొప్పది. ఆ మహాకవి కవితా మాధుర్యానికీ, ప్రతిభావ్యుత్పత్తులకూ, నికషోపలం ఈ కావ్యం! కనుకనే సంస్కృత విద్యార్థులు మొట్టమొదట రఘువంశ కావ్యాన్ని విధిగా అధ్యయనం చేస్తారు. వారి వారి యోగ్యతనూ, అర్హతనూ బట్టి, విజ్ఞుల, అల్పజ్ఞుల హృదయాలను కూడా అలరిస్తుంది ఈ హృద్యమైన కావ్యం.

సకల కావ్యరత్నమని చెప్పదగిన రఘువంశానికి పలువురు వ్యాఖ్యలు రచించారు. వీటిలో మల్లినాథసూరి, హేమాద్రి, చారిత్రవర్ధన, దక్షిణావర్త, సమితి విజయ, వల్లభ, ధర్మమేరు, విజయగణి, విజయానందసూరి చరణ సేవక, దినకర మిశ్ర ప్రభృతుల వ్యాఖ్యలు ప్రధానమైనవి.

అయితే కోలాచల మల్లినాథసూరి వ్యాఖ్యయందు తక్కిన వ్యాఖ్యలన్నీ దిగదుడుపు! కనుకనే అతని వ్యాఖ్య వచ్చిన తరువాత పూర్వపు వ్యాఖ్యాలన్నీ మూతబడ్డాయి!

'కాళిదాస గిరాం, సారాం,

కాళిదాసః సరస్వతీ'-

అట్టివాడు కాళిదాసు. కనుకనే అతను కవికుల గురువు అన్నాడు పక్షధర మిశ్ర బిరుదాంకితుడు జయదేవకవి. ఈ గురువు అప్పటికీ ఇప్పటికీ – ఎప్పటికీ గురువే! ఏ శిష్యుడూ ఇంతవరకు గురువును మించలేదు!

మరి, ఇలాంటి కాళిదాసు కవనాన్ని గురించి ఎవరు వర్ణించి చెప్పగలరు ? ఆ పని చేయడం కొంతలో కొంత, వ్యాఖ్యాతృ సార్వభౌముడు కోలాచల మల్లినాథ సూరికే చెల్లింది!

'ఉపమా కాళిదాసస్య'–

ఉపమానాలు చూచి చూచి, తూచి తూచి ప్రయోగించడంలో అతనికి అతనే సాటి! అర్థపుష్టికి కాళిదాసు పెట్టింది భిక్ష!

రమణీయమగు రఘువంశ కావ్యాన్ని సాధ్యమైనంత సరళ శైలిలో వచనంగా వ్రాశాను. నిజానికిది సాహసమే! మూలంలోని సొగసు పోనివ్వకుండా పట్టుక రావాలని ప్రయత్నించాను. ఎంత వరకు కృతకృత్యుడనయ్యానో పాఠకులకే ఎరుక.

ఇందలి అందచందాలన్నీ మహాకవి కాళిదాసువి, వికృతాలు ఏవి ఉన్నా, అవి నావి!

**- రెంటాల గోపాలకృష్ణ.**

# రఘువంశం

**వే**దాలకు మొదట ప్రణవం ఉన్నట్లు రాజులలో వైవస్వతమనువు మొదటివాడుగా ఉన్నాడు. ఆయన బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. దోషరహితమైన ఈ సూర్యవంశంలో పాలసముద్రాన చందమామ పుట్టినట్లు, పరిశుద్ధుడైన దిలీపుడనే రాజచంద్రుడు పుట్టాడు.

ఆయనిది విశాలమైన వక్షస్థలం. వృషభం మూపురం వంటి మూపురం. మనిషి సాలవృక్షం వలె చాలా ఎత్తు! ఆజానుబాహువులు.

దిలీపుని చూస్తుంటే క్షాత్రధర్మమైన పరాక్రమమే ఆ పురుషరూపం ధరించిందా అనిపిస్తుంది. భూతకోటిలో అన్నిటి కంటె బలమూ, తేజస్సూ కలవాడాయన. మనుష్యులలో అంత పొడవైనవాడు లేనేలేడు. మేరు పర్వతంలా ఆయన అంత పెద్ద దేహంతో భూమినంతా ఆక్రమించాడు.

ఆకారంతో సమానమైన ప్రజ్ఞ కూడా ఉన్నది ఆయనకు. ప్రజ్ఞకు సాటివచ్చే శాస్త్ర పరిజ్ఞానమూ ఉన్నది. ఆ శాస్త్ర పరిజ్ఞానానికి తగిన పనులే చేస్తాడాయన. ఆ పనులకు తగినట్టి ఫలితమూ పొందుతాడు.

సముద్రంలో తిమింగిలాది క్రూర జంతువులున్నాయి, ముత్యాలూ పగడాల వంటి రత్నసంపదా ఉన్నది. నౌకాయానం చేసే వర్తకులు మున్నగు వారికి సముద్రుడు భీకరుడుగా ఉంటాడు. రత్న సంపదా సమకూరుస్తాడు. అలాగే దిలీప మహారాజు కూడా తనను ఆశ్రయించిన వారికి తన తేజ ప్రతాపాదులతో భయంకరుడుగానూ, దయ–దాక్షిణ్యాది గుణాలచేత అవశ్యం ఆశ్రయించదగినవాడు గాను ఉంటున్నాడు.

నేర్పరి అయిన సారథి, చిరపరిచితమైన మార్గం నుండి కొంచెమైనా సరే రథచక్రాలు అటు – ఇటు తొలగనీయకుండా రథం నడుపుతాడు –

అలాగే దిలీపుడు తన పూర్వీకులైన మనువు మొదలు వస్తున్న ఆచార వ్యవహారాల నుండి ప్రజలను కొంచెమైనా తొలగనీయక గట్టి శిక్షణతో పరిపాలిస్తూ ఉన్నాడు.

ప్రజలకు శ్రేయస్సూ, సంపద చేకూర్చడం కోసమే వారి ఆదాయంలో ఆరవపాలు మాత్రం తాను స్వీకరించేవాడు దిలీపుడు. అవును మరి – తాను గ్రహించిన దానికి వేయిరెట్లు వదలడానికే సూర్యుడు జలం పీలుస్తున్నాడు.

ఆయనకు చతురంగ బలాలు అనేవి కేవలం రాజోపకరణంగా మాత్రమే ఉంటున్నాయి. కాని, వాటివలన ఏదో ప్రయోజనం సాధించడానికి కాదు. అయితే, ఆయన తన ప్రయోజనాలు సాధించుకోడానికి వేరే సాధనాలు ఉన్నాయి. శాస్త్రాలలో అప్రతిహతమైన బుద్ధిబలం, అదేపనిగా ధనుస్సును ఎక్కుపెట్టటం – ఇవి రెండే ఆ సాధనాలు!

దిలీపమహారాజు చేసే కార్యాలోచనలన్నీ గూడా చాలా గుప్తంగా ఉంటాయి. సంతోష సూచకములైన ముఖకవళికల వల్ల కాని, ఇతర చేష్టలద్వారా కాని వాటిని వెల్లడి కానివ్వడు. అయితే, ఆయన చేసే పనులు ఇతరులు ఎలా తెలుసుకోగలుగుతా రంటారేమో ? ఇప్పుడు మనం అనుభవించే శుభాశుభ ఫలాలను బట్టి, పూర్వజన్మలో మనం ఇలా చేసి ఉంటామని ఊహించుకున్నట్లే, తాత్కాలిక క్రియలను బట్టి ఇందుకోసం ఇలా చేసి ఉంటాడని ఊహామాత్రంగా తెలుసుకోవడం జరుగుతుంది.

ఆయన ధర్మార్థ కామముల కోసమే శరీర సంరక్షణ చేసుకుంటాడు. అంతేకాని దేహచ్యుతి కలుగుతుందేమోనన్న భయం వలన కాదు. ఆయనకు ఎలాంటి వ్యాధులూ లేవు. అయినా దానధర్మాలు చేస్తూ ఉంటాడు, యుద్ధాదుల వలన ద్రవ్యార్జన చేస్తాడు కాని ధనాపేక్ష వల్ల మాత్రం కాదు. సుఖాలు అనుభవిస్తాడు. కాని వాటిమీద ఆశక్తితో మాత్రం కాదు. ఆ విధంగా ఆయన భయమూ, వ్యాధీ, ధనాపేక్ష, సుఖాసక్తి లేకుండా రాజ్యపాలన చేస్తున్నాడు.

లోకులలోని గుణగుణాలను గురించి తెలుసుకోగల నేర్పు ఆయనకు ఉన్నది. లోకులలోని దుర్గుణాలు గ్రహించినప్పటికి వాటిని గురించి ప్రస్తావించడు దిలీపుడు. ప్రతీకారం చేయగల శక్తి సామర్థ్యాలు ఉండి కూడా, ఆయన, అపకారాలను మన్నిస్తాడేకాని పగ తీర్చుకోడు. గొప్ప దాతృత్వం కలిగి ఉండి కూడా తాను చేసిన త్యాగాలనుంచి బడాయిలు చెప్పుకోడాయన. ఇలా ఒకేచోట రెండేసి గుణాలు ఉండడం సకృత్తు. కానీ, దిలీప మహారాజులో అవి ఉన్నాయి.

ఆయన జితేంద్రియుడు. సకల విద్యా పారంగతుడు. ధర్మనిరతుడు. ఒక్క వయస్సు వల్ల ముసలితనం రాలేదు కాని తక్కిన అన్ని మంచి విషయాలలోనూ ఆయనకు వృద్ధత్వం అనగా ఔన్నత్యం ప్రాప్తించింది. ప్రజలందరినీ ఆయన మంచి మార్గాన నడిచేటట్లు చేస్తున్నాడు. భయమనేది లేకుండా వారిని సంరక్షిస్తున్నాడు. అన్న వస్త్రాదులిచ్చి పోషిస్తున్నాడు. కనుక ప్రజలకు, వారి తల్లిదండ్రులు కేవలం జన్మకారకులుగా మాత్రమే ఉన్నారు. తక్కిన అన్ని విధాల దిలీపుడే వారి తండ్రి.

ప్రజల క్షేమం కోసమే శిక్షార్హులైనవారిని శిక్షిస్తున్నాడాయన. సంతానం కోసమే భార్యను పరిగ్రహించాడు. కాబట్టి దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేస్తూ న్యాయంగా ధనం ఆర్జించాడు. సంతానార్థం యోగ్యకాలములందు మాత్రమే భార్యను పొందుతూ సదాచారవంతుడైనాడు. ఆ విధంగా ఆయన చేసే ప్రతి పనీ ధర్మాన్ని వృద్ధి పొందించడానికే ఉపయోగపడ్డాయి.

దిలీపుడు భూమియందలి ద్రవ్యాలను విస్తారంగా తీసుకుని వాటితో యజ్ఞయాగాదులు చేసి దేవతలను సంతుష్టి పరిచాడు. ఆ విధంగా స్వర్గాన్ని రక్షించినవాడైనాడు. ఇక దేవేంద్రుడు స్వర్గం నుంచి భూమిమీద వర్షం కురిసేటట్లు చేశాడు. దాని వలన పంట – పైరు సమృద్ధిగా ఉన్నది. ఆ

విధంగా ఇంద్రుడు భూలోకాన్ని సంరక్షించినవాడైనాడు. ఇలా దిలీపుడు, ఇంద్రుడూ పరస్పర సహాయంతో స్వర్గ భూలోకాలు రెంటినీ సంరక్షించుకున్న వారైనారు.

ప్రజలను కాపాడడంలో దిలీప మహారాజుదే ప్రథమ తాంబూలం. ఈ విషయంలో ఇతర రాజులెవరూ కూడా ఆయనతో సమానమైన కీర్తి పొందలేకపోయారు. ఎందుచేతనంటే దిలీపుని రాజ్యంలో దొంగతనం అంటే ఏమిటో ఎవరికీ తెలియదు!

యోగ్యులైన జనులు తనకు శత్రువులైనా సరే ఆయనకు ఇష్టులే, అవును మరి – రోగికి చేదుమందు కూడా ఇష్టంగానే ఉంటుంది. ఇక దుష్టులయిన జనులు తనకు మిత్రులయినా సరే ఆయనకు అయిష్టులు. అవును – పాము కాటువేసిన వ్రేలు ఎలా కోసివేస్తామో అలాగే వారిని త్యజిస్తాడాయన.

శ్రేష్ఠమైన పృధివ్యాధి పంచభూతసారం చేత ఆ దిలీపుని సృష్టించాడు బ్రహ్మ. ఏ విధంగానంటే, ఆయనలోని గుణాలన్నీ కూడా ఇతరుల ప్రయోజనం కోసమే ఉపయోగపడేవిగా ఉన్నాయి.

దిలీపమహారాజు భార్య పేరు సుదక్షిణాదేవి. దయా దాక్షిణ్యాలు గల ఆ సాధ్వీమతల్లికి ఆ పేరు స్థారకమయింది. ఉత్తమమైన మగధవంశంలో పుట్టిందామె. యజ్ఞానికి దక్షిణవలె ఆమె అన్ని విధాల దిలీపునకు తగిన ఇల్లాలు! అంతఃపురంలో అనేకమంది స్త్రీలున్నప్పటికీ మంచి మనస్సూ మనోహరమైన రూపమూ గల సుదక్షిణాదేవి వల్లా, సాటిలేని రాజ్యలక్ష్మి వల్లా తను మంచి భార్య కలవాడనని ఆయన భావించుకున్నాడు.

అయితే, ఇన్ని ఉన్నా దిలీప మహారాజుకు సంతానం లేదు. భార్య సుదక్షిణాదేవికి ఒక కుమారుడు కలిగితే బాగుండునని బహుకాలంగా ఆయన ఆపేక్ష పడుతూ వచ్చాడు. అలా కొన్నాళ్ళు గడిచాయి. పుత్ర సంతానప్రాప్తి

కలిగించే అనుష్ఠానం కోసం ఆయన తన రాజ్యపరిపాలనా భారాన్ని మంత్రులపై ఉంచాడు. తరవాత సుదక్షిణాదేవి, తాను పుత్ర సంతానం కోసం బ్రహ్మను పూజించారు. పిమ్మట వారిరువురూ తమ కులగురువైన వసిష్ఠ మహాముని ఆశ్రమానికి బయలుదేరారు.

వారు ఒక గొప్ప ధ్వనిగల రథం ఎక్కి వెళ్ళారు. నల్లటి రథం అది. ఆ రథం మీద తెల్లగా ఉండే దిలీపుడు, పచ్చగా ఉండే సుదక్షిణాదేవి వెడుతూవుంటే, నల్లటి మేఘం మీద తెల్లటి ఐరావతం అనే ఏనుగు, మెరుపు వెడుతున్నట్లు అనిపించింది.

ముని ఆశ్రమానికి వెడుతున్నారు కాబట్టి, అక్కడ మహర్షికి భాధ, ఇబ్బంది లేకుండా కొద్ది పరివారాన్ని మాత్రమే వెంటపెట్టుకుని వెళ్ళారు వారు. పరివారం మితంగానే ఉన్నప్పటికి ఆ దిలీపమహారాజు ప్రభావాతిశయం వల్ల పెద్ద సైన్యం ఆయన వెంట ఉన్నట్లు కనిపించింది.

వారి ప్రయాణంలో చల్లని మెల్లనిగాలి వీచింది. సాలవృక్షరస పరిమళంతో కూడిన గాలి అది. పుప్పొడులు రాలుస్తూ ఉన్న ఆ గాలి ప్రయాణంలో వారికి ఎంతో హాయి, ఆనందం కలిగించింది. దిలీపుడలా ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు ఆ రథ చక్రాల ధ్వని మేఘగర్జన అనుకుని నెమళ్ళు మోములెత్తి మనోహరంగా కూశాయి. త్రోవలో మగజింకలు, ఆడజింకలు ఎన్నో ఆ రథం వంక బెదరిబెదరి చూచాయి. సుదక్షిణ, దిలీపుడు కూడా తమ కళ్ళ వంటి కళ్ళుగల ఆ జింకలవంకే చూచారు.

ఒకచోట స్తంభాలులేని బహిద్ద్వారానికి తోరణాలు కట్టినట్లు సారసపక్షులు బారులు తీరి కలకల ధ్వనులు చేస్తూ పోతూ ఉండడం చూచి వారు ఎంతో ఆనందించారు. కోర్కె సిద్ధిస్తుందనడానికి సూచనగా ప్రయాణం అన్ని విధాలా వారికి అనుకూలంగా ఉన్నది.

వెనుకవైపు నుంచి గాలి వీచడం వల్ల, గుర్రాల వేగానికి ఎగజిమ్మే దుమ్ము సుదక్షిణాదేవి ముంగురుల మీదగాని, దిలీపమహారాజు తలపాగా పైనగాని పడడం లేదు. అనగా గాలి కూడా వారికి అనుకూలంగా వీచిందన్నమాట. త్రోవలో తామరకొలనుల అలలవల్ల చల్లనై తామరపూల వాసనలు వచ్చాయి. వారి విశ్వాసాలకు తగిన పరిమళం అది. ఆ విధంగా పరిమళం కూడా వారికి అనుకూలంగా ఉన్నది.

పూర్వం వారు బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలు మధ్యలో తగిలాయి. యజ్ఞాలు చేయడం వల్ల అక్కడ యూపస్తంభాల గుర్తులు కనిపిస్తున్నాయి. ఆ గ్రామాలలోని బ్రాహ్మణులవల్ల వారు అర్ఘ్యపాద్యాదులు, ఆశీర్వచనాలు పొందారు.

క్రితం రోజు పిండిన ఆవుపాల నుండి తీసిన వెన్నకాచిన నేతి దుత్తలు నెత్తిన పెట్టుకొని పోతున్న గొల్లపల్లెల్లోని ముసలివారు వారికి కనిపించారు. త్రోవలో కనిపించే చెట్లపేర్లు వారిని అడిగి తెలుసుకుంటూ ప్రయాణం చేశారు.

శ్రేష్టమైన అలంకారాలు ధరించి వెడుతున్న ఆ రాజదంపతులకు ఒక అనిర్వచనీయమైన శోభ చేకూరింది. మంచుకురిసే కాలం వెళ్ళిపోయిన పిదప చిత్తా నక్షత్ర చంద్రులకు కలిగే శోభలాంటి శోభ అది. వస్తు పరిజ్ఞానంలో బుధునితో సమానుడు దిలీపుడు. ఆయన భార్యకు ఆ యా వస్తువులను గురించి, వాటి విశేషాలను గురించి ముచ్చట్లు చెపుతూ ఉన్నందున వారికి ప్రయాణం చేసినట్లే అనిపించలేదు.

ఆ విధంగా సాటిలేని కీర్తిగల దిలీపమహారాజు భార్యా సమేతంగా సాయంకాలం వేళకు వసిష్ఠ మహాముని ఆశ్రమం చేరుకున్నాడు. అప్పటికి ఆయన గుర్రాలు బాగా అలసిపోయాయి.

ఆ సమయంలో ఎక్కడ చూసినా ఋషులు వారికి ఎదురు పడ్డారు. వారు చుట్టుపక్కల వనాల నుండి దర్భలు, సమిధలు, పండ్లు తెచ్చుకుంటున్నారు.

ఋషుల పర్ణశాలలతో నిండివున్న ప్రదేశం అది. ఆ పర్ణశాలలో జింకలు ఋషిభార్యల బిడ్డలవలె స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. అవి తృణధాన్యం కొంత తింటూ త్రోవకు అడ్డం వస్తున్నాయి.

మునికన్యలు చెట్లపాదులలో నీళ్ళుపోసి, ఆ నీళ్ళు పక్షులు కూడా త్రాగాలన్న తలంపుతో వెంటనే  అక్కడ నుంచి వెళ్ళిపోతున్నారు. ఎండ తగ్గిపోవటం వల్ల పర్ణశాలల ముంగిళ్ళలో తృణధాన్యాలు కుప్పచేశారు. అక్కడ జింకలు నెమరు వేస్తున్నాయి. ఋషులు త్రేతాగ్నులు ప్రజ్వలింపచేశారు. వాటి నుండి పొగలు లేచి అంతటా ఆక్రమించుకుంటున్నాయి. ఆ పొగతో పాటు వ్రేల్చే ఆహుతుల వాసన కూడా గుప్పున వస్తున్నది. అడుగు పెట్టిన వారందరినీ పవిత్రం చేసే ఆశ్రమం అది.

అలాంటి వసిష్టమహర్షి ఆశ్రమం చేరుకోగానే దిలీప మహారాజు, సుదక్షిణాదేవిని రథం నుండి దించాడు. గుర్రాలను సేదతీర్చమని సారథికి ఆజ్ఞాపించాడు.

జితేంద్రియులూ,శాస్త్రవేత్తలు అయిన మహర్షులు సభలో ఉండి సంరక్షించుట చేత, సత్కళత్రం కలవాడు కావటం వల్ల దిలీపుడు పూజార్హుడు. అందువల్ల వసిష్ఠ మహాముని ఆశ్రమంలో ఆయనకు సముచిత గౌరవ మర్యాదలు జరిగాయి.

సాయంకాలం వేళ జపహోమాది అనుష్ఠానాలు ముగిసేటప్పుడు స్వాహాదేవి యజ్ఞేశ్వరుణ్ణి పూజించినట్లుగా అప్పుడక్కడ అరుంధతీదేవి వసిష్ఠమహర్షిని పూజిస్తున్నది. అలా అరుంధతివల్ల పూజలందుకుంటూ తపోనిధి అయిన వశిష్ఠుడు దిలీపమహారాజును చూచాడు.

మగధరాజు కుమార్తె అయిన సుదక్షిణాదేవి, మహాత్ముడయిన దిలీపుడు తమ గురువైన వసిష్ఠులవారికి, ఆయన ధర్మపత్ని అయిన అరుంధతీదేవికి

పాదాభివందనం చేశారు. వారు అలా మ్రొక్కినప్పుడు మహర్షిదంపతులు చాలా సంతోషించారు. రాజదంపతులను మనసారా ఆశీర్వదించారు.

వసిష్ఠాశ్రమంలో ఉపచారాలవల్ల దిలీపమహారాజు ప్రయాణ బడలిక తీర్చుకున్నాడు. అంతట వశిష్ఠుడు రాజ్యం అనే ఆశ్రమంలో మునిగా ఉండే దిలీపుని యోగక్షేమాలు విచారించాడు. మంత్రులూ, మిత్రులూ–అందరి క్షేమ సమాచారం అడిగాడు. రాజ్యంలో అంతా సుభిక్షంగా ఉన్నది కదా అని ప్రశ్నించాడు.

మాట్లాడడంలో గొప్ప నేర్పుకలవాడు దిలీపుడు. శత్రురాజ్యాలను జయించి అపార ధనానికి అధిపతిగా ఉన్నవాడు. అలాంటి దిలీపుడు ఇష్టార్థసిద్ధిని కలుగజేసే అథర్వణవేదంలో దక్షుడయిన వసిష్టమహర్షికి ఇలా చెప్పడం మొదలుపెట్టాడు,

"ఓ గురుదేవా! నా సప్తరాజ్యాంగాలూ క్షేమంగా ఉన్నాయి. సమృద్ధములై ఉన్నాయి. ఒకవేళ దైవికములైన అగ్ని, వరద, వ్యాధి దుర్భిక్షం, సంఘాత మరణం లాంటి విపత్తులు సంభవించినా, లేక మానుష సంబంధమైన ఆయుధాలు, దొంగలు, విరోధులు, రాజవల్లభులు, రాజకార్పణ్యాలు లాంటి వ్యసనాలు ఏవైనా తటస్థించినా వాటిని తక్షణం నివారించడానికి సమర్థులైన తమరు ఉండనే ఉన్నారు. కాబట్టి ఇంక మాకు భయమేమున్నది?

'మహా మంత్రవేత్తలైన తమ మంత్రాలే మా శత్రువులను పరోక్షంగా శాంతి పొందిస్తున్నవి. నా బాణాలు కేవలం ప్రత్యక్షంగా మాత్రమే గురి తగిలేవిగా ఉన్నవి. హవనకర్తలైన మీరు యధావిధిగా అగ్నులలో ఉంచే హవిస్సులు, ఎండిపోయే పైరులకు వాన కురిపిస్తున్నాయి. ప్రజలు నిండా నూరేళ్ళు బ్రతికినప్పటికీ, వ్యాధి అనేది ఎరుగరు. అతివృష్టి, అనావృష్టి, మిడుతలు – మున్నగు ఈతిబాధలు లేకుండా ఉంటున్నారు. మీ అధ్యయనాలు, జప తప హోమాదులే అందుకు కారణం.

ఇంతటి మహా మహిమాన్వితులూ, బ్రహ్మ వంశోద్భవులూ అయిన మీరు మాకు కులగురువులుగా ఉండగా, ఇక మాకు కష్టం ఎలా వస్తుంది? మా సంపదలకు ముప్పూ, విచ్ఛిత్తి ఎలా కలుగుతుంది?

అయినప్పటికీ ఒకే ఒక దిగులు నన్ను బాధిస్తున్నది. మహాత్మా ! సప్త ద్వీపాలతో కూడిన ఈ భూమి ఎన్నో రత్నాలు ఇస్తున్నది. అయినా మీ కోడలు అగు ఈ సుదక్షిణ యందు మాతో సమానుడగు పుత్రుడనే శ్రేష్ఠమగు రత్నాన్ని మాత్రం ప్రసాదించలేకపోయింది. అదే మాకు సంకటంగా ఉన్నది గురువర్యా!

శ్రాద్ధసమయాలలో స్వధా అనే పితృదేవతలకు నేను సమర్పించే అన్నం తినాలని ఆసక్తిగా ఉండి కూడా వారు తృప్తిగా భుజించడం లేదు. నా తరువాత పిండ ప్రధానం చేసేవారెవరూ లేరన్న తలపులతోనే నేను పెట్టే శ్రాద్ధాలు శాశ్వతం కాదని వారు ఇలా చేస్తున్నారు. నా అనంతరం తిలోదకాలు ఇచ్చేవారు లేరని నా పితృదేవతలు నిట్టూర్పులు విడుస్తారు. కనుకనే నేను సమర్పించే జలం కొంచెం వెచ్చగా ఉంటున్నది, మరి అలాంటి ఉదకం వారు ఎలా పుచ్చుకుంటారు స్వామీ?

గురుదేవా! నేను యజ్ఞ యాగాదులెన్నో చేసి దేవతల ఋణం తీర్చుకున్నాను. ఆ విషయంలో పరిశుద్ధుడనై ప్రకాశమానుడుగా ఉన్నాను. అయితే పితరులు ఋణం నుండి విముక్తుడను కానందున ఆ విషయంలో ప్రకాశం లేకుండా ఉన్నాను. అందువల్ల నేను లోకాలోక పర్వతంలా ఉన్నాను! జపమూ, తపమూ, దానమూ మున్నగు పుణ్యకార్యాలు పరలోక సౌఖ్యాలకు మాత్రమే ప్రధాన సాధనాలుగా ఉంటున్నవి – మరి గొప్ప వంశంలో కలిగే సంతానం అంటారా – అది ఇహ పర సౌఖ్యాలు – రెంటికీ సాధన మవుతున్నది.

ఓ మహర్షీ! తాము స్వయముగా దేనినైనా సృష్టించగల శక్తి కలవారు. నేనంటే తమకు అమితమైన ప్రేమ ఉన్నది. మరి – అలాంటి వారు

సంతానహీనుడనైన నన్ను చూచి ఎందుకని చింతించడంలేదు ? – తమ ఆశ్రమంలో తాము స్వయంగా చెట్లకు నీళ్ళు పోసి పెంచుతున్నారు. మరి ఆ చెట్లలో ఏదైనా చెట్టు ఫలించక గొడ్డుగా ఉంటే మీరు చూడగలరా ? మజ్జన రహితమైన ఏనుగుకు మర్మభేది అయిన బంధన స్తంబం ఎంత బాధాకరమో నా పితృదేవతల ఋణం అంత భరించరానిది మహాత్మా!

"ఓ తండ్రీ వసిష్టమహామునీ! ఇక్ష్వాకు వంశస్థులకు అసాధ్యములైన కార్యాలను సిద్ధింపజేయు సమర్థులు మీరు. కాబట్టి, సంతాన భాగ్యం పొందడానికి, పితృఋణం నుండి విముక్తుడను కావడానికి నాకు ఏదైనా ఉపాయం చెప్పండి. ఏదైనా చెయ్యండి."

దిలీపమహారాజు ఇలా దీనంగా ప్రార్థించగా విన్నాడు వసిష్ట మహర్షి. ఒక్క క్షణం ధ్యానంలో ఉండిపోయాడు. చేపలు నిద్రపోతూ ఉన్నప్పుడు మడుగు ఎలా ఉంటుందో, అలా నిశ్చలమైన నేత్రాలతో క్షణంసేపు కదలకుండా ఉన్నాడు.

అలా ఉండి దిలీపమహారాజుకు సంతానం కలగకపోవడానికి కారణం ఏమిటో దివ్యదృష్టి వల్ల తెలుసుకున్నాడు. తరవాత దిలీపునకు ఇలా చెప్పాడు,

"మహారాజా! ఒక విషయం చెపుతాను విను – పూర్వం నీవు దేవేంద్రుని సందర్శించి తిరిగి భూలోకానికి వస్తూ ఉండగా ఒకచోట కల్పవృక్షం నీడలో కామధేనువు ఉంది. కానీ నీవా కామధేనువును సత్కరించకుండా వచ్చేశావు.

కామధేనువును ప్రదక్షిణ, నమస్కారాదులచే పూజించవలసి ఉన్నది. అయితే ఆ సమయంలో నీవు పరధ్యానంగా ఉన్నావు. ఋతుస్నానం చేసిన రాణి సుదక్షిణాదేవిని సంగమింపని యడల భ్రూణహత్యా దోషం సంభవిస్తుందే అని భయపడుతూ ఆ విషయాన్నే అప్పుడు తలుచుకుంటున్నావు. అందువల్ల కామధేనువును పూజించకుండా వచ్చావు. అప్పుడు ఆ కామధేనువు 'నన్ను

తిరస్కరించావు. కాబట్టి నా సంతతిని పూజించకుండా నీకు సంతానము కలుగదు' అని నిన్ను శపించింది.

ఆ సమయంలో, మదించిన దిగ్గజం ఆకాశగంగలో యధేచ్ఛగా మునుగుతూ పెద్ద ధ్వనిచేస్తూ ఉన్నందున కామధేనువు శాపం నీవుగాని, నీ రథసారధిగాని వినలేదు. దిలీపా! ఆ కామధేనువు శాపమే నీకు సంతానం కలుగకుండా ప్రతిబంధకమైంది. అవును – పూజార్హులైన వారిని పూజించక పోతే శ్రేయస్సు కలుగదు. ఆ కామధేనువిప్పుడు అనేక సర్పాలచే ఆవరించబడిన వాకిలి గల పాతాళలోకంలో ఉన్నది. అక్కడ వరుణుడు బహుకాలంగా చేస్తున్న యాగానికి ఆజ్యం మొదలైన హవిస్సులను ప్రసాదిస్తున్నది. కాబట్టి నీవిప్పుడు భార్యతోగూడా, ఆ కామధేనువు పుత్రిక అయిన నంధినీధేనువును పూజించు. తన సంతానాన్ని పూజించినందుకు సంతసించి కామధేనువు నీ కోర్కె నెరవేరుస్తుంది."

వసిష్ఠమహర్షి దిలీపునితో ఇలా చెపుతూ ఉండగానే, ఋషుల హవనములకు సహాయభూతురాలైన నందిని అనే ధేనువు వనం నుండి అప్పుడక్కడికి వచ్చింది! చిగురుటాకులవలె స్నిగ్ధమై ఎర్రని వర్ణంలో ఉన్న ఆ నందిని ముఖాన, మచ్చవలె కొన్ని వంకరలైన తెల్లవెంట్రుకలు మొలిచి ఉన్నాయి. అందువల్ల ఆ ధేనువు లేతచంద్రుని ధరించిన సంధ్య వలె కనిపించింది!

ఆ గోవు కుండవంటి పొదుగు గలది. చూడను చూడగానే చేపి, క్షీరధారలతో భూమిని తడుపుతున్నది. అవభృథ స్నానం కంటే కూడా పవిత్రమైన ఆ పాలు కొంచెం ఉష్ణంగా ఉన్నాయి.

నందనీధేనువు గిట్టలచే ధూళి రేగింది. అది దగ్గరలో ఉన్న దిలీప మహారాజుకు సోకింది. అందువల్ల పుణ్యతీర్థంలో మునిగినట్లుగా ఆయన పరిశుద్ధుడైనాడు. అవును – విభూతి స్నానం, ఆగ్నేయస్నానం, జలస్నానం,

వారుణస్నానం, మంత్రమార్జనస్నానం, బ్రహ్మస్నానం, గోధూళిస్నానం, వాయవ్యస్నానం – ఈ ఎనిమిది రకాల స్నానాలూ మానవులను పవిత్రులుగా చేస్తాయని ధర్మశాస్త్రం.

శుక్షాశుభ శకునాలను గురించి లెస్సగా తెలిసినవాడు, తపోనిధి అయిన వసిష్ఠుడు, దిలీపమహారాజు మనోరథసిద్ధికి శుభసూచకంగా నందినీధేనువు దర్శన ఇవ్వడం చూచాడు. మరల రాజుతో ఇలా అన్నాడు.

"ఓ రాజా ! మంగళప్రదమైన నందినీధేనువును గురించి మనం మాట్లాడుకుంటున్న సమయంలోనే అది ఇక్కడికి వచ్చింది. కాబట్టి నీ కోరిక అతి త్వరలోనే సిద్ధించగలదు. నీవు కందమూలాదులను ఆహారంగా స్వీకరిస్తూ, అభ్యాసంతో విద్యను వశం చేసుకున్నట్లుగా! నందినీధేనువును నిరంతరం అనుసరిస్తూ దానిని ప్రసన్నురాలుగా చేసుకోవలసినది. నందినిని అనుసరించడం ఎలాగో చెపుతాను విను – అది బయలుదేరి వెడుతున్నప్పుడు నీవూ బయలుదేరి దానివెంట వెళ్ళాలి. అది నిలుచుంటే నీవూ నిలుచోవాలి. నీ భార్య సుదక్షణాదేవి కూడా భక్తితో నియతచిత్తురాలై ఈ నంధినీధేనువును పూజించాలి. ఉదయం ధేనువు వెంట తపోవనాలకు వెళ్ళాలి. అలాగే సాయంకాలం అది తిరిగివచ్చే సమయానికి ఎదురుగా వెళ్ళి దానిని పిలుచుకొని రావాలి.

దిలీపా ! ఈ విధంగా నీవు నందినీధేనువు అనుగ్రహం కలిగేటంత వరకూ దానిని సేవించాలి. ఈ కార్యంలో నీకు ఎలాంటి విఘ్నం కలుగకుండు గాక! తరువాత నీకు నీ తండ్రిలాగానే మంచి కుమాళ్ళు జన్మిస్తారు."

తమ గురువు ఇలా చెప్పగానే దిలీపుడు, ఆయన భార్య చాలా సంతోషించారు.

"మహా ప్రసాదం. తమ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాను" అని పలికారు.

తరువాత విద్వాంసుడు, సత్యవంతుడు, బ్రహ్మపుత్రుడు అయిన వసిష్ఠుడు దిలీపమహారాజును నిద్రించవలసినదిగా కోరాడు. వ్రతాలు ఆచరించే విధానం లెస్సగా తెలిసిన వసిష్ఠుడు, దిలీపమహారాజు శయనించడానికై దర్భలతో పాన్పు మున్నగు సామగ్రులు తెప్పించి తగు ఏర్పాట్లు చేశాడు. రాజులకు యోగ్యమైన భోగవస్తువులు సమకూర్చే సామర్థ్యం ఉన్నప్పటికీ, నియమం కోసం ఆయన అలా చేశాడు.

దిలీపుడు ఆ రాత్రి వసిష్ఠమహర్షి ఆశ్రమంలో భార్యా సమేతుడై ఆయన ఏర్పాటు చేసిన దర్భలపాన్పు మీద శయనించి సుఖనిద్ర చెందాడు. వేకువజామున వసిష్ఠ మహర్షి శిష్యులు వేదపఠనం చేస్తూ ఉండగా ఆయనకు మెలకువ వచ్చింది.

## 2

**తె**ల్లవారగానే దిలీపరాజు అనుమతి ప్రకారం ఆయన భార్య సుదక్షిణాదేవి నందినీధేనువును గంధ, పుష్పాక్షతలతో పూజించి పూల మాలలతో అలంకరించింది. దూడ పాలు త్రాగిన తరువాత దిలీపుడు దాన్ని కట్టివేసి, గోవును వనంలోకి తోలాడు.

పతివ్రతా శిరోమణి అయిన సుదక్షిణాదేవి,ఆ గోవు వెంట వెళ్ళింది. గిట్టల వల్ల రేగిన ధూళితో, ధేనువు వెళ్ళినంత దూరం పవిత్రమవుతూ ఉండగా సుదక్షిణాదేవి ఆ మార్గాన్నే వెళ్ళింది. ఆమె అలా వెళ్ళడం వేదార్థాన్ని స్మృతులు అనుసరించినట్లుగా ఉన్నది!

తరువాత దిలీపుడు భార్యను వెనుకకు మరలించి, నందినీధేనువు సంరక్షణకార్యం తాను చేపట్టాడు. నాలుగు సముద్రాలతో చుట్టుకొనబడిన భూమిని సంరక్షించినట్లుగా ఆయన, నాలుగు సముద్రాలకూ ప్రాతినిధ్యం వహిస్తూ నాలుగు స్తనాలు గల ఆ గోవును సంరక్షించాడు.

మనువంశస్థులు మరొకరి సహాయం లేకుండానే, శౌర్యపరాక్రమాలతో తమ్ము తాము రక్షించుకోగల సమర్థులు. కనుకనే దిలీపుడు తన పరివారాన్ని, భటులను పంపివేసి, ఎవరి సహాయంతో నిమిత్తం లేకుండా తానొక్కడే నందిని సంరక్షణ భారాన్ని చేపట్టాడు. ఆ గోవుకు రసవంతములైన పచ్చి గడ్డిపరకలు ఆహారంగా అందిస్తూ, దాని వంటిమీద గీరుతూ, అడవి ఈగలను తోలుతూ, ఎలాంటి కష్టమూ, ఆటంకమూ లేకుండా అది స్వేచ్ఛగా సంచరించే అవకాశం కలిగిస్తూ దిలీపుడు నందినీధేనువుకు శ్రద్ధాభక్తులతో శుశ్రూష చేస్తూ వచ్చాడు.

గోవు నిలిస్తే తాను నిలుస్తున్నాడు. అది నడిస్తే తాను నడుస్తున్నాడు. అది పడుకుంటే తానూ పడుకుంటున్నాడు. అది నీళ్ళు త్రాగితే తానూ నీళ్ళు త్రాడుతున్నాడు. ఆ విధంగా నందినీధేనువును నీడలా అనుసరించి ఉన్నాడు దిలీపుడు!

అప్పుడు దిలీపుడు తన రాజచిహ్నాలన్నీ పరిత్యజించి ఉన్నాడు. ఛత్ర ఛామరాదులేవీ లేవు. అయినప్పటికీ రాజ్యలక్ష్మిని ధరించివున్న ఆయన గొప్ప తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. మదజలరేఖలు బయటికి కనుపించక పోయినప్పటికీ, అంతర్భూతమైన మదం వలన అవస్థ పొందివున్న గజేంద్రుని వలెనే, గొప్ప కాంతిగల దిలీపుని చూడగానే ఆయన రాజశ్రేష్ఠుడని ఎవరైనా ఇట్టే ఊహించుకోగలరు.

దిలీపమహారాజు తన తలవెంట్రుకలను వంకరలుగా ఉన్న సన్నని తీగెలచేత పైకి ఎత్తి కట్టుకున్నాడు. ధనస్సును ఎక్కుపెట్టుకొని, వసిష్ఠుని హోమకార్యాలకు ఉపయోగపడే నందినీధేనువును రక్షించాడు. ఆయన అలా వనాలలో సంచరిస్తూ ఉంటే, ఈ నెపంతో ఆయన అడవులలోని క్రూర మృగాలను శిక్షిస్తున్నాడా అనిపించింది!

ఇప్పుడాయనవెంట, ఇరువైపులా భటులెవరూ లేరు. అయినప్పటికీ ఆయన వనాలలో వెడుతుంటే, రెండువైపులా ఉండే చెట్లే ఆయన భృత్యులవలె

కనిపించాయి. ఆ చెట్ల మీద గల పక్షుల ధ్వనులే, త్రోవలో విశేషాలు ఆయనకు చెపుతూ, చూపుతూ ఉన్నట్లనిపించాయి!

వాయువుకు స్నేహితుడైన అగ్నిహోత్రునివలె దిలీపుడు వనాలలో సంచరిస్తున్నాడు. అప్పుడు తన స్నేహితుడైన అగ్నిహోత్రుని సంతోషపెట్టడానికై గాలి వీచగా, ఆ గాలికి అల్లలాడే లేత తీగలనుండి దిలీపునిపై పుష్పాలు రాలాయి. నగరంలో కన్యలు గౌరవార్థం రాజుపై చల్లే పేలాల వలె ఉన్నాయి ఆ పూలు !

ధనస్సు చేతబట్టి ఉండడంచేత దిలీపుడు చూడ భయంకరుడుగా ఉన్నప్పటికీ భయాన్ని పోగొట్టే దయారసం తొణికిస లాడే ప్రసన్న వదనమూ, సుందరరూపమూ ఆయనవి. అందువల్లనే ఆడజింకలు నిర్భయంగా కళ్ళు విప్పార్చి ఆయనవంక తదేకంగా చూస్తున్నాయి. అలా చూడడం వల్ల వాటి కనుల విశాలత్వానికి సార్థకత చేకూరింది!

వెదుళ్ళలో గాలి చేరడం వల్ల అవి శ్రావ్యంగా ధ్వనులు చేస్తున్నాయి. ఆ వేణునాదం విన్నాడు దిలీపుడు. పొదరిండ్లలోని వనదేవతలు ఆయన కీర్తిని పొగడుతున్నట్లుగా ఉన్నది ఆ వేణునాదం!

వ్రతనిష్ఠలో ఉండి గొడుగు మొదలైన సౌకర్యాలు లేనందున దిలీపుడు ఎండవేడికి ఒడలిపోతున్నాడు. అయితే ఆయన ఆచారవంతుడు కావడం వల్ల జగత్తును పావనం చేసే వాయువు ఆయనను సేవిస్తున్నది. చెట్లను కదలుస్తూ, వాటి పుష్పపరిమళాన్ని, కొండవాగుల తుంపరలను వెదజల్లుతూ చల్లని – మెల్లని గాలి వీచి దిలీపమహారాజు ప్రయాణ బడలికను పోగొట్టింది. ఆయన సమస్తభూతాలకు రక్షకుడు కావడం వల్ల ఆయన వనంలో అడుగుపెట్టగానే వర్షం లేకుండానే కార్చిచ్చు దానంతట అదే చల్లారింది. వనవృక్షాలు పుష్కలంగా పూలుపూశాయి, పండ్లు పండాయి. పెద్ద పులులు,

సింహాలు మొదలైన క్రూర మృగాలు కూడా, లేళ్ళు మొదలైన దుర్బల జంతువులను హింసించడం మానుకున్నాయి.

ఆ విధంగా నందినీధేనువు యధేచ్ఛగా వనమంతా తిరిగి, దానిని పావనమొనర్చి సాయంకాలం వేళకు తిరిగి ఇంటికి బయలుదేరింది. చిగురుటాకుల వలె ఎర్రనైన సూర్యకాంతి ప్రపంచమంతా వ్యాపించి, జగత్తును పవిత్రం చేసి సాయంత్రానికి అస్తమించినట్లుగా, వసిష్ఠులవారి ఆ ఎర్రని గోవు ఇంటిముఖం పట్టింది. దేవతలకు ప్రీతికలిగించే యజ్ఞ యాగాదులకూ, పితరులకు తృప్తి కలిగించే శ్రాద్ధకర్మలకూ, అతిధిసత్కారాలకు అవసరమగు దానాలకూ, నెయ్యి మొదలయిన వాటికి ఆధారభూతురాలు ఆ నందినీధేనువు. దానివెంట దిలీపుడు కూడా తిరిగి ఆశ్రమానికి బయలుదేరాడు. దిలీపునితో వెడుతున్న ఆ గోవు, సత్కార్యానుష్టానంతో కూడిన ప్రత్యక్షమగు అస్తిత్వబుద్ధి వలె ప్రకాశించింది.

అలా దిలీపుడు తిరిగి వస్తుండగా వనాలలో చిన్న చిన్న సరస్సుల నుండి అడవిపందులు గుంపులు గుంపులుగా ఇవతలకి వస్తున్నాయి. నెమళ్ళు అవి నివసించే వృక్షాలను చేరబోతున్నాయి. పచ్చికభూములలో అనేక రకాల మృగాలు వాసం చేస్తున్నాయి. ఒక్క దూడను ఈనిన ఆ నందినీధేనువు భారమైన పొదుగుతోనూ, దానితోపాటు స్థూలకాయుడైన దిలీపమహారాజూ వస్తూ ఉంటే చూడ ముచ్చటగా ఉన్నది.

అలా గోవుతోపాటు వనం నుండి తిరిగివస్తున్న దిలీపమహారాజును ప్రేమానురాగాలుగల సుదక్షిణాదేవి అల్లంత దూరంనుంచి చూచింది. ఉపవాసం చేసినవారు అధికదాహం వల్ల నీరు ఎక్కువగా త్రాగినట్లు, ఆమె రెప్ప వాల్చకుండా తన భర్తవంక తదేకంగా చూచింది. పిమ్మట ఆమె ఎదురు వెళ్ళి స్వాగతం పలికి, నందినీధేనువునూ, దిలీపునీ వెంటపెట్టుకుని ఆశ్రమం వైపు రాసాగింది. ముందు సుదక్షిణ, వెనుక దిలీపుడు, మధ్య నందినీధేనువు!

అప్పుడా ధేనువు దివారాత్రాల మధ్యనున్న సంధ్యాదేవిలా ప్రకాశించింది! పగటి కాంతితో సమానమైన తెల్లని వస్త్రాలు ధరించిన రాజు, రాత్రి వర్ణంతో సమానమయిన నీలి లేక ఊదారంగు వస్త్రం కట్టుకున్న రాణి – వీరి మధ్యనున్న ఎర్రని నందినీధేనువు సంజెకెంజాయ శోభతో వెలుగొందింది.

అక్షతల పాత్ర చేతబట్టుకుని సుదక్షిణాదేవి, అధికక్షీరం గలిగిన ఆ నందినీధేనువుకు ప్రదక్షిణ నమస్కారాలు చేసింది. విశాలమైన కొమ్ముల నడుమ పసుపు, కుంకుమ పెట్టి పూలు అక్షతలతో పూజించింది. నిజానికి అప్పుడా గోవు తన దూడకు పాలివ్వడానికి దాని దగ్గరికి పోవాలన్న ఇచ్ఛతో ఉన్నది. అయినప్పటికీ నిశ్చలంగా నిలుచుని సుదక్షిణాదేవి పూజను స్వీకరించింది. అందుకు దిలీపుడు, సుదక్షిణా చాలా సంతోషించారు. అవును – నందినీధేనువు వంటి మహాత్ముల అనుగ్రహ చిహ్నాలు భావిఫలాలు కలుగజేసేవి కదా !

ఎవరి సహాయం లేకుండా ఒక్కడై శత్రువులందరినీ సంహరించి భయం అనేది ఎరుగకుండా ఉన్న దిలీపుడు, అరుంధతీ సహితుడై ఉన్న వసిష్ఠులవారి పాదాలకు మ్రొక్కాడు. తరవాత సాయం సంధ్యానుష్ఠానాలు తీర్చుకున్నాడు. పాలు పిదకిన పిమ్మట మరల నందినీధేనువును కొలిచాడు. ఆ విధంగా దిలీపుడూ, ఆయన భార్య భక్తితో ఇరవై ఒక్క రోజులు ఆ గోవును సేవించారు. గోవ్రతం నిష్ఠతో అనుష్ఠించారు.

ఆ మరునాడు – అనగా ఇరవై రెండవరోజు మామూలుగా తనను వెంబడించి వస్తున్న దిలీప మహారాజు భక్తి దృఢమైనదో కాదో పరీక్షించాలను కున్నది నందినీధేనువు. అలా అనుకుని హిమవత్పర్వత ప్రాంతంలో పచ్చిక భూములందు సంచరిస్తూ, గంగోదకం పడే స్థలానికి సమీపాన ఉన్న ఒక గుహలో ప్రవేశించింది.

గొప్ప మహిమ గల ఆ గోవును పెద్దపులి మున్నగు క్రూరమృగాలు ఏమీ చేయజాలవన్న నమ్మకంతో దిలీపుడు హిమవత్పర్వత శోభను తిలకిస్తూ

నందినిని గమనించలేదు. అప్పుడొక సింహం ఆ ఆవుపై ఎగిరిపడి దానిని బలాత్కారంగా ఈడ్చింది. మరుక్షణంలోనే గోవు బిగ్గరగా, దీనంగా అరిచింది. గుహ అంతటా ప్రతిధ్వనించిన ఆ అరుపు ఘోరంగా దిలీపుని చెవుల పడింది. తక్షణమే ఆయన పర్వతం వంక చూస్తున్నవాడల్లా గభాలున తిరిగి చూచాడు.

అప్పుడు ధనుస్సుపట్టిన దిలీపుడు కొండగుహలో, ఎర్రని నందినీ ధేనువుపై లంఘిస్తున్న తెల్లని సింహం ఒకటి కనిపించింది. అది గైరికాది ధాతువులచేత ఎర్రనై, కొండమీద పుష్పించియున్న లొద్దుగ చెట్టులా ఉన్నది.

తనను లక్ష్యపెట్టకుండా ఆవుపైన పడుతున్న సింహాన్ని చూచి రాజు వెంటనే దానిని చంపడానికై తన అమ్ముల పొది నుండి బాణం తీయబోయాడు.

కానీ ఆశ్చర్యం, ఆ సింహం మహిమవల్ల, పొదిలో నుండి బాణం తీయబోయిన ఆ చెయ్యి, చిత్రంలో వ్రాసిన ప్రతిమలాగా అలాగే కదలకుండా ఉండిపోయింది. తన కళ్ళ ఎదుట కనిపిస్తున్న అపకారిమీద తన శక్తిని ప్రయోగించలేకపోయాడు రాజు. అసమానమైన పరాక్రమం కలవాడు, అపజయం అనేది ఎరుగనివాడు అయిన దిలీపుడు ఇప్పుడు ఏమీ చేయలేక మంత్రాలకు కట్టుబడిపోయిన సర్పంలాగా మహా కోపంతో బుసలుకొట్టసాగాడు. సింహబలం గల తన బాహువులు ఇలా స్తంభించిపోయా యేమిటా అని ఆయన ఆశ్చర్యచకితుడైనాడు.

అప్పుడు నందినీధేనువును పట్టుకున్న సింహం– ఎల్లప్పుడూ సజ్జనుల పక్షాన ఉండేవాడు, మనువంశానికి టెక్కెం వంటివాడు అయిన దిలీప మహారాజుతో వింతగా మనుష్య వాక్కులతో ఇలా పలికింది :

“ఓ దిలీపమహారాజా! నీవు నన్ను చంపడానికి అనవసరంగా శ్రమ పడవద్దు. నీవు నా మీద ఎలాంటి అస్త్రం ప్రయోగించినప్పటికీ అది వ్యర్థమే అవుతుంది సుమా. వృక్షాలను పెళ్ళగించు శక్తిగల వాయువేగం పర్వతాల మీద నిరుపయోగం కదా!

"ఓ రాజా! నే నెవరో కాదు – వెండికొండలా తెల్లగా ఉండే నందిపై ఎక్కుతాడే శివుడు – ఆ శంకరుని పాద విన్యాసానుగ్రహం వల్ల పవిత్రమైన వీపుకలవాడను నేను. పరమశివుని సేవకుడను. నికుంభునితో సమానుడను – నా పేరు కుంభోదరుడు.

"రాజా! అదిగో! ఆ ఎదురుగా కనిపిస్తున్నదే దేవదారు చెట్టు. దానిని చూచావు కదా! ఆ చెట్టుకు మా తల్లి పార్వతీదేవి బంగారు కుండలతో నీరుతెచ్చి పోస్తుంది. ఆ నీరే తల్లిపాలుగా పెరిగిన ఈ చెట్టును శివుడు తన పుత్రుడు కుమారస్వామితో సమానంగా ప్రేమిస్తాడు.

ఒకప్పుడు ఏమైనదో తెలుసా ? అడవి ఏనుగు ఒకటి వచ్చి తన గండస్థలాన్ని ఈ చెట్టుకు ఆనించి రుద్దుకున్నది. ఆ కారణంగా చెట్టు చర్మం ఊడిపోయింది. అది చూచి మా అమ్మ పార్వతీదేవి, తన కుమారుడు కుమారస్వామిని రాక్షసులు బాణాలతో కొడితే, ఎలా దుఃఖపడిందో అలా దుఃఖించింది. అప్పటి నుండి ఈశ్వరుడు అడవి ఏనుగులు ఇక్కడికి రాకుండా వాటికి భయం కలిగించే నిమిత్తం నాకు సింహరూపం ప్రసాదించాడు. ఆ చెట్టు దగ్గరికి వచ్చే జంతువులను ఆహారంగా చేసుకుని ఈ కొండగుహలో ఉండమని ఆజ్ఞాపించాడు.

ఇదీ నా కథ – పరమేశ్వరుడు నియమించిన భోజనం వేళకు నాకీ ఆవు తటస్థించింది. రక్తపానం చేసి రాహువునకు చంద్రుని నుండి స్రవించే అమృతం లభ్యం అయినట్లుగా నాకీ ధేనువు దొరకడం, ఆకలి గొనివున్న నాకు ఎంతో తృప్తికరంగా ఉన్నది – ఓ రాజా! నీవు సిగ్గుపడక వెంటనే తిరిగి పో! నీవు గురుభక్తి కలవాడవే – నాకు తెలుసు. నీ వీ గోవును రక్షించవలసి ఉన్న మాటా నిజమే. కానీ ఏం చేస్తావు ? ఆయుధాలచే రక్షించజాలని ప్రతిబంధకం ఏర్పడింది ఇప్పుడు. ఈ కార్యం నీకు అశక్యంగా ఉన్నది. అందుచేత వెళ్ళిపో. దీని మూలంగా నీ కీర్తికేమీ భంగం రాదు".

సింహం ఇలా ప్రౌఢంగా పలుకగా దిలీపుడు విన్నాడు. ఈశ్వరుని మహిమ వలన ఇలా జరిగినదని తెలుసుకున్నాడు. అందుచేత తన శక్తి సామర్థ్యాలు నిష్ప్రయోజనం అయినందుకు అదొక అవమానంగా మనస్సులో భావించలేదు. ఈశ్వరుని కోపదృష్టివల్ల స్తంభించబడిన బాహువుగల వజ్రపాణిలా, బాణ ప్రయోగమున వృథాప్రయాస నొందిన దిలీప మహారాజు ఆ సింహం మాటలకు ఇలా బదులు చెప్పాడు :

"ఓ సింహరాజా! నే నిప్పుడు పరాక్రమహీనుడుగా ఉన్నాను. అందువల్ల నేను ఏ మాట చెప్పినా అది మిక్కిలి పరిహాసాస్పదంగానే ఉంటుంది. అయినప్పటికీ నీవు ఇతరుల ఇంగితాన్ని తెలుసుకునేవాడవు. కాబట్టి నా కోర్కె తెలుపుతున్నాను. విను –

చరాచర సృష్టి స్థితిలయాలకు కారణభూతుడైన పరమేశ్వరుడు నాకు పూజ్యుడు. అయితే, నా గురువు వసిస్టులవారికి అనేక విధాలుగా ఉపయోగ పడుతున్న ఈ గో ధనం నశించిపోతూ ఉంటే నేను చూస్తూ ఉపేక్షించడం న్యాయం కాదు. ఓ సింహమా! నన్ను నీవు భక్షించి ఆకలి తీర్చుకో. ఈ గోవును మాత్రం విడిచిపెట్టు. నీకు పుణ్యం ఉంటుంది. పాపం ఈ ధేనువుకు దూడ ఉన్నది. అది సాయంకాలం అయ్యేసరికి తన తల్లి వస్తుందన్న ఆశతో వేయికళ్ళు పెట్టుకుని ఎదురు చూస్తూ ఉంటుంది. కాబట్టి దాన్ని విడిచిపెట్టు."

దిలీపమహారాజు ఇలా చెప్పగా విని సింహం చిరునవ్వు నవ్వింది. రాజును చూచి మరలా ఇలా అన్నది,

"ఓ రాజా! నీవు ఏకచ్ఛత్రాధిపతివై ఈ భూమండలాన్ని ఏలుతున్నావు. పైగా నీవు అందగాడవు. నవయౌవనం నీలో తొణికిసలాడుతున్నది. నీవు లోకంలో ఎన్నో గొప్ప పనులు సాధించవలసి ఉన్నది. నీ వలన ఎన్నో ప్రయోజనాలు లోకానికి చేకూరవలసి ఉన్నది. అలాంటి నీవు – వాటినన్నిటినీ

వదలి ఈ స్వల్పమైన ఫలం కోసం దేహత్యాగానికి సిద్ధపడుతున్నావు. ఇది నీకు తగదు. యుక్తాయుక్త విచక్షణలేని అవ్యక్తుడవని లోకం నిన్ను ఆడిపోసుకుంటుంది.

నీవు భూతదయ వల్ల నీ ప్రాణాలు పోగొట్టుకుంటే ఈ గోవు మాత్రమే బ్రతుకుతుంది. అలాకాక నీవు జీవించి ఉంటే ప్రజానాధుడవైన నీవు సమస్త జనులనూ తండ్రివలె ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉంటావు. కాబట్టి ఈ గోవు చావడం మంచిదో, నీవు చావడం మంచిదో కాస్త ఆలోచించి చూడు.

దిలీపా! అంతేకాదు – వసిస్ఠుడికి ఈ ఒక్కటే ఆవు కదా! అది లేకుండా చేసినందుకు నీ మీద ఆయనకు ఆగ్రహం వస్తుంది కనుక దానిని ఎలా సహించేది అని అంటావేమో. గొప్ప ఆవులు కోట్లకొలది ఆయనకు ఇవ్వగల సమర్థుడవు నీవు – ఆ విధంగా నీవు ఆయన కోపాన్ని చల్లార్చవచ్చునే. అందువల్ల నా మాట విను – అనేక సౌఖ్యాలు అనుభవించే నీ బలిష్ఠమయిన దేహాన్ని కాపాడుకో. మరొక మాట – ఈ గోవును ఉపేక్షిస్తే నీకు ఇంద్రపదవి లభించదని భయపడుతున్నావేమో, సకల సంపదలతో సంపూర్ణమయిన రాజ్యమే భూలోకంలో ఇంద్రపదవి అని పెద్దలు చెపుతారు."

సింహం ఇలా చెప్పి ఊరకున్నది. ఆ సింహం పలుకులు హిమవత్పర్వతం అంతా ప్రతిధ్వనించాయి. ఆ వెండికొండ ప్రేమతో మాట్లాడి నట్లనిపించింది.

సింహం చేతుల్లో చిక్కి ఉన్న ఆ నందినీధేనువు సింహం చెప్పిన మాటలు వింటూనే మహాభయంతో దిలీపమహారాజు వంక దీనంగా చూచింది. ఈ చూపులకు దయామయుడైన దిలీపుని హృదయం కరిగిపోయింది. ఇక ఆయన భరించలేకపోయాడు. మళ్ళీ మృగరాజుతో ఇలా అన్నాడు :

"ఓ సింహరాజా! క్షాత్రం అనగా క్షతం నుండి రక్షించడం. అది నీకు తెలుసు కదా ? మరి అలాంటి క్షాత్ర విరుద్ధమయిన రాజుకు రాజ్యం ఉండి

ఏమి ప్రయోజనం ? లోకనింద పొంది కళంకంతో కూడిన ప్రాణాలతో అతను బ్రతికి ఉండి ఏమి లాభం ? నేను కోట్లకొలది పాడి యావులను ఇచ్చినప్పటికీ వసిష్ఠుల వారి కోపం చల్లారదు. ఎందుచేతనంటే ఈ నందినీధేనువు సర్వవిధాలా కామధేనువుతో సమానమయినది. దీనిని పట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఈశ్వరుని మహిమ వలన నీవు ఒక్కడవు ఆ పని చేయగలిగావని నాకు అనిపిస్తున్నది. కాబట్టి ఈ నందినీధేనువుకు బదులుగా నీవు నా శరీరం స్వీకరించు. ఈ గోవును విడిచిపెట్టు. నన్ను భక్షించడం వల్ల నీకు ఆకలీ తీరుతుంది. వసిష్ఠమహర్షి హోమకార్యాలకు భంగం కలుగకుండానూ ఉంటుంది.

ఓ సింహమా! నీవు స్వామి పరతంత్రుడవు. ఈ దేవదారు చెట్టుమీద నీకు ఎంత దయ ఉన్నదో, ఈ గోవు మీద నాకు అంత దయ ఉన్నది. ఆ చెట్టును నీవు ఎలా రక్షిస్తున్నావో, ఈ ఆవును నేను అలా రక్షిస్తున్నాను. ఆ వృక్షాన్ని ఉపేక్షించడం నీకు ఎలా యుక్తం కాదో, ఈ ధేనువును ఉపేక్షించడం నీకూ అలాగే యుక్తం కాదు. దీనిని రక్షించకుండా నేను నా గురువుల ఎదుట ఎలా నిలబడగలను.

ఒకవేళ నన్ను చంపకూడదన్న ఉద్దేశ్యంతో ఉన్నావేమో నీవు! కానీ నాకీ శరీరం ముఖ్యం కాదు. కీర్తి ముఖ్యం. కాబట్టి అశాశ్వతమైన ఈ దేహాన్ని నీవు పరిగ్రహించి, శాశ్వతమైన యశస్సు నాకు అనుగ్రహించు! అశాశ్వత మయిన ఈ దేహంపై నాకు ఏ మాత్రం ఆపేక్ష లేదు!

స్నేహానికి కొద్దిమాటలు మాట్లాడితేనే చాలునని పెద్దలు చెపుతారు. ఈ అడవిలో మనిద్దరికీ స్నేహం కలిసింది. భూతనాథుడగు ఈశ్వరునికి కింకరుడవైన నీవు, స్నేహితుడనైన నా ప్రార్థన నిరాకరించడం ధర్మం కాదు.”

దిలీపమహారాజు ఇలా చెప్పగా విని సింహం అలాగే కానిమ్మని నందినీధేనువును విడిచిపెట్టింది! ఆ మరుక్షణంలోనే, అంత వరకూ సింహం మహిమ వలన స్తంభించిపోయి ఉన్న దిలీపుని చేతులు స్వాధీనంలోకి వచ్చాయి.

ఆయన తన చేతుల్లోని ధనుర్బాణాలు విడిచిపెట్టాడు. తన శరీరాన్ని మాంసపు ముద్ద వలె చేసి సింహం ఎదుట నిలబడ్డాడు! అప్పుడా సింహం భయంకరంగా తన మీద పడబోతున్నట్లు కనిపించిందాయనకు. ఆయన మౌనంగా తలవంచుకుని ప్రాణత్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు!

అప్పుడు దేవతలూ, విద్యాధరులూ, దిలీపమహారాజుపై పూలవాన కురిపించారు!

"ఓ వత్సా! ఇక లెమ్ము!" అనే అమృతపు వాక్కు అకస్మాత్తుగా దిలీపుని చెవిన పడింది. ఆయన లేచాడు. పొదుగు నుండి క్షీరధారలు కురిపిస్తూ, తల్లిలా ఎదుట నిలచి ఉన్న నందినీధేనువు మాత్రం ఆయనకు కనిపించింది! సింహం మాత్రం కనిపించలేదు!

ఇదేమిటా అని దిలీపమహారాజు ఆశ్చర్యచకితుడైనాడు. ఈ వింత ఏమిటో ఆయనకు అర్థంకాలేదు.

అప్పుడు నందినీధేనువు మనుష్యభాషలో "రాజా! నీ చిత్తశుద్ధిని పరీక్షించడానికై నేను ఈ మాయను సృష్టించాను! ఇక్కడ సింహమూ లేదు, నన్ను చంపడమూ లేదు! అంతా నేను కల్పించిన మాయ! నీవు సత్పురుషుడవు! ఈ పరీక్షలో నీవే నెగ్గావు! వసిష్ఠమహర్షి మహత్వం వల్ల, ఒక్క సింహాది మృగాలే కాదు ఆ యమధర్మరాజు కూడా నన్ను ఏమీ చేయలేదు! నాయనా, దిలీపా! నీకు గల గురుభక్తికీ, నా మీద నీకు గల విశ్వాసానికి మెచ్చాను! నీకు కావలసిన వరాలు కోరుకో, ఇస్తాను! నేను కేవలం పాలు మాత్రం ఇచ్చే ఆవును గాను! నేను కనుక సంతుష్టురాలనయితే, దేవతల్లా సకల ఇష్టార్థసిద్ధిని కలుగజేస్తాను!" అని పలికింది.

అప్పుడు దిలీపుడు చేతులు జోడించి, తన వంశానికి కర్తగా గొప్ప కీర్తి ప్రతిష్టలు సంపాదించిపెట్టే ఒక కుమారుని తన పట్టపురాణి అయిన సుదక్షిణాదేవి యందు అనుగ్రహించ వలసినదిగా కోరాడు.

అనేకమంది యాచకులను సంతుష్టిపరిచేవాడు, మహాదాత, తన బాహుబలంతో ఎందరినో జయించి మహావీరుడని ఖ్యాతిపొంది, ఎన్నడూ దైన్యం అనేది ఎరుగని దిలీపమహారాజు ఇప్పుడు అతి దీనుని వలె, పుత్రుని ప్రసాదించమని నందినీధేనువును యాచించాడు.

అందుకు ధేనువు "అట్లే అగుగాక!" అని వరం ఇచ్చింది.

"నాయనా! నీవు ఒక దొన్నెలో నా పాలుపిండి త్రాగవలసినది" అని చెప్పింది.

అంతట దిలీపుడు "గోమాతా! దూడకూ, గురువుల హోమకార్యానికి ఉపయోగపడగా మిగిలిన నీ పాలలో, భూమి ఫలంలో ఆరవ భాగం పుచ్చుకున్నట్లే, గురువుగారి అనుమతిపొంది ఆరవభాగం నేను పుచ్చుకుంటాను" అని విన్నవించాడు.

అలాగే చేయమన్నది నందినీధేనువు. పిమ్మట నందిని, ఆ హిమవత్ప ర్వత గుహ నుండి బయలుదేరి ఏ మాత్రం ప్రయాస లేకుండా, దిలీప మహారాజుతో ఆశ్రమానికి వచ్చింది.

గోవును చూడగానే దాని ముఖకవళికలను బట్టి, ప్రసన్నతను బట్టి అది దిలీపుని అనుగ్రహించినదని వసిష్ఠమహర్షి గ్రహించాడు. అయినప్పటికీ దిలీపుడు ధేనువు తనకు పుత్రప్రాప్తి కలిగేటట్లు వరం ఇచ్చిన సంగతి గురువుకు తెలియజేశాడు. తరవాత ఆ విషయం తన భార్య సుదక్షిణాదేవికి కూడా చెప్పాడు.

దూడ తాగిన తరువాత, హోమకార్యానికి వినియోగించిన తరవాత నందినీధేనువు పాలలో ఆరవ భాగం మాత్రం  వసిష్ఠుని అనుమతిపై తాను పుచ్చుకుని దిలీపమహారాజు మిక్కిలి ఆసక్తితో ఆ పాలు త్రాగాడు.

తెల్లవారింది. దిలీపుడు, సుదక్షిణ మరల యథావిధిగా నందినీ ధేనువును పూజించారు. పిమ్మట భోజనాలు చేశారు. తరవాత వసిష్ఠుడు వారిని అనేక ప్రియవచనాలతో సంతుష్టి పరిచి, ప్రయాణంలో మేలు కలిగేటట్లు దీవించి వారిని తిరిగి నగరానికి పంపివేశాడు.

దిలీపుడు మొదట హవిస్సుచే ప్రజ్వలించే అగ్ని హెూత్రుడికీ, తరవాత అరుంధతీదేవికీ, పిమ్మట దూడతో కూడిన నందినీధేనువుకూ ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. భార్యాసహితుడై రాజధాని నగరానికి బయలుదేరాడు.

వ్రతాలు – నిష్ఠలు మున్నగువాటి వలన కలిగే కష్టాలను ఓర్చుకునే వాడు కనుక దిలీపునకు ఈ గోవ్రతం ఎలాంటి శ్రమ అనిపించలేదు. పైగా చిరకాల వాంఛ నెరవేరినందున ఇప్పుడాయన, ఆయన భార్య చాలా సంతోషంగా ఉన్నారు. రథం ఎక్కి ప్రయాణంలో ఎటువంటి అసౌకర్యమూ, ఇబ్బందీ లేకుండా తమ నగరం చేరుకున్నారు.

కొన్నాళ్ళుగా రాజును చూడకుండా ఉన్నందున కళ్ళు పోయినట్లున్న ప్రజలు ఇప్పుడు దిలీపమహారాజును ఎంతో ఆసక్తితో అదేపనిగా చూడసాగారు. వసిష్ఠాశ్రమంలో నియమంగా గోసేవ చేయడం వల్ల ఆయన దేహం చిక్కిపోయి ఉన్నది. అయితే సంతానప్రాప్తికి వరం పొంది వచ్చినందున ఆయనలో ఒక నూతన తేజస్సూ, ఉత్సాహమూ, ఆనందమూ ద్యోతక మవుతున్నాయి. అలాంటి దిలీపుని ప్రజలు శుక్లపక్ష చంద్రుని చూచినట్లు పదేపదే చూచారు.

దేవేంద్రునితో సమానమైన భోగభాగ్యాలు గల దిలీపుడు, ప్రజలంతా తనను కీర్తిస్తూ ఉండగా నగరంలో ప్రవేశించి ఎప్పటివలె రాజ్యపాలన చేయసాగాడు.

తరువాత కొన్నాళ్ళకు సుదక్షిణాదేవి గర్భం ధరించింది. ఆమె గర్భంలో చంద్రునితో సమానమైన కాంతి, కుమారస్వామితో సరితూగే పరాక్రమం, దిక్పాలకులతో తులతూగే ఐశ్వర్యం గల పుత్రుడు పెరుగుతున్నాడు.

# 3

**సు**దక్షిణాదేవి గర్భవతి కాగానే దిలీపమహారాజు ఆనందంతో పొంగిపోయాడు. ఆమె సఖీజనులందరికీ కన్నుల పండుగగా ఉన్నది. ఇక్ష్వాకు వంశ పరంపరకు కారణభూతంగా ఆమె గర్భం ధరించడం రాజ్యంలోనే అందరికీ సంతోషదాయకమైంది.

సుదక్షిణాదేవి గర్భచిహ్నాలు ప్రస్ఫుటమైనాయి. ఆమె కొంచెం చిక్కిపోయింది. సొమ్ములు కొద్దిగా పెట్టుకున్నది. లొద్దుగ పువ్వులా ఆమె మొఖం తెలుపెక్కింది. తెలతెల వారే వేళకొలది నక్షత్రాలతో వెలవెలబోయే చంద్రుని వలె ఉన్నది. ఏకాంత సమయాలలో దిలీపుడు పరిమళభరితమైన సుదక్షిణాదేవి ముఖాన్ని ఆఘ్రాణించేవాడు. అయితే, గ్రీష్మ ఋతువు చివర మేఘాల జల్లులచే తడుపబడినట్టి వనాలలోని అల్ప సరస్సును ఏనుగు వాసన గ్రహించి ఎలా తృప్తి పొందదో, అలా దిలీపుడు తృప్తి పొందలేకపోయాడు.

భూమండలాన్ని అంతటికినీ ఏకపుత్రుడు పుట్టనున్నాడనడానికి సూచకంగా సుదక్షిణాదేవికి మొదట మృద్రూపమయిన భోగ్యవస్తువు మీద తప్ప మరి ఏ ఇతర భోజ్యపదార్థాలపైన బుద్ధిపుట్టలేదు. అయితే, తనకు ఏ వస్తువుల మీద ఇష్టమున్నదో సుదక్షిణ చెప్పడం లేదు. చెప్పాలంటే ఆమెకు ఎక్కడలేని సిగ్గు ముంచుకొస్తున్నది. అందువల్ల ఆమెకు ఏఏ వస్తువులమీద ప్రీతి ఉన్నది చెప్పమని దిలీపుడు ప్రతిక్షణం ఆమె అంతరంగిక చెలికత్తెలను అడుగుతూ వచ్చాడు. ఆమెకు ఏ వస్తువు పై ప్రీతి ఉన్నదని చెబితే ఆ వస్తువల్లా ఆమెకు లభింపజేసేవాడు. ఆమె కోరవలెనే గాని దిలీపునకు అసాధ్యమే మున్నది ? ఆమె అభిలషించిన వస్తువు స్వర్గంలో ఉన్నా సరే దానిని ఆమెకు తెచ్చి ఇవ్వగలడు!

ఇలా రకరకాల రుచులు మరిగి సుదక్షిణాదేవి, వేవిళ్ళ బాధ తీర్చుకున్నది. క్రమంగా ఆమె అవయవాలు సౌష్ఠవమయినాయి. పండుటాకులు

రాలిపోయిన తరవాత చిగురుటాకులు తొడిగిన తీగవలె ప్రకాశించిందామె. రకరకాల వస్తువులు ఆశపడే రోజులు గడిచినకొద్దీ ఆమె చనుమొనలు నలుపెక్కాయి. అవి తుమ్మెదలు వ్రాలిన తమ్మిమొగ్గల కాంతిని మించిన కాంతితో ప్రకాశించాయి!

అలా నిండు చూలాలుగా ఉన్న సుదక్షిణాదేవిని చూచి దిలీపుడు– రత్నాదినిధులు గర్భంలోగల భూదేవి వలెనూ, అగ్ని గర్భంలోగల శమీ వృక్షం వలెనూ, అంతర్వాహిని అయిన సరస్వతీనది వలెనూ భావించుకున్నాడు!

దిలీపుడు శాస్త్రవిధులు తెలిసిన విద్వాంసుడు. కనుకనే భార్యమీద గల ప్రేమకూ, తన ఉదారబుద్ధికీ, సంపదకూ పుత్రుడు పుట్టనున్నాడన్న సంతోషానికి తగినట్లుగా పుంసవనము, సీమంతం మొదలైన శుభకార్యాలు ఆమెకు జరిపించాడు.

సుదక్షిణాదేవి గర్భంలో అష్టదిక్పాలకుల అంశ పొందిన శిశువు ఉన్నాడు. ఆమె గర్భభారంతో మిక్కిలి శ్రమపడుతూ కూడా తన మందిరానికి వచ్చిన భర్తకు ఎన్నో మర్యాదలు చేస్తున్నది. అందుకు దిలీపుడు ఎంతో సంతోషించాడు. కుమార చికిత్సలో ప్రజ్ఞావంతులయినవారు, ఇష్టులయినవారు అయిన వైద్యులను పిలిపించి, ఆమె గర్భపోషణకు అవసరమగు చికిత్సలన్నీ చేయించాడు.

అంతట సుదక్షిణకు తొమ్మిది నెలలు నిండి, పదవ నెల ప్రవేశించింది. గ్రీష్మఋతువు ఆఖరున వర్షం కురియడానికి సిద్ధంగా దట్టమైన మేఘాలు గల ఆకాశంవలె ఆమె ప్రసనవేదన పడుతున్నది. దిలీపుడు ఆమెను చూచి ఎంతో సంతుష్టి చెందాడు.

అంతట ఒక సుముహూర్తంలో శచీదేవితో సమానురాలయిన సుదక్షిణ ఒక పిల్లవానిని కన్నది. అస్తంగత్యాది దోషాలు లేక అయిదు గ్రహాలు పరమోచ్ఛ

స్థితిని పొంది ఉన్న ఘడియలో జన్మించాడా కుమారుడు. ఆ పిల్లవాడు అదృష్టశాలి, మహాభాగ్యవంతుడు, అఖండ రాజయోగం కలవాడు అని గ్రహస్థితి సూచిస్తుంది.

ఆ పిల్లవాడు పుట్టిన క్షణంలో సమస్త దిక్కులూ నిర్మలంగా ప్రకాశించాయి. చల్లని మెల్లని గాలి వీచింది. యజ్ఞేశ్వరుడు ప్రదక్షిణములయిన జ్వాలలతో హవిస్సులను గ్రహించాడు. లోకశ్రేయస్సు కోసం దేవతలంతా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు శుభసూచకాలు ఎన్నో పొడగట్టాయి.

పురుటింటిలో పాన్పుపై పరుండబెట్టిన శిశువు తేజస్సు సమస్త దిక్కులనూ వెలిగించింది. ఆ తేజస్సు ముందు దీపాలు వెలవెలబోతూ, చిత్రించిన చిత్రాలవలె కనిపించాయి. తనకు కుమారుడు పుట్టాడని అంతఃపుర దాసీలు వచ్చి చెప్పగానే దిలీపుడు అమృతంతో సమానమైన ఆ మాట విన్నాడు. ప్రధాన రాజచిహ్నమగు ఛత్ర, చామరాలు తప్ప తక్కినవన్నీ వారికి బహుమానంగా ఇచ్చివేశాడు.

వెంటనే ప్రసూతిగృహానికి వెళ్ళాడు. పూర్ణచంద్రుని చూచి సముద్రం పొంగినట్లుగా పొంగిపోతూ మనోహరమగు పుత్రుని ముఖం వంక రెప్పవాల్చకుండా చూచాడు. అంతులేని ఆనందం పొందాడు.

తరువాత వసిష్ఠమహర్షి తపోవనం నుండి వచ్చాడు. రాకుమారుడికి జాతకర్మాది సకల కార్యాలూ జరిగించాడు. ఆ వసిష్ఠమహాముని మంత్ర ప్రభావం వలన శిశువు, గనిలోనుండి తీసిన వజ్రం సానబెట్టితే ఎలా ప్రకాశిస్తుందో అలా ప్రకాశించాడు. రాజభవనంలో శ్రవణానందకరములైన మంగళ వాయిద్యాలు మ్రోగించారు. పాటలు పాడారు. వేశ్యాస్త్రీలు నృత్యం చేశారు.

దిలీపమహారాజు ధర్మపరిపాలన చేసినవాడు కనుక ఆయన రాజ్యంలో హత్యలూ, దొంగతనాలూ మున్నగు నేరాలు జరగడమంటూ లేదు. కాబట్టి

చెరసాలలో ఖైదీలనేవారు లేరు. అందువల్లనే తనకు పుత్రుడు కలిగాడన్న సంతోషంలో ఆయన, చెరసాల నుండి విడిచిపెట్టడానికి నేరస్తుడనేవాడే లేకపోయాడు. కాని అందుకు ప్రతిగా ఆయనే పుత్రోత్పత్తి వల్ల పితృఋణం అనే బంధం నుండి విముక్తుడైనాడు!

శబ్దార్థములు తెలిసినవాడు దిలీపుడు. తన కుమారుడు గొప్ప శాస్త్రవేత్త. శత్రువులను జయించే వీరుడు కాగలడని ఆయన గ్రహించాడు. కనుకనే అందుకు తగినట్లు కుమారుడికి రఘువు అని పేరు పెట్టాడు!

సకలైశ్వర్యసంపన్నుడైన దిలీపమహారాజు పోషణలో రఘువు, సూర్య కిరణాలచేత ప్రవర్ధమానుడైన శుక్లపక్ష చంద్రునివలె పెరిగి పెద్దవాడైనాడు. శరీరావయవాలు పుష్టిగా ఎదిగి, మనోజ్ఞమైన రూపు ధరించాయి. పార్వతీ పరమేశ్వరులు, తమ పుత్రుడయిన కుమారస్వామిని చూచి ఎలా సంతోషిస్తారో, శచీదేవేంద్రులు తమ కుమారుడయిన జయంతుని చూచి ఎలా ఆనందిస్తారో – అలాగే సుదక్షిణా దిలీపులు, తమ కుమారుడయిన రఘువును చూచి అలా సంతోషించారు. వారు అలా తమ పుత్రుని అధిక ప్రేమతో చూచుకుంటు న్నప్పటికీ, వారిరువురికీ పరస్పరానురాగం ఏ మాత్రం తరుగలేదు.

రఘువు మొదట దాది చెప్పిన మాటలు ముద్దుముద్దుగా పలకడం నేర్చుకున్నాడు. పిమ్మట దాది వ్రేలు పట్టుకుని తప్పటడుగులు వేస్తూ నడవడం నేర్చుకున్నాడు. ఆపైన తల్లి, తండ్రి, గురువు, దేవతలకు నమస్కరించడం నేర్చాడు. కుమారుని ముద్దుచేష్టలు చూచి దిలీపుడు మహదానంద భరితుడైనాడు.

లేకలేక ఎంతో కాలానికి పుట్టిన బిడ్డడు, ప్రేమతో వాని శరీరావయాలు తాకితేనే అమృతప్రాయంగా తోస్తుంది. అలాంటి పుత్రుని దిలీపుడు అస్తమానం ఎత్తుకుంటూ, తొడపై కూర్చోపెట్టుకుని ముద్దులాడుతూ తన్మయుడైపోయేవాడు. అరవిచ్చిన కనులతో ఆనందం అనుభవించే వాడు!

ప్రజాపతి, సత్వగుణ ప్రధానుడు అయిన బ్రహ్మ! తను చేసిన సృష్టిని విష్ణుమూర్తి పాలిస్తున్నాడని తలుస్తాడు. అలాగే దిలీపమహారాజు, వరప్రభావం వల్ల సుముహూర్తంలో తనకు జన్మించిన రఘువు గొప్ప గుణసంపన్నుడై తన వంశానికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తాడని నిశ్చయించుకున్నాడు.

రఘువుకు చెవులు కుట్టడం, వడుగు చేయడం, బడిలో వేయడం లాంటి కర్మలన్నీ నిర్వర్తించారు. ఆ బాలుడుకిప్పుడు జుల్పాలు వచ్చాయి. తన ఈడువారయిన మంత్రి కుమారులతో కలిసి ఆ పిల్లవాడు ఆడుకుంటూ చదువుకుంటూ, సముద్రంలో నది కలిసేటప్పుడు నదీముఖ ద్వారంగా మొసలి మున్నగు జలజంతువులు సముద్రంలో ప్రవేశించినట్లుగా, వాఙ్మయం అనే సముద్రంలో ప్రవేశించి శబ్దజాలములను తెలుసుకున్నాడు.

గురువులకు ప్రియ శిష్యుడుగా ఉన్నాడు రఘువు. విద్వాంసులైన ఉపాధ్యాయులు అతనికి అన్ని విద్యలూ నేర్పారు, సుక్షేత్రంలో వేసిన విత్తనాలు ఎలా ఫలిస్తాయో, ఉపాధ్యాయుల కృషి అలా సార్థకమైంది.

దిక్పాలకుడైన సూర్యుడు, వాయువేగాన్ని మించిన వేగం గల తన గుర్రాలతో నాలుగు సముద్రాల వంటి నాలుగు దిక్కులనూ ఎలా దాటుతాడో, అలాగే సద్గుణరాశి అయిన రఘువు శుశ్రూషాదులచేత చతుస్సముద్రాల వంటి చతుర్విద్యలనూ అధిగమించాడు!

నల్లని జింక చర్మం కప్పుకుని నిష్ఠగా బ్రహ్మచర్యం అనుష్ఠిస్తూ, తండ్రి అయిన దిలీపమహారాజు వద్దనే ఆగ్నే యాద్యస్త్ర విద్యలన్నింటినీ సమంత్రకంగా అభ్యసించాడు. దిలీపుడు ధనుర్విద్యలో ఆ కాలంలోని ధానుష్కులందరినీ మించిన వాడు కావడం వల్ల ఆయన వద్దనే రఘువు ఈ విద్యలను నేర్చుకున్నాడు.

అంతట రఘుమహారాజుకు యౌవనం అంకురించింది. అత్యంత మనోహరంగా రూపొందాడాయన. మహావృషభత్వాన్ని పొందిన కోడెదూడ

వలె మహాగజత్వాన్ని పొందిన ఏనుగుగున్న వలె ఉన్నాడాయన. ఇప్పుడు ఆయనలో ఎక్కడలేని గాంభీర్యం కానవస్తున్నది.

తరువాత దిలీపుడు రఘువుకు పెండ్లి చేశాడు. రాకుమార్తెలైన పెండ్లికూతుళ్ళు, మంచి మగడు దొరికాడు కదా అని రోహిణ్యాది నక్షత్రాలు చంద్రుని పతిగా పొంది ఆనందించినట్లుగా ఆనందించారు.

యువకుడుగా ఉన్న రఘువు తండ్రికంటె దృఢములూ, దీర్ఘములూ అయిన బాహువులతో, విశాలమైన వక్షస్థలంతో, బలిసిన కంఠంతో అన్ని విధాల తండ్రి కంటె అధికుడుగా కనిపించాడు. అయితే ఇన్ని ఉన్నా ఆయనలో గర్వం లేదు. నిరాడంబరంగా, వినయవిధేయతలతో తండ్రి కంటె ఎక్కువ వాడైనట్లుగా ప్రవర్తించేవాడు.

బహుకాలంగా రాజ్యభారం వహించి ఉన్న దిలీపుడు, ఇప్పుడిక తన బరువు తగ్గించుకోవాలనుకున్నాడు. స్వభావం చేత, శాస్త్రాభ్యాసం చేత వినమ్రుడుగా ఉన్న రఘువుకు యువరాజ్య పట్టాభిషేకం చేశాడు.

లక్ష్మీదేవి ఎల్లప్పుడూ పరిమళాన్నే కోరుతుంది. అందుకే ఆమె సూర్యాస్తమయం వేళ ముకుళించే కమలంలోనుండి బయటికి వచ్చి వికసించే కలువలో చేరుతుంది! అలాగే వినయాది సద్గుణాలనే సువాసనలను ఆపేక్షించే రాజ్యలక్ష్మి దిలీపమహారాజు నుండి వైదొలగి, ఆయన తరవాత అధికారి అయిన రఘుమహారాజును పొందింది!

వాయువుతో గూడిన అగ్ని, శరదృతువులో మేఘాలు లేని సూర్యుడు, మదజలధారలు స్రవించే ఏనుగు ఎలా సహించరానివిగా ఉంటాయో అలాగే రఘుమహారాజుతో కూడిన దిలీపమహారాజు అసాధ్యుడుగా ఉన్నాడు.

అంతట దిలీపుడు నూరు అశ్వమేధయాగాలు చేయాలని సంకల్పించుకున్నాడు. మహావీరుడైన రఘుమహారాజును యజ్ఞాశ్వాలకు రక్షకునిగా

నియమించి తొంభైతొమ్మిది అశ్వమేధ యాగాలు జయప్రదంగా నిర్వహించాడు. తరవాత నూరవ అశ్వమేథయాగం ప్రారంభించిన సమయంలో, యాగాశ్వాన్ని దేవేంద్రుడు అపహరించాడు. ధనుర్ధారులై రఘువు తక్కిన రాకుమారులు రక్షకులుగా ఉన్నప్పటికీ సురపతి అదృశ్యంగా వచ్చి గుర్రాన్ని ఎత్తుకుని పోయాడు.

అప్పుడు రఘుమహారాజు సైనికులు గుర్రాన్ని గురించి దిగులు పడ్డారు. వారికి ఏమీ తోచలేదు. గుర్రం ఎలా మాయమైందా అని ఆశ్చర్యపడసాగారు. ఆ సమయంలో అకస్మాత్తుగా వసిష్ఠులవారి నందినీధేనువు అక్కడికి వచ్చింది.

ఆ గోవు మహిమను గురించి రఘుమహారాజు ఇదివరకే విని ఉన్నాడు. ఆయన పవిత్రమగు ఆ గోమూత్రంతో తన నేత్రాలు తుడుచుకున్నాడు. ఆ మూత్ర ప్రభావం వలన, మనుష్యులెవరికీ కనిపించని వస్తువులు ఆయన కళ్ళకు కనిపించాయి!

దేవేంద్రుడు తూర్పుదిక్కున తన సారథిచే, యాగాశ్వాన్ని రథానికి పగ్గాలతో కట్టించి అపహరించుకుని పోతూ ఉండడం రఘుమహారాజు చూచాడు.

తమ యాగాశ్వాన్ని ఎత్తుకుని పోతున్న వ్యక్తికి వేయి కళ్ళున్నాయి. అతనికి రెప్పపాట్లు లేవు. అతని రథానికి కట్టిన గుర్రాలు పచ్చగా ఉన్నాయి. వీటినిబట్టి అతను దేవేంద్రుడేనని రఘుమహారాజు నిశ్చయించుకున్నాడు. అతన్ని అడ్డగించదలచినవాడై అంతరిక్షంలో వినబడేటట్లు అతనిని గూర్చి బిగ్గరగా ఇలా పలికాడు :

“ఓ దేవేంద్రా! యజ్ఞాలలో హవిర్భాగాలు భుజించే దేవతలలో నీవే మొదటివాడివని అందరూ చెప్పుకుంటారు కదా! అలాంటి నీవు మా యాగాశ్వాన్ని ఎందుకు అపహరించావు ? మా తండ్రిగారు తలపెట్టిన యజ్ఞానికి

విఘ్నం కలిగించాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావు ? నీవు ముల్లోకాలకూ ప్రభువువు. నీవు నీ దివ్యచక్షువులతో, యాగాలకు విఘ్నం చేసేవారిని కనిపెట్టి వారిని శిక్షిస్తూ ఉంటావు కదా! అలాంటి నీవే ధర్మాన్ని తప్పి యజ్ఞాలకు విఘ్నం కలిగిస్తే ఇక లోకంలో ధర్మానుష్ఠానం అనేది ఎలా సాధ్యమవుతుంది?

కనుక ఓ దేవేంద్రుడా! మా తండ్రిగారి అశ్వమేథ యాగానికి ముఖ్య సాధనమైన ఈ గుర్రాన్ని విడిచిపెట్టు, సన్మార్గాన్ని అవలంబించి ధర్మాన్ని నిలబెట్టు."

రఘుమహారాజు ఇలా పలుకగా విని దేవేంద్రుడు ఆశ్చర్యచకితుడై నాడు. తన రథాన్ని వెనుకకు త్రిప్పి ఇలా బదులు చెప్పాడు :

"ఓ, రాకుమారుడా! నీవు చెప్పిన మాటలు నిజమే, కానీ, నేను ఒక్కమాట చెపుతాను విను – కొందరికి యశస్సే ధనం. తమ కీర్తిని ఇతరులు హరించకుండా సర్వవిధాల రక్షించుకుంటూ ఉంటారు వారు. మరి, మీ తండ్రి జగత్ప్రసిద్ధమైన నా కీర్తిని అపహరించడానికి ప్రయత్నిస్తున్నాడు. జగత్తులో ఒక్క విష్ణుమూర్తికే పురుషోత్తముడనే పేరు. ఒక్క శివుడికే మహేశ్వరుడనే పేరు చెల్లుతుంది. అలాగే నూరు అశ్వమేధయాగాలు చేయడం వల్ల నన్ను ఒక్కడినే మునులు శతక్రతుడని అంటూ ఉంటారు. వరసగా ఈ పేర్లు మా ముగ్గురికే చెల్లుతాయి తప్ప ఇతరులకు చెల్లవు. మరి మీ తండ్రి నూరు అశ్వమేథ యాగాలు జయప్రదంగా నిర్వహించినట్లయితే, అతనికి ఇంద్రపదవి లభిస్తున్నది. ఆ విధంగా నీ కీర్తిని చెడగొట్టి, నా స్థానం ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడు కనుకనే మీ తండ్రి నూరవ అశ్వమేధానికి విడిచిన గుర్రాన్ని నేను అపహరించాను. ఇందులో నా దోషం లేదు! నీవు ఈ విషయంలో అనవసరంగా ప్రయాసపడవద్దు. ఎందుచేతనంటే, పూర్వం సగర చక్రవర్తి కుమారులు యజ్ఞాశ్వం విషయంలో కపిలమహర్షి జోలికిపోయి సర్వనాశనమై నారు. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుంది. కనుక చెపుతున్నాను."

దేవేంద్రుడు ఇలా గంభీరవాక్కులతో సమాధానం చెప్పగా రఘుమహారాజు విని చిరునవ్వు నవ్వాడు! ఇంద్రుని పలుకులకు ఏ మాత్రం భయపడక మరల ఇలా అన్నాడు :

"ఓయీ దేవేంద్రుడా! నీవు నా గుర్రాన్ని వదిలిపెట్టరాదని నిశ్చయించుకున్నట్లయితే, మొదట నీవు నాతో యుద్ధం చేయవలసి ఉంటుంది. యుద్ధంలో నన్ను జయించి గుర్రాన్ని పట్టుకుని పో"

ఇలా అని రఘుమహారాజు దేవేంద్రునికి ఎదురుగా నిలిచాడు. ధనుర్ధారి అయి యుద్ధసన్నద్ధుడయినాడు.

ఆ విధంగా రఘువు శివునివలె నిలిచి, దేవేంద్రునిపై స్తంభనరూపమైన బాణాన్ని ప్రయోగించాడు. అది వెళ్ళి ఇంద్రుని రొమ్ముకు తాకింది. ఆయన కోపోద్దీపితుడైనాడు. కొత్త మేఘాలకు చిహ్నంగా ఉండే తన ధనస్సున ఒక దివ్యశరం సంధించాడు.

భయంకరులైన రాక్షసుల రక్తానికి అలవాటుపడిన ఇంద్రముక్తమగు ఆ బాణం రఘుమహారాజు విశాల వక్షస్థలంలో నాటుకున్నది. మున్నెన్నడూ రుచి చూడని మనుష్యరక్తం ఎలా ఉంటుందో అని కుతూహలపడుతున్నట్లు, రఘుమహారాజు రక్తం త్రాగింది. రఘువు హృదయం నుండి నెత్తురు కారింది.

అప్పుడు కుమారస్వామి వంటి పరాక్రమం గల రఘుమహారాజు, రోషకషాయిత లోచనుడై మరొక ఉగ్రమైన బాణం వేశాడు. రఘుమహారాజు పేరు చెక్కి ఉన్న బాణం అది. అది వెళ్ళి – శచీదేవి చిత్రించిన మకరికాపత్రాల గుర్తులు గలది, ఐరావతాన్ని తట్టి తట్టి మొద్దుబారిన వ్రేళ్ళు గలది అగు ఇంద్రుని భుజాన నాటుకున్నది.

రఘువు అంతటితో ఊరుకోక, నెమలి రెక్కలుగల మరొక బాణం వేసి, చాలా బలిష్ఠమైన ఇంద్రుని టెక్కాన్ని విరగొట్టాడు! రాజ్యలక్ష్మి

తలవెంట్రుకలు బలాత్కారంగా కత్తిరించినట్లు అనిపించి ఇంద్రుడు రఘుమహారాజుపై మిక్కిలి కోపం వహించాడు.

అంతట వారిరువురికీ గొప్ప యుద్ధం జరిగింది. ఒకరినొకరు జయించాలన్న జీగీషతో ఉగ్రమైన బాణాలు ప్రయోగించుకున్నారు. క్రింద ఉండి రఘుమహారాజు వేసే బాణాలు ఊర్ధ్వ ముఖంగాను, పైన ఉండి దేవేంద్రుడు వేసే బాణాలు అధోముఖంగాను వ్యాపించాయి.

దేవేంద్రుడు ఎడతెరిపి లేకుండా ఉగ్రమైన శరాలను ప్రయోగిస్తూనే ఉన్నాడు. అయినప్పటికీ తన అంశతో పుట్టిన రఘుమహారాజును అవి ఏమీ చేయలేకపోయినవి. మేఘం తన జలంచేత, తన గర్భంనుండి వెడలి వచ్చిన పిడుగును ఎలా చల్లార్చలేదో, ఇంద్రుడు తన అంశవలన జన్మించిన రఘువును అలా జయించలేకపోయాడు.

అప్పుడు రఘుమహారాజు ఒక అర్ధచంద్ర బాణంతో దేవేంద్రుని వింటినారిని తెగవేశాడు. మధించబడిన సముద్రంలా గంభీరంగా ధ్వనించే వింటినారి అది! శ్రీచందనం పూసుకున్న ఇంద్రుని మోచేతిక్రింద ఉన్నదది!

ఆ విధంగా తన ధనుస్సు చెడిపోగా ఇంద్రుడు దానిని వదలి వేశాడు. అంతులేని క్రోధంతో వజ్రాయుధం తీశాడు. పర్వతాల రెక్కలు విరగగొట్టిన వజ్రాయుధం అది. కనులు మిరుమిట్లు గొలిపే తేజఃపుంజాలను వెదజల్లు తున్నది. రఘువును సంహరించడానికై ఆ వజ్రాయుధం చేతబట్టాడు ఇంద్రుడు! దానితో రఘుమహారాజు రొమ్మున కొట్టాడు!

ఆ వ్రేటుకు రఘువు నేలమీద పడిపోయాడు. అప్పుడాయన సేనాజనులలో హాహాకారాలు మిన్నుముట్టాయి. అయితే! నేలకూలిన రఘువు మరల ఒక్క నిమిషంలో లేచాడు! అప్పుడు ఆయన సేనాజనులు సింహనాదాలు చేశారు.

తన వజ్రాయుధం వ్రేటుకు కూడా లొంగక అజేయుడై నిలచిన రఘుమహారాజు శౌర్యపరాక్రమాలు చూచి దేవేంద్రుడు ఎంతో మెచ్చుకున్నాడు. అవును, గుణవంతులు శత్రువుల శౌర్యాన్ని కూడా శ్లాఘించడం సహజం!

అప్పుడు దేవేంద్రుడు "ఓయీ – రఘుమహారాజా! పర్వత పక్షాలనే ఛేదించిన నా వ్రజాయుధం దెబ్బతిని బ్రతికినవాడు నీవు తప్ప ఇంత వరకూ మరెవ్వరూ లేరు! అందువల్ల నీమీద నాకు ప్రేమ కలిగినది. ఈ యాగాశ్వాన్ని తప్ప మరేదైనా కోరుకో ఇస్తాను." అని పలికాడు.

అప్పుడు రఘుమహారాజు – ప్రయోగించడానికై అంబుల పొదిలో నుంచి తీసిన వాడిబాణాన్ని తిరిగి వెనుకకు నెట్టి ఇంద్రునితో – "దేవా! యజ్ఞాశ్వాన్ని విడిచిపెట్టటం నీకు ఇష్టం లేకపోతే – మరొక పని చెయ్యి! నూరవ అశ్వమేధయాగానికి దీక్ష వహించి ఉన్న నా తండ్రికి ఆ యాగ ఫలాన్ని సంపూర్ణంగా ప్రసాదించు. యాగదీక్షలో ఉన్నవాడు ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకడని చెపుతారు. అలంటి దీక్షలో ఉన్న నా తండ్రి గారికి మీరే మీ దూతల చేత ఈ వృత్తాంతం తెలియజేయించడండి." అని బదులు చెప్పాడు.

దేవేంద్రుడు అలాగేనని చెప్పి అదృశ్యుడైనాడు. రఘుమహారాజు తన నగరానికి తిరిగు ప్రయాణమైనాడు – యాగాశ్వం లేకుండా తిరిగి వెడుతున్నందున, ఆయనకు ఎంతో చింతగా ఉన్నది. దేవేంద్రుని జయించానన్న సంతోషం ఆయనకు కలుగలేదు.

రఘువు తన నగరికి వెళ్ళేసరికి, ఇంద్రుడు తన దూతల చేత దిలీపమహారాజుకు సంగతంతా చెప్పి పంపాడు. నూరవ అశ్వమేధయాగఫలం సంపూర్ణంగా తనకు లభించినందున దిలీపమహారాజు మిక్కిలి సంతోషించాడు. వజ్రాయుధం వ్రేటుకు తట్టుకుని, ఇంద్రుని మెప్పించిన తన కుమారుడు రఘుమహారాజును దగ్గరకి తీసుకుని, పుత్రుని శౌర్యసాహసాదిగుణాలను ఎంతగానో ప్రశంసించాడు.

ఆ విధంగా దిలీపుడు అంత్యకాలమున స్వర్గానికి పోవలెనన్న ఇచ్ఛతో స్వర్గానికి సోపానాలు కట్టినట్లు తొంభైతొమ్మిది అశ్వమేథ యాగాలు చేసి, నూరవ అశ్వమేథ యాగ ఫలం కూడా పొందాడు. సర్వసంగ పరిత్యాగుడై, రాజ్యలక్ష్మికి చిహ్నమయిన శ్వేతచ్ఛత్రాన్ని తన కుమారుడైన రఘుమహారాజుకు అప్పగించాడు. భార్య సుదక్షిణాదేవితో కూడా, వానప్రస్థాశ్రమధర్మం నిర్వర్తించడానికై వనభూములకు వెళ్ళిపోయాడు.

అవును – ఇక్ష్వాకువంశపు రాజులందరికీ వృద్ధాప్యంలో వానప్రస్థం అవలంభించడం ఆచారం.

## 4

**తం**డ్రి అయిన దిలీపమహారాజు వల్ల రాజ్యం పొంది రఘుమహారాజు, సాయంకాలం వేళ, సూర్య తేజస్సును పొందిన అగ్నిహోత్రుని వలె ప్రకాశించాడు!

అసలు దిలీపుడంటేనే శత్రురాజులకు అమితభయం. ఇప్పుడు రఘుమహారాజు పట్టాభిషిక్తుడైనాడన్న వార్త వినగానే శత్రురాజుల గుండెలు తల్లడిల్లాయి. వారు మరింత భయభ్రాంతులయినారు. వారి హృదయాలలో రాజుకున్న సంతాపాగ్ని ఇప్పుడు మంటలెత్తినట్లుయింది.

వర్షాలు బాగా కురియడానికి రాజులు ఏటేటా ఇంద్రధ్వజం అనే ఉత్సవం చేస్తారు. ప్రజలంతా తమ బిడ్డలతో, పాపలతో ఆ ఉత్సవాన్ని కళ్ళారా చూచి ఎంతో ఆనందిస్తారు. అలాగే ఇప్పుడు కొత్తగా రాజ్యానికి వచ్చిన రఘుమహారాజును చూచి జనులంతా మిక్కిలి ఆనందం పొందారు. ఏనుగు వలే నడిచే రఘుమహారాజు పితృదత్తమైన సింహాసనం ఎక్కగానే శత్రురాజు లంతా ఆయనకు లొంగిపోయారు. ఆయన సింహాసనాసీనుడై గొప్ప కాంతితో తేజరిల్లాడు. రాజ్యలక్ష్మి స్వయంగా ఆయనకు గొడుగు పట్టినట్టు అనిపించింది!

వందిమాగధులు ఆయన గుణవిశేషాలను అనేకవిధాల స్తోత్రాలు చేశారు. రాజు విష్ణు దిక్పాలకుల అంశ కలవాడన్న దేవతా భావంతో సరస్వతి ఆయనను స్తుతించినట్లు అనిపించింది. ఇదివరకు ఈ భూమండలాన్ని మనువు మొదలైన ప్రసిద్ధులగు రాజులనేకులు పాలించారు. అయినప్పటికి వితరణాది గుణాలవల్ల రఘుమహారాజు అందరినీ అతిశయించినవాడు కావడంవల్ల, ఇంతటి రాజు ఇదివరకు రాలేదన్న ఖ్యాతి పొందాడాయన.

నేరస్తులను శిక్షించవలసి వస్తే, వివేకంతో ఎవరికి ఎంత శిక్ష యుక్తమో, వారికి అంత శిక్షే విధించేవాడు రఘుమహారాజు. అందువల్ల ఆయన పరిపాలన చల్లని-మెల్లని మలయమారుతంలా సకల జనులకూ ఆనందకరంగా ఉన్నది.

తియ్యమామిడి చెట్లు పుష్పించినప్పుడు అందరికీ సంతోషంగానే ఉంటుంది. కానీ అది పండ్లు పండినప్పుడు పూలు పూసినప్పటికంటె ఎక్కువ సంతోషం కలుగుతుంది. అలాగే దిలీపమహారాజు పరిపాలనలో సుఖపడిన ప్రజలు, ఇప్పుడు రఘుమహారాజు పాలనలో అంతకంటె సుఖాలు అనుభవిస్తూ, దిలీపుని కంటె ఎక్కువగా రఘుమహారాజును ప్రేమించడం మొదలుపెట్టారు.

కొత్తగా రాజ్యానికి వచ్చిన రఘుమహారాజుకు నీతిశాస్త్రజ్ఞులు ధర్మాధర్మ యుద్ధాదుల క్రమాన్ని గురించి లెస్సగా బోధించారు. అయితే రఘువు ధర్మయుక్తమైన విషయాలను మాత్రమే స్వీకరించి ధర్మవిరుద్ధమైన విషయాలు విడిచిపెట్టాడు. ఆయన ధర్మపరిపాలనలో ఋతుధర్మాలు తప్పక నిర్వర్తించ బడటం చేత, పృధివ్యాది పంచభూతాల గుణాలు అతిశయించాయి. అందువల్ల ఆయన ప్రభుత్వంలో అన్నీ నూతనంగా ఉన్నట్లు కనిపించాయి.

తన చల్లని కిరణాలచేత ఆహ్లాదం కలిగించేవాడు కనుక చంద్రుడికి చల్లనివాడన్న పేరు సార్థకమైంది. వెచ్చని కిరణాలచేత తాపం పుట్టించేవాడు కనుక సూర్యుడికి తపనుడు అనే పేరు సరిపోయింది. అలాగే, జనులకు

ప్రీతిపాత్రుడై ఆనందం కలిగించే రఘుమహారాజుకు ఆ పేర్లు అన్నివిధాల తగినవి.

చెవులకు తాకి ఉండేటంత విశాలమైన నేత్రాలు రఘుమహారాజువి! ఆయన ఏ పని చేసినా శాస్త్రాలకు అనుగుణంగానే చేసేవాడు. శరణుజొచ్చిన శత్రువులను రక్షించి సంతోషపెట్టేవాడు. ఎదిరించి నిలచిన విరోధుల అహంకారాన్ని అణచివేసేవాడు. అందువల్ల ఆయన రాజ్యంలో శత్రుబాధ అనేది లేకుండా పోయింది. ఇలా ఉండగా శరదృతువు వచ్చింది. బాగా వర్షాలు కురిసిన పిదప ఎండాకాలం మొదలుపెట్టింది. అప్పుడు రఘుమహారాజు యుద్ధప్రయత్నాలు ప్రారంభించాడు.

వర్షాలు కురిపించడానికై దేవేంద్రుడు తాను ఎత్తిన ధనుస్సు దించి వేశాడు. ఇంద్రుడలా ధనుస్సు దించివేయగానే రఘుమహారాజు యుద్ధం కోసం ధనుస్సు ధరించాడు! ఆ విధంగా ప్రజల సుఖం కోసం సస్యాభివృద్ధికై ఇంద్రుడు, శత్రుబాధా నివృత్తికై రఘువు పూనుకున్నాడు.

తెల్లని కమలాలు గొడుగులుగాను – వికసించిన రెల్లుగడ్డిపూలు వింజామరలుగాను ఉన్న శరదృతువు రఘుమహారాజుతో సరిపోల్చదగినదిగా ఉన్నది. అయితే ఆయన ఐశ్వర్యాన్ని మాత్రం అది పొందలేకపోయింది. దయామయుడైన రఘుమహారాజు ముఖం చూస్తే ప్రజలకు చంద్రుని చూచిన దానికంటె ఎక్కువ హాయి – ఆనందం కలుగుతున్నది. ఆ రఘుమహారాజు కీర్తి హంసల సమూహాలలోనూ – నక్షత్రాల గుంపులలోనూ – తెల్లకలువలు గల జలాలలోనూ ప్రతిఫలిస్తున్నట్లు తోచింది.

వరిపొలాలకు  కావలిగా చెరకుల నీడలలో కూర్చుని ఉండే రైతు స్త్రీలు – చిన్నతనం నుండీ రఘుమహారాజు గొప్పతనాన్నీ, గుణగణాలనూ పాటలుగా పాడారు!

మహాతేజస్సు గల అగస్త్యుడు ఉదయించడం వల్ల అన్నిచోట్లా నీళ్ళు నిర్మలమైనాయి. గొప్ప పరాక్రమశాలి అయిన రఘుమహారాజు వైభవం చూచి శత్రువుల గుండెలలో దిగులు పుట్టింది.

బలిసిన మూపురాలు గల ఎద్దులు స్వేచ్ఛగా పచ్చిగడ్డి మేసి మదించాయి. ఏటి ఒడ్డులను కొమ్ములతో పెళ్ళగించి వేస్తూ వినోదిస్తున్నాయి. రఘుమహారాజు పరాక్రమాన్ని అవి జ్ఞాపకం చేస్తున్నట్లున్నది.

అది శరత్కాలం కావడంవల్ల ఏడాకుల అరటిచెట్లు పుష్పించాయి. రఘుమహారాజు ఏనుగులకు ఏడుచోట్ల (తొండం రంధ్రాలు రెండు, గండ స్థలాలు రెండు, మేఢ్రం ఒకటి , కళ్ళు రెండు) మదజలం పుట్టి పరిమళం వెదజల్లింది. ఏడాకుల అరటిపూల పరిమళానికి అసూయపడినట్లుగా ఏనుగు లకు ఇలా తత్సమానమైన సువాసనగల మదజలం స్రవించినట్లు తోచింది.

ఏరులలో నీరు ఇగిరిపోయి మిట్టలు పెట్టాయి. త్రోవలలో బురద ఎండింది. ఆ విధంగా రఘుమహారాజు యుద్ధయాత్ర చేయడానికి అన్ని విధాల అనుకూల పరిస్థితులు ఏర్పడినాయి.

అప్పుడు రఘుమహారాజు యుద్ధంలో క్షేమం, విజయం పొందడానికి గాను గుర్రాలకు నీరాజనం అనే శాంతికర్మ హోమం యధావిధిగా చేశాడు. ఆ హోమం నుండి పుట్టిన జ్వాల విజయాన్ని సూచిస్తూ ప్రదక్షిణాకారంగా తిరిగింది.

తన పట్టణం సమీపాన భాండారం ఉండే దుర్గాన్ని రక్షించడానికి తగిన సేనను అట్టిపెట్టి ఉంచాడు రఘుమహారాజు. తరవాత చతురంగ బలాలనూ సమకూర్చుకున్నాడు. దేవ బ్రాహ్మణులను పూజించాడు. మంగళప్రదములైన కర్మలు యధావిధిగా నిర్వర్తించాడు. వీరోచితమైన అలంకారాలు చేసుకున్నాడు. దిగ్విజయయాత్రకు బయలుదేరాడు.

రఘుమహారాజు అలా యుద్ధయాత్రకు వెడుతుండగా పట్టణంలోని వృద్ధాంగనలు శుభసూచకంగా ఆయనపై వరిపేలాలు చల్లారు. ఆ పేలాలు ఆయనపై పడి క్షీరసముద్ర మధనకాలంలో పాల తుంపరులు విష్ణుమూర్తిపై పడినట్లు శోభిల్లాయి!

ఆ విధంగా దేవేంద్రునితో సమానుడైన రఘుమహారాజు మొదట తూర్పుదిశకు వెళ్ళాడు. శత్రువులకు భయం పుట్టించేటట్లుగాను, ఆయనకు అనుకూలంగాను గాలి వీచింది. ఆ గాలికి ఆయన సైన్యంలోని టెక్కాలు ముందరికి ఎగిరాయి. ఆయన రథాల ధూళి ఆకాశం అంతా వ్యాపించింది. ఆకాశం, భూమి ఒకేవిధంగా ఉన్నట్లు తోచింది. భూమిమీద ఏనుగులు వర్ణంలోనూ, పరిమాణంలోనూ మేఘాలతో సమానంగా ఉండి ఆకాశాన మేఘాలు పోతున్నట్లుగా భూమి మీద నడవసాగాయి. ఆ విధంగా భూమి ఆకాశంలాగాను, ఆకాశం భూమిలాగాను పొడగట్టింది. నాలుగు వ్యూహాలు గల రఘుమహారాజు సైన్యం కదలిపోయింది.

ఆయన చాలా శక్తిమంతుడు కనుక నీరు లేని స్థలాలలో నీరు పుట్టించాడు. నావలచేత దాటవలసిన నదులు అడ్డం వస్తే, సులభోపాయంతో వాటిని దాటాడు. చెట్లతో నిండివున్న అడవులు వస్తే, వాటిని నిరాటంకంగా చేశాడు.

ఆ విధంగా రఘుమహారాజు తన సైన్యాలను తూర్పు సముద్ర ప్రాంతాలకు తీసుకుని వెళ్ళాడు. శివుని జటాజూటం నుండి వచ్చే గంగను భగీరథుడు తూర్పు సముద్రానికి తీసుకుని పోయినట్లున్నదది. అంత విస్తారమైన సేన అది.

రఘుమహారాజు త్రోవ పొడుగునా శత్రురాజులను జయించి వారి నుండి కప్పములు తీసుకున్నాడు. ఏనుగులు అవి వెళ్ళే మార్గంలో చెట్లను

పెళ్ళగించి, విరిచివేసి త్రోవను ఎలా నిరామయంగా చేస్తాయో, అలా రఘుమహారాజు తన దండయాత్రా మార్గాన్ని నిష్కంటకం చేశాడు.

ఆ విధంగా రఘుమహారాజు శత్రువులను జయిస్తూ తూర్పుసముద్ర తీరం చేరుకున్నాడు. ఆ ప్రదేశం తాటిచెట్లతో నిండి ఉన్నది. ఎదిరించిన శత్రువులను హతమార్చేవాడు కావడం వల్ల రఘుమహారాజుకు భయపడి, సింహళ దేశాధిపతులు ఆయనను శరణుజొచ్చారు. నదీ ప్రవాహానికి ప్రబ్బలి వృక్షాలు వంగినట్లుగా వారు ఆయనకు లొంగిపోయి తమ ప్రాణాలను, రాజ్యాలను కాపాడుకున్నారు.

వంగదేశపు రాజులు గంగానదిలో ఓడలమీద సైన్యాలతో వచ్చి రఘుమహారాజును ఎదిరించారు. అయితే ఆయన వారిని సునాయాసంగా జయించి ఆ నదీలంకలో జయస్తంభాలు నాటించాడు. మొదట ప్రతిఘటించిన వంగరాజులు రాజ్యభ్రష్టులైన పిదప రఘుమహారాజు చేత మరల రాజ్యం పొంది ఆయన పాదాలకు మ్రొక్కారు. అపారమైన ధనమూ, కానుకలూ ఆయనకు సమర్పించి సంతోషపెట్టారు.

పొలంలో విత్తనాలు చల్లగా నారు మొలుస్తుంది. ఆ నారు తీసి మరల వేరే నాటగా పెరిగి వెన్నులు పుట్టుతాయి. తరువాత మొదళ్ళపర్యంతం వంగి పొలం యజమానికి పంటను ఇస్తుంది. ఈ రాజులు తిరిగి తమ రాజ్యాలు పొంది రఘుమహారాజుకు కానుకలు సమర్పించడం ఆ తీరిగానే ఉన్నది.

రఘుమహారాజు తన ఏనుగులనే వరసగా నిలబెట్టి వంతెనగా చేసి దానిమీద తన సైన్యంతో కపిశానదిని దాటాడు. ఉత్కళరాజులు చూపిన మార్గాన కళింగదేశం వెళ్ళాడు. చర్మం భేదింపబడి కండలతో సహా నెత్తురు కారుతున్నా లెక్కపెట్టని మదం గల గంభీరవేది అనే ఏనుగు గండస్థలంపై మావటివాడు వాడి అగు అంకుశంతో పొడిచినట్లుగా రఘుమహారాజు సప్తకుల పర్వతాలకూ రాజైన మహేంద్ర పర్వతంపై తన శౌర్యపరాక్రమాలను విజృంభింప జేశాడు.

కళింగరాజుకు అసంఖ్యాకంగా ఏనుగులు ఉన్నాయి. అటువంటి అపారమైన గజబలం గల కళింగరాజు అనే పర్వతం రెక్కలను విరగగొట్టడానికి దేవేంద్రుడిలా వచ్చాడు రఘుమహారాజు. అయితే, అలాంటి దేవేంద్రుడిపై పర్వతాలు రాళ్ళవాన కురిపించినట్లుగా కళింగరాజు రఘుమహారాజుపై శరవర్షం కురిపించాడు. అయితే రఘుమహారాజు ఆ వర్షంలో ఓర్పుతో తడిశాడు. అది ఆయనకు మంగళస్నానంలా ఉన్నది.

రఘుమహారాజు సైనికులు ఆ మహేంద్ర పర్వతంపైన గల టెంకాయచెట్ల కల్లును తాంబూలదళాలచేత త్రాగారు. వారు ఆ కల్లు అలా పానం చేయడం శత్రువు కీర్తిని పానం చేసినట్లున్నది.

అపజయం ఎరుగని రఘువు కళింగుని యుద్ధంలో జయించాడు. అయితే కళింగరాజు శరణాగతుడు అయినందున అతని ఐశ్వర్యాన్ని మాత్రం తీసుకుని,  అతని రాజ్యం అతనికి తిరిగి ఇచ్చివేశాడు.

ఇలా వెళ్ళిన చోటనల్లా విజయభేరి మ్రోగిస్తూ రఘుమహారాజు తూర్పు దిక్కునుండి, ఫలించిన పోకచెట్ల బారులుగల సముద్రతీరం మీదుగా అగస్త్యులవారు ఉండే దక్షిణ దిక్కునకు వెళ్ళాడు.

అక్కడ కావేరీనదిలో ఆయన సైనికులు యథేచ్ఛగా స్నానాలు చేశారు. ఏనుగుల గండస్థలాలు శుభ్రపరిచారు. అందువల్ల సైనికులు పూసుకున్న దివ్యగంధం చేత, ఏనుగుల మదజలం చేత కావేరీజలాలు పరిమళభరిత మైనాయి. నదీ భర్త అయిన సముద్రుడు కావేరికి ఇతర పురుష సంబంధం కలిగినదా అని సంశయించినట్లుగా ఆయన గజసైన్యం దక్షిణ సముద్రం దాకా వ్యాపించింది!

అంతట ఆయన తన సైన్యంతో మలయాచల ప్రాంతం చేరుకున్నాడు. అక్కడ మిరియాలచెట్ల వనాలు విస్తారంగా ఉన్నాయి. ఆ చెట్లపైన హారీతపక్షులు

గుంపులు గుంపులుగా నివసిస్తున్నాయి. అక్కడ యాలకచెట్లు కూడా విస్తారంగా ఉన్నాయి. గుర్రాలు త్రొక్కటం వల్ల పొడి పొడి అయి పైకి ఎగిరిన ఏలక కాయ పొళ్ళు, ఏలకుల వాసన గల ఏనుగుల గండస్థలాలపై మెత్తుకున్నాయి.

అక్కడ చందనపు చెట్లకు పాములు చుట్టుకోవడం వల్ల కోసులైనాయి. ఆ కోసులలో గొలుసులు చుట్టి మదపుటేనుగులను కట్టివేశారు. అయితే కట్టు గొలుసులను కూడా త్రెంచివేసే ఆ ఏనుగుల ఆర్భటికి అవి జారలేదు.

అది దక్షిణాయనం. సూర్యుడు పాండ్యరాజుకు భయపడినట్లుగా వేడిని తగ్గించాడు. అయినా కూడా ఆ పాండ్యరాజులు రఘుమహారాజు ప్రతాపం ముందు ఆగలేకపోయారు. తామ్రపర్ణీనది సముద్రంలో సంగమించే చోట తాము సంపాదించిన శ్రేష్టమైన ముత్యాలను రఘుమహారాజుకు తమ కీర్తిని అప్పగించినట్లుగా అప్పగించారు వారు.

చందనపు చెట్లు గుబురుగా ఎదిగి పొదివి ఉన్న మలయ, దుర్దురు పర్వతాలు రెండూ దక్షిణదిశ అనే సుందరికి చందన చర్చితములయిన రెండు కుచాలవలె ఉన్నాయి. రఘుమహారాజు ఆ పర్వతాలపై యధేచ్ఛగా సుఖాలు అనుభవించాడు. పిమ్మట సముద్రానికి దూరంగా భూదేవికి చీర జారిపోగా కనిపిస్తున్న పిరుదల వలె ఉన్న సహ్యా పర్వతాన్ని అతిక్రమించాడు.

ఆ విధంగా ఆయన పశ్చిమ దేశాలను జయించడానికి వెళ్ళాడు. సహ్యాపర్వతానికి, దక్షిణ సముద్రానికి మధ్య ప్రయాణం చేసింది ఆయన సైన్యం. పూర్వం పరశురాముడు బ్రాహ్మణులకు దానమిచ్చిన భూమికాక, వేరే భూమి కోసం తన గండ్రగొడ్డలితో సహ్యాపర్వతం నుండి కొంతదూరం తొలగించి సముద్రుడు తిరిగి సహ్యాపర్వతాన్ని కలుసుకున్నట్లు రెండవ సముద్రం వలె కనిపించింది ఆయన సైన్యం.

రఘుమహారాజు పేరు వినగానే కేరళ రాజస్త్రీలు సొమ్ములు తీసి పరుగెత్తడం మొదలుపెట్టారు. అప్పుడు రఘుమహారాజు సైన్యం నుండి

చెలరేగిన పాదధూళి ఆ స్త్రీల ముంగురులకు అంటుకుని కుంకుమ చూర్ణం వలె కనిపించింది.

మార్గంలో మురళానది మీదుగా వచ్చిన చల్లని గాలికి, ఆ ప్రాంతం లోని మొగలిపూల పరాగములు రఘుమహారాజు సైనికుల కవచాలపై పడింది. అప్రయత్నంగా గంధదూళి చల్లబడినట్లు కనిపించింది.

గుర్రాలు నడుస్తున్నప్పుడు వాటి కవచాల ధ్వని గాలికి కదులుతున్న శ్రీతాళ వన ధ్వనిని మించిపోయింది. ఏనుగులను ఈతచెట్లకు కట్టివేశారు. వాటి గండస్థలాల నుండి మదజలం స్రవిస్తున్నది. అప్పుడు పొన్నపూల పైన గల తుమ్మెదలు వచ్చి ఏనుగుల గండస్థలాలపై వాలాయి.

పూర్వం పరశురాముడు భూమికావాలని అర్థించగా సముద్రుడు తన జలాన్ని తగ్గించి కొంత చోటు ఇచ్చాడు. ఇప్పుడా సముద్రుడు రఘుమహారాజుకు పడమటి రాజులనే కానుకలను సమర్పించాడు.

రఘుమహారాజు మదపుటేనుగు దంతాలతో త్రికూట పర్వతాన్ని పొడిచి, పొడిచి, ఆయన విజయాన్ని తెలిపే అక్షరాలు లిఖించినట్లు గీరలు వేశాయి. అందువల్లనే చాలా పొడుగుగా ఉండే ఆ త్రికూటపర్వతం ఆయన జయస్థంభం వలె కనిపించింది.

ఆ విధంగా రఘుమహారాజు పశ్చిమదేశాన్ని జయించి, తపస్వి తత్త్వజ్ఞానంతో ఇంద్రియాలనే శత్రువులను జయించినట్లు, పారశీకరాజులను జయించడానికై సముద్రతీరం వెంటనే వెళ్ళాడు.

వర్షం లేని కాలంలో మేఘాలు, తెల్లవారగానే వికసించే తామర పుష్పాలను ప్రకాశింపజేసే ఎండను అచ్ఛాదించినట్లు, కమలాల వంటి ముఖాలుగల పారశీకదేశపు యవనజాతి స్త్రీలు వారి భర్తలతో కూడి మద్యం

త్రాగి మహావైభవంగా ఉండడం చూచి రఘుమహారాజు సహించలేక పోయాడు. వారి భర్తలతో యుద్ధం చేయడానికి ఉబలాటపడ్డాడు.

తురుష్కుల అశ్వికదళం అపారమైనది. వారి సైనికులు ధనుర్విద్యలో ఆరితేరినవారు. అటువంటి తురుష్కసేనలతో రఘుమహారాజుకు భయంకర మగు యుద్ధం తటస్థించింది. రఘుమహారాజు తన బల్లెములతో తురకల తలలు తెగవేయగా, ఆ తలలు పొడుగైన ముఖరోమాలు గలవి కావడం వల్ల తేనెటీగలు ముసిరిన తేనె రేగడలవలె కనిపించాయి. అలాంటి తురకల తలలతో యుద్ధభూమి యావత్తూ నిండిపోయింది.

ఆ యుద్ధంలో చనిపోయినవారు చనిపోగా, చావక బ్రతికి ఉన్న వారు టోపీలు తీసివేసి రఘుమహారాజును శరణు వేడుకున్నారు. అప్పుడాయన వారిని కాపాడాడు. అవును, మహాత్ములు ఎప్పుడూ శత్రువుల గర్వాన్ని అణచవలెనని పట్టుదలతో ఉంటారే కాని – వారి గర్వం అణగిపోయిన పిదప, క్రోధం వహించరు.

యుద్ధానంతరం రఘుమహారాజు సైనికులు ద్రాక్ష పందిళ్ళ కింద మెత్తని తోళ్ళ పరుపులు పరుచుకున్నారు. వాటిపై కూర్చుని ద్రాక్షసారాయం సేవిస్తూ యుద్ధంలో కలిగిన శ్రమను పోగొట్టుకున్నారు. తరవాత రఘుమహారాజు సూర్యుడు తన కిరణాలతో జలాలను పీల్చడానికై ఉత్తరాయణ గతుడైనట్లు ఉత్తరదేశపు రాజులను జయించడానికై ఆ దిక్కునకు వెళ్ళాడు.

పశ్చిమ వాహిని అయిన సింధూనదం తీరాన రఘుమహారాజు గుర్రాలు పొర్లాడి మార్గాయాసం తీర్చుకున్నవి. అవి అలా పొర్లాడినప్పుడు వాటి తలలకు, మూపురాలకు అంటుకున్న కుంకుమపూలు రాలినవి.

రఘుమహారాజు తన అసమానమైన పరాక్రమంతో ఉత్తర దేశ మందలి హూణరాజులను హింసించాడు. ఆ రాజుల భార్యలు చెంపలు బాదుకుంటూ అమితంగా దుఃఖించడం చేత వారి చెంపలు ఎర్రగా కందాయి.

కాంభోజరాజులు, రఘుమహారాజు పరాక్రమం ముందు నిలువలేక పోయారు. ఊడుగచెట్లకు ఏనుగులను కట్టివేస్తే, వాటి కాళ్ళ సంకెళ్ళ ఒరిపిడికి ఆ చెట్లు వాలిపోయినట్లుగా ఆ రాజులు రఘుమహారాజుకు లొంగిపోయారు. కాంభోజ దేశపు గుర్రాలు మిక్కిలి శ్రేష్ఠమైనవి. జాతి గుర్రాలు అవి. ఆ రాజులు గుర్రాలనూ, అపారమైన ధనరాసులను రఘుమహారాజుకు కానుకలుగా సమర్పించారు. అయినా, అందుకు ఆయన పొంగిపోలేదు, గర్వపడలేదు.

ఆయన తన గుర్రాలమీద హిమవత్పర్వతం ఎక్కాడు. ఆ గుర్రాలు నడిచేటప్పుడు రేగిన గైరికాది ధాతుపరాగములవల్ల ఆ పర్వతం పెరుగు తున్నట్లు కనిపించింది. ఆయన సైనికుల కోలాహల ధ్వనులు విని ఆ కొండ గుహలలో పండుకుని ఉండే సింహాలు, మహాబలం కలవి కనుక భయంతో పారిపోక వెనుదిరిగి చూడసాగాయి. కొండ త్రోవలలో చల్లని మెల్లని గాలి వీచడం చేత కోమల చర్మాలుగల భుజపత్ర వృక్షాలలో ఆకులు కదిలాడి మర్మర ధ్వనులు పుట్టాయి. వెదురులు మధురంగా ధ్వని చేశాయి. గంగానదీ తరంగాలపై నుంచి చల్లని తుంపరలు వచ్చి పడ్డాయి. ఇలా చల్లనిగాలి, వాతావరణం రఘుమహారాజుకు ఎంతో ఆనందం కలిగించాయి.

ఆయన సైనికులు సురపొన్న చెట్లక్రింద బండలపై విశ్రమించారు. ఇదివరకు కస్తూరీ మృగాలు పడుకున్నందున ఆ బండలు కస్తూరివాసనలు వెదజల్లుతున్నాయి. ఏనుగులను దేవదారు చెట్లకు గొలుసులతో కట్టివేశారు. అప్పుడు జ్యోతిర్లతల కాంతి, ఆ ఏనుగుల మెడలకు కట్టిన గొలుసులలో ప్రతిఫలించి, రఘుమహారాజుకు చమురులేని దీపాల వలె వెలుగొందాయి.

రఘుమహారాజు విడిది చేసిన చోటనల్లా ఏనుగులను దేవదారు చెట్లకు కట్టివేసినప్పుడు, వాటి మెడల గొలుసుల రాపిడిచే ఆ చెట్లకు ఎంతో ఎత్తున పట్టలు పగిలాయి. వాటిని చూచి బోయలు 'అబ్బా! ఈ ఏనుగులు ఇంత ఎత్తుగలవా" అని ఆశ్చర్యపడ్డారు.

హిమవత్పర్వతంపైన, ఆ పర్వతాన పుట్టిన ఉత్సవ సంకేతులనే పేరుగల సప్తగణాలతో రఘుమహారాజుకు భయంకరమైన యుద్ధం జరిగింది. రకరకాల బాణాలు, భిండివాలాలు మున్నగు సాధనాలతోను పాషాణాదులతోను, ఘోరంగా జరిగిన యుద్ధం అది! ఆ సాధనాల తాకిడికి అగ్నికణాలు ఎగిరిపడడం వల్ల చూచేవారికి ఆ యుద్ధం మహా భయం గొలిపింది.

అయితే రఘువు ఆ యుద్ధంలో ఉత్సవ సంకేతాఖ్య గణాలను జయించాడు. ఇంత గొప్ప విజయం ఆయన సాధించగా చూచి కిన్నెరులు ఆ విజయాన్ని ఒక కావ్యంగా గానం చేశారు!

పరాజితులైన పర్వతవాసులు రఘుమహారాజుకు పెక్కు కానుకలు సమర్పించుకున్నారు. అటువంటి వెలలేని కానుకలను బట్టి హిమవంతుడు ఎంత గొప్పవాడో రఘుమహారాజు తెలుసుకున్నాడు. అజేయులైన పర్వత వాసులను జయించడం వల్ల రఘుమహారాజు శౌర్యపరాక్రమాలు ఎట్టివో హిమవంతుడు కూడా తెలుసుకోగలిగాడు.

ఆ విధంగా రఘువు హిమవత్పర్వతమున తన కీర్తిని వ్యాపింపజేసి, కైలాసం పూర్వం రావణాసురుని చేత ఎత్తబడినది కావడం వల్లనూ, దానిని జయించడం గౌరవం కాదని భావించడం వల్లనూ దాని దగ్గరికి పోలేదు!

అంతట రఘుమహారాజు లౌహిత్యం అనే పేరుగల నదిని దాటాడు. అక్కడ కృష్ణాగరు చెట్లకు ఏనుగులను కట్టివేయగా ఆ ఏనుగుల ఈడ్పులకు చెట్లు చలించాయి. అదే విధంగా ఆయన సైన్యాన్ని చూచి అక్కడి రాజుల గుండెలు తల్లడిల్లాయి!

రఘుమహారాజు రథం పోతూ ఉంటే, ఆ రథచక్రాల తాకిడికి లేచిన దుమ్ము ఆకాశం అంతా కప్పుకున్నది. మేఘాలు లేకుండా సూర్యుడు ప్రకాశిస్తున్నప్పటికీ వర్షం పడుతున్నట్లు తోచింది. ఆ రథధూళి చూచినంత

మాత్రం చేతనే ప్రాగ్జ్యోతిషపురాజు భయభ్రాంతుడై, యుద్ధ ప్రయత్నం లేకుండా రఘుమహారాజుకు లొంగిపోయాడు.

ఇంద్రుని మించిన పరాక్రమం గల రఘుమహారాజును చూడగానే కామ్యదేశాధీశ్వరుడు వినమ్రతతో తలవొంచి వశమైనాడు. తాను పూర్వం ఏ ఏనుగుల సహాయంతో ఇతర రాజులను జయించాడో, ఆ ఏనుగులనే రఘుమహారాజుకు కానుకలుగా ఇచ్చాడు. ఆ రాజు ఇంకా రఘుమహారాజును సువర్ణ సింహాసనంపై కూర్చోపెట్టి, ఆయన పాదాలకు రత్నాలనే పుష్పాలతో పూజచేశాడు!

ఆ విధంగా జయశీలుడైన రఘుమహారాజు దిగ్విజయం చేసి ఏకచ్ఛత్రాధిపత్యం సాధించాడు. మహదానందంతో తిరిగి తన పట్టణానికి ప్రయాణమైనాడు.

తరువాత ఆయన విశ్వజిత్తు అనే గొప్ప యాగం చేశాడు. ప్రపంచాన్ని జయించి చేయదగిన యాగం ఇది. ఈ యజ్ఞంలో సర్వస్వమూ దక్షిణ క్రింద ఇవ్వవలసి ఉన్నది. అవును, మహాత్ములు తాము ఎంత అర్జించినా మేఘుని వలె అర్జించినదంతా సద్వినియోగం చేస్తారు.

రఘుమహారాజు ఆ యాగాన్ని పూర్తి చేయగానే, వచ్చిన రాజులందరికీ అనేక బహుమతులు ఇచ్చి వారిని వారివారి దేశాలకు పంపించివేశాడు.

ఆ రాజులు తాము యుద్ధంలో ఓడిపోయామన్న దుఃఖం మరచిపోయి, మరల తమ భార్యలను కలుసుకోబోతున్నాము కదా అన్న సంతోషంతో రఘుమహారాజు కాళ్ళకు సాష్టాంగ నమస్కారాలు చేశారు. అప్పుడు వారి తలలోని పూలరసం, పుప్పొడి రఘుమహారాజు కాలివ్రేళ్ళకు సోకి ఆ వ్రేళ్ళు గౌరవర్ణంగా మారినవి.

# 5

రఘు మహారాజు విశ్వజిత్తు అనే యజ్ఞం చేశాడు. తన సర్వస్వం దానంగా ఇచ్చాడు. ఆయన విశ్రాంతుడై ఉన్న సమయంలో పరతంతుముని శిష్యుడైన కౌత్సుకుడను ముని కుమారుడు, పద్నాలుగు విద్యలూ నేర్చుకుని గురుదక్షిణ యాచించడానికై రఘుమహారాజు వద్దకు వచ్చాడు.

అతిథి అభ్యాగతులంటే మిక్కిలి ప్రీతిగల రఘుమహారాజు ఆ మునిపుత్రునికి సగౌరవంగా స్వాగతం ఇచ్చాడు. ఒక మృణ్మయ పాత్రలో సకల పూజాద్రవ్యాలూ ఉంచుకుని కౌత్సుక ఋషికి ఎదురు వెళ్ళాడు. ఋషి కుమారుని తీసుకుని వచ్చి ఒక ఉచితాసనంపై కూర్చోబెట్టాడు. యధావిధిగా పూజించి, వినమ్రతతో చేతులు జోడించుకుని నిలుచున్నాడు.

“సూర్యుడు లోకంలో వారికి సకల పదార్థజ్ఞానం ప్రసాదించునట్లు, సమస్త పదార్థ జ్ఞానమును బోధిస్తూ, మంత్రజ్ఞులలో శ్రేష్ఠుడైన మీ గురువులు క్షేమంగా ఉన్నారా ? దేహసంబంధమైన ఉపవాసాది వ్రతాలూ, వాగ్రూపములైన వేదపారాయణాదులూ, మనస్సంబంధమైన గాయత్రీ మంత్రజపాదులూ– ఇలా మూడువిధాలైన క్రియలతో మీ గురువర్యుల తపస్సు నిర్విఘ్నంగా జరుగుతున్నదా ? దేవేంద్రుని వల్ల ఎలాంటి విఘ్నమూ సంభవించడం లేదు కదా ? మీ ఆశ్రమంలో పాదులుకట్టి, నీళ్ళుపోసి కుమారుల వలె పోషిస్తున్న చెట్లు సురక్షితంగా ఉన్నాయి కదా ? పెనుగాలి, కార్చిచ్చు, ఏనుగుల తాకిడి – మున్నగు ఉపద్రవాలతో అవి పాడైపోకుండా ఉన్నాయి కదా ? మీకు స్నాన, పాన, పితృతర్పణాదులకు యోగ్యమైన తీర్థోదకాలున్నాయి. ఉంఛవృత్తితో లభించే ధ్యానంలో రాజభాగార్థమై మీచేత ఉంచబడిన ఆరవభాగం ధాన్యం గింజలు గల ఇసుక దిబ్బలు గల తీర్థోదకాలు అవి. మరి వాటికేమీ హాని కలుగకుండా ఉన్నాయి కదా ?

మీ యజ్ఞయాగాది క్రతువులకు పవిత్రమైన దర్భలు ఉపయోగపడుతూ ఉంటాయి. వాటిని ప్రేమతో భక్షిస్తూ ఉంటాయి జింకపిల్లలు. వాటిని ఎవరూ ఏమీ అనరు. ఎన్నడూ అదలించరు. అవి యధేచ్ఛగా దర్భపోచలు తిని ఋషుల తొడలపై పడుకుంటూ ఉంటాయి. అలా మీచేత లాలించబడే జింకపిల్లలు క్షేమంగా ఉన్నాయి కదా ?

అతిథులకూ మీకూ కూడా జీవనసాధనంగా ఉంటున్న తృణధాన్యాలు, దేశాలనుండి వచ్చే ఆవులూ, ఎద్దులూ మున్నగు జంతువులచే పాడుచేయబడకుండా ఉన్నవి కదా ?

నాలుగు ఆశ్రమాలలోని వారికీ గృహస్థాశ్రమం ఉపయోగకరంగా ఉంటున్నది. అలాంటి గృహస్థాశ్రమం స్వీకరించే తరుణం మీకు వచ్చింది. కాబట్టి దయార్ధ్ర హృదయుడైన పరతంతు మహర్షి మీకు అన్ని విద్యలూ చక్కగా నేర్పి, ఇక వివాహం చేసుకోడానికి అనుజ్ఞ ఇచ్చాడా?

"అయ్యా! మీరు పూజ్యులు. కానీ కేవలం మీ రాకవల్లనే నాకు సంతోషం లేదు. మీరు మీ గురువర్యుల ఆజ్ఞ ప్రకారం వచ్చారో? లేక మీ స్వంత పనిమీద వచ్చారో ? ఆ విషయమై మీ ఆజ్ఞ నెరవేర్చడంలోనే నాకు కుతూహలం ఉన్నది."

ఇలా రఘుమహారాజు యుక్తమైన మాటలు చెప్పగా కౌత్సుముని విన్నాడు. మహారాజు చేతిలో మృణ్మయపాత్ర ఉండడం వల్ల ఆయన తన సర్వస్వం దానం చేశాడన్న విషయం మునికి విదితమైంది. గురుదక్షిణ సంపాదించుకోడానికై తాను వచ్చిన కార్యం నెరవేరదేమో అని ముని అనుకున్నాడు.

"రఘుమహారాజా! నీవు ప్రభువు అయివుండగా ఎవరికేమి లోపం కలుగుతుంది కనుక ?" సూర్యుడు ప్రకాశిస్తూ ఉండగా చీకటి వస్తుందా ?

ఓ భూపాలకా! పూజ్యుల యెడల భక్తి అనే దానికి మీ వంశం పుట్టినిల్లు, కాగా, భక్తి విషయంలో మీ పూర్వులకంటె నీవు అధికుడవు. అయినప్పటికి సమయం మించిపోయిన తరువాత నిన్ను యాచించడానికి వచ్చానే అని నేను విచారపడుతున్నాను. నీవు నీ సర్వస్వం దానం చేసి దేహం మాత్రం నిలుపుకుని ఉన్నావు. చక్రవర్తివి అయివుండి కూడా యజ్ఞార్థం సర్వస్వం ఇచ్చివేసినందున నీవు నిర్ధనుని వలె కనిపిస్తున్నావు. అవును. అది సహజమే, చంద్రుని కళలను కృష్ణపక్షంలో దేవతలు పానం చేసినప్పటికీ, కృష్ణపక్షంలో ఆ కళలు వృద్ధిపొందుతూనే ఉన్నాయి. కాబట్టి మరొక కార్యం అంటూ లేని నేను, గురుదక్షిణ కోసం మరొక దాతను యాచించాలని అనుకుంటున్నాను. నీకు శుభం చేకూరుగాక! వానచినుకులు త్రాగే చాతకపక్షి కూడా, వర్షాకాలం దాటిన పిమ్మల, వర్షబిందువుల కోసం మేఘుని అర్థించదు కదా!" –

కౌత్సమహర్షి ఇలా పలికి, అక్కడ నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధమైనాడు.

రఘుమహారాజు అది చూచి వెంటనే ఆయనను అడ్డగించాడు.

"స్వామీ! మీరు మీ గురువుగారికి ఇవ్వవలసిన గురుదక్షిణ ఏమిటి ? ఆ ధనం ఎంత ? నాకు చెప్పండి ?" అని రఘుమహారాజు అడిగాడు.

అప్పుడు, ఎలాంటి కొరత లేకుండా శాస్త్ర విధిని యజ్ఞం చేసిన వాడూ, నిగర్వీ, వర్ణాశ్రమ ధర్మాలను తప్పక నిర్వర్తించేవాడు అయిన రఘుమహారాజుతో పండితుడూ, బ్రహ్మచారీ అయిన కౌత్సఋషి ఇలా చెప్పాడు:

"నేను విద్యలన్నీ నేర్చుకున్న తరువాత గురుదక్షిణ తీసుకోమని మా గురువులు పరతంతు ఋషిని వేడుకున్నాను. కానీ, భక్తితో అవిరామంగా నేను చేసిన శుశ్రూషలే చాలునని ఆయన మొదట అన్నారు. అయితే, గురుదక్షిణ తీసుకోవలసినదని నేను బలవంతం చేశాను. అప్పుడాయనకు

కోపం వచ్చింది. నేను కటిక దరిద్రుడనని తెలిసి కూడా ఒక్కొక్క విద్యకు ఒక కోటి చొప్పున - పధ్నాలుగు విద్యలకూ పధ్నాలుగు కోట్ల ద్రవ్యం గురుదక్షిణగా తెమ్మని ఆయన కోరాడు.

(ఋక్కు, యజస్సు, సామం, అథర్వం - అను నాలుగు వేదాలు శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం - అను ఆరు వేదాంగాలు తర్క, మీమాంస, పురాణ, ధర్మశాస్త్రాలనే నాలుగు - మొత్తం పధ్నాలుగు విద్యలు) రాజా! నీవు నన్ను మృణ్మయ పాత్రలో ద్రవ్యాలు తెచ్చి నన్ను పూజించినందున నీవు నామమాత్రంగా ప్రభువై ఉన్నావేకాని నీవద్ద ధనం లేదని నేను గ్రహించాను. మరి, నేను ఇవ్వవలసిన గురుదక్షిణ చాలా పెద్ద మొత్తం. అందువల్ల నిన్ను యాచించడానికి మనసొప్పలేదు."

కౌత్సుడు ఇలా చెప్పగా విని, చంద్ర సమానమైన కాంతి కలవాడు, పాపరహితుడు, పృథ్వీపతి అయిన రఘుమహారాజు మరల ఇలా బదులు పలికాడు :

"ఓ మహాత్మా! శాస్త్రాలన్నీ చదివి గురుదక్షిణ యాచించడానికి వచ్చిన ఒక విద్వాంసుడికి రఘుమహారాజు ఏమీ ఇవ్వలేకపోయాడనీ, ఆ యాచకుడు మరొక దాతను అర్థించడానికి వెళ్ళాడనే అపవాదు నాకు లేకుండా చేయండి. సంభావితులకు అవమానం అనేది మరణం కంటె ఎక్కువ. దయచేసి మీరు నా త్రేతాగ్ని గృహంలో నాల్గవ అగ్నిలా రెండు రోజులపాటు ఉండండి, మీ కోర్కె తీర్చడానికి ప్రయత్నం చేస్తాను."

రఘుమహారాజు ఇలా విన్నవించగా కౌత్సముని సంతుష్టుడైనాడు. ఆయన చెప్పినట్లు చేశాడు. అప్పుడు రఘువు, భూమిలో ద్రవ్యాలను తాను గ్రహించి ఉన్నందున, ఆ ద్రవ్యాన్ని కుబేరుని వద్ద నుండి పొందాలని అనుకున్నాడు. వెంటనే తన రథాన్ని ఆయత్తం చేయించాడు.

వసిష్ఠమహర్షి మంత్రోదకం ప్రోక్షించడం వల్ల రఘుమహారాజు రథం సముద్రాలనూ, పర్వతాలనూ, ఆకాశాన్నీ వాయు సహాయంతో అధిగమించి మేఘంలా పోవడానికి సమర్థమై ఉన్నది.

తరువాత రఘుమహారాజు తన శస్త్రాస్త్రాలన్నీ రథంలో ఉంచాడు. కుబేరుడు కూడా రాజులలో ఒకడని, అతనిని జయించవచ్చునన్న అలక్ష్య భావం వహించాడు. పరిశుద్ధుడై ఆ సాయంకాలం రథంలో పడుకున్నాడు. వేకువజామున ప్రయాణం చేయాలని ఆయన తలంపు. అయితే, అప్పుడు కోశాధికారులు అక్కడికి వచ్చారు.

"మహారాజా! మన బొక్కసంలో ఆకాశం నుండి బంగారు వాన కురిసింది!" అని ఆశ్చర్యంతో ఆయనకు చెప్పారు

అప్పుడు రఘుమహారాజు తాను ఏ కుబేరుని కోసం ప్రయాణ సన్నాహం చేశాడో, ఆ కుబేరుని వలన అపార ధనం లభించినందుకు సంతోషించి కౌత్సునకు కోరినదానికంటె అధికంగా బంగారం అంతా ఇచ్చివేశాడు.

అప్పుడు అయోధ్యాపురవాసులు రఘుమహారాజు దాతృత్వాన్ని ఎంతగానో కొనియాడారు.

రఘుమహారాజు ఆ ధనరాసులను వందలకొలది ఒంటెల మీద, గుర్రాలమీద కౌత్సుఋషి వెంట పంపడానికి ఏర్పాట్లు చేశాడు. కౌత్సుముని ఎంతో సంతోషించాడు. వినమ్రుడై ఉన్న రఘు మహారాజును తన చేతితో స్పృశించాడు.

'రాజా! న్యాయంగా ద్రవ్యం సంపాదించడం, దానిని వృద్ధి చేయడం, కాపాడడం, సత్కార్యాలకు వినియోగించడం – అను ఈ నాలుగు పనులూ చేసే రాజుకు కోరిన ద్రవ్యాన్ని భూదేవి ఇస్తూ ఉంటుంది. ఇప్పుడు ఆకాశం కూడా నీ ఇష్టార్థాలను ఇవ్వడం వల్ల నీ మహిమ ఇంత – అంత అని

వర్ణించనలవి కాకుండా ఉన్నది. ఏనుగులూ, గుర్రాలూ, రాజ్యమూ మున్నగు సకలైశ్వర్యాలు గల పుత్రుడు నీకు కలుగవలెనని ఆశీర్వదిస్తున్నాను. ఇంతకంటె వేరే దీవన నీకు నిష్ప్రయోజనం. కాబట్టి మహనీయుడైన నీ తండ్రికి నీవు ఎలాగో, అలాగే నీకూ పుత్రుడు జన్మించుగాక!" ఇలా కౌత్సుడు రఘు మహారాజును దీవించి మరల తన గురువు వద్దకు వెళ్ళిపోయాడు.

సూర్యోదయం వల్ల ప్రజలకు వెలుగు లభించినట్లుగా, మహర్షి ఆశీర్వాద ప్రభావం వల్ల రఘుమహారాజుకు ఒక కుమారుడు జన్మించాడు.

అజమను పేరుగల అరుణోదయ సమయంలో అనగా బ్రహ్మ ముహూర్తంలో రఘుమహారాజు పట్టపుదేవి కుమారస్వామి వంటి ఒక పుత్రుని కన్నది. అందువలన రఘువు ఆ పిల్లవానికి బ్రహ్మపేరైన అజుడు అను పేరు పెట్టాడు. ఆ పిల్లవాడు బలిష్టమగు దేహం చేతనేమి, శౌర్య పరాక్రమాల చేతనేమి, దీపం నుండి మరొక దీపాన్ని వెలిగించినట్లుగా అన్ని విధాల తండ్రితో సమానుడుగా ఉన్నాడు. గురువుల వద్ద సమస్త విద్యలూ నేర్చుకున్నాడు. యౌవనం వచ్చింది. యువరాజ్యాధిపత్యం పొందడానికి అర్హుడై ఉన్నాడు.

అప్పుడు విదర్భ దేశాధీశుడైన భోజరాజు తన చెల్లెలు ఇందుమతికి స్వయంవరం చాటించాడు. ఆ స్వయంవరానికి అజుని రప్పించాలన్న కోరికతో నమ్మకమైన తన దూతనొకణ్ణి రఘుమహారాజు వద్దకు పంపాడు. దూత వలన సంగతీ సందర్భాలు తెలుసుకున్నాడు రఘుమహారాజు. మంచి సంప్రదాయం గల భోజునితో వియ్యమందడం యుక్తమని భావించాడు. వయసు వచ్చిన అజుడికి పెండ్లి చేయడం అవసరమనుకున్నాడు. యువరాజును సమస్త ద్రవ్యాలతో, సైన్యంతో భోజరాజు పట్టణానికి పంపించాడు.

అజమహారాజు వస్తున్నాడని తెలియగానే కాంభోజుడు త్రోవలో అతనికి అన్ని సౌకర్యాలు కలిగించాడు. అక్కడక్కడ విడిది చేయడానికి డేరాలు వేయించాడు. వాటిల్లో విశ్రమించడానికి పాన్పులు మున్నగునవి ఏర్పాటు

చేయించాడు. భోజనాదులకు అవసరమగు అహార పదార్థాలన్నీ పట్టణం నుంచి పంపించాడు. సుఖంగా విహరించడానికి, వినోదించడానికి ఉద్యానవనాల వలె మనోహరంగా ఉండే ప్రదేశాలలో విడిది వసతులు కల్పించాడు. ఆ విధంగా అజుడు అడవులలో ప్రయాణం చేసినా నగరంలో వలె అన్ని సుఖాలూ అమరునట్లుగా పెద్ద ఎత్తున వసతులు కల్పించాడు.

అజుడు తన సైన్యంతో నర్మదా నదీ తీరములందు విడిది చేశాడు. దూరప్రయాణం వల్ల సైనికులు అలసిపోయి ఉన్నారు. జెండాలన్నీ దుమ్ముకొట్టుకుని ఉన్నాయి. నర్మదా తీరాన క్రానుకచెట్లు మిక్కుటంగా ఉన్నాయి. తుంపరలతో కూడిన గాలికి ఆ వృక్షాలు కదులుతున్నాయి.

నర్మదా నదీ జలాలనుండి ఒక అడవి ఏనుగు లేచింది. మదజలం వాసనకు అక్కడ తుమ్మెదలు గుంపులుగా తిరుగుతున్నందున అక్కడ ఒక ఏనుగు ఉన్నదని ముందుగానే ఊహించడానికి వీలుకలిగింది. ఆ ఏనుగు నీళ్ళ నుండి లేచేటప్పటికి గండస్థలము లందలి మదజలం నీటిలో కలిసి పోయింది. అందువల్ల గండస్థలాలు కడిగినట్లు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

అంతకు ముందు దాని దంతాలకు అంటివున్న గావు రాయి గురుతులు ఇప్పుడు మాసిపోయాయి. అయినప్పటికీ ఆ కోరలపై చిత్రవర్ణాలు గల నిలువు గీతలు, అక్కడక్కడ వ్రేటుపడి విరిగిన గుర్తులు కనిపిస్తున్నాయి. వాటిని బట్టి ఆ అడవి ఏనుగు దగ్గరలో ఉన్న ఋక్షపర్వత చరియలలో వప్రక్రీడ కావించినదని చూచేవారికి తెలుస్తున్నది.

ఆ ఏనుగు తన తొండాన్ని ముడుస్తూ చాచుతూ పెద్ద ధ్వని పుట్టేటట్లుగా నర్మదానది తరంగాలపై తొండంతో బాదుతున్నది. తరవాత కట్టు స్తంభాలను త్రెంచుకుని వచ్చినట్లుగా ఒడ్డుకు వచ్చింది. నీళ్ళలో మునిగి రావడం వల్ల దాని గండస్థలాల నుండి మదజలం స్రవించడం క్షణకాలం నిలిచి

పోయినప్పటికీ, అజమహారాజు సైన్యంలోని ఊర ఏనుగులను చూడగానే దాని గండస్థలాలలో తిరిగి మదజలం ఊరింది!

ఏడాకుల అరిటిచెట్ల పాలవలె పరిమళం వెదజల్లు ఆ మదజలం వాసన సోకగానే రాజు ఏనుగులు దానిని చూచి సహించలేక పోయాయి. మావటివాళ్ళు ఎంత బిగబట్టినా అవి ఆగలేదు.

ఇంతలో అడవి ఏనుగు అజమహారాజు సైన్యం విడిది చేసిన చోటుకు వచ్చి అల్లకల్లోలం చేసింది. అప్పుడు గుర్రాలు కట్టుత్రాళ్ళు త్రెంచుకుని ఉరుకులు పెట్టాయి. రథాలు ఇరుసులు విరిగాయి. సైనికులు తమ తమ స్త్రీలను రక్షించుకోడానికి చికాకు పడుతున్నారు. ఆ విధంగా సైన్యం యావత్తూ చిందర వందర అయింది.

యుద్ధంలో తప్ప తక్కిన ప్రదేశాలలో ఏనుగులను చంపకూడదని శాస్త్రం. ఆ విషయం తెలిసిన అజమహారాజు – తనకు ఎదురుగా వస్తున్న ఏనుగును వెనక్కు మళ్ళించడానికి ప్రయత్నించాడు. దాని కుంభస్థలంపై ఒక బాణం వేశాడు.

ఆ బాణం తాకగానే ఏనుగు ఆ రూపం విడిచి మనోహరమూ, మిక్కిలి తేజస్సూ గల ఒక దివ్యరూపం ధరించి ఆకాశంలో నిలిచింది. అది చూచి సైనికులంతా ఆశ్చర్యచకితులయినారు.

ఆ దివ్య పురుషుడు తన మహిమతో కల్పవృక్ష పుష్పాలు సృష్టించి అజమహారాజుపై వెదజల్లాడు. తరవాత ఇలా అన్నాడు :

“రాజా! నేను ఒక గంధర్వ కుమారుడను. నా తండ్రి పేరు ప్రియదర్శనుడు. నా పేరు ప్రియంవదుడు. నా గర్వం అణచివేయడానికై మతంగ మహర్షి శాపం పెట్టాడు. అందువల్ల నాకు ఏనుగు రూపం వచ్చింది. నేను ఋషిని ప్రార్థించగా ఆయనకు నా మీద దయ గలిగింది. అవును –

అగ్నికి లేదా ఎండకూ వేడెక్కిన నీళ్ళు మరల సహజమైన చల్లదనం పొందుతాయి కదా! అలాగే ఋషి శాంతచిత్తుడై నాకు శాపవిముక్తి ప్రసాదించాడు. ఇక్ష్వాకు వంశస్థుడైన అజమహారాజు నీ కుంభస్థలాన్ని ఎప్పుడు బాణంతో కొడతాడో అప్పుడు నీవు మామూలు రూపం పొందగలవని చెప్పాడు. నేను చాలా కాలం నుండి నీ దర్శనం కోసం నిరీక్షిస్తున్నాను. నేటికి నీ వలన నాకు శాపవిముక్తి కలిగినది. రాజా! ఇందుకుగాను నేను నీకు ఏదో ఒక ప్రత్యుపకారం చేయాలి. అలా చేయకపోతే నా మహిమ వ్యర్థమే కాగలదు.

స్నేహితుడా! నీకు నేను సమ్మోహనాస్త్రం అనే ఒక దివ్యాస్త్రాన్ని ప్రసాదిస్తున్నాను. శత్రువులను జయించే అస్త్రం ఇది. ఈ అస్త్రప్రయోగోప సంహారాలకు సంబంధించిన రెండు మంత్రాలు నీకు ఉపదేశిస్తున్నాను. గంధర్వ దేవతా సంబంధమైన మంత్రాలు ఇవి. నీవు నాకు గొప్ప మేలు చేశావు. కాబట్టి నీవు సిగ్గుపడక నేను చేసే ఈ ప్రత్యుపకారాన్ని అంగీకరించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.”

గంధర్వ కుమారుడు ఇలా పలుకుతున్నప్పుడు అతని దంత కాంతికి అతని వక్షస్థలాన ఉన్న ముత్యాలహారం మరింతగా ప్రకాశించింది.

గంధర్వ పుత్రుని మాటలు మన్నించి అజమహారాజు నర్మదానదీ జలాలలో ఆచమనం చేశాడు. తూర్పు ముఖంగా నిలిచి ప్రియంవదుని వద్ద సమ్మోహనాస్త్రం మంత్రపూర్వకంగా గ్రహించాడు.

ఆ విధంగా అజమహారాజు తన ప్రయాణంలో తలవని తలంపుగా గొప్ప స్నేహాన్ని, ప్రయోజనాన్ని పొంది విదర్భ దేశానికి వెళ్ళిపోయాడు. గంధర్వుడు కూడా తన స్వస్థలమగు కుబేరుని ఉద్యానవనానికి వెళ్ళాడు.

అజమహారాజు తన నగరానికి వచ్చాడన్న వార్త వినగానే విదర్భ రాజు చాలా సంతోషించాడు. పొంగుతున్న సముద్రుడు చంద్రుని ఎదుర్కొన్నట్లు

అజమహారాజుకు ఎదురు వెళ్ళాడు. సకల గౌరవ మర్యాదలతో పెద్ద ఊరేగింపుతో అజమహారాజును తన నగరికి తీసుకుని వెళ్ళాడు. ఆ మర్యాదలు చూచి పురజనులంతా అజుని తమ స్వంత రాజుగాను, భోజుని కొత్తవానిగాను భావించారు.

భోజరాజు భటులు వెంట ఉండి మార్గం చూపగా అజమహారాజు తూర్పు ద్వారాన రత్నఖచితమగు బంగారు మంగళ కలశాలతో నిండివున్న కొత్త విడిది ఇంటిలో, మన్మథుడు యౌవనంలో ప్రవేశించినట్లు ప్రవేశించాడు.

ఆ రాజగృహంలో స్వయంవరం కోసం వచ్చిన రాజులు అనేకులు ఉన్నారు. చక్కని చుక్క అయిన ఇందుమతి తమకు లభిస్తుందో లేదో అని వారంతా దిగులు పడుతున్నారు.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. వందిజనులు వచ్చి అజమహారాజును నిద్ర లేపారు. నిద్రలో ఆయన చెవులకు కుండలాలు ఒరుసుకుని పోయాయి. స్త్రీ సంపర్కం లేకుండానే ఆయన ఒంటికి పూసుకున్న గంధం పాన్పుమీద రాలింది.

“ఓ అజమహారాజా! తెల్లవారింది. ఇక లేవండి. బ్రహ్మదేవుడు రాజ్య భారాన్ని మీ తండ్రిపైన, యువరాజైన మీపైన ఉంచాడు. మీ తండ్రి అప్రమత్తుడై భూమిని పాలిస్తున్నాడు మీరున్నూ మీ పరిపాలనా బాధ్యత నిర్వర్తించవలసి ఉన్నది. మీరు నిద్ర అనే కాంతకు వశులై ఉండగా, పురుషుడు అన్యస్త్రీ లోలుడయినట్లు తెలుసుకుని ఆగ్రహించిన ఖండితనాయక వలె లక్ష్మి రాత్రివేళ వేరే దిక్కు కానక, నీ ముఖసామ్యమును పొందిన చంద్రుడితో కూడి వినోదిస్తున్నది. ఆ చంద్రుడు కూడా ఇప్పుడు సిగ్గుతో ముఖవికాసాన్ని విడిచి వెల వెలబోతూ క్రుంగుతున్నాడు. కనుక వెంటనే నిద్రలేచి దిక్కులేని రాజ్యలక్ష్మిని పరిగ్రహించండి!

"సూర్యోదయం కాగానే తామరపూలు వికసిస్తున్నాయి కదా! అలాగే మీరున్నూ అందమైన మీ కళ్ళు తెరవండి! పూలువాసన గల మీ నిట్టూర్పులను అనుసరించాలన్న తలంపుతో, ప్రాతఃకాల వాయువులు చెట్లనుండి పూలు రాలుస్తూ ఉన్నాయి. సూర్యకిరణాలతో వికసిస్తున్న తామరపూల పరిమళంతో నిండి ఉన్నాయి. ఎర్రని చిగురుటాకులపై పడిన తెల్లని ముత్యాలవంటి మంచు బిందువులు మీ ఎర్రని అధరోష్ఠమున ప్రకాశించే తెల్లని దంత కాంతిగల చిరునవ్వు వలె శోభిస్తున్నవి!

రాజా! సూర్యుడు ఉదయించబోతున్నాడు. చీకటిని పారద్రోలాడు. వీరులైన మీరు శత్రువులను యుద్ధంలో జయించినప్పుడు, ఇక మీ నాయనగారికి ఆ విషయంలో చేయవలసిన పని ఏముంటుంది కనుక? మీ ఏనుగులు నిద్రమేల్కొన్నాయి. కట్టుగొలుసులను గలగల లాడిస్తూ ఈడుస్తున్నాయి. వాటి దంతాలపై ఎర్రని లే ఎండ పడుతున్నది. కొండ చరియలను రాచుకునేటప్పుడు అంటిన ధాతురాగం వలె అవి ఎర్రగా మెరుస్తున్నాయి. మీ డేరాలలో పడుకున్న గుర్రాలు కూడా నిద్రలేచాయి. దగ్గర ఉన్న సైంధవ లవణపు ముక్కలను నాకుతూ, ఆ విధంగా నోటి అరుచి, బడలిక, నొప్పులు తీర్చుకుంటున్నాయి! దేవుళ్ళకు పూజ చేసిన పూలు వాడిపోయాయి. దీపకాంతి పలచబడింది. మీ పంజరంలోని చిలుక మిమ్మల్ని నిద్రలేపే నిమిత్తం మా మాటలను అనుకరిస్తూ పలుకుతున్నది!"

ఈ విధంగా వందిమాగధులు అజమహారాజును స్తోత్రం చేశారు. ఆయన మేలుకున్నాడు. సుప్రతీకమనే దివ్యగజం రాజహంసల కలకల ధ్వనులకు మేలుకుని గంగాతీరమందలి ఇసుక తిన్నెల నుంచి లేచినట్లుగా అజమహారాజు పాన్పు నుండి లేచాడు.

ఆయన అలా నిద్రలేచి కాలకృత్యాలు నిర్వర్తించుకున్నాడు. స్వయంవరానికి అర్హమైన అలంకారాదులు చేసుకున్నాడు. స్వయంవర మండపంలో ప్రవేశించాడు. అక్కడ తక్కిన రాకుమారులంతా కూడా ఉన్నారు.

# 6

**ఆ** స్వయంవరమండపంలో సింహాసనములపై, విమానాలలో సంచరించే దేవతల విలాసముల వంటి మనోజ్ఞములైన అలంకారాలు చేసుకుని కూర్చుని ఉన్న రాకుమారులను అజమహారాజు చూచాడు.

అయితే, అజమహారాజు అందరిలా లేడు. రతీదేవి ప్రార్థించడం వలన ఈశ్వరుని అనుగ్రహంతో మరల దేహం పొందిన మన్మథునిలా ఉన్నాడు. ఆయనను చూడగానే అక్కడి రాజులందరూ ఇక తమకు ఇందుమతి దక్కదని ఆశ వదులుకున్నారు.

అజమహారాజు ఆశీనుడు కావడానికై విదర్భరాజు సోపానాలు గల ఒక ఉన్నత సింహాసనం చూపాడు. రాళ్ళమీద నుండి సింహప్పిల్ల కొండశిఖరం ఎక్కినట్లుగా అజు డా సింహాసనం ఎక్కాడు. రత్నఖచితమగు సింహాసనంపై పరచిన ఉత్తమ రత్నకంబళిపై అజమహారాజు కూర్చున్నాడు. అప్పుడాయన రంగురంగుల నెమలిపై కూర్చున్న కుమారస్వామిలా కనిపించాడు!

స్వయంవర మండపంలో ఉన్న రాజసమూహంలో ప్రతిరాజు కాంతీ ఒకటిగా రూపొందింది. మేఘపంక్తులలో అనేకంగా పుట్టి ఒక్కటిగా కనిపించే మెరుపుతీగవలె ఆ కాంతి మిరిమిట్లు గొలుపుతూ చూడ శక్యం కాకుండా ఉన్నది.

ఉత్తమ సింహాసనాలపై పలువిధాలైన అలంకారాలతో కూర్చుని ఉన్న ఆ రాకుమారుల మధ్య అజమహారాజు, కల్పవృక్ష సమూహంలో పారిజాత వృక్షంలా ప్రకాశించాడు!

రాజులందరి దృష్టి, పురజనుల దృష్టి – ఒక్క అజమహారాజు పైననే నిలిచింది! చెట్లపూవులలోని రసాన్ని ఆస్వాదిస్తూ ఉండే తుమ్మెదలు, అడవి

ఏనుగు కనిపించగానే ఆ పుష్పాలను విడిచి ఏనుగు మందజలంపై వ్రాలినట్లుగా వారందరి దృష్టి తక్కిన రాజులను విడిచి అజమహారాజుపై ప్రసరించింది!

తరువాత వందిమాగధులు వచ్చారు. సూర్య, చంద్ర వంశాలలో జన్మించిన అక్కడి రాజులందరి వంశావళులనూ, బిరుదులనూ, పేరు పేరున చెప్పి పొగడసాగారు. అగరుధూపపరిమళం అంతటా వ్యాపించింది. శంఖాలు పూరించారు. మంగళ వాయిద్యాలు మ్రోగాయి. ఈ ధ్వనులన్నీ కలిసి దిక్కులను ప్రతిధ్వనింపజేశాయి. ఆ చప్పుడు మేఘగర్జన అనుకుని ఉద్యానవనాలలో ఉండే నెమళ్ళు పురులు విప్పి మనోహరంగా నృత్యం చేయడం మొదలు పెట్టాయి!

ఇందుమతీదేవిని స్వయంవరానికి సిద్ధంచేశారు. పెళ్ళికూతురులా అలంకరించుకుని దాసదాసీజనంతో మేనా ఎక్కి అక్కడికి వచ్చింది. అందమంతా రాశిపోసి ఆమెను సృష్టించాడు బ్రహ్మ. రాకుమారులంతా వళ్ళంతా కళ్ళు చేసుకుని ఆమెవంక చూచారు. వారు తన్మయులై ఉన్నారు. వారి దేహాలు మాత్రం సింహాసనాలపై ఉన్నాయి కానీ, వారి మనస్సులు మాత్రం ఆమెపైనే లగ్నమై ఉన్నాయి.

వసంత ఋతువనే స్త్రీని చూచినప్పుడు, వృక్షాలలో చిగుళ్ళు మొలచినట్లుగా ఇందుమతిని చూడగానే తమనే పెండ్లాడమని ప్రార్థిస్తున్నట్లుగా సూచిస్తూ రాజులలో శృంగార వ్యాపారాలు వాటంతట అవే పుట్టుకొచ్చాయి.

తనను ఇందుమతి పెండ్లాడి భ్రమింపజేయాలన్న అభిప్రాయం సూచిస్తూ ఒక రాకుమారుడు ఒక తామరపువ్వును దాని కాడను చేతపట్టుకుని త్రిప్పసాగాడు. విలాసపురుషుడైన మరొక రాకుమారుడు, ఇందుమతితో తాను చేయదలచిన శృంగార చేష్టలను సూచిస్తూ, రత్నాలు పొదిగిన భుజకీర్తికొనకు తగుల్కొని ఉన్న హారాన్ని, ముఖాన్ని ప్రక్కకు త్రిప్పి సవరించుకున్నాడు!

ఇంకొకరాజు ఇందుమతిని తన దగ్గరికి రమ్మని సూచిస్తూ కళ్ళు క్రిందకు వాల్చి కాలిగోళ్ళతో నేలమీద అడ్డగీత గీయడం మొదలుపెట్టాడు. అయితే ఇలా నేలమీద అడ్డగీతలు గీసేవాడు అవలక్షణుడని ఇందుమతి అతని వంక చూడనే లేదు!

వేరొక రాకుమారుడు ఎడమచెయ్యి దిగువున ఆనించుకున్నాడు. మెడలో ముత్యాల పేరులు వెనుకకు వ్రేలాడుతున్నాయి. ప్రక్కనున్న స్నేహితుడి వైపు తిరిగి ముచ్చట్లాడుతున్నారు. ఆ విధంగా అతను ఇందుమతితో ముచ్చట్లాడాలని అభిలషిస్తున్నట్లు సూచించాడు. అయితే, అతని వాలకం గ్రహించింది ఇందుమతి. అతను రసికుడు కాదని తృణీకరించింది. అతన్ని చూడకుండానే ముందుకు సాగిపోయింది.

యువకుడైన ఇంకొక రాజపుత్రుడి చేతిగోళ్లు స్త్రీల పిరుదుల గిల్లి వ్రణాలు చేసేటట్లుగా ఉన్నాయి. స్త్రీలు విలాసార్థం ధరించే దంతపు కమ్మల వలె ఉండే తెల్లని మొగలిరేకును అతను తన గోళ్ళతో చీలుస్తున్నాడు. ఆ విధంగా తాను ఇందుమతి నితంబప్రదేశాలలో నఖక్షతం చేయాలని అభిలాషపడుతున్నట్లుగా అతను వ్యక్తం చేశాడు! అయితే, ఇందుమతి అతన్ని గమనించింది. అతను గడ్డిపోచలను తుంచే అవలక్షణుడని నిరాకరించింది.

ఒక రాజనందనుడి అరచేతులు తామరతూడుల్లా ఎర్రటి ధ్వజరేఖలు కలిగివున్నాయి. అతని వేళ్ళ ఉంగరాలు రత్నకాంతులు విరజిమ్ముతున్నాయి. అతను పాచికలు ఎగరవేస్తున్నాడు. ఆ విధంగా తాను ఆమెతో ఆడుకోవాలన్న అభిలాషను అతను వెలిబుచ్చాడు. అయితే, అతను గర్హణీయమైన జూదగాడని తలచి ఇందుమతి అతన్ని నిరసించింది.

ఒక రాజు తలపై కిరీటం మామూలుగానే ఉన్నది. అయినా అతను తలపై చేయిపెట్టుకుని ఆ కిరీటం సవరించుకోసాగాడు. ఆ విధంగా తాను

ఇందుమతిని నెత్తిన పెట్టుకుని పూజిస్తానన్న ఉద్దేశ్యాన్ని అతను వ్యక్తపరిచాడు. అయితే, నెత్తిన చేతులు పెట్టుకోవడం అశుభలక్షణం అని తెలిసిన ఇందుమతి అతన్ని కూడా త్రోసిపుచ్చింది.

వివిధ రాకుమారుల వంశాల గురించి, చరిత్రలను గురించి సునంద అనే ద్వారపాలకురాలికి బాగా తెలుసు. మంచి వాక్చాతుర్యం కూడా ఉన్నదామెకు. ఆమె ఇందుమతిని మొదట మగధ రాకుమారుని చెంతకు తీసుకుని వెళ్ళింది. అతని గురించి ఇందుమతికి ఇలా చెప్పింది :

"రాకుమారీ! ఇతను మగధరాజు. శరణన్న వారిని రక్షించే స్వభావం కలవాడు. ప్రజలను ఎప్పుడూ సంతోషపెట్టేవాడు. ఈయన పేరు పరంతపుడు. సార్థకమైన నామధేయం. ఆకాశంలో నక్షత్రాలున్నా చంద్రుని వల్ల అధిక ప్రకాశం పొందుతున్నది. అలాగే రాజులు అనేక మంది ఉన్నా, ఇతని వల్లనే భూమికి మంచిరాజు దొరికాడని చెపుతుంటారు. అంతే కాదు ఇతను ఎప్పుడూ తెంపు లేకుండా యజ్ఞాలు చేస్తుంటాడు. అందువల్ల ఇంద్రుడు స్వర్గాన్ని విడిచిపెట్టి యజ్ఞవాటికల్లోనే ఉంటున్నాడు. ఆ కారణంగానే ఇంద్రుని భార్య శచీదేవి తన భర్త చెంత లేదని పసుపు పూసుకోవడం లాంటి సంస్కారాలన్నీ మానివేసింది.

రాజపుత్రీ! నీవీ రాజును పెండ్లాడితే, ఇతని రాజధాని అగు పాటలీపుత్రం మేడలలో గవాక్షముల చెంత కూర్చుని అక్కడ ఉండే చక్కని స్త్రీలను ఎప్పుడూ చూస్తూ ఆనందించవచ్చు."

సునంద ఇలా చెప్పగా ఇందుమతి మౌనంగా మగధరాజుకు నమస్కరించింది. జారిపోతున్న ఇప్పపూలమాల చేతపట్టుకుని అవతలికి నడిచింది.

ఆ విధంగా ద్వారపాలకురాలు సునంద, బెత్తం చేత పట్టుకుని, మానస సరస్సులో గాలికి కదలాడే తరంగం, రాజహంసను ఒక కమలం నుండి,

మరొక కమలం వద్దకు తీసుకుని వెళ్ళిన రీతిగా, ఇందుమతిని ఆ రాజు వద్ద నుండి మరొక రాజు దగ్గరికి తీసుకుని పోయింది!

సునంద, ఇందుమతిని ఇంకొక రాజు వద్దకు తీసుకుని పోయి "రాకుమారీ! ఇతను అంగదేశాధీశుడు. దేవతా స్త్రీలు కోరే యౌవనం కలవాడు. ఇతని ఏనుగులు గజశాస్త్ర నిపుణులైన వాలఖిల్యాది మహర్షుల చేత శిక్షితులైనవి. ఇతను భూలోక దేవేంద్రునిలా ఉంటున్నాడు. ఇతను శత్రు సంహారకుడు. శత్రువుల భార్యల కన్నీటి బిందువులు పెద్ద ముత్యాల్లా వారి స్తనాలపై పడి, దారం లేని ముత్యాలసరాల వలె ప్రకాశించాయి!

కల్యాణీ! సహజంగా లక్ష్మీ సరస్వతులిద్దరూ ఒకచోట ఉండరని చెపుతారు కానీ, ఈ అంగరాజులో వారిద్దరూ ఉన్నారు. కాబట్టి లావణ్యంలో లక్ష్మికి, ప్రియవచనాలలో సరస్వతికి నీవు తగిన చెలికత్తెవు అవుతావు! నీవీ రాజును వరించు" అని చెప్పింది.

అయితే, ఇందుమతి అంగరాజును కన్నెత్తి చూడలేదు. ముందుకు పదమని తన తల్లికి స్నేహితురాలైన సునందతో చెప్పింది.

అంతట సునంద ఆమెను మరొక రాజువద్దకు తీసుకుని వెళ్ళింది. అతను శత్రువులకు అసాధ్యుడు. చక్కనివాడు. అప్పుడే ఉదయించిన చంద్రునిలా ప్రకాశిస్తున్న వాడు. పొడుగాటి చేతులు, విశాలమైన వక్షస్థలం గుండ్రంగా, సన్నగా ఉన్న నడుము.

"చెలీ, ఇందుమతీ! ఇతను అవంతిరాజు త్వష్ట అనే ప్రజాపతి వల్ల వర్తులాకారంగా చేయబడిన సూర్యునివలె వెలిగిపోతున్నాడు. శత్రువులను సంహరించడంలో ఇతన్ని మించినవారు లేరు. ఈయన పట్టణంలో మహాకాళేశ్వరుడున్నాడు. ఆయన శిరస్సు నందలి చంద్రకాంతిచేత ఈ రాజు ఎల్లప్పుడూ వెన్నెలరాత్రులు గలవాడై స్త్రీ ముఖసందర్శన సుఖాన్ని అనుభవిస్తున్నాడు సుమా!

"అరటి స్తంభాలవంటి తొడలుగల ఓ ఇందుమతీదేవీ! ఈ అవంతీ రాజును నీవు పెండ్లాడితే శిప్రానదీ తరంగాల నుండి వచ్చే గాలిచేత కదిలాడే ఉద్యానవనాలలో నీవు హాయిగా విహరించవచ్చు. బంధువులనే పద్మాలకు ప్రియం చేకూరుస్తూ శత్రువులనే బురదను ఎండింపజేస్తూ ఈ రాజు సూర్యునితో సమానుడుగా ఉన్నాడు. నీ వీతని వరించు" అని చెప్పింది సునంద.

అయితే ఇందుమతి తెల్లకలువతీగె చంద్రునిపై ఇష్టం చూపనట్లుగా ఆ రాజుపై ఇష్టం చూపలేదు.

పిమ్మట సునంద, భోజరాజు పుత్రిని అనూపదేశాధీశుని వద్దకు తీసుకుని వెళ్ళింది. బంగారు ఛాయగల దేహం కలవాడతను.

"రాజపుత్రీ! ఇతనికి రెండు చేతులే ఉన్నా, వేయి చేతులు కలవారితో యుద్ధం చేయగలవాడు. పద్ధెనిమిది ద్వీపాలలోనూ యజ్ఞాలు చేసినవాడు. ఇలాంటి రాజు ఇంకొకరు లేడని ప్రసిద్ధి. పూర్వం కార్తవీర్యుడనే రాజు ఉండేవాడు. అతను దత్తాత్రేయుని అనుగ్రహం వల్ల బ్రహ్మజ్ఞాని అయినాడు. దుష్టులైన వారిని ఎల్లప్పుడూ శిక్షిస్తూ ఉండేవాడు. అతను దేవేంద్రుని జయించిన రావణాసురుని తన వింటి నారితో కట్టివేశాడు. చెరసాలలో పెట్టి, తరువాత దయతలచి విడిచి పెట్టాడు. అటువంటి కార్తవీర్యుని వంశంలో పుట్టినవా డీ రాజు. ఇతని పేరు ప్రతీపుడు. పెద్దలను సేవిస్తుంటాడు. లక్ష్మికి ఇష్టంలేని జూదం, పానం, వ్యభిచారం, కాఠిన్యం, దురహంకారం మొదలైన వ్యసనాలకు లోనుకాకుండా ఉంటున్నాడు.

ఇతను యుద్ధంలో అజేయుడు. సకల క్షత్రియులను సంహరించిన పరశురాముని గొడ్డలి దెబ్బను కూడా ఇతను లక్ష్యపెట్టినవాడు కాదు. మహిష్మతీ పట్టణానికి చుట్టూ అగడ్త వలె ఉన్న నర్మదానదీ ప్రవాహపు సొగసు నీవు ఉప్పరిగె గవాక్షాల గుండా చూడవలెనంటే నీవు ఇతన్ని భర్తగా వరించ వలసిందే!" అని పలికింది సునంద.

అయితే ప్రతీపరాజు ఎంత గొప్పవాడైనా శరదృతువులో మబ్బు లేకుండా ఉన్న పూర్ణచంద్రుని సయితం కమల లత ఒల్లని రీతిగా ఇందుమతి అతన్ని ఒల్లలేదు.

తరవాత సునంద, ఇందుమతిని శూరసేన దేశాధిపుడగు సుషేణుని దగ్గరకి తీసుకుని వెళ్ళింది. మూడు లోకాలలోనూ కీర్తి గలిగి, సదాచారంతో పవిత్రములైన తల్లిదండ్రుల ఉభయ వంశాలను ప్రకాశింపచేస్తున్నాడతను.

ఆ రాజును గురించి సునంద "తరుణీ! ఈ రాజు నీ వంశస్థుడు శాస్త్ర ప్రకారం యజ్ఞాలు చేసిన వంశం వీరిది. మహర్షుల ఆశ్రమాలలో సింహాలు, ఏనుగులు మున్నగు జంతువులు కూడా సహజమైన తమ ద్వేషాన్ని విడిచి పెట్టినట్లుగా, ఈ రాజులో జ్ఞానం, మౌనం మున్నగు గుణాలు వాటి స్వాభావికమగు వైషమ్యాన్ని విడిచిపెట్టాయి. జ్ఞానం ఉండేచోట మౌనం ఉండదు. ఐశ్వర్యం ఉన్నచోట దానగుణం ఉండదు. కానీ ఇతనిలో సకల గుణాలూ ఉన్నాయి. సుషేణరాజు ప్రతాపం వర్ణింపనలవి కానిది. ఇతని రాజధాని మధుర. దాని సమీపాన నల్లటి యమునా నది ప్రవహిస్తున్నది. అంతఃపుర స్త్రీలు నదిలో జలక్రీడలాడతారు. వారా జలాలలో, స్తనాలు కడుగుకోవడం వల్ల నల్లని యమునానదీ జలాలు తెల్లగా అవుతాయి. గంగానదిని కలిసినట్లుగా ఉంటాయి.

పూర్వం కాళింగుడనే సర్పరాజు గరుత్మంతుడికి భయపడి ఆ యమునానదిలో దాగి ఉన్నాడు. అలాగే ఈ సుషేణరాజు పెద్దలు అనుగ్రహించిన అభయప్రధానానికి విక్రయంగా ఇచ్చినట్లు, పరంపరగా కనపడే మణిని ఈ రాజు తన వక్షస్థలంలో ధరించాడు. ఆ విధంగా ఇతను కౌస్తుభమణిని ధరించిన కృష్ణుని అతిశయించాడు.

ఓ, సుందరాంగీ! నీకు ఇష్టమైతే ఈ యువకుని వరించు. కుబేరుని ఉద్యానవనంతో సమానమైన ఈతని బృందావనం అనే ఉద్యానవనంలో విహరించు. పూలపాన్పుపై పరిచిన చిగురుటాకులపై సుఖాలు అనుభవించు.

అంతేకాదు. అక్కడ వర్షాకాలంలో గోవర్ధనపర్వత గుహలలో జలబిందువులతో తడిసి, శిలాజిత్తు వాసనగల బండలపై నెమళ్ళు నాట్యం చేయడం నీవు కళ్ళారా చూడవచ్చు." అని తెలియజేసింది.

అయితే ఇందుమతి, సముద్రంలో కలియబోయే నది, త్రోవలో పర్వతాన్ని దాటిపోయినట్లుగా ఆ రాజును దాటేసి ముందుకు నడిచింది.

తరవాత సునంద కళింగరాజైన హేమాంగదుని వద్దకు ఇందుమతిని తీసుకు వెళ్ళింది. అతను చక్కని బాహుపురులు ధరించి ఉన్నాడు.

"రాజపుత్రీ! ఈ రాజు శత్రుంజయుడు. మహేంద్ర పర్వతంతో సమానమగు స్థయిర్యం కలవాడు. ఈయనకు మహేంద్రపర్వతం గిరి దుర్గం గాను, సముద్రం జలదుర్గం గాను ఉంటున్నవి. ఇతని సైన్యంలో ఏనుగులు చాలా గొప్పవి. ఆ ఏనుగులు నడుస్తుంటే మహేంద్ర పర్వతాలు నడుస్తున్నట్లుంటాయి! ఈ రాజు ధనుర్ధరులలో శిరోమణి. ఇతను ఎల్లప్పుడూ రెండు భుజాలపై రెండు ధనుస్సులు ధరిస్తాడు. వాటి నారుల రాపిడి వల్ల భుజాలపై నల్లటి చారలు ఏర్పడ్డాయి. ఈ రాజు తన ముందిరంలో శయనించి వుండగా, సముద్రుడు మృదంగధ్వనుల వంటి తరంగ ధ్వనులతో ఈయనను నిద్రలేపుతూ ఉంటాడు. ఆ విధంగా సముద్రుడే ఇతన్ని సేవిస్తున్నప్పుడు ఇక ఇతరులు ఇతన్ని సేవిస్తారనడంలో గొప్పకాదు. నీ వీరాజును పెండ్లాడితే, అక్కడ సముద్రతీరంలో మర్మర ధ్వనులు గల ఆకులతో కూడిన తాటివనాల నుండి ద్వీపాంతరాలనుండి లవంగ పుష్పాల నుండి వచ్చే పరిమళ వాయువులను నీవు అనుభవించవచ్చు. అక్కడ హాయిగా విహరించవచ్చు."

ఇలా సునంద చెప్పినప్పటికి ఇందుమతికి ఆ రాజుపై మనసు పోలేదు. అతన్ని దాటి ముందుకు నడిచింది.

అంతట సునంద, ఇందుమతిని దేవతాసనుడైన నాగపురాధీశుని చెంతకు తీసుకు వెళ్ళింది.

"కళ్యాణీ ఇతనే పాండ్యరాజు. ఇతని భుజ, శిరస్సుల నుండి తెల్లని ముక్తాహారాలు వ్రేలాడుతున్నాయి చూడు! మలయపర్వతంలో పుట్టిన ఎరుపు, పసుపు వర్ణం గల గంధం పూసుకున్నాడు. పర్వతరాజు వలె ప్రకాశిస్తున్నాడు. వింధ్యపర్వతం గర్వాన్ని అణచివేసినాడు. సముద్ర జలాలను చుక్క లేకుండా త్రాగివేసినవాడు అయిన అగస్త్యమహర్షి అనుగ్రహం పొందిన రాజు ఇతను. ఇతను అశ్వమేధయాగం జయప్రదంగా పూర్తి చేసినప్పుడు అగస్త్యుడు వెళ్ళి ఇతన్ని కుశల ప్రశ్నలడిగాడు.

అంతేకాదు. పూర్వం రావణుడు తన జనస్థానమగు ఖరాలయానికి ముప్పువస్తుందేమోనని భయపడ్డాడు. శంకరుని వద్ద బ్రహ్మశిరం అనే మహాస్త్రాన్ని పొందిన పాండ్యరాజుతో సంధి చేసుకున్నాడు. ఆ తరవాత ఇంద్రుని పైకి యుద్ధానికి వెళ్ళాడు. ఆ విధంగా రావణునికి కూడా అజేయుడైన రాజు ఈ పాండ్యుడు. రత్నాలుగల సముద్రం ఉండే దక్షిణ దేశాధీశుడైన ఈ పాండ్యుని నీవు పరిణయమాడితే, నీవు అతని పట్టపురాణివి అవుతావు. అంతేకాదు

పోకచెట్లను అల్లుకుని ఉండే తలమపాకు తీగలు, చందనపు చెట్లను చుట్టుకుని ఉండే యాలక తీగలు, కస్తూరి కానుక చెట్లుగల మలయపర్వత ప్రదేశాలలో నీవు ఇతన్ని కూడి సుఖంగా విహరించవచ్చు. నల్లని కలువవలె శ్యామల వర్ణుడయిన ఈ రాజుకూ, గోరోజనం వంటి పచ్చని దేహం గల నీకు సంబంధం, మేఘానికి మెరుపుతో సంబంధంలా భాసిస్తుంది!" అని సునంద తన వాక్పటిమతో పాండ్యుని గుణగణాలను వర్ణించి చెప్పింది. అయినా ఇందుమతి మనసు అతనిపై పోలేదు. ఆమె అతన్ని కూడా తృణీకరించి ముందుకు సాగిపోయింది.

ఒక రాజభవనంలో దీపం తీసుకుని పోతుంటే, వెనుక భాగాలన్నీ చీకటి అలముకున్నట్లు, ఇందుమతి ఏ ఏ రాకుమారులను కన్నెత్తి చూడక దాటిపోయిందో ఆ రాజపుత్రుల ముఖాలన్నీ కళావిహీనములైనాయి!

అంతట ఇందుమతి అజమహారాజు దగ్గరికి వచ్చింది. అప్పుడాయన ఆమె తనను వరిస్తుందో లేదో అని మనసులో సందేహించసాగాడు. అయితే, అంతలో శుభసూచకంగా అతని కుడిభుజం అదిరింది. అప్పుడతనికి సందేహం తొలగిపోయింది.

తుమ్మెదల గుంపు వికసించిన తీయమామిడి చెట్టును చూచిన తరువాత మరే చెట్టునూ ఎలా అపేక్షించదో, అలాగే అజమహారాజును చూచిన ఇందుమతికి మరే రాజుచెంతకూ పోవడానికి బుద్ధి పుట్టలేదు!

అయితే ఆ విషయం తెలివిగల సునంద ఇట్టే గ్రహించింది. ఇందుమతి మనోభీష్ఠానికి తగినట్లుగా ఇలా పలికింది :

“రాకుమారీ! ఇక్ష్వాకుకులంలో రాజశ్రేష్ఠుడగు కకుత్సరాజు జనన మందాడు. అతని తరువాత పుట్టిన గుణాధికులగు ఉత్తరకోసల రాజులకు కకుత్సరాజులనే పేరు వచ్చింది. ఆ కకుత్సరాజు వృషభ రూపం ధరించిన ఇంద్రుడిపై ఈశ్వరుని వలె కూర్చుని రాక్షసులను సంహరించాడు. పిమ్మట ఇంద్రుడు నిజరూపం దాల్చి, కకుత్సరాజును స్వర్గలోకానికి తీసుకుని వెళ్ళాడు. తన ప్రక్కన అర్థ సింహాసనంపై కూర్చోబెట్టి గౌరవించాడు.

ఎవరూ పొందని అలాంటి గౌరవం పొందిన కకుత్సరాజు వంశంలో కులదీపకుడు, కీర్తిశాలి అయిన దిలీపుడు పుట్టాడు. తొంభై తొమ్మిది అశ్వమేధ యాగాలు చేసి, ఇంద్రుని కోరికపై నూరవయాగం మానివేశాడు. ఆ దిలీపుని రాజ్యంలో ఎవరికీ ఎలాంటి భయమూ లేదు. వ్యభిచారం, దొంగతనం అతని రాజ్యంలో మచ్చుకైనా కనిపించవు. అలాంటి దిలీపరాజు కుమారుడు

రఘుమహారాజు. ఆయన విశ్వజిత్తు అనే గొప్ప యాగం చేశాడు. నాలుగు దిక్కులనూ జయించి తెచ్చిన ధనాన్ని ఆ యజ్ఞం కోసం వెచ్చించాడు. తుదకు మట్టిపాత్ర మాత్రమే తాను మిగుల్చుకున్నాడు!

ఆ రఘుమహారాజు కీర్తి పద్నాలుగు లోకాలకూ వ్యాపించింది. ఆయన యశస్సు ఇంత – అంత అని వర్ణింపనలవి కాదు. అలాంటి రఘుమహారాజుకు ఇంద్రుడికి జయంతుడు జన్మించినట్లుగా ఈ అజమహారాజు జననమందాడు. తండ్రితో సమానుడయి రాచకార్యాలు నిర్వహిస్తున్నాడు. కులంలోనూ, రూపం లోనూ, వినయంలోనూ, సమస్త గుణాలలోనూ ఇతను నీకు సరిసమానుడు. కనుక నీవు ఇతన్ని వరించు, మీ ఇద్దరి సంయోగం, బంగారంలో పొదిగిన రత్నంలా శోభిల్లుతుంది!"

సునంద ఇలా యుక్తియుక్తంగా చెప్పగానే ఇందుమతి కొంచెం సిగ్గువదిలింది. ప్రసన్నవదనంతో, చేతిలో పూలహారం అతనికి వేసినట్లుగా నిర్మలమైన చూపుతో అతని వంక చూచింది! ఆ చూపుతోనే తన అంగీకారాన్ని వ్యక్తం చేసింది!

అజమహారాజుపై తనకు మక్కువ కలిగినదని ఇందుమతి సిగ్గు వల్ల మాటలతో చెప్పలేకపోయింది. కానీ సంతోషాతిశయం వల్ల ఆమె వెంట్రుకలు నిక్కపొడుచు కున్నందున, అవే ఆమె అభిప్రాయాన్ని చెప్పక చెప్పాయి!

అది కనిపెట్టి సునంద "ఏవమ్మా! మరొక రాజకుమారుని వద్దకు పోదామా?" అని పరిహాసంగా ఇందుమతిని అడిగింది.

అయితే ఆ మాట ఇందుమతి సహించలేకపోయింది. సునంద వంక చురచుర చూచింది.

అప్పుడు సునంద ఇందుమతి చేయిపట్టుకుని, ఆమె చేతిలో గల కుంకుమ పూసిన పూలమాలను అజమహారాజు మెడలో హెచ్చుతగ్గులు లేకుండా వేయించింది.

అప్పుడు అజమహారాజు ఇందుమతి పూలమాల వేస్తూ బాహువులను తన మెడపై ఉంచినట్లు, తనను కౌగిలించుకున్నట్లు తెలుసుకున్నాడు.

అన్నివిధాల తగిన ఆ వధూవరులను చూచి పురజనులంతా సంతోషించారు. ఈమె అజుని వరించడం వల్ల చంద్రుని కూడిన వెన్నెలలా ఉన్నదని, సముద్రుని కలిసిన గంగలా ఉన్నదని అందరూ ముక్తకంఠంతో ప్రశంసించారు.

అయితే, ఈ ప్రశంసా వాక్యాలు స్వయంవరానికి వచ్చిన ఇతర రాజుల చెవులకు ములుకులవలె ఉన్నాయి.

అప్పుడు అజమహారాజు బంధువుల, స్నేహితుల ముఖాలు మాత్రం సూర్యోదయం వేళ వికసించిన పద్మాలవలె ఉల్లాసభరితములైనాయి. తక్కిన రాజుల ముఖాలు ముకుళించిన కలువలవలె ముడుచుకుని పోయాయి!

# 7

**త**రువాత విదర్భరాజు, కుమారస్వామితో కూడిన దేవసేనలా అజమహారాజుతో కూడిన సోదరి ఇందుమతీదేవిని వెంట పెట్టుకుని రాచనగరుకు బయలుదేరాడు.

ఇందుమతి తమకు దక్కలేదని నిరాశ చెందిన రాజులు, ప్రాతఃకాల వేళ తేజస్సు ఉడిగిన సూర్యేతర గ్రహాలవలె కళావిహీనమైన ముఖాలతో, తమ అందచందాలనూ, అలంకారాలనూ, ఆడంబరాలనూ నిందించుకుంటూ తమ తమ శిబిరాలకు వెళ్ళిపోయారు.

శచీదేవి మహిమ వలన స్వయంవర మంటపంలో గొడవ ఏమీ జరగలేదు. అజుని మీద ఎంత అసూయ ఉన్నప్పటికీ రాజులంతా అక్కడ శాంతంగానే ఉన్నారు.

ఇందుమతితో కూడిన అజమహారాజు నూతన అలంకారాలు చేసుకున్నాడు. ఇంద్రధనుస్సుల వంటి తోరణాలతో, ధ్వజాలతో ఎండ తగలకుండా ఉండే రాజమార్గంలో ప్రవేశించాడు. అప్పుడా నూతన వధూవరులను చూడడానికై పురస్త్రీలు తహతహలాడారు. చేసే పనులు వదలి మిద్దెలు, మేడలు ఎక్కారు. బంగారు కిటికీలవద్ద ముఖాలు బయటికి పెట్టి నిలుచున్నారు.

అలా వారు తత్తరపాటుతో ఇందుమతిని, అజుని చూడడానికై వచ్చేటప్పుడు ఒక నీలవేణికి కొప్పులో తురుముకున్న పూలదండ జారిపోయింది. ఆమె తన కొప్పు ముడి వేసుకోవాలని చేతికి చుట్టుకున్నది కాని, అంతలోనే ఆ విషయం మరిచిపోయి పరుగుతీసింది. మరొక మగువ పాదాలకు పారాణి పెట్టుకుంటూ, మధ్యలోనే లేచి వెళ్ళినందున త్రోవ పొడుగులా లత్తుక మరకలు పడ్డాయి. ఇంకొక కలువకంటి కుడికంటికి కాటుక పెట్టుకుంటూ, ఆ తొందరలో ఎడమకంటికి కాటుక దిద్దుకోవడం మరిచిపోయింది. చేత కాటుకపుల్ల పట్టుకునే గవాక్షం దగ్గిరికి పరుగెత్తింది! వేరొక సుందరి గవాక్షం గుండా వీధిలోకి చూస్తూ, పోకముడి జారిపోయిన సంగతే మరిచిపోయింది! చేతి కంకణాల కాంతి నాభిమీద పడుతుండగా చేత్తో చీర ఎత్తి పట్టుకుని నిలుచున్నది!

మరొక ఇంతి సంతోషంతో గబగబా లేచేటప్పటికి మొలనూలు సగం తెగిపోయింది. మణులు జలజల రాలాయి. అయినా ఆమె మొలనూలు ఒక కొన చేతపట్టుకుని పోయింది. ఆమె ఆలా వెళ్ళగా చివరకు బొటనవ్రేలి వద్ద వట్టి సూత్రం మాత్రమే మిగిలింది.

ఆ విధంగా కాంతల ముఖబింబాలతో నిండిన గవాక్షాలను చూస్తూ ఉంటే వేయిరేకుల తామరలవలె కనిపించాయి. ఆ స్త్రీలంతా తమ చూపులతోనే

అజమహారాజు అందాన్ని త్రాగివేస్తున్నట్లు కనిపించారు! వారు మైమరచి ఉన్నారు.

"ఆహా! ఈ వధూవరులిద్దరూ అన్ని విధాల ఒకరికొకరు తగిన వారు. ఇంతకు ముందే అనేకమంది రాకుమారులు తనను పెండ్లాడతామని చారుల వల్ల తెలిపినప్పటికీ, స్వయంవరంలోనే భర్తను ఎన్నుకోడం ఉత్తమమని ఇందుమతి భావించింది. ఈ స్వయంవరమే జరగనట్లయితే, ఇంత చక్కని పతిని ఆమె పొందగలిగి వుండేదా ? నిజానికి లక్ష్మికి నారాయణుడు దొరికినట్లు ఈమెకు ఈ భర్త దొరికాడు. అవును – వీరిరువురికీ జత కూర్చనిచో ఇద్దరినీ అన్ని విధాల సరిపోయేటట్లు బ్రహ్మ చేసిన సృష్టి వృథా అయి ఉండేది. వీరిద్దరూ సాక్షాత్తూ రతీమన్మథులు! వేలకొలది రాకుమారులతో తనకు తగిన వరుని ఎన్నుకున్నది ఇందుమతి. అవును – మనసుకు జన్మజన్మాంతర సంస్కారం ఉంటుందని చెపుతారు కదా!" అని పురస్త్రీలు తమలో తాము చెప్పుకోసాగారు.

వారి పలుకులు వింటూ అజమహారాజు సంతోషంతో పొంగిపోయాడు. మగళవాయిద్యాలు మ్రోగుతూ ఉండగా, మనోహరమైన విదర్భరాజు మందిరం సమీపించాడు. అక్కడ విదర్భరాజు చేయూతనివ్వగా ఏనుగు దిగాడు. తరవాత తన కోసం రాజు ఏర్పాటు చేసి ఉంచిన మందిరంలో, ప్రియురాలి మనసులో ప్రవేశించినట్లు ప్రవేశించాడు.

అక్కడ అజమహారాజు ఉన్నత సింహాసనంపై కూర్చుని, భోజరాజు సమర్పించిన అర్ఘ్యాన్ని, దుకూల వస్త్రాలను స్వీకరించాడు.

పిమ్మట అంతఃపుర రక్షకులు త్రోవ చూపగా పెండ్లికుమార్తె వద్దకు వెళ్ళాడు. అతను తెల్లని వస్త్రాలు ధరించి అలా వధువును సమీపిస్తూ ఉంటే, అప్పుడే పొడిచిన చంద్రకాంతితో నురుగులు గల సముద్రుడు చెలియలి కట్టను సమీపిస్తున్నట్లు ఉన్నది!

తరువాత పురోహితుడు యధావిధిగా అగ్నికార్యం నిర్వర్తించి, వధూవరులను అగ్నిహోత్రుని ముందు నిలిపాడు ఇందుమతి తన చేతిని అజమహారాజు చేతిలో చేర్చింది. అప్పుడతను అశోకలత చిగుళ్ళను అంటిన రసాలవృక్షంలా కనిపించాడు. ఒకరి చెయ్యి ఒకరు పట్టుకోవడం వల్ల వారిరువురికి సమానంగా మదనోద్రేకం కలిగింది. అతని ముంజేయి పులకించింది. ఆమె చేతి వ్రేళ్ళు చెమర్చాయి.

వారిరువురూ ఒకరి వంక ఒకరు క్రీగంట చూచుకున్నారు. ఇద్దరికీ సిగ్గు ముంచుకుని వచ్చింది.

ఇందుమతి, అజుడు అగ్నిహోత్రుని చుట్టూ ప్రదక్షిణం చేసేటప్పుడు, మేరుపర్వత ప్రాంతంలో, పరస్పర సంసక్తిలో సంచరించు రాత్రింబవళ్ళు వలె కనిపించారు! తరువాత గొప్ప జఘనం కల ఇందుమతి, బ్రహ్మ సమానుడయిన పురోహితుని ఆనతి ప్రకారం, అగ్గిలో లాజమోక్షం కావించింది. అప్పుడు కూడా ఆమె సిగ్గుపడుతూనే ఉన్నది.

లాజలు, జమ్మి చిగుళ్ళు ఆహుతిగా వ్రేల్చగానే అగ్ని జ్వాలలు పైకి ఎగసి ఆమె కపోలాలను సమీపించాయి. కొంచెం సేపు పొగ క్రమ్మింది. ఆ పొగవల్ల సుకుమారి రాకుమారి కాటుక కరిగి, కన్నీరు కారింది. చెవులు ఎర్రబడ్డాయి. గండస్థలాలు పాలవర్ణమైనాయి.

పిమ్మట బంగారు ఆసనంపై కూర్చున్న నూతన వధూవరులను సభవారు, బంధువులు, భోజరాజు, పుణ్యస్త్రీలు అర్ఘాక్షతలతో ఆశీర్వదించారు.

ఆ విధంగా విదర్భరాజు తన సోదరి ఇందుమతికి మహావైభవంగా పెండ్లి జరిపించాడు. రాజులందరినీ యధోచితంగా గౌరవించే నిమిత్తం వారిని ఒకచోటికి రప్పించాడు. ఆ రాజులు, లోపల మొసళ్ళూ మొదలగు జలజంతువులున్నా పైకి నిర్మలంగా కన్పించే మడుగువలె మనసులలో

అసూయా ద్వేషాలు రగుల్కొంటున్నా, పైకి సంతోషం వ్యక్తం చేశారు. తమకు జరిగిన గౌరవ సన్మానాలకు బదులుగా విదర్భరాజుకు కానుకలు సమర్పించి వెళ్ళిపోయారు.

అయితే ఆ రాజులు ఇందుమతీ దేవిని అపహరించుకుని పోవాలని అంతకు మునుపే కుట్రపన్ని ఉన్నారు. వారందరూ ఒక రహస్య సంకేతస్థలం ఏర్పరచుకుని, అజమహారాజు ఇందుమతితో ఎప్పుడు వస్తాడా అని త్రోవలో కాచుకుని ఉన్నారు.

విదర్భరాజు తన తాహతుకూ, స్థోమతుకూ తగినట్లుగా పెండ్లి కుమార్తెకు ధనద్రవ్యాలు అరణంగా ఇచ్చాడు. వధూవరులను అయోధ్యకు సాగనంపుతూ మర్యాద కోసం తాను కూడా కొంతదూరం వారిని అనుసరించాడు.

అలా మూడు రోజులు పెళ్ళివారితో ప్రయాణం చేసిన పిదప విదర్భరాజు పర్వాంతమున సూర్యుని విడిచే చంద్రునిలా అజమహారాజు వద్ద శెలవు తీసుకుని తిరిగి తన నగరానికి వెళ్లే నిమిత్తం వెనుకకు మరలాడు.

ఆ సమయం కనిపెట్టి తక్కిన రాజులు, ఇందుమతితో వెడుతున్న అజమహారాజును అడ్డగించారు. ఇదివరకు దిగ్విజయయాత్రలో రఘుమహారాజు తమ ధనద్రవ్యాలు వశపరచుకున్నందుకు వారు పగబట్టి ఉన్నారు. ఇప్పుడు రఘుమహారాజు పుత్రుడు అజుడు, భోజకన్యను తమకు దక్కకుండా తీసుకుని పోవడం వారు అసలు సహించలేకపోయారు. అజుని అడ్డగించారు.

అయితే మహావీరుడగు అజమహారాజు బెదిరిపోలేదు. ఇందుమతిని రక్షించడానికై, గొప్ప సైన్యంలో తనకు ముఖ్యుడయిన మంత్రిని నియమించి, తాను తరంగాలతో పొంగుతున్న శోణనదం, గంగానదిని ఎదుర్కొన్న విధంగా శత్రుసేనలను ఎదిరించాడు.

అప్పుడు గొప్ప యుద్ధం జరిగింది. రౌతు రౌతుతో, రథికుడు రథికునితో, కాల్బంటు కాల్బంటుతో, గజస్థుడు గజస్థునితో ఎదుర్కొని ద్వంద్వయుద్ధం చేశారు. ఒకరిపై ఒకరు శస్త్రాస్త్రాలు, ఇతర ఆయుధాలు ప్రయోగించుకుని భయంకరంగా పోరాడారు. కూలిపోయిన గుర్రాలతో, తెగిపడిన సైనికుల మొండెములతో, విరిగిన రథాలతో, పర్వతాల్లా నేలపడిన ఏనుగులతో, సూర్యుని కప్పి వేస్తున్న ధూళితో, రోదన ధ్వనులతో ఆ రణభూమి అతిభీకరమై కనిపించింది. నెత్తురు ఏరులై ప్రవహించింది. మాంసఖండాలు భక్షించడానికై నక్కలు, గ్రద్దలు ఆ ప్రదేశమంతా తిరుగాడ జొచ్చాయి. ఆ రణభూమి మృత్యుదేవత పానశాల వలె గోచరించింది.

ఇలా ఇరుపక్షాలవారు ఒకరినొకరు తీసిపోకుండా, వీరాలాపాలాడుతూ, మహాశౌర్యంతో పోరాడి ఒకరినొకరు చంపుకున్నారు. ఎవరు గెలుస్తున్నదీ, ఎవరు ఓడుతున్నదీ తెలియడం లేదు. ఇరుపక్షాల వారికీ అంతలో గెలుపు, మరల అంతలోనే ఓటమి సంభవిస్తున్నది.

రఘుకుమారుడయిన అజుడు వీరవిక్రమాన్ని ప్రదర్శించాడు. ప్రళయ కాలంలో పొంగిన సముద్రజలాలను ఆదివరాహమూర్తి నిరోధించినట్లుగా, తాను ఒక్కడే శత్రురాజులను ప్రతిఘటిస్తూ నిలిచాడు. అతడు అంబులపొది నుండి ఎప్పుడు బాణం తీస్తున్నదీ, ఎప్పుడు వింట సంధిస్తున్నదీ, ఎప్పుడు శత్రువుపై ప్రయోగిస్తున్నదీ తెలియడం లేదు. అంత వేగంగా, చాకచక్యంగా యుద్ధం చేశాడు అజమహారాజు.

అతని పెదవులు ఎరుపెక్కాయి. కళ్ళు జ్యోతుల్లా అయినాయి. కనుబొమలు ముడిపడ్డాయి. హుంకరిస్తున్నాడు. శత్రువుల శిరస్సులను, చెట్లపండ్లు రాల్చినట్లు రాలుస్తున్నాడు.

అప్పుడు శత్రురాజులందరూ అతన్ని ఒక్కమాటుగా చుట్టుముట్టి ఎలాగైనా అతన్ని వంచవలెనని విశ్వప్రయత్నం చేశారు. అప్పుడు

అజమహారాజు కనిపించలేదు. అతని ధ్వజం తప్ప మరేమీ గోచరం కావడం లేదు. మంచు కప్పిన ఉషఃకాలం వలె ఉన్నాడతను.

అంతట అజుడు, పూర్వం ప్రియంవదుడనే గంధర్వుని వలన తాను పొందిన గాంధర్వాస్త్రాన్ని శత్రురాజులపై ప్రయోగించాడు. వెంటనే ఆ దివ్యాస్త్ర మహిమ వలన శత్రుసేనలన్నీ ఎక్కడివక్కడ నిశ్చేష్టితములై మహానిద్రలో మునిగిపోయినట్లు స్తంభించిపోయాయి. శత్రుసైనికుల చేతులు ఎత్తినవి ఎత్తినట్లే ఉన్నాయి. శిరస్త్రాణాలు ఒకవైపు ఒరిగి పోయాయి. చేతపట్టిన ఆయుధాలు అలాగే ఉండిపోయాయి.

ఆ విధంగా శత్రువులను జయించి అజమహారాజు, విజయ చిహ్నంగా శంఖం పూరించాడు. ఆ శంఖధ్వని విని అతని సైనికులు, ముకుళించిన పద్మాలమధ్య చంద్రునివలె, నిద్రాపరవశులైన శత్రువుల మధ్యగల తమ ప్రభువును గుర్తించగలిగారు.

అంతట అజుడు, నెత్తురుతో తడిసిన బాణాలతో శత్రురాజుల జెండాలపై "రఘుకుమారుడు మీ కీర్తిని మాత్రం హరించాడు. మీ ప్రాణాలను హరించలేదు." అని వ్రాశాడు.

తరువాత భయవిచలిత అయి ఉన్న తన ప్రియురాలు ఇందుమతి వద్దకు వెళ్ళాడు.

"వైదర్భీ! నా శత్రువులకు ఎలాంటి అవస్థ పట్టిందో చూడు! నా సొత్తు అయిన నిన్ను అపహరించదలచారు వీరు. వీరికీ శాస్తి కావలసినదే!" అని పలికాడు.

ఆ మాట వినగానే, అప్పటి వరకూ శత్రుభయం వల్ల విషణ్ణవదనయై ఉన్న ఇందుమతి సంతోషించింది. ఆమె సుందరవదనం మాలిన్యం తుడిచిన

అద్దం వలె ప్రకాశించింది. భర్త శౌర్య పరాక్రమాలు చూచి ఎంతగానో మురిసి పోయింది. అయితే సిగ్గువల్ల మాటలతో అతన్ని ప్రశంసించలేకపోయింది. అయితే, ఆమె చెలికత్తెలు మహారాజును చమత్కార వాక్కులతో పొగిడారు.

ఆ రీతిగా అజమహారాజు వైరి రాజుల మదగర్వాన్ని అణచి, ఇందుమతితో తిరిగి ప్రయాణం సాగించాడు. సైన్యంలో ధూళి లేచి ఇందుమతి ముంగురులను కప్పి వేసింది. ఆమె రఘువీరకుమారుని విజయలక్ష్మి వలె కనిపించింది.

అయితే, స్వయంవరంలో జరిగిన సంగతులన్నీ అప్పటికే చారుల వల్ల రఘుమహారాజు విని ఉన్నాడు. సాటిలేని కన్యారత్నంతోను, ప్రశంసార్హమైన విజయలక్ష్మితోను మరలి వచ్చిన కుమారుని ఎంతో అభినందించాడు. అతన్ని ఆలింగనం చేసుకున్నాడు. ఆ నూతన వధూవరులు తనకు నమస్కరించగా వారిని ఆశీర్వదించాడు.

పిమ్మట రాజ్యభారమూ, కుటుంబ భారమూ, పూర్తిగా అజమహారాజుకు అప్పగించాడు. తాను దైవచింతనతో మోక్షమార్గోన్ముఖుడైనాడు. అవును సూర్య వంశపు రాజులంతా అంతే! కుమారులు కులధర్యులు కాగానే వారు గృహస్థాశ్రమాన్ని అధిగమిస్తారు.

## 8

**అ**నంతరం రఘుమహారాజు వివాహితుడైన తన కుమారునికి రెండవ ఇందుమతి వంటి ధరారమణిని కూడా అప్పగించాడు. భోగాల మీద ప్రీతివల్ల కాక అజుడు రాజ్యాన్ని తండ్రి ఆజ్ఞ ప్రకారం స్వీకరించాడు. వసిష్ఠులవారు యధావిధిగా అతనికి రాజ్యాభిషేకం చేశాడు. ఇంత వరకూ క్షాత్రతేజంతో వెలుగొందుతున్న అజుడికి ఇప్పుడు బ్రహ్మతేజస్సు కూడా సమకూడడం చేత, అగ్నికి వాయువు తోడయినట్లుయింది.

అప్పుడా అజమహారాజును చూచిన ప్రజలు, తిరిగి యౌవనవంతు డయిన రఘుమహారాజుగా భావించారు. అతను తండ్రి ఐశ్వర్యంతోపాటు ఆయన గుణగణాలను కూడా పొందినవాడు కావడమే అందుకు కారణం.

రెండు ఉత్కృష్టమైన విషయాలు రెండు ఉత్కృష్టమైన వాటితో కూడా మహోత్కృష్టమై భాసించాయి. ఒకటి తండ్రి నుండి సంక్రమించిన రాజ్యసంపద. అది అజుని పొంది మరింతగా సార్థక్యతను చేకూర్చుకున్నది. రెండవది యౌవనం. అది అతని వినయం వలన అధికంగా ప్రకాశించింది. అతను రాజ్యలక్ష్మిని నవోఢవలె చూచుకున్నాడు. దానిని ఏ మాత్రం నొప్పించకుండానే అనుభవించాడు.

సముద్రుడికి ఏ నది మీదా తిరస్కార భావం ఉండదు. అలాగే అజుడికి ప్రజలలో ఎవరి మీదా అయిష్టత లేదు. ప్రజలు ఎవరి మటుకు వారు తమ మీదనే ప్రభువుకు అధిక ప్రేమ అని అనుకుంటూ వచ్చారు. వృక్షాలను వాయుదేవుడు వంచినట్లుగా అజుడు తన శత్రువులను వశపరచుకున్నాడు.

కుమారుడు అలా రాజ్యపాలన యందు సర్వవిధాల సమర్థుడు కావడం చూచి రఘుమహారాజు అశాశ్వతములయిన లోక సుఖాలందు విముఖుడయినాడు. తన వంశం వారంతా చేసినట్లే ఆయన కూడా నారచీరలు ధరించి ముని వృత్తిలో అరణ్యాలకు పయనమైనాడు.

అయితే అప్పుడు అజమహారాజు, రఘుమహారాజు పాదాలపై వ్రాలి తనను వదలి వెళ్ళవద్దని ప్రార్థించాడు. కన్నీళ్ళపర్యంతంగా కుమారుడు అలా వేడుకోవడం చూచి ముసలిరాజు అతని కోరికను కాదనలేకపోయాడు. కానీ, విడిచి పెట్టిన కుబుసాన్ని తిరిగి ధరించటానికి పాము ఎలా ఇష్టపడదో, అలాగే రఘుమహారాజు తాను పరిత్యజించిన రాజ్యాన్ని తిరిగి చేపట్టడానికి అంగీకరించలేదు. సన్యాసాశ్రమం స్వీకరించి పట్టణం వెలుపల ఉంటూ వచ్చాడు.

జితేంద్రియుడయిన రఘువు తన కుమారుడు, కోడలు చేసే ఉపచారాలను స్వీకరించాడు. ఆ విధంగా పూర్వపురాజు మునివృత్తిలో ఉండగా, కొత్తరాజు రాజ్యానికి రావడం జరిగిన ఇక్ష్వాకు వంశం, చంద్రుడు అస్తమించగా సూర్యుడు ఉదయించిన ఆకాశంతో సామ్యం పొందింది.

అటు రఘువు, ఇటు అజుడు – ఇరువురూ రెండు రకాలయిన ధర్మాలను నిర్వర్తిస్తూ వచ్చారు. రఘువు మోక్ష ధర్మాచరణానురక్తుడయినాడు. అజుడు జీవితధర్మాన్ని అనుష్ఠిస్తున్నాడు. ఒకరికి పరివ్రాజక చిహ్నము, మరొకరికి ప్రభు చిహ్నము. ఆయన మహాయోగులతో సమావేశాలు జరుపుతున్నాడు. ఈయన నీతికోవిదులయిన అమాత్యవర్యులతో గోష్ఠులు నిర్వర్తిస్తున్నాడు. ఒకరిది మోక్షపదవికై చేస్తున్న ప్రయత్నం. ఒకరిది తనకు ఇంకా లభించని రాజ్య పదవులకై కావిస్తున్న ప్రయత్నం.

ధర్మచింతనకై రఘువు దర్భాసనం అధిష్టించాడు. ప్రజాపాలనకై అజుడు ధర్మసింహాసనం అధిష్టించాడు. ఆయన అభ్యాసంతో ఇంద్రియాలను నిగ్రహించగా, ఈయన తన శక్తి సామర్థ్యాలతో తన రాజ్యానికి ఆవల ఉన్న శత్రురాజులను వశపరచుకున్నాడు. రఘువు జ్ఞానమనే అగ్నిచేత ఐహిక సంబంధమైన వాంఛలను దగ్ధం చేశాడు. అజుడు తన రాజనీతితో శత్రువుల కుట్రలను భగ్నం చేశాడు. ఆయన ఆముష్మిక సంబంధమైన కోరికలు సిద్ధించే వరకూ తన ప్రయత్నం విరమించలేదు. ఈయన ఐహిక సంబంధమైన తన వాంఛలు ఈడేరే వరకూ విశ్రమించలేదు.

ఇలా వారిరువురూ ఎవరి సిద్ధులను వారు పొందారు. కుమారుని కోరికపై కొన్ని సంవత్సరాలు ఇలా గడిపి రఘుమహారాజు పిమ్మట బ్రహ్మజ్ఞాని అయినాడు. సర్వం బ్రహ్మమయంగా చూచాడు. తుదకు యోగసమాధిలో పరమాత్మయందు ఐక్యమైనాడు.

తండ్రి బ్రహ్మైక్యం పొందాడని విని అజుడు మిక్కిలి దుఃఖించాడు. యతి అయిన రఘువుకు అగ్నిసంస్కారంతో నిమిత్తం లేదు. అయినప్పటికీ యతుల సహాయంతో అజుడు, తండ్రికి నైష్ఠికమగు అంత్యకర్మ నిర్వర్తించాడు. తండ్రిమీద ఉన్న భక్తిచేత, ఆయనకు ఔర్ధ్వదేహిక కర్మలను కూడా నెరవేర్చాడు. అయితే యోగమార్గాన దేహత్యాగం చేసినవాడు, తమ కుమారుల పిండోదకాలను అపేక్షించరు.

బ్రహ్మైక్యం పొందిన తండ్రి కోసం శోకించనవసరం లేదని పెద్దలు అజునకు బోధించారు. ఆ విధంగా ఆయనకు మనశ్శాంతి కలిగించారు. తరవాత అజుడు దుఃఖం విడనాడి, ఎక్కడా ఎదురులేకుండా రాజ్యం పరిపాలించాడు.

తన పతి అజమహారాజును కూడి భూదేవి అనేక రత్నాలను ప్రసాదించింది. అలాగే ఇందుమతీదేవి ఒక కుమారరత్నాన్ని ప్రసవించింది. ఆ బాలుడు దశరశ్మి శతద్యుతుడై, దశదిశలా తన కీర్తి వ్యాపింపజేసుకుంటాడనీ, దశకంఠుడికి శత్రువవుతాడని తెలుసుకుని పెద్దలు అతనికి దశరథుడని పేరు పెట్టారు.

అప్పటికే అజమహారాజు వేదాధ్యయనం చేసి ఋషుల ఋణం తీర్చుకున్నాడు. యజ్ఞాలు కావించి దేవతల ఋణం నుండి విముక్తుడైనాడు. ఇక ఇప్పుడు పుత్రప్రాప్తివల్ల పితృ ఋణం నుండి కూడా ఆయనకు విముక్తి కలిగింది. ఇలా మూడు రకాల ఋణాల నుండి విముక్తుడై అజుడు పరివేష విముక్తుడైన సూర్యునివలె ప్రకాశించాడు.

ఆపదలో ఉన్నవారి భయాన్ని పోగొట్టడానికే ఆయన తన బలాన్ని శక్తి సామర్థ్యాలను వినియోగించాడు. పండితుల ప్రశంసలు పొందడానికే శాస్త్రాలను అధ్యయనం చేశాడు. అందువల్ల ధనమే ఆయనకు పరమార్థం కాలేదు. అవును మరి – గుణ సంపత్తి ఉన్నందున పరులకు అది ఉపకరించాలి.

ఇలా ఉండగా ఒకనాడు అజమహారాజు, ఇందుమతీదేవితో నగర సమీపమందలి ఉద్యానవనంలో విహరిస్తున్నాడు. ఆయన వనవిహారం శచీ సహితుడయిన ఇంద్రుని నందన వన విహారం వలె ఉన్నదని పౌరులు అనుకున్నారు.

ఆ సమయంలో ఆకాశమార్గాన నారదముని వెడుతూ ఉండడం తటస్థించింది. దక్షిణ సముద్ర సమీపానగల గోకర్ణేశ్వరాలయంలో స్వామి సన్నిధిన వీణాగానం చేయడానికై వెడుతున్నాడాయన. ఆయన చేతిలో వీణ ఉన్నది. ఆ వీణకు అలంకరించిన పూలమాలపై తుమ్మెదలు గుంపులు గుంపులుగా వ్రాలుతున్నాయి. అలాంటి వీణ గాలికి కదులుతూ కాటుక కలిసిన కన్నీటివలె కనిపించింది.

అప్పుడా నారదముని వీణపైగల దివ్యపుష్పమాల, సమస్త మృదుమధుర పరిమళాన్నీ అతిక్రమిస్తూ వీణ నుండి జారి, ఉద్యానవనంలో విహరిస్తున్న కోసలరాజు పట్టమహిషి స్తనాగ్రములపై పడింది! వెంటనే ఇందుమతీదేవి అదిచూచి వివశురాలైంది. చీకటివల్ల చంద్రుని కోల్పోయిన వెన్నెలలా ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఆమె నేల వాలిపోతూ తనతో పాటు తన భర్తను కూడా నేలకూల్చింది. అవును – క్రింద కారిపోయే నూనె బొట్లుతోపాటు దీపశిఖ కూడా నేలపాలు కావడం సహజం కదా!

అజమహారాజు, ఇందుమతీదేవి ఇలా ఆకస్మికంగా క్రిందపడి పోవడం చూచి, చుట్టూ ఉన్న దాసదాసీజనం పెద్ద పెట్టున ఆర్తనాదాలు చేసింది. అక్కడ సరోవరంలో గల పక్షులు కూడా దుఃఖిస్తున్నట్లు కలకల ధ్వనులు చేశాయి.

పరిజనుల ఉపచారాల వల్ల కొంతసేపటికి అజమహారాజుకు తెలివి వచ్చింది. ఇందుమతీదేవి మాత్రం అలాగే పడివున్నది. అవును, నాటితో ఆమెకు ఆయుర్దాయం తీరింది.

అప్పుడు అజమహారాజు తన ప్రియురాలిని చేతులతో లేవనెత్తి తన ఒడిలో ఉంచుకున్నాడు. ప్రాణం పోయిన కారణంగా కళావిహీనమైన తన దేవిని తొడపై ఉంచుకున్న అజమహారాజు అప్పుడు, మృగాంక మనే మచ్చతో కూడిన చంద్రునిలా కనిపించాడు! ఆయన తన సహజమైన ధైర్యస్థయిర్యాలను కోలుపోయాడు. దుఃఖం పొంగిపొరలి వస్తున్నందున కంఠం గాద్గదికమైంది. అలా ఆయన ఎంతగానో వాపోవడం మొదలుపెట్టాడు. అవును మరి – ఇనుము కూడా బాగా కాలినప్పుడు మెత్తపడుతుంది కదా!

"దేవీ! మెత్తని పూలు దేహానికి తాకినంతనే నీకు ప్రాణాలు పోయినవే! మెత్తనిపూలతోనే ప్రాణాలు తీయగల విధికి, ఇక ఏదైనా ప్రాణాలు తీయడానికి సాధనం అవుతుంది! ఒకవేళ సున్నితమైన వారి ప్రాణాలు హరించడానికి మృత్యువు సున్నితమైన సాధనాలనే ఉపయోగిస్తాడేమో! అవును, మంచు పడినంత మాత్రాననే తామర పూవు మాసిపోవడం ఇందుకు తార్కాణం! ఈ పుష్పమాల నీ ప్రాణాలు తీసింది కదా! మరి నా వక్షస్థలంపైన ఉన్న పూలమాల నా ప్రాణాలు తీయలేదే, ఎందుచేత?

అవును ప్రేయసీ! ఈశ్వర సంకల్పం వల్ల ఒకచోట విషం అమృతం అవుతుంది. ఒక చోట అమృతమే విషమవుతుంది! లేదా నా అదృష్టం తారుమారు కావడానికి విధి నాకీ పిడుగుపాటు కల్పించాడేమో! ఈ పిడుగు చెట్టును కాల్చకుండా, దానిని అల్లుకుని ఉన్న తీగెను నాశనం చేసింది దేవీ! నేను ఎన్ని తప్పులు చేసినా ఎన్నడూ నీవు నన్ను పల్లెత్తుమాట అని ఎరుగవు, అలాంటి దానివి ఇప్పుడు నన్ను మన్నింపవేమి? అవును – నిజంగా నేను దుర్మార్గుడను. బూటకాలు పలికేవాడను. లేకపోతే నీవు నాతో చెప్పకుండానే ఎన్నటికీ తిరిగిరాని లోకాలు వెళ్ళిపోతే, నేను మాత్రం వెంబడించక బ్రతికి ఉన్నాను. నేను చేసిన మహాపాపం వల్ల దుఃఖం పొందడానికే భగవంతుడు నన్ను బ్రతికించాడు.

ఆహా! మన విహారంలో అలసట వల్ల నీ ముఖాన చిరుచెమటలు పోశాయి. ఆ చెటమ బిందువులు ఇప్పటికీ అలాగే ఉన్నాయే. ఇంతలోనే నీవు ఏమైపోయావు ? ఛీ, ఛీ! మానవదేహాలు ఎంత అస్థిరమైనవి! దేవీ! ఎన్నడూ మనసులో నయినా కష్టం కలిగించలేదే. మరి నన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయావు ? ఇప్పుడు నేను కేవలం పేరుకు మాత్రమే ప్రభువును. నీతోపాటు నా సర్వస్వం పోయింది. వంకులొంకులు తిరిగిన నీ ముంగురులు తుమ్మెద రెక్కల్లా మెరుస్తున్నాయి. గాలికి కదిలాడుతున్నాయి. నీవు మరల బ్రతుకుతావేమోనన్న ఆశ కలుగుతున్నది. ప్రేయసీ! నీవు త్వరగా కళ్ళు తెరిచి చూడు. నా దిగులు పోగొట్టు సుందరీ! కదిలాడుతున్న ముంగురులతో మాట-పలుకు లేకుండా ఉన్న నీ ముఖం ఇప్పుడు, రాత్రి నిశ్శబ్దంగా ఉన్న పద్మం వలె ఉన్నది.

అయ్యో! మెత్తని పూలపాన్పుపై పడుకున్నా నీ దేహం నొచ్చుతుంది. అలాంటిది నిన్ను చితిపై ఎలా చేర్చేది ప్రాణేశ్వరీ! ఈ మొలనూలు నీకు ప్రాణసఖి. ఎందుచేతనంటే రతివేళల్లో కూడా ఇది నీ దగ్గరే ఉంటుంది. ఇప్పుడీ మొలనూలు, నీవు అడుగు పెట్టలేని కారణంగా నిశ్శబ్దమైంది. ప్రాణం కోలుపోయి ఉన్న నిన్ను చూచి ఏడ్చిఏడ్చి తాను కూడా మరణించినట్లున్నది!

జీవితేశ్వరీ! నీవు స్వర్గం చేరుకుంటూ కూడా నా కోసం కొన్ని విషయాలు నీ జ్ఞాపక చిహ్నాలుగా ఈ లోకంలో అట్టిపెట్టి వెళ్ళావు. కోయిలలకు మధురమైన మాటలు, రాజహంసలకు మందమూ, మనోహరమూ అయిన నడక, ఆడలేళ్ళలో బెదరు చూపులూ, గాలికి కదిలాడే కొమ్మలలో, రెమ్మలలో ఒయ్యారమూ – ఇవి చూచి నేను నిన్ను జ్ఞాపకం చేసుకోడానికి వీలు కలుగుతున్నది! అయినా, నీ వియోగం భరించలేను.

ప్రియసఖీ! ఈ మామిడి మొక్కనూ, ఈ ప్రియంగు లతనూ నీవేకదా ఒకచోట నాటి పెంచావు. ఈ రెంటికీ పెళ్ళిచేయాలనుకున్నావు. మరి, ఆ

కార్యం నెరవేర్చకుండానే నీవిలా వెళ్ళిపోవడం న్యాయమేనా ? నీ వలన దోహదక్రియ పొందిన ఈ అశోకం పూచే పువ్వు ముందుగా నీవు నీ ముంగురులలో అలంకరించుకోనిదే దానిని మాలకై ఎలా ఉపయోగిస్తాను ? నీవు నీ అందెలరవళితో అడుగు పెట్టినందున, ఆ విషయం తలచుకుని ఇప్పుడీ అశోకపుష్పాలు కన్నీటిలా మంచుబొట్లు రాలుస్తూ దుఃఖిస్తున్నాయి. నీకై పొగడపూలతో సగం దాకా గుచ్చాను. ఈ మొలనూలు. మరి దీన్ని పూర్తిచేయకముందే నీవిలా కన్నుమూయడం తగునా ?

ఈ చెలికత్తెల నయినా ఒక్కసారి కన్నెత్తి చూడు. వీరంతా నీ కష్టసుఖాలలో పాలుపంచుకున్నవారు. ఈ పసివాడు చూడబోతే నెలబాలుడు. నేనా, నీవు నన్ను ఎంతగా ప్రేమించావో, నిన్ను అంతగా ప్రేమించినవాడను. మరి, ఇలాంటి ఆప్తులందరనీ కష్ట సముద్రంలో ముంచి నీవు ఒంటరిగా వెళ్ళిపోవటం ఏ మాత్రం బాగా లేదు. ఇప్పుడు నాకు ఆనందం లేదు, ధైర్యం లేదు. ఏ వేడుకా లేదు. ఏ సౌఖ్యమూ లేవు. ప్రాణేశ్వరీ! నీవే నా అర్ధాంగివి. నీవే నా ముద్దుల చెలివి. నీవే నాకు ఆలోచన చెప్పే మంత్రివి. లలితకళలలో నీవే నాకు శిష్యురాలవు. నిన్ను అపహరించుకునిపోయి ఆ దైవము, నా సర్వస్వమూ అపహరించిన వాడైనాడు!

మదిరాక్షీ! నేను నీకు నా నోటితో మంచి మద్యం అందిస్తే అది త్రాగేదానవు కదా నీవు. మరి, ఇప్పుడు వెచ్చటి కన్నీటితో నిండిన జలతర్పణం అర్పిస్తే అది నీవు ఎలా త్రాగగలవు ? నీకు తప్ప నా మనసులో మరెవరికీ చోటు లేదు కదా ? అలాంటి నాకు ఎన్ని ఐశ్వర్యాలున్నా ఆ సుఖాలన్నీ నీవు ఉన్నంత వరకే! ఎందుచేతనంటే నాకు ఆనందం కలిగించే విషయాలన్నీ నీతోనే ఉన్నాయి.”

ఈ విధంగా అజమహారాజు ఎన్నో విధాల తన ప్రియురాలిని తలచుకుని ఎంతగానో దుఃఖించాడు. ఆయన శోకానికి అక్కడ చుట్టు ప్రక్కల

ఉన్న చెట్లు కూడా మకరందం అనే కన్నీటి బొట్లు రాల్చాయి. తరవాత బంధుమిత్రులు వచ్చి ఎంతో ప్రయత్నం మీద ఇందుమతి కళేబరాన్ని మహారాజు తొడపై నుండి తొలగించారు. అగరు, చందనపు చెక్కలతో చితి పేర్చి ఆమెను చితిపై పడుకోబెట్టారు. చితికి నిప్పంటించారు.

ప్రజలను పాలించు మహారాజైనా కూడా భార్యతోపాటు చనిపోయాడన్న లోకాపవాదుకు వెరచి అజమహారాజు, ఇందుమతితో కూడా అగ్నిలో ప్రవేశించక ఎలాగో ప్రాణాలు నిలుపుకొన్నాడు. అంతేకాని జీవితంపై ఆశ ఉండి ఆయన బ్రతకలేదు.

పదిరోజుల అశౌచం గడచిన పిదప, ఆ ఉపవనంలో భార్యకు అంత్యకర్మలు విధివిహితంగా నిర్వర్తించాడు. ఆ తరువాత మహాదుఃఖంతో నగరమున ప్రవేశించాడు. అప్పుడాయన రాత్రి అయిపోతుండగా కనిపించే చంద్రుని వలె కనిపించాడు. పురస్త్రీలంతా కూడా ఆయనతో పాటు దుఃఖాక్రాంతలై ఉన్నారు.

అజమహారాజుకు భార్యా వియోగం సంభవించిన సమయంలో వారి కులగురువయిన వసిష్టమహర్షి యజ్ఞదీక్షలో ఉన్నాడు. అందువల్ల ఆయన అక్కడికి రాలేదు. అయినప్పటికీ ధ్యానంలో ఆయన మహారాజుకు సంభవించిన ఆపదను గురించి గ్రహించాడు. దుఃఖంలో మునిగివున్న మహారాజుకు తన శిష్యుని చేత ఒక సదేశం పంపాడు. ఆ మునికుమారుడు అయోధ్యకు వచ్చి అజమహారాజును సందర్శించాడు. మహర్షి చెప్పి పంపిన సందేశాన్ని ఇలా వినిపించాడు :

"మహారాజా! పూజనీయులైన వసిష్టుల వారికి, మీకు సంభవించిన ఆపదను గురించి తెలుసు. అయినా వారు యజ్ఞదీక్షలో ఉన్నందున మధ్యలో వదిలి రాలేకపోయారు. స్వయంగా మిమ్మల్ని పరామర్శించే అవకాశం

లేకపోయినందున నా ద్వారా కొన్ని మాటలు చెప్పి పంపారు. అవి శ్రద్ధగా ఆలకించండి. మనస్సుకు ధైర్యం తెచ్చుకోండి. గురుదేవులు వసిష్ఠులు జరిగింది, జరుగుతున్నది, జరుగనున్నది సర్వం జ్ఞానదృష్టితో తెలుసుకోగలరు. పూర్వం తృణబిందువు అనే మహర్షి తపస్సు చేస్తూ ఉండగా, ఆ తపస్సుకు దేవేంద్రుడు భయపడ్డాడు. తపస్సును భగ్నం చేయమని హరిణి అనే ఒక అప్సరసను పంపాడు.

“ఆమె ముని తపస్సు చేసుకుంటున్న చోటుకు వెళ్ళింది. తన అందచందాలు, ఒయ్యారాలు ఒలికిస్తూ మహర్షి తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించింది. అయితే జితేంద్రియుడయిన తృణబిందుమహాముని మహాకోపంతో ‘ఓసీ, మానవస్త్రీవై జన్మించు’ అని శపించాడు.

అప్పుడా అప్సరస, దారుణమైన మహర్షి శాపానికి భయపడి ‘స్వామీ! నేను అస్వతంత్రురాలనై ఈ అపరాధం చేశాను. నన్ను క్షమించవలసినది...’ అని ప్రార్థించింది.

తృణబిందు మహాముని అప్సరసపై దయదలచి “దివ్య పుష్ప సందర్శనం కలిగేవరకూ నీవు భూలోకంలో ఉంటావు” అని శాపవిముక్తి ప్రసాదించాడు.

మహాప్రభో! ఆ హరిణి అనే అప్సరసే భూలోకంలో ఇందుమతీదేవిగా జన్మించి మీకు పట్టపురాణి అయింది. నారదమహర్షి వీణ నుండి దివ్య పుష్పమాల తనపై పడగా మరణించింది. ఆ విధంగా ఆమె శాపవిముక్తి పొంది మరల స్వర్గలోకం చేరుకున్నది. కనుక ఆమె కేదో ఆపద సంభవించిన దని మీరు విచారపడవలసిన పనిలేదు. ఎందుచేతనంటే పుట్టినవారికి చావు తప్పదు. ఇక మీరు ఈ భూదేవినే పట్టపుదేవిగా భావించి ఆమెను పాలించండి. భూదేవివల్లనే రాజులు మంచి కళత్రం కలవారు అవుతారు!

మహారాజా! మరొకమాట – మీరు అన్ని శాస్త్రాలు లెస్సగా చదివిన వారు, జ్ఞానవంతులు. ఇలా దుఃఖించడం తగదు. మీరు ఎంత దుఃఖించినా మరణించిన మహారాణి మరల మీకు లభింపదు. కనుక పిండోదకాలు సక్రమంగా సమర్పించండి. అంతేకాని అజ్ఞానిలా ఇలా దుఃఖించవద్దు జ్ఞాని దుఃఖించడు. పెనుగాలికి చెట్టు కదులుతుంది కాని కొండ కదలదు. అజ్ఞానికి జ్ఞానికీ అదే భేదం!"

మునిపుత్రుడు ఇలా వసిష్ఠులవారి సందేశం వినిపించగా అజమహారాజు శ్రద్ధగా ఆలకించాడు. మునికుమారుని సగౌరవంగా మరల పంపించి వేశాడు.

అయితే దుఃఖపూరితమైన ఆ మహారాజు హృదయంలో, వసిష్ఠుల వారి హితబోధ ప్రవేశించలేకపోయింది. అది తిరిగి గురువుల వద్దకే వెళ్ళి పోయినట్లయింది.

పసివాడైన దశరథునిలో ఇందుమతి పోలికలు ఉండడం వల్ల ఆ కుమారుని చూచుకుంటూ, అజమహారాజు కొంత సంతుష్టి చెందాడు. ఆమెను గురించే కలలుగంటూ ఎలాగో కాలం గడపసాగాడు.

ఆ విధంగా ఎనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ, అజమహారాజు హృదయంలో దుఃఖం అనేది శాశ్వతంగా తిష్టవేసుకుని ఉన్నది. అది ఆయన హృదయంలో ఒక శల్యమై బాధించజొచ్చింది. అదొక మానసిక వ్యాధిగా పరిణమించింది. ఏ వైద్యులూ ఆరోగ్యాన్ని మాన్పలేక పోయారు. ఆ విధంగా నైనా తను త్వరలో ప్రియురాలిని కలుసుకోవచ్చునని భావించాడాయన.

కుమారుడు దశరథుడికి ఉపనయనాది సంస్కారాలు చేయించాడు. కవచధారణకు అర్హమైన వయస్సు వచ్చిన దశరథుని తన మంత్రులకు

అప్పగించాడు. చివరకు మందులేని ఆ రోగబాధనుండి విముక్తి పొందడానికై ప్రాయోపవేశం చేయ సంకల్పించాడు.

ఆ రీతిగా అజమహారాజు గంగా సరయూ సంగమస్థలంలో దేహత్యాగం చేశాడు. దివ్యరూపం ధరించి విమానారూఢుడై స్వర్గం చేరుకున్నాడు. అక్కడ తిరిగి తన ప్రేయసిని కలుసుకున్నాడు.

# 9

**అ**జమహారాజు అనంతరం సింహాసనం ఎక్కిన దశరథుడు – మహారథుడు, జితేంద్రియుడు. మునులనూ, జనులనూ రక్షిస్తూ ప్రజానురంజకంగా రాజ్యపాలన చేశాడు.

ఆయన రాజ్యంలో వ్యాధి అనేది లేదు. శత్రుభయం లేదు. ఆయనను ఇంద్రునితో సమానుడని ప్రశంసించేది లోకం. అసమానమైన రాజ్యసంపద ఉండి కూడా ఆయన జూదం, పానం, వేట, స్త్రీ మున్నగు దుర్వ్యసనాలకు వశుడు కాలేదు. ఆయన ఎవరినీ అవమానించి ఎరుగడు. శత్రువుల విషయంలో కూడా అబద్ధమాడడు. అంతటి దయామయుడు, శాంతిమూర్తి మరొకడు లేడని అంతా చెప్పుకున్నారు.

దశరథుని వల్ల పరరాజులు ఉదయమూ, అస్తమయమూ – అను రెంటినీ పొందినవారైనారు. ఎందుచేతనంటే, తన ఆజ్ఞ మీరని వారికి ఆయన మిత్రుడుగా ఉన్నాడు. ధిక్కరించిన వారిని శిక్షించాడు. ఒక్క రథంతోనే సముద్రం వరకూ సమస్త భూమినీ జయించాడు. ఎక్కడా లేని గుర్రాలు, ఏనుగులు గల గొప్ప సైన్యం ఆయన శౌర్యపరాక్రమాలకూ, విజయ పరంపరకూ నిదర్శనంగా ఉన్నది. కానీ, ఆయనకు ఒక్క రథమే సైన్యం. ఆ రథంతోనే ఆయన అవని అంతా జయించాడు!

ఇంద్రుడు కొండల రెక్కలు నరుకగా, దశరథుడు శత్రువుల బాహువులను నరికాడు. మరుత్తులు ఇంద్రుని సేవించినట్లుగా వందలాది రాజులు ఆయన పాదాలపై రత్నకిరీటాలు గల శిరస్సులు ఉంచి కొలిచారు.

పర్వతాలలో పుట్టిన సెలయేళ్ళు, సముద్రాన్ని పొందినట్లుగా, పతివ్రతలైన మగధ, కోసల, కేకయదేశాల రాకుమార్తెలు ఆయనను పతిగా పొందారు. ఆ ముగ్గురు దేవేరులతో ఆయన దేవేంద్రుని విధంగా భాసించాడు.

అంతేకాదు, దశరథుడు దేవేంద్రుడికి యుద్ధంలో సహాయపడ్డాడు. సురపతిచే గొప్ప గౌరవసన్మానాలు పొందాడు. దేవకన్యలు ఆయన భుజబల పరాక్రమాలను గానం చేశారు. అపారమైన ధనం వెచ్చించి ఎన్నో గొప్ప యాగాలు కూడా చేశాడాయన. తమసా సరయూ నదీతీరాలు ఆయన నాటిన బంగారు యూపస్తంభాలతో నిండిపోయినవి. యాగా నంతరం అపబృధ స్నానం చేసిన తరువాత ఆయన ఒక్క దేవేంద్రునికి తప్ప మరెవరికీ తలవంచి నమస్కరించలేదు.

దశరథుడు ఒకే ఒక రథం ఎక్కి ధనుస్సు ధరించగానే, సూర్యాభి ముఖంగా భూమి నుండి లేచిన ధూళి, రాక్షసుల రక్తంతో అణగిపోయేది. అప్పుడు సూర్యుని సారథి అనూరుడు గుర్రాలను అదలించి మరలించగా, ఉత్తర దిక్కుకు వెళ్ళదలచిన భాస్కరుడు మంచును పారద్రోలుతూ, మలయ పర్వతాన్ని విడిచిపెట్టాడు. అప్పుడు ఆయనను నవసుమములతో పూజించడానికా అన్నట్లు వసంతుడు వచ్చాడు.

సూర్యుడు ఉత్తరాభిముఖుడయినప్పటికీ మెల్లమెల్లగా ప్రయాణం సాగించాడు. మంచువల్ల వివర్ణములయిన మంచి గంధపు చిగుళ్ళుగల మలయ పర్వతాన్ని వదిలిపెట్టినప్పటికి సూర్యుడు, పగటి ఎడబాటు గల చక్రవాకముల పట్ల దయతలచి అలా ప్రయాణం చేసినట్లు కనిపించాడు. వసంతుడు సకల

పృథ్విని పులకితం చేశాడు. చెట్లు, తీగలు మొదట పూతపట్టాయి. పిమ్మట లేత చిగుళ్ళు తొడిగాయి. ఆ తరవాత తుమ్మెదలకూ, కోయిలలకూ ఆవాసమైనాయి. అంతటా వసంతశోభ వెల్లివిరిసింది.

ఆర్థి జనులను లక్ష్మి పొందినట్లుగా సరోవరాలలో తేనె నిండిన పద్మాలను తుమ్మెదలూ, హంసలూ ఆశ్రయించాయి. ప్రియురాండ్రు చెవులలో తురుముకున్న అశోక చిగుళ్ళు కూడా మదకరమైనాయి. చిగురుటాకులు మందమారుతానికి అల్లల్లాడుతూ అభినయం నేర్చుకుంటున్నట్లు కనిపించాయి! అవి మొగ్గలు తొడిగి, జితేంద్రియులయిన మునులకు కూడా కామవికారం పుట్టిస్తున్నాయి. జవ్వనులు పూచిన పూదోటలలో మధురమగు కోయిలలు పలుకులు వింటూ విహరించారు. ఆ కోయిలల గానానికి తీగలు కదలాడుతూ తాళం వేశాయి.

చల్లని గాలి, తెల్లని వెన్నెల, పూచిన చెట్లు, మత్తెక్కిన కోయిలలు– ఇవన్నీ ఆమనికి అలంకారాలైనాయి. ప్రేయసీ ప్రియులలో కామోద్రేకాన్ని పెంపొందించాయి. వారు సుఖాలలో మునిగి తేలారు.

ఇలాంటి వసంతరాత్రులలో మన్మథ సమానుడగు దశరథ మహారాజు తన ప్రియురాండ్రతో కూడి తనివితీర సుఖాలు అనుభవించాడు. తరవాత ఆయనకు వేటకు వెళ్ళాలని బుద్ధిపుట్టింది.

వేట రాజులకొక వినోద క్రీడ అని, ధనుర్విద్యకు సార్థకమని, దేహానికి మంచి వ్యాయామమని మంత్రులు ఆమోదముద్ర వేయగా, దశరథుడు సంతోషించి వేటకు బయలుదేరాడు. వేటకు అనువైన వేషం ధరించాడు. వనమాలతో కేశాలను పైకి కట్టుకున్నాడు. ఆకుపచ్చని కవచం తొడిగాడు. విల్లు, అంబులూ చేతబట్టాడు. ఆఘమేఘాలమీద పోయే గుర్రం ఎక్కి, చెవి కుండలాలు కదులుతూ ఉండగా, ఘోరాటవులలో ప్రవేశించాడు. చెట్లు, తీగలు, తెమ్మెదల రూపంలో వనదేవతలు ఆయనను కన్నుల పండుగగా తిలకించారు.

వేటకుక్కలను తీసుకుని భటులు ముందువెళ్ళారు. కార్చిచ్చు, దొంగలు లేక గుర్రం సంచరించటానికి యోగ్యమై, లేళ్ళు రకరకాల పక్షులు నివసించే అడవిలోకి వెళ్ళాడాయన. అప్పుడాయనకు ఒక లేళ్ళ గుంపు కనిపించింది. దశరథుడు ధనుస్సు ఎక్కుబెట్టి, గుర్రాన్ని లేళ్ళ గుంపు చేరువకు పోనిచ్చాడు. వెంటనే లేళ్ళు బెదిరాయి. గాలికి కదలిన నల్లకలువ వలె అవి బెదరు చూపులతో చెల్లాచెదురుగా పరుగుతీయడం మొదలుపెట్టాయి.

అంతట దశరథుడు ఒక మగలేడిని కొట్టటానికై ధనుస్సున బాణం సంధించాడు. గురిచూచి బాణం చెవిదాకా లాగాడు. అయితే, ఇంతలో మగలేడి వెంటనున్న ఆడలేడి తన ప్రియుని రక్షించుకోడానికి తానే రాజు బాణానికి బలి కావాలనుకున్నది. ముందుకు వచ్చింది.

అది చూచి దశరథుడు ఆ ఆడలేడి సాహసానికి ఆశ్చర్యపోయాడు. ఆయన హృదయం కరిగిపోయింది. బాణం వెనక్కు తీశాడు. ఆ అనుభవం వల్ల తక్కిన లేళ్ళను కూడా చంపడానికి దశరథునకు చెయ్యి రాలేదు. వేరే మృగాల కోసం వెదకసాగాడు.

అప్పుడాయనకు అడవిపందులు పోయిన జాడ కనిపించింది. మడుగులలో నుండి అవి లేచి వచ్చినట్లు త్రోవలో బురద మరకలు కనిపించాయి. అవి నోట కరచుకొని వచ్చిన తుంగ మొలకలు అక్కడక్కడ జారిపడి ఉన్నాయి. తడి అడుగుల జాడ ననుసరించి ఆయన ముందుకు పోయాడు.

అలా పోగాపోగా ఒకచోట అడవిపందుల మంద కనిపించింది. అప్పుడాయన యథేచ్ఛగా వేటాడడం మొదలుపెట్టాడు. ఆ వనవరాహాలు దెబ్బతిన్న రోషంతో ఆయనపైకి లంఘించాలని ప్రయత్నించాయి. అయితే అవి తమ వెనుకనున్న చెట్ల కొమ్మలమధ్య తామే చిక్కుపడినట్లు తెలుసుకోలేక పోయాయి.

ఒక అడవిదున్న బాగా దెబ్బతిని మహావేగంతో దశరథుని పైకి దూకింది. అయితే ఉపాయ మెరిగిన మహారాజు ఒక బాణాన్ని కంటికి గురిపెట్టి కొట్టాడు. అది ఆ దెబ్బకు నేల కూలిపోయింది. తరవాత ఆయన ఖడ్గమృగాలను అనేకం వేటాడాడు. అయితే వాటి కొమ్ములను మాత్రమే నరికివేసి, ఆ విధంగా వాటి పొగరు అణచాడు. వాటిని చంపలేదు.

కొండగుహల నుండి వెలికి వచ్చిన పెద్ద పులులనూ, పొదల చాటు నుండి దూకుతూ వచ్చిన సింహాలనూ ఆయన అనేక విధాల కవ్వించి వాటిని వేటాడాడు. గుర్రాన్ని అన్ని దిక్కులకూ పరుగెత్తిస్తూ ధనస్సును చిత్రవిచిత్రంగా తిప్పుతూ, బాణాలను వర్షంలా కురిపిస్తూ ఆయన క్రూర మృగాలను వేటాడాడు. అదొక వినోద క్రీడగా ఎంచుకుని ఆనందించాడు.

అలా వేటాడి దశరథుడు అలసిపోయాడు. చల్లని గాలి వీచి ఆయన బడలిక తీర్చింది. తరవాత పరివారాన్ని పంపించి వేశాడు. ఓషధుల వెలుగులో, మెత్తని చిగుళ్ళు, పువ్వులు పాన్పుగా చేసుకొని ఒకచోట విశ్రమించాడు.

ఆ రాత్రి గడిచింది. ఉదయాన్నే శంఖభేరీధ్వానాలు మ్రోగుతుండగా, వందిమాగధులు స్తోత్రపాఠాలు వల్లిస్తూ ఉండగా మేల్కొన్నాడు. కాలకృత్యాదులు ముగించుకుని, అలంకారాలు తీర్చుకుని మరల గుర్రం ఎక్కాడు. ఆ జవనాశ్వం ఆఘమేఘాల మీద పరుగులు తీసింది. అలా దశరథుడు మునిజనులకు నిలయంగా ఉంటున్న తమసానదీతీరం చేరుకున్నాడు.

అప్పుడా నదిలో ఒకచోట ఎవరో కడవతో నీరు ముంచుతున్నట్లు “బుడ బుడ” మను శబ్దం వినిపించింది. అయితే, అది ఏనుగు నీరు త్రాగుతున్న చప్పుడని అనుకున్నాడు దశరథుడు. శబ్దభేది అను బాణం ప్రయోగించాడు.

రాజైనవాడు ఒక్క రణభూమిలో తప్ప మరెక్కడా ఏనుగును చంపకూడదని ధర్మశాస్త్రం. దశరథుడు ధర్మాన్ని అతిక్రమించి ఈ అకృత్యానికి పాల్పడ్డాడు.

దశరథుడు బాణం వదిలాడో లేదో – అంతలోనే "హా! తండ్రీ" అను అర్తనాదం విన వచ్చింది. అది చెవిన పడగానే మహారాజు అదిరిపడ్డాడు. తక్షణమే ఆ ధ్వని వచ్చిన వైపు వెళ్ళాడు.

అలా వెదకుతూ వెళ్ళగా ఒక వెదురుపొద చాటున మునిపుత్రుడొకడు నేలపడి ఉండడం ఆయనకు కనిపించింది. మునికుమారుని చేతిలో కడవ ఉన్నది. రొమ్మున బాణం గుచ్చుకొని ఉన్నది. ఆ దృశ్యం చూడగానే దశరథుడికి తన హృదయంలో బాణం గుచ్చుకొన్నంత బాధ కలిగంది. వెంటనే గుర్రం దిగాడు. మునికుమారుని చెంతకు వెళ్ళి పలకరించాడు.

"నాయనా! నీవు ఎవరు? నీ పేరేమిటి? నీ తల్లి దండ్రులెవరు?" అని అడిగాడు.

మునికుమారుడు ఒకచేత నీటి కడవను పెనవేసుకుని, ఎంతో బాధపడుతూ మాట చెప్పలేక, చెప్పలేక చివరకు తానొక మునికుమారుడని చెప్పాడు. తన తల్లి దండ్రుల వద్దకు తీసుకుని పొమ్మని కోరాడు, వారు ఎక్కడ ఉన్నదీ త్రోవ తెలియజేశాడు.

అప్పుడు దశరథు డా మునిపుత్రుని తన చేతులమీద ఎత్తుకుని అతని తల్లిదండ్రుల వద్దకు తీసుకుని వెళ్ళాడు. పాపం, ఆ ముని దంపతులు కడువృద్ధులు, పైగా కళ్ళు లేనివారు.

దశరథుడు భయపడుతూ తెలియక తాను చేసిన ఘోరకృత్యాన్ని గురించి వారికి వినిపించాడు.

ఆ వార్త తెలియగానే మునిదంపతులు తమ ఏక పుత్రుని తలచుకుంటూ గోడు గోడున దుఃఖించారు. పుత్రుని వక్షస్థలాన నాటి ఉన్న బాణం

తీసివేయమని దశరథుడికి చెప్పగా ఆయన అలా చేశాడు. బాణం తీసివేయగానే ఆ మునిబాలకుని ప్రాణాలు పోయాయి.

అప్పుడు ముని కంటికి మంటికి ఏకధారగా విలపిస్తూ పుత్రశోకం భరించలేక, దశరథ మహారాజును, "ఓయీ! రాజా! నా వలెనే నీవు కూడా వృద్ధాప్యంలో పుత్రశోకంతో మరణింతువు గాక!' అని కఠోరంగా శపించాడు.

తోక తొక్కిన పాము విషం కక్కినట్లుగా, తను చేసిన దారుణ కృత్యం వల్ల పుత్రుని కోల్పోయిన ముని ఇలా శపించగా, దశరథుడు విని తిరిగి బదులు పలికాడు :

"మహర్షీ ! నాకు ఇంతవరకూ సంతానభాగ్యం లేదు. అందువలన మీరిచ్చిన శాపం నాకొక వరప్రసాదమైంది. ఈ విధంగానైనా నాకు పుత్రప్రాప్తి కలుగుతుందని సంతోషిస్తున్నాను. మహాత్మా! నేను కఠినాత్ముడనై నిష్కారణంగా మీ కుమారుని పొట్టన పెట్టుకున్నాను. కనుక నేను అవశ్యం వధ్యుడను. నన్ను ఆజ్ఞాపించండి. ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు?"

దశరథుడు ఇలా చేతులు జోడించి అడుగగా మునీశ్వరుడు, తాను తన భార్య కూడా కుమారునితోపాటే అగ్ని ప్రవేశం చేయదలచామని చెప్పాడు. అందుకు సిద్ధం చేయమని కోరాడు.

అంతట దశరథుడు తన పరిజనులచే చితి పేర్పించి ముని కోరిక తీర్చాడు. తరువాత తాను చేసిన పాపకార్యాన్ని గురించి తలచుకుంటూ, శాపభీతి పొందుతూ మిక్కిలి దుఃఖాక్రాంతుడై తిరిగి తన నగరానికి వెళ్ళిపోయాడు. అయితే తనకు కలిగిన శాపం సంగతి ఎవరికీ చెప్పక మనస్సు లోనే దాచుకున్నాడు.

# 10

తరువాత దశరథ మహారాజు మహావైభవంగా దాదాపు పదివేల సంవత్సరాలు అయోధ్యాపట్టణాన్ని పాలించాడు. అయినా ఆయనకు సంతానం కలుగలేదు. పితరులకు గతులు కల్పించడానికీ, మోక్ష సిద్ధికీ సాధనమైన పుత్రుడు జన్మించనందుకు ఆయన మిక్కిలి పరితపించాడు.

అప్పుడు ఆయన సంతాన ప్రాప్తి కోసం ఋష్యశృంగుడు మున్నగు మహర్షులు ఋత్విక్కులుగా ఉండి, పుత్రకామేష్టి అనే యజ్ఞం మొదలుపెట్టాడు.

ఆ తరుణంలో పులస్త్య బ్రాహ్మపుత్రుడైన రావణుడు ముల్లోకాలనూ పీడిస్తూ వచ్చాడు. దేవతలంతా అనేక బాధలకు లోనైనారు. ఎండాకాలపు ఎండకు బాధపడిన బాటసారులు, నీడకోసం చల్లని వృక్షాన్ని ఆశ్రయించి నట్లుగా దేవతలంతా విష్ణుమూర్తిని ఆశ్రయించారు. వారు పాల సముద్రం వద్దకు పోయి విష్ణుదేవుని ప్రార్థించాడు.

అప్పుడు భగవంతుడు యోగనిద్ర నుండి మేల్కొని, వారికి అభీష్టసిద్ధి కలిగించడానికి సంసిద్ధుడైనాడు. రత్నకాంతులతో వెలిగిపోయే వేయిపడగలు గల ఆదిశేషునిపై పవళించి ఉన్న ఆదినారాయణుడు దేవతలకు దర్శనం ఇచ్చాడు. పద్మంలో కూర్చుని వున్న ఆదిలక్ష్మి ఆయనకు పాదాలు ఒత్తుతున్నది. మెత్తని తన ఒడిలో ఆయన పాదపద్మాలు ఉంచుకుని సేవ చేస్తున్నది.

బంగారు కాంతులు వెదజల్లే పైవస్త్రం ధరించి విష్ణువు కనులు తెరిచి చూచాడు. పాలసముద్రంలో పుట్టి, లక్ష్మీదేవికి అద్దంగా ఉంటున్న కౌస్తుభమణి, విష్ణుదేవుని వక్షస్థలాన శ్రీవత్సం అనే పుట్టుమచ్చయై ప్రకాశిస్తున్నది. దివ్యాభరణాలతో అలంకరించబడిన పొడుగాటి చేతులు గల విష్ణుదేవుడు పాలసముద్రంలో పుట్టిన రెండవ పారిజాతంలా శోభిల్లుతున్నాడు. రాక్షస స్త్రీల

కపోలాలపై మదరక్తిమను లోపింపజేసే శంఖచక్రాది ఆయుధాలు, సజీవములూ, సచేతనములూ అయి జగన్నాథునికి జయ జయధ్వానాలు చేస్తున్నవి!

దేవేంద్రుడు వజ్రాయుధంతో కొట్టగా గాయపుమచ్చగల గరుత్మంతుడు ఆదిశేషుడితో విరోధం మాని, చేతులు జోడించుకుని తన ప్రభువు ఎదుట వినమ్రుడై నిలుచుని ఉన్నాడు. ఆ దేవదేవుడు యోగనిద్ర విడచి, మహర్షులను తన ప్రసన్న దృష్టితో కటాక్షిస్తున్నాడు.

అప్పుడు దేవతలు పురుషోత్తముని ఇలా ప్రస్తుతించారు :

"మొదట ఈ సకల విశ్వాన్ని సృష్టించి, తరవాత పాలించి, తుదకు సంహరిస్తున్న త్రిమూర్త్యాత్మకుడవగు దేవదేవా, నీకు నమస్కారం! ఒకే రసంగల దివ్యజలం ఊసర క్షేత్రాది నానారకాలయిన ప్రదేశాలలో రసాంతరములను పొందిన విధంగా, వికార రహితుడవైన నీవు సత్వాది త్రిగుణాలలో భాసిస్తూ బ్రహ్మాదిరూపాలు ధరిస్తూ ఉంటావు. స్ఫటికం ఒకే రూపం కలది అయినా, జపాకుసుమాది పుష్పరాగం వల్ల వివిధావస్థలు పొందుతున్నది. అలాగే నీవున్నూ ఏకరూపుడవైనా ఉపాధిని బట్టి నానా అవస్థలూ పొందుతూ, నానా విధాలుగా ఉంటున్నావు. జగన్నాథా! నీకు పరిమితులూ, కొలతలూ లేవు. అయినా నీవు లోకాలకు పరిధులు విధిస్తున్నావు. నీవు ఏదీ కోరవు. అయినా కోరిన వారికి అన్నీ నీవు ఇస్తున్నావు. ఇతరులు నిన్ను జయించలేరు. అయినా నీవు అందరినీ జయిస్తావు. లోకాలు నిన్ను తెలుసుకోలేవు. అయినా నీ మూలంగానే లోకాలు వ్యక్తమవుతున్నాయి.

"శ్రీమన్నారాయణా! నీవు సమస్త జీవుల హృదయాలలోనూ ఉన్నప్పటికీ ఎవరికీ కనిపించవు! కామరహితుడై ఉండి కూడా లోకోపకార్థం తపస్సు చేస్తుంటావు. నీకు శోకం లేదు. కానీ ఇతరుల శోకం పోగొడుతుంటావు.

పురాణ పురుషుడవైనా నీకు వృద్ధాప్యం లేదు. నీకు సర్వం తెలుసు. కానీ ఎవరూ నిన్ను తెలుసుకోలేరు. అన్నిటికీ జన్మస్థానం నీవే. కానీ నీకు జన్మస్థానం లేదు! సకల జగత్తుకూ నీవు నాథుడవు. కానీ నీకు నాథుడు లేదు!

"స్వామీ! నీవు ఒక్కడవే. కానీ అన్ని రూపాలు నీవే ధరిస్తావు! మహనీయులు నీకు అనేక పేర్లు పెట్టి, అనేక విధాలుగా వర్ణిస్తూ ఉంటారు. చతుర్వర్ణమయమైన లోకం, చతుర్యుగ విభక్తమైన కాలం, చతుర్వర్గసారమైన జ్ఞానం – అన్నీ చతుర్ముఖుడవైన నీ నుండే అవతరిస్తున్నాయి. యోగులు మనోనిగ్రహంతో, అభ్యాసుదుల చేత, హృదయంలో జ్యోతి స్వరూపుడవై ఉండే నిన్ను ముక్తి కోసం ధ్యానిస్తూ ఉంటారు. నీకు జన్మ లేదు. అయినా జన్మలెత్తుతావు. కోరికలు లేకపోయినా ఏవో కోరికలు పెట్టుకుని దుష్టసంహారం చేస్తుంటావు. నిద్రిస్తూ మేల్కొని ఉంటావు! మేల్కొని ఉండే నిద్రపోతుంటావు! ఇలాంటి నిన్ను నీ నిజస్వరూపాన్ని తెలుసుకోవడం ఎవరికి సాధ్యం ? అందరినీ నీవు రక్షిస్తుంటావు. అయినా అన్నిటి పట్ల ఉపేక్షవహిస్తూ ఉంటావు. వేరు వేరు చోట్ల నుండి వచ్చే జలప్రవాహాలు సముద్రుని యందు అణగిపోతున్నట్లుగా, ఆగమమువల్ల పురుషార్థ సాధకమార్గాలు విభిన్నంగా ఉండి గూడా నీలో కలిసిపోతున్నాయి.

"చిత్తాన్ని నీపైననే లగ్నం చేసి సమస్త కర్మలూ నీకే అర్పించి, నిష్కాముడై పూజించే వారికి నీవు మోక్షం ప్రసాదిస్తావు. స్మరించినంత మాత్రం చేతనే నీవు కోరికలు తీరుస్తున్నావు. అలాంటిది సర్వమూ నీకే అర్పించి నిరంతరం నిన్ను పూజించేవారికి ఎంతటి ఫలం కలుగుతుందో చెప్పనలవి కాదు కదా! సముద్రుడి రత్నాలవలె, సూర్యుడికి కిరణాల వలె, నీ కథలు స్తోత్రపాఠాలకు అతీతంగా ఉంటాయి. నీవు అందుకునేదీ, నీకు అందనిదీ ఏదీ లేదు. కానీ లోకాన్ని అనుగ్రహించే నిమిత్తమే నీవు జన్మలనూ, కర్మలనూ అంగీకరిస్తావు!"

ఇలా దేవతలు పెక్కువిధాల భగవంతుని ప్రార్థించారు. విష్ణుదేవుడు సంప్రీతుడై వారిని పలకరించాడు. కుశల ప్రశ్నలు వేశాడు. అప్పుడు దేవతలు రావణుని వలన తమకు కలిగిన ఉపద్రవాలను గురించి చెప్పుకున్నారు. ఎంతో దీనంగా తమ అవస్థలను మనవి చేసుకున్నారు.

వారి కష్టాలు విని దేవదేవుడు కరిగిపోయాడు. గంభీరవాక్కులతో వారికి సమాధానం ఇచ్చాడు. ఆదికవి అయిన ఆ నారాయణుని వర్ణోత్పత్తి స్థానములందు పుట్టి, ప్రకటిత అయిన సరస్వతి సాధుత్వం సంతరించుకుని చరితార్థురాలైంది! ఆయన ముఖం నుండి వెలువడిన వాణి, ఆయన పాదాల నుండి వెలువడగా మిగిలిపోయిన గంగ ఊర్ధ్వవాహిని అయినట్లు కనిపించింది!

"ఓ, దేవతలారా! దేహధారుల సత్వరజోగుణాలు, తమోగుణం వల్ల నశించిపోయినట్లు రావణుని ముందు మీ మహిమలు, శౌర్యపరాక్రమాలు వ్యర్థమై పోయినవని నాకు తెలుసు. ప్రమాదం వల్ల పాపం చుట్టుకుని సాధువు హృదయం ఎలా తపిస్తుందో, అలాగే రావణుని వల్ల ముల్లోకాలు బాధ పడుతున్నవని నేను ఎరుగుదును. లోకరక్షణ మీతో పాటు నాకూ కావలసినదే – కనుక దీనికై ఇంద్రుడు నన్ను ప్రత్యేకంగా వేడుకోవలసిన పని లేదు. వాయువు కోరకుండానే తనంతట తాను అగ్నికి తోడుపడుతూ ఉంటుంది! ఆ రావణునికి నా చేతిలో చావు రాసి పెట్టి ఉన్నది. అయితే, బ్రహ్మవరం వల్ల వాడు, మంచి గంధపుచెట్టు మూలంగా పాము ఉన్నత స్థితి పొందినట్లుగా, ఉన్నతస్థితి పొంది ఉన్నాడు. గొప్ప తపస్సు చేసి దేవతల చేత చావు రాకుండా వాడు బ్రాహ్మ వల్ల వరం పొందాడు. అయితే, మానవుల వల్ల మరణం రాకుండా మాత్రం కోరలేదు. కాబట్టి నేను దశరధునకు పుత్రునిగా భూలోకంలో అవతరిస్తాను. నా వాడి బాణాలతో ఆ రావణుని శిరస్సులు ఖండిస్తాను. ఆ శిరస్సులను భూదేవికి పూజా పుష్పాలుగా సమర్పిస్తాను.

త్వరలో మరల మీకు యాగాలలో హవిర్భాగాలు లభించుగాక! దేవతలంతా త్వరలోనే భయవిముక్తులవుతారు. నలకూబరుని శాపం వల్ల నిరుద్ధడైన రావణాసురుడిచే, బలాత్కరింపబడకుండా అతని కారాగృహంలో మ్రగ్గుతున్న దేవకాంతల జడలుకట్టిన కురులు మీరు త్వరలోనే చక్కదిద్దుతారు!" అని పలికాడు విష్ణుమూర్తి.

వర్షం లేక వాడిపోయి ఉన్న పంటపై మేఘం వర్షించినట్లుగా రావణుని వల్ల బాధ పడుతున్న దేవతలపై నారాయణుడనే మేఘం వాగమృతం వర్షించి అంతర్ధానమైనాడు. అంతట దేవతలు తమతమ నిలయాలకు వెళ్ళి పోయారు. వాయువును అనుసరించే వృక్షాల వలె, వారు తమతమ అంశాలతో విష్ణుదేవునితోపాటు భూలోకంలో అవతరించడానికి సంసిద్ధులైనారు.

ఇక్కడ దశరథ మహారాజు చేస్తున్న పుత్రకామేష్టి పూర్తి అయింది. యజ్ఞాంతమున అగ్ని నుండి ఒక దివ్యపురుషుడు ఉద్భవించాడు. విష్ణుమూర్తి అంశ ప్రవేశించడం వల్ల తాను మోయలేకుండా ఉన్న పాయసాన్నం పాత్ర రెండు చేతులతో పట్టుకుని ఉన్నాడు.

సముద్రుడు సమర్పించిన అమృతాన్ని ఇంద్రుడు పరిగ్రహించినట్లుగా, ప్రజాపతి పురుషుడు అందించిన ఆ దివ్యాన్నపు పాత్రను దశరథుడు స్వీకరించాడు.

తరువాత, లేత ఎండను భూమ్యాకాశాలకు పంచిపెట్టే దినరాజు వలె, రాజేంద్రుడు వైష్ణవతేజంతో కూడిన ఆ పాయసాన్నాన్ని తన భార్యలగు కౌసల్య, కైక, సుమిత్రలకు పంచి ఇచ్చాడు. మొదటి భార్య అయిన కౌసల్యాదేవికి సగం పాయసాన్నం పెట్టాడు. తక్కిన సంగం ప్రియురాలైన కైకకు ఇచ్చాడు. వారిద్దరూ సుమిత్రను ఆదరిస్తారని ఆయన అభిప్రాయం.

భర్త అభిమతం తెలిసిన కౌసల్య, కైకలు తమ భాగాలలో చెరిసగం తీసి సుమిత్రకు ఇచ్చారు. ఈ విషయంలో సుమిత్రకు తన సవతుల పట్ల అసూయ జనించ లేదు. మదపుటేనుగు కుంభస్థలానికి రెండు వైపుల నుండి స్రవించే మదజల ధారలు రెంటి యందునూ ప్రేమ చూపే ఆడుతుమ్మెదవలె, ఆమె తన సవతులిద్దరి పట్ల అనురాగమే చూపింది!

పాయసాన్నం భక్షించగానే, దశరధుని భార్యలు ముగ్గురూ గర్భవతులైనారు. కంకి పుట్టేటప్పుడు పైర్లు తెలివన్నె ధరించినట్లుగా వారి దేహాలు కొంచెం పాండువర్ణములైనాయి. వారి ముగ్గురికీ దివ్యస్వప్నాలు వచ్చాయి. శంఖం, చక్రం, గద, ఖడ్గం, శార్జ్గం –ధరించి ఉన్న దివ్య పురుషులు తమ్ము రక్షిస్తున్నట్లుగా వారికి కల వచ్చింది. గరుత్మంతుడు తమ్ము మోస్తున్నట్లు వారు కలకన్నారు. తామరాకు విసనకర్రతో లక్ష్మి తమకు సేవచేస్తున్నట్లు – అత్రి మున్నగు సప్తర్షులు తమ్ము పూజిస్తున్నట్లు వారికి కల వచ్చింది.

తమకు వచ్చిన స్వప్నాలను గురించి దశరధమహారాజుకు వారు తెలియజేశారు. భగవంతుడు తనకు పుత్రుడుగా జన్మించబోతున్నాడని గ్రహించి మహారాజు చాలా సంతోషించాడు.

అంతట ఒక శుభ సమయాన కౌసల్యాదేవి మహాతేజశ్శాలి అయిన ఒక కుమారుని కన్నది. ఆ బాలుడి చక్కదనం చూచి దశరధుడు వానికి రాముడని పేరు పెట్టాడు. లోకానికి మొట్టమొదటిసారిగా శుభలక్షణ మగు పేరు అది! రఘువంశానికే వెలుగుగా ఉన్న ఆ బాలుని తేజస్సు ముందు పురిటింటిలో దీపాలన్నీ వెలవెలబోయినవి!

రాముని ప్రక్కన పరుండబెట్టుకుని ఉన్న కౌసల్యాదేవి – శరత్కాలంలో సన్నగిలి ఉండే సైకతమున పద్మోపహారంతో కూడిన గంగా నదివలె భాసించింది!

కైకేయి భరతుని కన్నది. వినయ సంపత్తికి మెరుగులు దిద్దినట్లుగా అతను తల్లికి వన్నె తెచ్చాడు. సుమిత్ర లక్ష్మణ – శత్రుఘ్నులనే కవల పిల్లలను కన్నది. విద్యావినయములను ప్రసవించినట్లుగా ఆమె ఆ కుమారులను కన్నది.

ఇలా రామ లక్ష్మణ, భరత శత్రుఘ్నులు పుడమిపై అవతరించగానే, విష్ణుదేవునితో పాటు స్వర్గమే భూలోకానికి దిగి వచ్చినట్లు అయింది. సమస్త లోకాలూ ఎటువంటి బాధలూ లేకుండా గొప్ప ప్రకాశంతో వెలుగొందాయి. విష్ణువు నాలుగు రూపాలతో పుట్టడం వల్ల, అంతవరకూ రావణునికి భయపడుతూ వచ్చిన దిక్పాలకులు గల నాలుగు దిక్కులూ అమ్మయ్య – అని విశ్వసించినట్లుగా ధూళిలేని గాలి వీచింది. రాక్షసభీతితో ఉన్న సూర్యుడు, అగ్ని ఇప్పుడు శోకవిముక్తులైనట్లు వేడి, పొగలేకుండా ప్రసన్నులై వెలిగారు!

అప్పుడు రావణుని పది కిరీటాల నుండి మణులు జారిపడ్డాయి. ఆ విధంగా రాక్షసలక్ష్మి కన్నీటి చుక్కలు రాల్చినట్లు కనిపించింది.

పుత్రులు జన్మించగానే అయోధ్య అంతటా మంగళ తూర్యారవాలు మ్రోగాయి. కల్పవృక్షం పుష్పవృష్టి కురిపించింది.

తరువాత ఆ బాలకులకు జాతకకర్మాది సంస్కారాలు నెరవేర్చారు. వారు నలుగురూ శుక్లపక్ష చంద్రుల వలె వర్ధిల్లుతూ, తండ్రికి నయనానందం చేస్తూ వచ్చారు. ఆ అన్నదమ్ములకు పరస్పర విరుద్ధ ప్రవర్తన అనేది లేదు. ఆ ఋతువులు దేవవనాన్ని ప్రవేశింప జేసినట్లుగా వారు రఘువంశాన్ని దీపింపజేశారు. ఆ నలుగురన్నదమ్ములూ పరస్పరాను రాగంతో ఒకరి నొకరు క్షణం ఎడబాసి ఉండరు. అయినప్పటికీ రామలక్ష్మణులు ఒక జంటగాను, భరత శత్రుఘ్నులు ఒక జంటగాను కలసి మెలసి తిరుగుతూ వచ్చారు. వారి ఐకమత్యానికి ఎన్నడూ ఏ విధంగాను భంగం వాటిల్లలేదు.

ఆ నలుగురు రాకుమారులూ, తేజో వినయగుణాదులతో మిక్కిలి ప్రకాశిస్తూ, గ్రీష్మాంతమున నీలమేఘాలు గల దినముల వలె ప్రజల హృదయాలను ఆకర్షించి ఆకట్టుకున్నారు. వారు నలుగురూ ధర్మార్థ కామ మోక్షములనే పురుషార్థాలు అవతారాలు తాల్చినట్లు భాసిల్లారు.

అపారమైన పితృభక్తితో ఆ నలుగురు కుమాళ్ళూ, నాలుగు సముద్రాల చివర వరకూ భూమిని పాలిస్తున్న తండ్రిని, రత్నాలు సముద్రుని సేవించినట్లుగా తమ గుణ సంపత్తితో సేవించారు.

విష్ణుదేవుని అంశ వలన పుట్టిన నలుగురు కుమారులతో దశరథుడు కూడా, రాక్షస ఖడ్గాలను ముక్కలు చేసే నాలుగు దంతాలు గల ఐరావతం లాగాను, ఫలసిద్ధిలో చతురోపాయాలతో కూడిన నీతి వలెనూ, నాలుగు బాహువులతో కూడిన శ్రీహరి వలెనూ తేజరిల్లాడు!

# 11

**ఒ**కనాడు విశ్వామిత్ర మహర్షి దశరథుని వద్దకు వచ్చాడు. తన యజ్ఞానికి రాక్షసులు విఘాతం కలిగిస్తున్నారని, వారి మదగర్వం అణచడానికి బాలరాముని తన వెంట పంపమని అడిగాడు. తేజస్వి అయిన రాముడు బాలుడైనా రాక్షసులను సంహరించగలడని ముని తలంపు.

మహర్షి మాట కాదనలేక రాముని పంపడానికి అంగీకరించాడు దశరథుడు. తను ఎంతో కష్టపడి, యజ్ఞం చేసి పొందిన కుమారుడు రాముని లక్ష్మణునితో కూడా విశ్వామిత్ర మహర్షికి అప్పగించాడు. అవును, అర్థిజనులు ఏది అడిగితే అది లేదనకుండా ఇవ్వడం రఘువంశంలో మామూలు.

కుమాళ్ళు నగరం విడిచి వెడుతున్నారు. కనుక పురవీధులన్నీ అలంకరించమని దశరథుడు ఆజ్ఞాపించాడు. వెంటనే మేఘాలు పూలతో కూడిన వాన కురిపించాయి!

తండ్రి ఆజ్ఞ నిర్వర్తించబూనుకున్న రామలక్ష్మణులు విండ్లు, అంబులూ చేతబూని విశ్వామిత్ర మహర్షి వెంట బయలుదేరుతూ, తండ్రి పాదాలకు నమస్కరించారు. అప్పుడు దశరథ మహారాజు కనుల నుండి వెచ్చని కన్నీటిబొట్లు, వారిపై రాలాయి!

కుమారుల వియోగాన్ని భరించలేని తండ్రి అశ్రుబిందువులు తమ శిరస్సులను అభిషేకించగా పవిత్రులైన రామలక్ష్మణులు తల్లులకు కూడా నమస్కరించి మునితోపాటు అయోధ్య విడిచి వెళ్ళారు.

వారు వెడుతుండగా పురవీధులలో వేలాది పౌరులు బారులు తీరి నిలుచున్నారు. కళ్ళు ఇంతింత చేసుకుని వారిని చూచారు. పౌరుల చూపులే వారికి మార్గతోరణాలు అయినాయి! సూర్యమార్గాన్ని అనుసరించే చైత్రవైశాఖ మాసాల్లా ప్రకాశించారు రామలక్ష్మణులు.

పసితనం వల్ల వారు చేతులు ఎగురవేస్తూ నడిచారు. అయినప్పటికీ, వర్షాకాలంలో గట్టులను కోసివేసే అలలతో ప్రక్కలకు విస్తరిస్తూ సాగిపోయే నదుల వలె, వారి నడక పసితనానికి తగినట్లుగా చూడముచ్చట గొలిపింది!

త్రోవలో విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల, అతిబల అనే విద్యలను బోధించాడు. ఆ విద్యల మహిమ వల్ల వారు మరింత తేజస్సుతో ప్రకాశించారు. ముని ఎన్నో పురాణ కథలు చెప్పాడు. రామలక్ష్మణులు అవి శ్రద్ధగా వింటూ కాలినడకన వెడుతున్నా ప్రయాణ బడలిక ఎరుగక ముందుకు సాగిపోయారు. తనను గురించిన కథలు వింటున్నా రాముడికి పూర్వస్మృతి కలుగలేదు. తాను భగవంతుడనని తెలుసుకోలేదు. సామాన్య రాజకుమారుడననే అనుకుంటూ అవన్నీ ఆలకించాడు.

చివరకు వారు విశ్వామిత్రుని తపోవనం ప్రవేశించారు. అప్పుడు విశ్వామిత్రుని శిష్యులు ఎదురు వచ్చి వారికి పూజలు చేశారు. చెట్లు ఆకులనే

దొన్నెలుగా చేసుకుని వారికి అంజలి ఘటించాయి. మృగాలు ఎదురు వచ్చి మర్యాదలు చేశాయి.

విశ్వామిత్రుడు యాగం ప్రారంభించాడు. అయితే, అంతలోనే యజ్ఞవేదిక నెత్తురు చుక్కలతో నిండిపోయింది. అది చూచి ఋత్విక్కులైన మునులు తమ చేతులలోని సమిధలు, యజ్ఞద్రవ్యాలు క్రింద పడవేశారు.

రాముడు ఇది చూచి ఆశ్చర్యచకితుడైనాడు. ఏమిటా ఈ వింత అని ఆకాశం వంక చూచాడు. అప్పుడతనికి పెద్ద పెద్ద గ్రద్దల రెక్కల తాకిడికి రెపరెపలాడే పతాకాలతో రాక్షసమూక వినువీధిలో కనిపించింది. ఆ రాక్షస సమూహానికి ఇద్దరు రాక్షసులు నాయకత్వం వహిస్తున్నారు.

వెంటనే రాముడు ఆ ఇరువురు రాక్షసులకూ బాణం గురిపెట్టాడు. గొప్ప వేగం గల వాయువ్యాస్త్రాన్ని వింట సంధించి, కొండవలె ఉన్న తాటక కొడుకు మారీచుని, పండుటాకును కూల్చినట్లు తృటిలో నేల కూల్చాడు!

అప్పుడు తాటక రెండవ కుమారుడైన సుబాహుడు తన మాయా జాలాన్ని ప్రదర్శిస్తూ విజృంభించాడు. అయితే రాముడు లెక్కపెట్టక మరొక బాణంతో వాడి దేహాన్ని ముక్కలు ముక్కలు చేశాడు. ఆ ఆశ్రమం ఆవల పక్షులకు ఆహారం అయ్యేటట్లు చేశాడు. తక్కిన రాక్షసులను రాముడు ఒక లెక్కలోకి తీసుకోలేదు – అవును. గరుత్మంతుడు మహా సర్పాలపైననే తన బలాన్ని ప్రదర్శిస్తాడు. కాని నీటి పాముల సంగతి పట్టించుకోడు.

ఆ విధంగా యజ్ఞాన్ని విఘ్నం చేస్తున్న రాక్షసులను, రాముడు సంహరించడం చూచి మునులు ఎంతో సంతోషించారు. విశ్వామిత్రుని యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తి అయింది. మహర్షి అపబృథస్నానం చేశాడు. తన పాదాలకు నమస్కరించిన రామలక్ష్మణులను దీవించి ప్రేమతో లేవనెత్తాడు.

ఆ సమయంలో మిథిలాపతి అయిన జనకుడు ఒక యజ్ఞం తలపెట్టి విశ్వామిత్రుడికి ఆహ్వానం పంపాడు. ఆ రాజు వద్ద గొప్ప శివధనస్సు ఉన్నట్లు రామలక్ష్మణులు విని ఉన్నారు. దానిని చూడాలని వారికి అభిలాష ఉన్నది. వారి కోరిక గ్రహించిన మహర్షి తనతోపాటు రామలక్ష్మణులను కూడా మిథిలానగరానికి తీసుకుని వెళ్ళాడు.

త్రోవలో చీకటి పడింది. వారు గౌతమముని ఆశ్రమంలో చెట్లు క్రింద ఆ రాత్రి బసచేశారు. గౌతమముని భార్య అహల్య – ఇంద్రుడికి క్షణకాలం భార్య అయి – భర్త శాపం వల్ల శిలగా పడి ఉన్న దక్కడ.

ఇప్పుడా అహల్య శ్రీరామచంద్రుని పాదధూళి సోకగానే – పాపాలన్నీ పోయి – పావని అయి తన నిజరూపం పొందింది.

ఆ విధంగా అహల్యా శాపవిమోచనం కావించి రాముడు లక్ష్మణునితో విశ్వామిత్రుని వెంట మిథిలకు వెళ్ళాడు.

మహర్షి రాక తెలిసి జనకమహారాజు  అర్థకామాలతో కూడి వున్న ధర్మంలా ప్రకాశించే మహర్షికి ఎదురు వచ్చి స్వాగత మర్యాదలు చేశాడు. గగనమండలం నుండి భూలోకానికి దిగివచ్చిన పునర్వసు దేవతల్లా ప్రకాశిస్తున్న రామలక్ష్మణులను చూచి మిథిలాపుర వాసులంతా మహదానందం పొందారు. రెప్పవాలిస్తే ఎక్కడ వ్యర్థమైపోతుందేమోనన్న భావంతో వారు కళ్ళార్పకుండా తదేకంగా రామలక్ష్మణుల వంక చూడసాగారు.

జనకమహారాజు యాగం పూర్తి అయిన పిమ్మట విశ్వామిత్రుడు శివధనుస్సును చూడాలని రామచంద్రుడు వేడుక పడుతున్నాడని ఆయనకు తెలియజేశాడు.

అప్పుడు జనకుడు 'అయ్యో! ఎవరూ వంచలేని విల్లు అది. ఈ రాముడు చూడబోతే బాలుడు. కుసుమ కోమలమైన శరీరం కలవాడు–' అని

అనుకున్నాడు. ఆ విల్లు వంచిన వారికి తన కుమార్తె సీతను ఇచ్చి పెండ్లి చేస్తానని తాను నిర్ణయం చేసినందుకు ఎంతో విచారపడ్డాడు.

విశ్వామిత్రుని జూచి "మహర్షీ, మదించిన పెద్ద ఏనుగు గూడా మోయలేని బరువును పిల్ల ఏనుగు మోయాలనుకోవడం వ్యర్థమే కదా! ఆ ఉద్దేశ్యంతోనే నేను శివధనువును రాముడికి చూపడానికి ఇష్టపడలేక పోతున్నాం. మహాబలాఢ్యులయిన రాజు లెందరో ఆ విల్లును ఎత్తలేక పరాభవం పొందారు. ఆ వింటి నారి వల్ల గాయపడనివారు లేరు. అంతా తమ అసమర్థతకు నిందించుకుంటూ వెళ్ళిపోయినవారే – మరి నేనిప్పుడు ఏం చేసేది?" అని దిగులుగా అన్నాడు.

అందుకు విశ్వామిత్రుడు "జనకమహారాజా ! ఈ రాముడి బలాన్ని గురించి ఎంత చెప్పినా తరగదు. అయినా మాటలతో ఏం పని? వజ్రాయుధం శక్తి ఎలాంటిదో పర్వతంపై ప్రయోగంచినప్పుడు తెలుస్తుంది. అలాగే ఈ ధాశరధి శక్తి ఈ ధనుస్సును ఎత్తడంలో నీకు తెలియగలదు" అని బదులు పలికాడు.

తనకు ఆప్తుడు, సర్వజ్ఞుడు అయిన విశ్వామిత్రుడు ఇలా చెప్పగా రాముని శక్తి యందు జనకుడికి నమ్మకం కలిగింది. పిమ్మట తేజోమయమైన ఇంద్రధనువును సృష్టించడానికై దేవేంద్రుడు మేఘాలను ఆజ్ఞాపించినట్లుగా, జనకుడు శివధనువును తెప్పించమని తన భటులను ఆజ్ఞాపించాడు.

పూర్వం శివుడు, యాగ మృగాన్ని వెంబడించే బాణాన్ని ఈ ధనుస్సు నుండే ప్రయోగించాడు. అయితే బహుకాలం నుండీ తనను ధరించే వారు ఎవరూ లేనందున ఆ విల్లు నిద్రిస్తున్న సర్పరాజులా ఉన్నది. చూచేవారికి మిక్కిలి భీతి గొలుపుతున్నది.

అనేక మంది భటులు పట్టి ప్రయత్నం మీద సభామండపంలోకి తీసుకుని వచ్చిన శివుని విల్లును శ్రీరామచంద్రుడు చూచాడు. అవలీలగా

దానిని పట్టుకున్నాడు. సభలో అందరి కళ్ళూ అతనిపైనే ఉన్నాయి. వారు నిశ్చేష్టులై ఆశ్చర్యంతో అతని వంక చూస్తున్నారు.

ఆ ధనుస్సు కొండంత బరువు ఉన్నప్పటికీ బాలరాముడు, మన్మథుడు పూల విల్లును వలె దానిని అల్లె త్రాటితో కూర్చాడు. ఎక్కుపెట్టాడు. అయితే రాముడు అలా వంచాడో లేదో, వెంటనే ఆ విల్లు ఫెళ ఫెళ విరిగి పోయింది. అప్పుడు పుట్టిన ధ్వని ఒక పెద్ద పిడుగు మ్రోతలా వినిపించింది. దిక్కులను పిక్కటిల్లజేసిన ఆ ధ్వని క్రోధఘూర్ణితలోచనుడైన పరశురాముడికి మరల క్షత్రియ కులం తల ఎత్తినట్లు తెలియజేసినదా అనిపించింది.

శివధనువును సునాయాసంగా విరచడం వల్ల రాముని బలం ఎంతటిదో తెలుసుకొని జనకుడు చాలా సంతోషించాడు. అయోనిజ, సాక్షాత్ లక్ష్మీదేవి వంటి సీతను, అగ్ని వంటి తేజశ్శాలి అగు విశ్వామిత్రుని ఎదుట శ్రీరామునికి చూపాడు.

తరువాత తన కుమార్తెను కోడలుగా స్వీకరించి తమ వంశాన్ని పావనం చేయవలసినదిగా కోరుతూ పురోహితుని ద్వారా దశరథ మహారాజుకు వర్తమానం పంపాడు.

అదే సమయంలో అక్కడ అయోధ్యలో దశరథుడు రాముడికి వివాహం చేస్తే బాగుండునని అనుకున్నాడు. అంతలోనే జనకుడు పంపిన పురోహితుడు ఆయన వద్దకు వచ్చి విషయం తెలియజేశాడు. దశరథు డా బ్రాహ్మణోత్తముని పూజించి జనకుని సందేశం విన్నాడు. తలచినంతనే తన మనోవాంఛ నెరవేరుతున్నందుకు చాలా సంతోషించాడు. అవును కల్పవృక్ష ఫలం తక్షణమే పరిపక్వమైనట్లు పుణ్యం చేసుకున్న వారి కోర్కెలు వెంటనే ఫలించడం సహజం.

తరువాత దశరథుడు తన పరివారంతో మిథిలా నగరానికి పయనమై నాడు. గొప్ప సైన్యంతో ఆ నగరం వెలుపల విడిది చేశాడు. ప్రియుడి వల్ల

కలిగే రతిశ్రమను స్త్రీ సంతోషంతో సహిస్తుంది. అలాగే కోసల దేశాధీశుని సైన్యం వల్ల కలిగిన శ్రమను మిథిలానగరం ఆనందంతో భరించింది.

వియ్యంకుడు వచ్చాడని జనకుడు విన్నాడు. సపరివారంగా ఎదురు వచ్చి సకల విధ గౌరవ లాంఛనాలతో స్వాగత మర్యాదలు జరిపాడు. కోసల మిథిలేశుల కలయిక ఇంద్రవరుణుల కలయిక వలె ఉన్నది.

పిమ్మట సీతారాముల కల్యాణం మహావైభవంగా జరిగింది. సీత చెల్లెలు ఊర్మిళకు లక్ష్మణునితో పెళ్ళి జరిగింది. జనకుని సోదరుడగు కుశధ్వజుని కుమార్తెలు మాళవి, శ్రుతకీర్తులను భరత, శత్రుఘ్నులు పరిణయమాడారు.

ఆ విధంగా దశరథమహారాజు తన నలుగురు కుమాళ్ళతోనూ, నలుగురు కోడళ్ళతోనూ బంధుమిత్ర పరివారంతోనూ మహోజ్వలంగా ప్రకాశించాడు. ఈ వివాహాల వల్ల ఉభయ వంశాలవారు చరితార్థులైనారు. ఆ వధూవరుల సంయోగం ప్రకృతి ప్రత్యయముల సంయోగంలా భాసించింది.

పిమ్మట దశరథుడు తన వారితో అయోధ్యకు ప్రయాణమైనాడు. త్రోవలో మూడు మజిలీల వరకూ జనకుడు వారిని సాగనంపడానికి వెంట వచ్చాడు. తరువాత వియ్యంకుని వీడ్కొలిపి దశరథుడు ప్రయాణం కొనసాగించాడు.

చాలా దూర ప్రయాణం అది. ఒక సమయంలో తీవ్రమయిన ఎదురు గాడ్పులు వీచాయి. ఒక సమయంలో నదులూ, వాగులూ పొంగి వచ్చాయి. ఇలా దశరథమహారాజు పరివారానికి చాలా ఇబ్బందులు కలిగాయి. తరవాత సూర్యుని చుట్టూ పెద్ద పరివేషం క్రమ్ముకున్నది.

గరుత్మంతుడు పడగను చీల్చగా, వలయాకారంలో చుట్టుకున్న పాము శరీరం లోపల జారి ఉన్న మణివలె దినమణి కనిపించాడు. గ్రద్దల రెక్కలు బూడిద రంగుగల ముంగురులు, సంధ్యాకాలపు మబ్బులు నెత్తురు తడిచిన చీరలు కాగా దిక్కులన్నీ బయటికి వచ్చిన స్త్రీల వలె చూడనలవి కాకుండా ఉన్నవి.

క్షత్రియ రక్తంతో పితృదేవతలను తృప్తి పరిచే గండ్రగొడ్డలి గల పరశు రాముని హెచ్చరిస్తున్నట్లుగా, నక్కలు సూర్యుడున్న దిక్కునకు తలలు ఎత్తి భయంకరంగా ఏడ్వసాగాయి.

ఇలా అపశకునాలు కనిపించడం చూచి దశరథమహారాజు పెద్దలను అడిగి కీడు తొలగిపోవడానికి, శుభములు చేకూరడానికి అవసరమగు శాంతులు చేయించాడు. చివరకు మేలు కలగగలదని పెద్దలు దశరథ మహారాజుకు ధైర్యం చెప్పారు.

అంతట హఠాత్తుగా ఒక మహా తేజస్సు వారి ముందు ప్రత్యక్షమైంది. దశరథమహారాజు సైనికుల కళ్ళు మూతలు పడ్డాయి. ఎంతో సేపటికి గాని వారు కళ్ళు తెరవలేకపోయారు. అప్పుడు తమ ముందు నిలచినది ఒక మహాపురుషుడని వారు చూడగలిగారు.

ఆయన ధరించిన జందెంలో తండ్రి పోలిక కనిపిస్తున్నది. ఆయన పట్టుకున్న పొడుగాటి ధనుస్సులో తల్లి చందం గోచరిస్తున్నది. ఆయన వెన్నెల వెలుగులతో నిండిన చంద్రునిలా, పాములతో గూడిన మంచి గంధపు చెట్టులా కనిపిస్తున్నాడు. తండ్రి ఆజ్ఞ ప్రకారం, గజగజ వణుకుతున్న తల్లి శిరస్సు నరికిన మహా సాహసి అతను. భూమండలం అంతా గెలిచిన వాడతను. ఇరవైఒక్క సార్లు భూమండలం అంతా వెదకి వెదకి, క్షత్రియుడనేవాడు లేకుండా చంపివేశాడతను. ఆ లెక్క తెలియడం కోసమే అన్నట్లు కుడిచెవికి పూసల పేరు తగిలించుకున్నాడు. తన తండ్రిని ఒక క్షత్రియుడు చంపాడన్న కోపంతో అతను క్షత్రియ కులం మీదనే పగబట్టాడు. క్షత్రియుడనేవాడు లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ బూనాడు. అతను పరశురాముడు! మహా తపస్వి. మహా తేజస్వి.

అతన్ని చూడగానే దశరథమహారాజుకు ఎక్కడలేని భయమూ, దిగులూ పుట్టుకొచ్చాయి. అవును, తన కుమాళ్ళు పసివాళ్ళు, తన కుమారుడు రాముడు, ఇతను పరశురాముడు.

పరశురాముని అర్ఘ్యపాద్యాదులతో పూజించడానికి దశరథుడు సిద్ధమైనాడు. "స్వామీ! ఇదిగో అర్ఘ్యం" అని అంటున్నాడు దశరథుడు.

అయితే, భార్గవ రాముడు ఆ వృద్ధ రాజువంక చూడనే లేదు. ఆయన మాటలు వినిపించుకోనేలేదు. క్షత్రియుల యందుగల క్రోధంతో అగ్ని జ్వాలలు ఎగజిమ్మే తన చూపును, రఘురాముని వైపు ప్రసరింప చేశాడు. ఆ పరశు రాముడు పిడికిలితో విల్లు పట్టుకున్నాడు. వ్రేళ్ళ సందున బాణం ఉన్నది. యుద్ధాన్ని కాంక్షిస్తున్నాడు.

తన ఎదుట నిర్భయంగా నిలచి ఉన్న రఘురాముని చూచి భార్గవరాముడు ఇలా పలికాడు :

"ఓయీ! నాకు అపకారం చేసిన క్షత్రియులపై శత్రుత్వం వహించాను. అందరినీ వధించాను. చాలావరకు శాంతించాను. కానీ ఇప్పుడు నీ పరాక్రమం గురించి చాలా చాలా విన్నాను. కనుకనే సుప్తభుజంగాన్ని కర్రతో మోదితే ఎలా అవుతుందో అలా రోషకషాయితలోచనుడ నయ్యాను. ఇంతవరకూ ఏ రాజూ వంచని జనకుని ఇంటిలోని శివ ధనువును నీవు విరిచేశావని విన్నాను. ఇంతవరకూ లోకంలో రాముడంటే నేనే. ఆ పేరు మరెవరికీ వర్తించదు. మరి, ఇప్పుడు నీవు మరొక రాముడవు బయలుదేరావు. అందువల్ల నా పేరు ప్రతిష్ఠలకు భంగం కలిగింది. నాకు సిగ్గుగా ఉన్నది.

"క్రౌంచ పర్వత పానమున మొక్కవోని అస్త్రం ధరించి ఉన్న నాకు ఇద్దరే ఇద్దరు శత్రువులుగా కనిపించారు. వారిరువురూ సమానమైన అపరాధమే చేశారు నాకు! ఈ ఇద్దరిలో మొదటివాడు కార్తవీర్యార్జునుడు, అతను మా గోవును అపహరించి మా క్రోధానికి గురి అయినాడు. మరి రెండవవాడెవడో తెలుసా ? నీవే! నీవు మా కీర్తి హరించడానికి సిద్ధపడినావు. క్షత్రియులందరినీ సంహరించిన పరాక్రమం నాది. అయినా జయించనిదే నా పరాక్రమం పరిపూర్ణం కాదు.

"ఓయీ, బాలకా! నీవు తుంచిన శివధనువు ఉన్నదే, అది ఇదివరకే విష్ణుతేజం వల్ల బలహీనమై ఉన్నది. నదీప్రవాహ వేగానికి మూలంలో ఉన్న వ్రేళ్ళు పట్టు తప్పిపోయిన ఒడ్డుమీద వృక్షాన్ని, ఆఖరుకు మందమారుతం కూడా కూల్చివేయగలదు. అలాగే బలం కోలుపోయిన శివుని విల్లు విరవడం గొప్ప కాదు. ఇదిగో – నా ధనుస్సు. దీనిని నారితో ఎక్కుపెట్టు బాణం తొడిగి దీనిని వంచు. నీ ప్రతాపం కనిపిస్తుంది! నా విల్లు నీవు వంచగలిగితే, నీవు నాతో సమానమైన పరాక్రమం కలవాడవని ఎంచుకుంటాను. అంతేకాదు. నేను నీతో ఓడిపోయానని ఒప్పుకుంటాను. ఓయీ! నా గండ్రగొడ్డలి చూచి భయపడుతున్నావా ఏం? కానివ్వు. ఇదిగో విల్లు!"

భార్గవరాముడు ఇలా భయంకరంగా పలుకగానే రఘురాముడు చిరునవ్వు నవ్వాడు! అతని క్రింద పెదవి కదిలాడింది. అదే అతనికి సమాధానంగా భావించాడు.

వెనుకటి అవతారంలో తాను ధరించిన విల్లు ఇప్పుడు తిరిగి చేత బట్టడం చేత శ్రీరాముడు మరింత శోభతో వెలుగొందాడు! సహజంగానే కన్నుల పండుగ చేసే తొలకరి మబ్బు, ఇంద్రధనుస్సుతో కూడినప్పుడు మరింత శోభాయమానంగా ఉంటుంది కదా!

దాశరథి, జమదగ్ని వైష్ణవ ధనువును చేతబట్టి ఒక కొన నేలమీద ఆన్చాడు. రెండవ కొనకు నారి తగిలించాడు. కానీ అంతలోనే కేవలం పొగ మాత్రమే మిగిలిన అగ్ని వలె పరశురాముడు నిస్తేజుడైనాడు.

ఒకరికొకరు ఎదురుగా నిలబడి ఉన్న రఘురాముడు, భార్గవ రాముడు, పూర్ణిమనాటి సాయంకాలం పరస్పరాభి ముఖులై ఉన్న చంద్ర సూర్యుల వలె కనిపించారు!

కుమారస్వామిని బోలిన శ్రీరాముడు ధనుస్సున తొడిగిన బాణాన్ని, పరశురాముని కూడా ఒకసారి చూచి ప్రేమతో ఇలా పలికాడు:

“అయ్యా! నీవు నన్ను ఎదిరించావు, అయినప్పటికీ నీవు బ్రాహ్మణుడవు కావడం వల్ల నిన్ను నొప్పించదలచలేదు. మరి నేను సంధించిన ఈ బాణంతో నీ మగతనాన్ని అరికట్టమంటావో లేక నీవు ఆర్థించిన పుణ్యాన్ని అరికట్టమంటావో చెప్పు ?”

రఘురాముడు ఇలా ప్రశ్నించగా తేజోవిహీనుడూ, గర్వం కోలుపోయిన వాడు అయిన పరశురాముడు “ఓ దేవా! నీవు భూలోకంలో అవతరించిన శ్రీమహావిష్ణువవని నాకు తెలుసు! నీ వైష్ణవ తేజస్సును కళ్ళారా దర్శించాలన్న అభిలాషతో ఇలా చేశాను. నీకు ఆగ్రహం తెప్పించాను. నా తండ్రికి శత్రువులైన వారిని నా క్రోధాగ్నిలో భస్మం చేశాను. సప్తసాగర పరీవృత్తమైన వసుంధరను నా స్వాధీనం చేసుకున్నాను. అలాంటి నేను జగన్నాథుడవైన నీ చేతిలో ఓడిపోవడం వల్ల నా కీర్తి ఇనుమడించింది, కాని తరగదు! కాబట్టి ఓ భగవంతుడా! ఇక నేను శాంతచిత్తంతో తీర్థయాత్రలు సేవిస్తూ గడుపుతాను. అనుగ్రహించు” అని బదులు చెప్పాడు.

అప్పుడు శ్రీరాముడు పరశురామునిపై దయతలచి ఆయన కోరినట్లే చేశాడు. తూర్పు దిక్కునకు తిరిగి బాణం ప్రయోగించాడు. ఆ బాణం జమదగ్ని, స్వర్గమార్గానికి ప్రతిబంధకమైంది. అంతట రాఘవుడు సవినయంగా “స్వామీ! నన్ను క్షమించవలసినది!” అని మహాతపస్వి అయిన పరశురాముని పాదాలపై వ్రాలాడు.

శత్రువులను జయించిన శౌర్యవంతులు ఆ శత్రువులకే నమస్కరించడం శ్లాఘనీయం కదా!

అప్పుడు పరశురాముడు శ్రీరామునితో "రామా! తల్లి నుండి నాకు రజోగుణం సంక్రమించింది, ఆ రజోగుణాన్ని విసర్జించడానికి, తండ్రి తాలూకు శాంత గుణాన్ని అలవరచుకోడానికి ఇప్పుడు నీవే కారణమైనావు, నీ నిగ్రహం నాకు అనుగ్రహమే అయింది. ఇక నేను వెళ్ళిపోతాను, నీవు దేవతా కార్యాన్ని సాధించనున్నావు. నీకు జయమగు గాక!" అని చెప్పాడు.

పిమ్మట భార్గవరాముడు అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిపోగానే, దశరథుడు తన కుమారుని ప్రేమతో కౌగలించుకున్నాడు. ఆయన ఆనందానికి మేర లేదు. తన పుత్రుడు చనిపోయి మరల జన్మించాడని భావించుకున్నాడు.

తరువాత మరి కొన్ని రోజులు ప్రయాణం చేసి వారు అయోధ్యా నగరం చేరుకున్నారు.

## 12

**కొ**న్ని సంవత్సరాలు గడచిపోయాయి. సమస్త రాజభోగాలూ అనుభవించిన దశరథమహారాజు చాలా వృద్ధుడైనాడు. ప్రాతఃకాల మందలి దీపం వలె ఆయన శక్తి సామర్థ్యాలు, తేజస్సూ అంతరించి పోయినవి. తల ముగ్గు బుట్ట అయింది. ఆయన చెవి వద్ద నెరసిన వెంట్రుకలు "రాముడికి రాజ్య పట్టాభిషేకం చెయ్యి" అని కైకేయికి తెలియకుండా రహస్యంగా చెప్పినట్లయింది.

వెంటనే దశరథుడు రాముడికి రాజ్యం అప్పగించడానికి నిర్ణయించాడు. ఆ వార్త అయోధ్యావాసులందరికీ మిక్కిలి సంతోషం కలిగించింది.

అయితే క్రూరురాలైన కైకకు దుర్బుద్ధి పుట్టింది. రాముడి పట్టాభిషేకానికి అంతా సిద్ధమైన తరువాత ఆమె అలిగి కూర్చున్నది. వృద్ధరాజు ఆమెను అనునయించడానికి ప్రయత్నించాడు. అయితే, వాన కురిసినప్పుడు పుట్టలో

నుండి రెండు పాములు బయటికి వచ్చినట్లుగా, ఆమె కోరరాని రెండు కోరికలు బయటపెట్టింది. ఒకటి – శ్రీరాముని పధ్నాలుగేండ్లు అరణ్యవాసానికి పంపడం, రెండవది – తన కుమారుడైన భరతునికి పట్టాభిషేకం చేయడం. అయితే, ఈ రెండవ కోరికవల్ల తనకు వైధవ్యం మాత్రమే ఫలితం అవుతుందని ఆమెకు తెలియదు!

మొదట తండ్రి అనుగ్రహించిన రాజ్యాన్ని రాముడు మిక్కిలి దుఃఖంతో అంగీకరించాడు. తరవాత వనాలకు వెళ్ళమని తండ్రి ఆజ్ఞాపించగా, ఆ ఆజ్ఞను మహాసంతోషంతో స్వీకరించాడు.

పట్టాభిషేకానికి ఉపయుక్తమైన పట్టు వస్త్రాలు, దివ్యాభరణాలు ధరించిన రాముడు, వనవాసానికి అనుకూలమైన నార చీరెలు కట్టుకున్నాడు. అయినప్పటికీ ఆయన ముఖారవిందం సంతోషంతో కళకళలాడుతూనే ఉన్నది. అది చూచి ప్రజలంతా విస్మయం చెందారు.

రాముడు పితృవాక్య పరిపాలనార్థం సీతా లక్ష్మణ సహితుడై వనాలకు బయలుదేరాడు. దండకారణ్యానికి వెళ్ళిపోయాడు.

రాముని ఎడబాటు సహించలేకపోయాడు దశరథమహారాజు. అంతులేని దుఃఖంలో మునిగిపోయాడు. అయితే, పూర్వం ముని వలన తనకు సంభవించిన శాపాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. పుత్రవియోగంతో దేహత్యాగం చేయడమే తనకు ప్రాయశ్చిత్తమని తెలుసుకున్నాడు. రామా, రామా అని పలవరిస్తూనే ప్రాణాలు విడిచాడా వృద్ధమహారాజు.

సీతా రామ లక్ష్మణులు ఇప్పుడు అయోధ్యలో లేరు. దశరథమహారాజు స్వర్గం చేరుకున్నాడు. అందువల్ల రాజ్యం శత్రుపరమయ్యేటట్లు కనిపించింది. అప్పుడు ప్రజలు, మేనమామ ఊరిలో ఉన్న భరతునికి కబురు పంపి అతన్ని రప్పించారు. తమ కష్టం చెప్పుకుని కన్నీరు కార్చారు.

భరతుడు అయోధ్యకు వచ్చి తండ్రి మరణానికి కారణం తెలుసు కున్నాడు. తల్లి కైకేయిపై అతనికి ఎక్కడలేని అయిష్టత ఏర్పడింది. అలాగే రాజ్య సంపదల పైన కూడా విముఖత్వం ఏర్పడింది. వెంటనే పరివారాన్ని వెంటపెట్టుకుని అన్న రాముని చూడడానికై అడవులకు వెళ్ళాడు. అడవి జనులు మార్గం చూపగా సీతా రామ లక్ష్మణులున్న చిత్రకూటమందలి ఆశ్రమం చేరుకున్నాడు. రాజభోగాలనుభవించ వలసిన రామచంద్రమూర్తి అలా అడవిలో ఉండవలసి వచ్చినందుకు దుఃఖించాడు.

పిమ్మట రాముడికి తమ తండ్రి మరణాన్ని గురించి, తాను రాజ్య పాలనను స్వీకరించకపోవడాన్ని గురించి ఎరుకపరిచాడు భరతుడు. నీ రాజ్యాన్ని నీవే స్వీకరించమని ప్రాధేయపడ్డాడు. అయితే రాముడు అందుకు అంగీకరించలేదు. కానీ తాను రాజ్యభారం వహించడం తగదని, అలా చేయడం అన్నకు వివాహం కాకముందే తమ్ముడు పెండ్లాడడం లాంటిదని భరతుడు స్పష్టం చేశాడు.

ఎన్ని చెప్పినా, తండ్రి ఆజ్ఞను అతిక్రమించి రాజ్యం చేపట్టజాలనని రామభద్రుడు దృఢసంకల్పుడై చెప్పడం వల్ల – కనీసం పాదుకలనైనా ఇవ్వవలసిందనీ, వాటిని సింహాసనంపై ఉంచి తాను నిమిత్తమాత్రం రాజ్యపాలన సాగిస్తానని భరతుడు ప్రార్థించాడు. తమ్ముని ప్రార్థన మన్నించి రాముడు తన పాదుకలను ఇచ్చాడు.

భరతు డా పాదుకలతో మరల అయోధ్యకు వెళ్ళక, నందిగ్రామంలోనే నివసిస్తూ రాజ్యపాలన చేయసాగాడు. అయితే అతను రాజ్య సంపదను రక్షిస్తూ వచ్చాడే కాని, ఎప్పుడూ అనుభవించలేదు! ఆ విధంగా పవిత్రుడు, పరమ భక్తుడు అయిన భరతుడు రాజ్యభోగాలేవీ ఆశించక, తల్లి కైకేయి చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం కావించాడు.

ఇక్కడ రాముడు సీతతోను, లక్ష్మణునితోను తాపసి వలె వనాలలో సంచరిస్తూ, కందమూలాదులు భక్షిస్తూ, యౌవనంలో ఉండి కూడా తన పూర్వీకులగు ఇక్ష్వాకు రాజులను ఆదర్శంగా తీసుకుని కఠిన వ్రతం నెరపుతూ వచ్చాడు.

ఇలా ఉండగా ఒకనాడు రాముడు ఒక చెట్టు నీడన సీతాదేవి తొడపై తల పెట్టుకుని నిద్రించాడు. ఆ తరుణంలో ఇంద్రుని కుమారుడగు ఒక కాకి అక్కడికి వచ్చింది. రాముడి నఖక్షత చిహ్నాలు గల సీతాదేవి స్తనాలను తన గోళ్ళతో రక్కి పెట్టింది! ఆ బాద భరించలేక జానకి రాముని నిద్ర లేపింది. రాముడు లేచి కాకాసురుడు చేసిన పని చూశాడు. వెంటనే క్రోధారుణ నేత్రుడైనాడు. అక్కడున్న ఒక గడ్డిపరకను మంత్రించి ఆ వాయసంపై ప్రయోగించాడు.

అప్పుడా కాకి రామబాణం నుండి ఏ విధంగానూ తప్పించుకోలేక పోయింది. తుదకు తన కన్ను ఒకటి ఆ అస్త్రానికి అర్పించి, రాముని శరణు వేడుకుని ప్రాణాలు కాపాడుకున్నది.

తరువాత రాముడు, అయోధ్యకు సమీపంగా ఉన్న చిత్రకూటంలో ఉంటే భరతుడు మరల రావచ్చునని తలచి ఆ చోటు విడిచి పెట్టాడు. సీతతోను, లక్ష్మణునితోను దక్షిణ దిశకు వెళ్ళాడు. అది వర్షాకాలం. మునుల ఆశ్రమాలలో ఆతిథ్యాలు స్వీకరిస్తూ రాముడు దక్షిణాటడవులలో సంచారం సాగించాడు. కైకేయి అడ్డుపడినా రాముని విడిచి పెట్టని కోసల రాజ్యలక్ష్మివలె సీతాదేవి శ్రీరాముని అనుసరించింది.

వారు అత్రి మహాముని ఆశ్రమం చేరుకున్నారు. అక్కడ అనసూయాదేవి పుణ్యగంధాన్ని సీతాదేవికి ఇచ్చింది. ఆ గంధం జానకి పూసుకోగా, తుమ్మెదలు కూడా పూలు విడిచి సీతను వెంబడించాయి. అక్కడ నుండి సీతా రామ

లక్ష్మణులు అడవిలో కొంత దూరం ప్రయాణం చేశారు. అప్పుడు చంద్రుని మార్గాన్ని రాహువు అడ్డగించినట్లుగా సంధ్యాకాలపు మేఘచ్ఛాయ వంటి విరాధుడనే రాక్షసుడు రాముని అడ్డగించాడు.

ఆ రక్కసుడు, శ్రావణ భాద్రపద మాసాల నడుమ గల వృష్టిని అవగ్రహణం హరించినట్లుగా రామలక్ష్మణుల మధ్యగల జానకిని హరించాడు. అప్పుడు మహావీరులగు రామ లక్ష్మణులు వెంటనే ఆ రాక్షసుని సంహరించారు. వాడి కళేబరం ఇవతల ఉంటే మునుల ఆశ్రమవాటికలు అపవిత్ర మవుతాయని తలచి వారా శవాన్ని ఒక గోతిలో త్రవ్వి పూడ్చి పెట్టారు.

అంతట రాఘవుడు అగస్త్యమహర్షి ఆదేశానుసారం పంచవటిలో నివాసం ఏర్పరచుకున్నాడు. వారు అక్కడ ఉంటూ ఉండగా రావణుని చెల్లెలు శూర్పణఖ అక్కడికి వచ్చింది. ఎండవేడికి తాళలేని ఆడుపాము మంచి గంధపు చెట్టు చెంత చేరినట్లు, మదనబాధ ఓర్వలేక ఆమె రాముని చేర వచ్చింది.

మదవతి అగు శూర్పణఖ సిగ్గు, బిడియం లేక సీత ఎదుటనే రామునితో సరసాలు ప్రారంభించింది.

తనంతట తానే కులగోత్రాలు తెలుపుకొని తన కోరిక తీర్చమని రాముని వేడింది.

అయితే ఏకపత్నీ వ్రతుడగు రాముడు ఆమెను నిరాకరించాడు.

"అమ్మాయీ! నాకు భార్య ఉన్నది. కనుక నీ కోరిక తీర్చలేను. అదిగో నా తమ్ముడు లక్ష్మణుడు, అతను ఒంటరిగా ఉన్నాడు. అతని వద్దకు వెళ్ళు–" అని పలికాడు రాముడు.

శూర్పణఖ లక్ష్మణుని వద్దకు పోయి తన అభిమతం తీర్చమన్నది. అయితే, ముందుగా తన అన్నగారిని వరించడానికి వెళ్ళావని సాకు చెప్పి సౌమిత్రి కూడా ఆమెను కాదన్నాడు. అప్పుడు శూర్పణఖ రాముడి వద్దకు

వచ్చింది.. అలా ఆమె ఇరుదరుల మధ్య కొట్టుకుంటున్న నదీ ప్రవాహంలా ఆ అన్నదమ్ముల మధ్య విసుగు పుట్టేదాకా తిరిగింది.

శూర్పణఖ అవస్థ చూచి జానకి నవ్వింది. క్షణంసేపు సౌమ్యురాలుగా వున్న ఆ రక్కసి, సీత పరిహసించడంతో చంద్రోదయ కాలమందలి సముద్రంలా క్షోభించి పోయింది.

"ఈ పరిహాసానికి ప్రతిఫలం ఇప్పుడే పొందుతావులే. ఆడు లేడి ఆడు పులిని అవమానించినట్లు నన్నే అవమానిస్తావుటే మానవాంగనా!" అని రోషంతో పలికింది.

ఇలా పలికి శూర్పణఖ రాముడి ఒడిలో ఒదిగివున్న సీతను అనేక విధాల బెదరిస్తూ భయంకరమైన తన రాక్షసి రూపం ధరించింది.

మొదట తియ్య తియ్యగా మాట్లాడిన ఆ అంగన ఇప్పుడు నక్కవలె అరుస్తూ ఉండడం చూచి లక్ష్మణుడు అది మాయావి అని గ్రహించాడు. వెంటనే తన ఒర నుండి కత్తి తీశాడు. శూర్పణఖ ముక్కు, చెవులు కోశాడు. అసలే భయంకరంగా ఉన్న ఆ రక్కసి ఇప్పుడు మరీ వికృత రూపంలో చూడ భీతి గొలిపింది.

వెంటనే అది ఆకాశంలోకి ఎగసింది. వంకర గోళ్లు, వెదురుగడ కనుపుల వంటి కనుపులు గల వ్రేళ్ళు చాచి రామ లక్ష్మణులను భయపెట్టింది. రివ్వున అక్కడ నుంచి జనస్థానానికి వెళ్ళింది. ఖరాది రాక్షసులకు సంగతంతా చెప్పింది.

"రాముడనేవాడు రాక్షస కులానికే తీరని అవమానం చేశాడు!" అని తెలియజేసింది.

అది విని ఖరాదులు ఉగ్రులైనారు. ముక్కు, చెవులు తెగిన శూర్పణఖను ముందుంచుకుని అపారమైన సైన్యంతో రాముడిపై దండెత్తి వచ్చారు.

రకరకాల ఆయుధాలు ధరించి మదోన్మత్తులై తన మీదికి వచ్చిన రాక్షస మూకను చూచాడు రాఘవుడు. లక్ష్మణుని సీతకు రక్షణగా ఉంచి తాను ధనుస్సు చేత బట్టాడు. రాక్షస సైన్యాన్ని ఎదిరించాడు.

అప్పుడు రాక్షసులకూ, రాముడికీ భయంకరమైన యుద్ధం జరిగింది. రాముడు ఒక్కడే వేలాది రక్కసులను కూల్చివేశాడు. వేలమంది రాములు తమతో యుద్ధం చేస్తున్నట్టు కనిపించింది రాక్షసులకు.

మొదట దూషణుడనేవాడు రాముని ఎదుర్కొన్నాడు. అయితే దాశరథి తృటికాలంలో దూషణుని, తరవాత ఖరుని, త్రిశిరుని, వారితో ఉన్న రాక్షస సైన్యాన్ని సంహరించాడు. ఒకేసారి వేలకొలది బాణాలు రాముడి ధనస్సు నుండి వెలువడుతున్నట్లు కనిపించాయి. రామబాణాలు రాక్షసుల ప్రాణాలను త్రాగివేయగా, వారి రక్తాన్ని పక్షులు త్రాగివేశాయి. అంతు లేకుండా రాక్షసుల తలలు పండ్ల వలె నేల రాలాయి. ఆ విధంగా రాక్షససేన నంతటినీ రాఘవుడు హతమార్చాడు. ఈ వార్త రావణాసురుడికి తెలియ జేయటానికో అన్నట్లు ఒక్క శూర్పణఖ మాత్రమే మిగిలింది.

లంకేశ్వరుడు తన చెల్లెలికి జరిగిన అవమానాన్ని గురించి, తన ఆప్తులైన ఖరాదుల చావును గురించి విన్నాడు. తన పది తలల మీద రాముడనేవాడు పాదం మోపాడని భావించుకున్నాడు. మారీచుడు రావణుని ఆజ్ఞ మీరలేక మాయలేడి రూపంలో పంచవటికి వెళ్ళాడు. రామ లక్ష్మణులను మోసగించాడు. ఆ సమయం కనిపెట్టి రావణుడు సీతను దొంగిలించుకుని పోయాడు.

జానకిని రావణుడు ఎత్తుకొని పోతూ ఉండగా త్రోవలో జటాయువు అనే పక్షరాజు కొద్దిసేపు అడ్డగించాడు. కాని, ఆమెను కాపాడలేకపోయాడు.

తరువాత రామ లక్ష్మణులు జానకిని వెదకుతూ వచ్చారు. ఒక చోట రావణుని వల్ల రెక్కలు తెగి పడి ఉన్న జటాయువును చూచారు. ఆ పక్షిరాజు అప్పటికి కొన ఊపిరితో కొట్టుకుంటున్నాడు. సీతను రావణుడు అపహరించు కుని పోయాడన్న వార్త రాముడికి చెప్పి ప్రాణాలు విడిచాడు. ఆ విధంగా అతను దశరథమహారాజుతో తనకు గల ప్రాణ మైత్రిని పురస్కరించుకొని మహోపకారం చేశాడు. ఋణం తీర్చుకున్నాడు. జటాయువు మరణించినప్పుడు రామ లక్ష్మణులు తమ తండ్రి దశరథమహారాజు అప్పుడే మరణించినట్లు భావించుకుని అమితంగా దుఃఖించారు. తండ్రికి చేసినట్లు అతనికి అగ్ని సంస్కారాలు నిర్వర్తించి అంత్యక్రియలు జరిపారు.

తరువాత కబంధుడనే రాక్షసుడు రామ లక్ష్మణులను ఎదిరించి వారి చేతుల్లో నిహతుడైనాడు. ఆ రాక్షసుడు ఆ విధంగా శాపవిముక్తుడై దివ్యరూపం పొందాడు. అతను బోధించిన ప్రకారం శ్రీరాముడు, తన వలెనే భార్యా వియోగంలో కుమిలిపోతున్న వానరరాజు సుగ్రీవుని కలుసుకుని అతనితో స్నేహం చేశాడు.

సుగ్రీవుని అన్న అగు వాలిని సంహరించి బహుకాలంగా రాజ్యపదవిని కోరుతున్న సుగ్రీవునకు వానరరాజ్యం కట్టబెట్టాడు రాముడు. సుగ్రీవుడు అందుకు కృతజ్ఞతా సూచకంగా తన వానర సైన్యాన్ని నలుదిక్కులకూ పంపి సీత ఎక్కడున్నదీ వెదికించాడు.

వానరులు అన్ని దిక్కులకూ వెళ్ళి సీత కోసం అన్వేషణ సాగించారు. తుదకు వానరులలో ఒకడైన హనుమంతుడు తన వారితో సీతను వెదకుతూ సంపాతి వలన జానకి జాడ తెలుసుకున్నాడు. సంసార సాగరాన్ని తరించే విరాగి వలె దక్షిణ సముద్రాన్ని దాటి వెళ్ళాడు.

ఆ విధంగా హనుమంతుడు సముద్రం ఆవలి గట్టున లంకాపట్టణం చేరుకున్నాడు. జానకి కోసం లంకంతా గాలించాడు. విషలతల మధ్య

మహౌషధి ఉన్నట్లు, అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య ఉన్న సీతాదేవిని చూచాడు! ఆనవాలుగా రాఘవుడు ఇచ్చిన అంగుళీయకాన్ని ఆ దేవికి సమర్పించాడు. రాముని సందేశం ఆ తల్లికి వినిపించాడు. ఆమె మనస్సుకు ఆనందం కలిగించాడు.

తరువాత ఆంజనేయుడు సీతాదేవి వద్ద సెలవు పుచ్చుకుని, రాక్షసులకు బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నవాడై ప్రళయకాల రుద్రుని వలె విజృంభించాడు. ఒక్క క్షణం సేపు శత్రువులకు కట్టుబడి, వెంటనే బంధవిముక్తుడై లంకా పట్టణాన్ని కాల్చివేశాడు. ఆ తరువాత రాముని చెంతకు మరలి వచ్చి సీతాదేవిని చూచి వచ్చానని విన్నవించాడు. గుర్తుగా జానకి ఇచ్చిన చూడామణిని రాఘవునకు సమర్పించాడు. సీత హృదయం వలెనే నిర్మల కాంతులు వెదజల్లుతున్న ఆ మణిని చూచి రామచంద్రుడు పొంగి పోయాడు. ఆ మణిని తన గుండెలపై చేర్చుకుని, తన ప్రియురాలిని కౌగిలించు కున్నంత ఆనందం పొందాడు.

అర్థాంగి వార్త వినగానే రాముడికి ఆమెను ఎప్పుడెప్పుడు కలుసు కుందామా అన్న ఉత్సుకత కలిగింది. ఆ ఔత్సుక్యంలో ఆయనకు మహా సముద్రం చుట్టుకుని ఉన్న లంకా దుర్గం ఒక చిన్న కందకంలా తోచింది.

అంతట రామభద్రుడు అంతులేని వానర సైన్యంతో రావణునిపై దండెత్తాడు. ఆ వానరులు మహావీరులు. భూమి మీదనే కాక ఆకాశంలో కూడా సంచరించగలవారు.

రాముడు వానరసేనతో దక్షిణ సముద్రతీరం చేరుకున్నాడు. అప్పుడు రావణుని తమ్ముడు విభీషణుడు, అన్న వలన అవమానం పొంది అక్కడికి వచ్చాడు. రాముని శరణు వేడుకున్నాడు. లంకారాజ్యానికి పట్టం కడతానని రాముడు విభీషణునకు మాట ఇచ్చాడు.

పిమ్మట రాముడు వానరులచే సముద్రంపై సేతువు కట్టించాడు. ఆ వారధి, విష్ణుమూర్తి యోగనిద్రలో ఉన్నప్పుడు పాతాళం నుండి పైకి వచ్చిన ఆదిశేషుని శిరస్సు వలె ఉన్నది. రాముడు వానరసేనతో వారధి మీదుగా సముద్రం దాటాడు. పసుపుపచ్చని రూపాలు గల వానరమూక లంకాపట్టణాన్ని చుట్టుముట్టింది. అప్పుడా లంకానగరం చుట్టూ మరొక బంగారు ప్రాకారం ఏర్పడినట్లు కనిపించింది.

అంతట వానర సైన్యాలకూ, రాక్షస సేనలకూ భయంకరంగా యుద్ధం మొదలైంది. ఒకవైపు వారు రాముని జయం కోరుతూ నినాదాలు చేయగా, మరొకవైపు వారు రావణుని విజయం కాంక్షిస్తూ నినాదాలు ఇచ్చారు. ఆ జయ జయ ధ్వానాలతో దిక్కులు మారుమ్రోగాయి. ఆ మహా యుద్ధంలో రాక్షసుల బరిసెలు వానరుల వృక్షాలవల్ల తునాతునకలైనాయి. దానవుల ఇనుప గుదియలు, కపులు ప్రయోగించిన పెద్ద పెద్ద కొండ రాళ్ళతో పొడి పొడి అయినాయి. వానరుల గోళ్ళు, పిడికిడి పోట్లు గొప్ప గొప్ప ఆయుధాల కంటె అధిక శక్తివంతమై రాక్షసుల ప్రాణాలు హరించినవి. కపులు కొండలతో మదగజాలను కూల్చి వేశారు.

ఆ యుద్ధంలో రాముడి శిరస్సు తెగిపడినట్లు చూచి సీతాదేవీ తల్లడిల్లి పోయింది. అయితే అది రాక్షసమాయ అని చెప్పి త్రిజట ఓదార్చింది.

భర్త జీవించే ఉన్నాడు కదా అని జానకి దుఃఖం విడనాడింది. కానీ, రాఘవుడు గతించాడనుకున్నప్పుడు తాను బ్రతికే ఉన్నాను కదా అని సిగ్గుపడింది.

యుద్ధంలో ఇంద్రజిత్తు నాగాస్త్రం ప్రయోగించి రామ లక్ష్మణులను కట్టివేశాడు. అప్పుడు గరుత్మంతుడు వచ్చి నాగపాశాలను త్రెంచివేశాడు. రామ లక్ష్మణులు క్షణకాలం అలా కష్టం అనుభవించినప్పటికీ అది వారికొక స్వప్నంలా తోచింది!

తరువాత రావణుడు గొప్ప శక్తిని ప్రయోగించగా అది లక్ష్మణుని గుండెల్లో చొచ్చుకొని పోయింది. అది చూచి రాముడు, తన హృదయం ప్రయ్యలైనట్లు భాధపడ్డాడు. అయతే తక్షణమే హనుమంతుడు వెళ్ళి దివ్యౌషధం తీసుకుని వచ్చి లక్ష్మణుని బాధా విముక్తుని చేశాడు. అప్పుడు సౌమిత్రి యుద్ధరంగంలో శత్రువులపై దారుణమైన అస్త్రాలు ప్రయోగించాడు. రాక్షస స్త్రీలకు పతి వియోగ దుఃఖాన్ని కలిగించాడు.

మేఘగర్జనాన్ని ఇంద్రధనుస్సులా, లక్ష్మణుడు మేఘనాధుని సింహ గర్జనాన్ని, ఇంద్రచాపం వంటి కాంతిగల అతని ధనుస్సును హరించి వేశాడు.

సుగ్రీవుని వల్ల కుంభకర్ణుడు తన చెల్లెలు శూర్పణఖ వలెనే ముక్కు, చెవులు పోగొట్టుకున్నాడు! కొండశిఖరంలా వచ్చి శ్రీరాముని ఎదిరించాడు. అతను నిద్రలో ఉండగా మధ్యలో అతన్ని మేల్కొల్పాడు రావణుడు. అందువల్ల అసంతుష్టుడై ఉండి తిరిగి రాముని బాణాలవల్ల సంతుష్టుడై శాశ్వతంగా నిద్రపోయాడు! తక్కిన రాక్షసులంతా కూడా, సమరంలో రేగిన ధూళి, రక్తప్రవాహంలో అణిగిపోయినట్లుగా వానర సైన్యంలో పడి రాలిపోయారు.

అప్పుడు దశకంఠుడు లోకంలో రావణుడయినా లేకుండా పోవాలి, లేదా రాముడైనా లేకుండా పోవాలి – అని దృఢంగా సంకల్పించుకున్న వాడై సమరభూమికి వచ్చాడు. రావణుడు రథంమీద ఉండగా, రాముడు పాదచారియై పోరాడవలసి వచ్చింది. అది చూచి దేవేంద్రుడు తన దివ్య రథాన్ని రాముని వద్దకు పంపాడు.

వియద్గంగా వాహిని నుండి వచ్చు చల్లని మెల్లని గాలిచే కదిలాడే పతాకంగల ఆ దివ్య రథాన్ని రామభద్రుడు, మాతలి చెయ్యి అందివ్వగా అధిరోహించాడు. తరువాత రాక్షస వీరుల శస్త్రాస్త్రాలకు చెక్కు చెదరని ఇంద్ర కవచాన్ని మాతలి, రామభద్రుడికి తొడిగాడు.

అప్పటికి రావణుడి పక్షన యోధాన యోధులంతా నేలకూలి పోయారు. రావణుడు ఒంటరివాడైనాడు. అయినప్పటికీ పది తలలూ, పది చేతులూ కలిగి ఉండడం చేత మాతృవంశం ఇంకా విస్తృతమై ఉన్నట్లే కనిపించాడతను.

అష్టదిక్పాలకులను జయించిన ఆత్మముఖ పద్మములచే శంకరుని అర్చించినవాడు. కైలాస పర్వతాన్ని కదల్చినవాడు అయిన రావణుని చూచి రాముడు, తన పరాక్రమానికి తగిన వీరుడు లభించాడు కదా అని ఆనందించాడు!

అంతట రామరావణ సంగ్రామం జరిగింది. సీతను త్వరలో కలుసుకోనున్నట్లు శుభ సూచకంగా రాముడి కుడిభుజం అదిరింది. అప్పుడు రావణుడు మహా కోపంతో బాణం ప్రయోగించి రాఘవుని దక్షిణ భుజాన్ని నొప్పించాడు. అయితే రామభద్రుడు ప్రయోగించిన దివ్యాస్త్రం ఆ లోకకంటకుని హృదయం చీల్చి, ఆ మంచి వార్త నాగులకు తెలియజేయడానికై వెడుతున్నట్లు భూమిలో ప్రవేశించింది. వారిరువురూ ఒకరిపై ఒకరు దివ్యాస్త్రాలు శస్త్రాలు ప్రయోగించుకున్నారు. జయాభిలాషులై అంత వరకూ విజృంభించి ఒకరి కొకరు తీసిపోకుండా పోరాడారు.

రెండు మదపుటేనుగుల మధ్య వేది వలే, సమాన బల పరాక్రమములు గల ఆ ఇరువురు వీరుల మధ్య జయలక్ష్మి తారట్లాడినది! దేవతలు వారిరువురి యుద్ధనైపుణ్యాన్ని మెచ్చుకుంటూ పూలవాన కురిపించారు.

రాముడి విజృంభణను సహించలేక లంకేశ్వరుడు, యముని గదా దండాన్నే తాను తీసుకుని ప్రయోగించినట్లుగా, నూరు ఇనుపముళ్ళు గల శతఘ్ని అను గొప్ప ఆయుధాన్ని రాముడిపై వేశాడు! అయితే అది తన రథాన్ని సమీపించకముందే రాముడు, అరటి ఆకును చీల్చినట్లుగా అర్ధచంద్రముఖ బాణాలతో దానిని సునాయాసంగా చీల్చివేశాడు.

తరువాత రామభద్రుడు, సీతా వియోగ దుఃఖం అనే శల్యాన్ని తీసి వేసే దివ్యౌషధంలా, రావణుని సంహరించడానికి అమోఘమగు బ్రహ్మాస్త్రాన్ని వింట తొడిగాడు. అప్పుడా అస్త్రం గగనమండలానికి ఎగసి, ఎత్తైన పడగలు గల సర్పరాజులా మహోజ్వలమై ప్రకాశించింది! రావణుని పది తలలూ నరికివేసింది.

నేల కూలిన పంక్తి కంఠుని కంఠముల వరుస, నీళ్ళలో అలలపై ప్రతిఫలించే బాలసూర్యుని ప్రతిబింబాల వలె గోచరించింది! రావణుని పది తలలూ నేలపై రాలిపోవడం దేవతలు కళ్ళారా చూచారు. అయితే అవి మళ్ళీ అతని మొండానికి అతుక్కుంటాయేమోనన్న అనుమానం వల్ల వారికి పూర్తిగా నమ్మకం కలుగలేదు!

అప్పుడు శ్రీరాముని శిరస్సును దేవతలు పుష్పవృష్టితో అభిషేకించారు. ఇంద్ర సారధి మాతలి దేవకార్యం నెరవేర్చి, ధనుస్సు దించి ఉన్న రాముని వద్ద సెలవు పుచ్చుకున్నాడు. వేయి గుర్రాలు గల తన రథాన్ని మరల స్వర్గలోకానికి తీసుకుని వెళ్ళాడు.

పిమ్మట రాఘవుడు, అగ్ని ప్రవేశం చేయడం ద్వారా తన పాతివ్రత్యాన్ని లోకానికి ప్రకటించిన సీతాదేవిని స్వీకరించాడు. లంకా పట్టణానికి విభీషణుని రాజుగా చేశాడు. విభీషణుడు, సుగ్రీవాది వానరులు, లక్ష్మణుడు తన వెంట రాగా జానకితో కూడి, పరాక్రమం వల్ల తను గెల్చుకున్న పుష్పకవిమానం ఎక్కి అయోధ్యకు పయనమైనాడు.

# 13

**వి**మానంలో అయోధ్యకు మరలి వస్తూ రాముడు, దిగువనున్న సముద్రాన్ని పరికించి సీతతో రహస్యంగా ఇలా చెప్పసాగాడు :

“జానకీ! ఆ సముద్రాన్ని చూడు! నేను వారధి కట్టడం వల్ల ఆ సముద్రం మలయపర్వతం దాకా రెండు పాయలుగా చీలింది. నురుగులు

కక్కుతూ జ్యోతిశ్చక్రంలోని ఛాయాపదం వల్ల రెండు సముద్రాల వలె కనిపిస్తున్నది. నక్షత్రాలతో కూడిన శరత్కాలమందలి నిర్మల నీలాకాశంలా శోభిల్లుతున్నది.

మా పూర్వీకులలో ఒకడగు సగరుడు యజ్ఞం చేస్తూ గుర్రాన్ని వదలిపెట్టాడు. అది పాతాళంలో కపిలాశ్రమం వద్దకు వెళ్ళింది. దాని కోసం సగర పుత్రులు పాతాళం త్రవ్వారు. ఆ విధంగా మా పెద్దల వల్ల వృద్ధి పొందిన దీ సాగరం. ఈ సముద్రంలోనే కదా రత్నాలు వర్థిల్లుతున్నాయి. తన జలాలను శోషింపజేసే బడబాగ్నిని కూడా గర్భంలో ధరిస్తున్నా డీ సముద్రుడు.

సీతా! సమస్తలోకాలనూ ఆనందంలో ముంచివేసే చంద్రుడు ఈ సముద్రంలోనే ప్రాదుర్భవించాడు. సమస్త దిశలూ వ్యాపించి ఉన్న ఈ సముద్రుణ్ణి విష్ణుమూర్తిలాగానే, ఇలాంటి గుణం కలవాడని, ఇలాంటి రూపం కలవాడని వర్ణించ జాలము. యుగాంతాన శ్రీమన్నారాయణుడు యోగ నిద్రా ముద్రితుడై, సకల లోకాలనూ ఉపసంహరిస్తాడు. మొట్ట మొదట తన నాభి కలమం నుండి ఉద్భవించిన బ్రహ్మచే సుతులు గైకొంటాడు. అప్పుడా నారాయణు డీ సముద్ర మధ్యంలోనే పవళించి ఉంటాడు. తమ రెక్కలు నరకడానికై ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించగా, పర్వతాలు ఈ సముద్రుని శరణుజొచ్చి ఆత్మరక్షణ చేసుకున్నాయి.

వైదేహీ! ప్రళయ కాలంలో ఈ సముద్రజలం స్వచ్ఛంగా ఉంటుంది. భూదేవిని పాతాళం నుండి పైకి ఎత్తడానికై వచ్చిన ఆదివరాహమూర్తి కీ జలాలు కొంచెం సేపు వస్త్రాలంకారంగా ఉంటుంది. అవిగో! సముద్రంలోని తిమింగలాలను చూచావా ? అవి జల జంతువులతో సహా నదీముఖాన జలాలు మ్రింగి, నోళ్ళు మూసుకుంటాయి. మరల తలలపై ఉండే రంధ్రం గుండా జలాలను పైకి చిమ్ముతుంటాయి.

ఆ మొసళ్ళు చూచావా ? అవి పెద్ద ఏనుగులంత ఉన్నాయి. వాటి సంచారం వల్ల సముద్రపు నురుగు పాయలుగా చీలిపోతున్నది. నీటి పాములు ఎగిరెగిరి పడుతూ సముద్ర తరంగాలతో పోటీపడుతున్నాయి. సూర్యరశ్మి సోకడం వల్ల వాటి పడగల మీద మణులు మరింత కెంపు వర్ణం తాల్చి మెరిసి పోతున్నాయి. అవిగో! పగడాలు చూచావా ? నీ అధరాలతో పోటీపడుతున్నాయి. నీళ్ళు త్రాగడానికై మేఘాలు తన మీదికి వ్రాలగానే ఈ సముద్రుడు మహావేగంతో సుళ్ళు తిరిగిపోతున్నాడు. మరొకసారి మందర గిరిచే మథనం పొందుతున్నట్లున్నాడు.

సీతా! లోహవలయంలో ఉన్న ఈ లవణ సముద్రానికి దూరంగా సన్నని చెలియలికట్ట కనిపిస్తున్నది చూశావా ? తమాలవృక్షాల వల్ల అది నల్లగా ఉండి కళంక రేఖలా గోచరిస్తున్నది. అరెరె! ఈ విమానం అప్పుడే మనలను సముద్రం నుంచి దూరదూరంగా తీసుకునిపోతున్నదే! ఈ విమానం ఒకచోట దివ్యమార్గాన, మరొకచోట అరణ్యమార్గాన, వేరొకచోట పక్షిమార్గాన సంచరిస్తుంది. నా మనస్సులోని కోరిక లాగే విహరిస్తున్నది ఇది.

ఐరావతం మదగంధాన్ని మోసుకుని, మందాకినీ వీచికల తాకిడికి చల్లనై వీచే గగన వాయువు ఇప్పుడు నీ సుందర ముఖారవిందానికి సోకి చిరుచెమటలు ఆర్చుతున్నది సుమా! నీవు ఈ విమానం గవాక్షం గుండా చేయి బయటికి జారవేసి ఉంచావు. నీ హస్త స్పర్శవల్ల మేఘుడు తనలో నున్న మెరుపుతీగను నీకు హస్తకంకణంగా చేస్తున్నాడు.

దేవీ! అవిగో మునుల ఆశ్రమాలు! రావణాది రాక్షసులు అంత-మొందారని తెలిసి మునులు ఇక తమకు తపోవిఘ్నం కలగదని సంతోషిస్తు న్నారు. ఏనాడో విడచిపోయిన తపోభూములలో మరల కొత్తగా పర్ణశాలు నిర్మించుకుంటున్నారు.

సీతా! నీ కోసం వెదకుతూ ఉండగా మాకు నీ కాలి అందె కనిపించిన చోటు అదే! నీ పాదాన్ని విడిచానన్న దుఃఖంతో ఆ మంజీరం మౌనం వహించినట్లుగా ఉన్నది. దుర్మార్గుడైన రావణుడు నిన్ను ఎటు ఎత్తుకొనిపోయినదీ ఈ నోరులేని తీగెలు నాకు చెప్పలేకపోయినవి. అయినా అవి చిగురు కొమ్మలనే చేతులతో నాకు మార్గం చూపాయి. నీ కోసం వెదుకుతున్న నన్ను చూచి ఆడులేళ్ళు, గరికపోచలు మేయడం మానాయి. దక్షిణదిశగా చూపులు నిగిడ్చి నీవు వెళ్ళిన మార్గాన్ని నాకు సూచించాయి.

జనకాత్మజా! అదిగో మాల్యవంతం అనే పర్వతం. దాని శిఖరం ఆకాశం అంటుతున్నట్లున్నది చూచావా ? తొలకరి వానలు కురిసే రోజులలో నేను అక్కడే అతి భారంగా గడిపాను. మేఘాలు తొలకరి జల్లులు కురిపించగా, వాటితో సమానంగా నేనున్నూ నీ వియోగం వల్ల కన్నీరనే జలాన్ని వర్షించాను. నెమళ్ళ నృత్యాలు, పూల పరిమళం – మున్నగునవన్నీ ఆ వానాకాలంలోనే ఇక్కడ నీ వియోగాన్ని భరించలేకుండా చేశాయి నన్ను! నీ కౌగిలిని తలుచుకుంటూ నేను ఎంతగా విలవిలలాడిపోయానో నీకు తెలుసునా ?

ప్రేయసీ! అదిగో, పంపాసరోవరం. కదిలాడే కమలాలు గల ఆ పంపాసరోవర జలాలను దూరం నుంచే నా కళ్ళు త్రాగివేస్తున్నట్లున్నది. ఇక్కడ చక్రవాక జంటలను చూచి, నిన్నే జ్ఞాపకం చేసుకుంటూ నేను ఎంతగా కుమిలిపోయానో తెలుసునా?

అదిగో! సరోవరం ఒడ్డున సన్నని ఆ అశోక లతను చూడు. దాని పూలగుత్తులు నీ స్తనాలలా ఉంటాయి. ఆ లతను చూచి నీవే అనుకునేవాడను. కౌగలించుకోబోయే వాడను. అప్పుడు లక్ష్మణుడు అడ్డు వచ్చేవాడు.

సీతా! అదిగో గోదావరి! మన విమానానికి వ్రేలాడుతున్న బంగారు చిరుగంటల మ్రోత విని, గోదావరిలోని హంసలు, మరొక హంసల గుంపు

వస్తున్నదని భ్రమపడి నిన్ను ఎదుర్కోడానికి వస్తున్నట్లున్నవి! నీవు ఎంతో సుకుమారివైన రాకుమారివే అయిననూ, ఓపికతో నదిలో నీరు తెచ్చి పోసి పెంచిన మామిడి మొక్కలు ఇప్పుడు నీ వంక ఆతృతతో చూస్తున్నాయి. ఈ పంచవటీ ప్రాంతాన్ని మళ్ళీ ఇంత కాలానికి చూచినందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నది.

"నేను వేటకు వెళ్ళి అలసిపోయి తిరగి వచ్చేవాణ్ణి. కాని గోదావరి తరంగాల నుండి వచ్చే చల్లని మెల్లని గాలి నా అలసట తీర్చేది. నేను పొదరిండ్ల మధ్య నీ తొడల మీద తలపెట్టుకునేవాణ్ణి. అవన్నీ ఇప్పుడు నాకు జ్ఞాపకం వస్తున్నాయి సుమా!

దేవేరీ! కేవలం కనుబొమలు ముడివేయటం ద్వారానే నహుషుని ఇంద్రపదవి నుండి భ్రష్టుని కావించినవాడు, ఉదయించినంత మాత్రాననే కలుషజలాలను శోషింపజేసేవాడు అయిన అగస్త్యమహర్షి ఆశ్రమం అదే! ఆ మహర్షి పవిత్ర యజ్ఞకుండం నుండి హవిర్గంధంతో వెడలి వస్తున్న పొగను వాసన చూడగానే నా మనసు హాయి గొలుపుతున్నది.

"జానకీ! అదిగో, పంచాప్సరమనే తీర్థం. శాతకర్ణి మహాముని విహరించే ప్రదేశం అది. చుట్టూ దట్టమైన వనం. మధ్యలో ఉన్న ఆ తీర్థం, మేఘాల మధ్యనున్న చంద్రుడిలా మెరిసిపోతున్నది సుమా! ఆ మహర్షి పూర్వం, కఠోరమైన తపస్సు చేసి ఇంద్రుడికే భయం పుట్టించాడు. అయితే ఇప్పుడు ఇంద్రుడు ప్రయోగించిన పంచాప్సరసలు అనే వలయంలో చిక్కుపడి ఉన్నాడు. ఈ తీర్థ జలాల లోపల మునీంద్రుని భవనం ఉన్నది. అందు లయబద్ధంగా మ్రోగే మృదంగ ధ్వనులు, మన పుష్పక విమానంలోని చంద్రశాలలో కూడా తృటికాలం ప్రతిధ్వనిస్తున్నాయి.

అదిగో, సీతా! సుతీక్ష్ణుడనే మరొక మహర్షి ఆశ్రమం. ఆయన పరమ శాంతమూర్తి. నాలుగు వైపులా అగ్నిని ప్రజ్వలింప చేసి, ఎర్రని ఎండని

కఠోరతపస్సు చేస్తున్నాడు. దేవకన్యలు తమ సౌందర్య విలసాలతో ఎన్ని చేష్టలు చేస్తున్నప్పటికీ ఆ తపోనిధి మనసు ఇంచుకైనా చలించడం లేదు. తన తపో దీక్షతో ఇంద్రుని భీతి గొలుపుతున్నాడు. నన్ను చూచి ఆహ్వానిస్తున్నట్లు జపమాల గల దక్షిణ హస్తాన్ని నా వంక చాచి ఉంచాడు. మౌనవ్రతంలో ఉన్నాడు. కనుక, నేను చేసిన నమస్కారాన్ని శిరఃకంపన ద్వారా అంగీకరించాడు. మరల తన చూపు మన విమానం నుండి మళ్ళించి సూర్యునిపై నిలిపాడు.

వైదేహీ! అదిగో, అదే శరభంగముని ఆశ్రమం. అత్యంత పవిత్రమయిన ఆశ్రమం అది. శరభంగ మహాముని ఎంతో కాలం మంత్ర పూతమయిన సమిధలతో యజ్ఞం చేశాడు. తుదకు తన దేహాన్నే అగ్నిహోత్రునకు అర్పించాడు. ఈ ఆశ్రమంలో ఉన్న వృక్షాలను చూడు. చెట్లన్నీ పండ్లతో నిండి ఉన్నాయి. చల్లని నీడలో పాంథులకు మార్గాయాసం తీరుస్తున్నాయి. మంచి కుమాళ్ళలో వలె ఈ వృక్షాలలో అతిథి మర్యాద సుప్రతిష్ఠితమై ఉన్నది సుమా!

జానకీ! ఈ చిత్రకూట పర్వతం నా మనసును అమితంగా ఆకర్షిస్తున్నది. ఇక్కడ సెలయేళ్ళు గల గల ధ్వనులు చేస్తున్నాయి. ఈ పర్వత శిఖరాలపై మబ్బులు గుమిగూడి ఆడుకుంటున్నాయి. వృషభ రాజులా ఉన్నది పర్వతరాజం. దూరాన నిర్మల జలాలతో ప్రవహిస్తున్న మందాకిని భూదేవి కంఠసీమను అలంకరించిన ముక్తాహారం వలె ప్రకాశిస్తున్నది.

అదిగో తమాలవృక్షం. నాకు అత్యంత ప్రియమైనది. సువాసన వెదజల్లే ఈ చెట్టు చిగురాకులనే నేను నీ చెక్కిళ్ళపై అవతంసములుగా అలంకరించేవాణ్ణి.

అదే, అత్రి మహాముని ఆశ్రమం! అక్కడ సమస్త మృగాలూ నిర్భయంగా సంచరిస్తున్నాయి. చెట్లు పూలు పూయకుండానే పంటలు పండుతున్నాయి! ఆ మహర్షి మహిమ వర్ణించలేము కదా! పరమశివుని మౌళిపై పూలదండలా ప్రకాశిస్తూ, సప్తమహర్షులు పూజకై కోసుకొని పోయే బంగారు తామరలుగల

మందాకినీ నదిని, పతివ్రతా తిలకమగు అనసూయాదేవి, మహర్షుల స్నాన సంధ్యాదుల నిమిత్తం ఈ ఆశ్రమం చెంత ప్రవహించేటట్లు చేసింది.

ఇక్కడ ఋషులు జపవేదికలపై వీరాసనాలు వేసుకుని ధ్యాన నిమగ్నులై ఉన్నారు. వారి వలెనే ఇక్కడి చెట్లు కూడా ఆకు కూడా కదల్చకుండా నిశ్చల యోగనిష్టలో ఉన్నట్లు కనిపిస్తున్నవి.

అదిగో! ఆ మర్రిచెట్టు గుర్తున్నదా ? ఎర్రని పండ్లతో పచ్చని ఆకులతో పద్మరాగాలు గల గరుడ పచ్చలరాశి వలె శోభిల్లుతున్నది. ఈ వటవృక్షాన్ని ఒకనాడు నీవు ప్రార్థించావు; జ్ఞాపకం ఉన్నది కదూ ?

జానకీ! యమునతో సంగమించిన ఈ గంగాతరంగిణి ఎలా ఉన్నదో చూడు! ఒక చోట ఇంద్రనీలాలు పొదిగిన ముక్తాహారంలాగా మరొకచోట మధ్య మధ్య నల్లకలువ పూలు కూర్చిన తెల్లతామర లాగా కాంతులు వెదజల్లుతూ కనిపిస్తున్నది. ఇంకొక ప్రదేశంలో నీలహంసలూ, రాజహంసలూ కలిసి బారుతీర్చి ఉన్నట్లు, మరొక చోట ముకరికా పత్రాలతో శోభిల్లే చందనరేఖ లాగాను గోచరిస్తున్నది! ఇంకొక తావున మధ్య మధ్య మసక చీకట్లు నింపుతూ ఉండే వెన్నెల వెలుగు లాగా వేరొకచోట లోలోపల నీలాకారం గోచరింపజేస్తూ శరత్కాల మేఘ పంక్తిలాగా కనిపిస్తున్నది. అదిగో – అక్కడ చూడు! యమునాతరంగాల వల్ల జలవాహినులు పాయలుగా విడిపోగా ఈ పావనగంగ – భస్మం పూసుకొని – నల్లటి పాములు ఆభరణాలుగా ధరించిన పరమశివుని వలె గోచరిస్తున్నది. ఈ గంగా యమున సంగమస్థలంలో స్నానం చేసినవారు సమస్త పాపాలూ తొలగి పవిత్రులవుతారు. ఇక్కడ దేహత్యాగం చేసిన వారికి ఎలాంటి తత్త్వోపదేశంతో పనిలేకుండానే మోక్షం సిద్ధిస్తుంది.

ప్రాణేశ్వరీ! అదిగో! శృంగిబేరపురం అదే! నిషాదరాజు రాజధాని! అక్కడే నేను శిరోమణిని తీసివేసి జడలు ధరించాను. అప్పుడు సుమంతుడు 'కైకేయీ! ఇక నీ కోరిక తీరిందిలే'! అని కంట తడి పెట్టుకున్నాడు.

అదిగో, సరయూనది! యక్షకాంతలు బంగారు తామరల పుప్పొడి స్తనాలపై అలదుకొంటారు. అట్టి తామర పూలకు నిలయం మానససరోవరం. మరి ఆ మానససరోవరం బుద్ధికి మహత్తత్త్వంలా ఈ సరయూ నదికి కారణమవుతున్నది. మన రాజధానీ నగరం అయోధ్యను ఆనుకొని ప్రవహిస్తున్నది. ఈ నదీతీరానికి ఇక్ష్వాకురాజులు అశ్వమేధయాగాల అనంతరం అవబృధ స్నానాలకై వచ్చేవారు. వారి స్నానాల ఫలితంగా పుణ్యజలాలు వహిస్తున్న నది ఇది. ఈ నదీతీరాన ఇప్పటికీ యూపస్తంభాలు అనేక వెలుగొందుతున్నాయి. కోసలరాజు లందరికీ తల్లివంటి నది. ఇప్పుడీ నదీమతల్లి కౌసల్య వలెనే, తరంగాలనే చేతులు చాచి దూరదేశాల నుండి వచ్చే నన్ను, చల్లని వాయువులచే ఆహ్వానిస్తూ కౌగలించుకుంటున్నట్లున్నది.

సీతా! అదిగో, అటుచూడు. సంధ్యవలె భూమి మీద నుండి ఎర్రని ధూళి ఎగసి వస్తున్నది. దీనిని బట్టి ముందుగా వెళ్ళిన హనుమంతుడు భరతుడికి నా రాకను గురించి తెలియజేయగా నా తమ్ముడు సైన్యంతో ఎదురు వస్తున్నాడని అనుకోవచ్చు. రావణుని సంహరించి వచ్చిన నాకు, పవిత్రమైన నిన్ను లక్ష్మణుడు అప్పగించినట్లుగా, పితృవాక్యాన్ని పాలించిన భరతుడు ఇప్పుడు నాకు స్వరాజ్యలక్ష్మిని అప్పగిస్తాడు. ఇది నిజం.

అదిగో, చూడు జానకీ, మా కుల గురువులైన వసిష్ఠులవారు వారు ముందు నడుస్తూ ఉండగా, సకల సైన్యాలూ వెంటరాగా వృద్ధులైన అమాత్య శేఖరులతో భరతుడు పాదచారియై నన్ను కలుసుకోడానికి వస్తున్నాడు. చేత అర్ఘ్యం పట్టుకున్నాడు. పాపం, వాడు యౌవనంలో ఉండి నా మీద భక్తిచేత ఇన్నేళ్ళు రాజభోగాలేవీ అనుభవించక ఉన్నాడు. ఉగ్రమైన అసిధారావ్రతం సలిపినవాడులా కనిపిస్తున్నాడు చూచావా ?"

శ్రీరాముడు ఇలా సీతతో చెపుతూ ఉండగానే పుష్పక విమానం భూమి మీదికి దిగింది. భరతుడు మున్నగువారు సంతోషంతో, ఆశ్చర్యంతో చూస్తూ ఉన్నారు.

అప్పుడు విభీషణుడు ముందుండి త్రోవ చూపగా, సుగ్రీవుడు చేయి పట్టుకోగా రాఘవుడు పుష్పక విమానం స్ఫటికపు మెట్ల మీద నుంచి దిగి భూమి మీద అడుగు పెట్టాడు. వెంటనే గురువులైన వసిష్ట మహర్షికి సాష్టాంగ నమస్కారం చేశాడు. పిమ్మట భరతుడు అన్నకు అర్ఘ్యం సమర్పించాడు.

రాఘవుడు మిక్కిలి ఆనందంతో భరతుని ఆలింగనం చేసుకున్నాడు. అతని తల నిమిరాడు. తలలపైన, ముఖాలపైన పెద్ద వెంట్రుకలు పెరిగి ఊడలు దిగిన వటవృక్షాల వలె ఉన్న వృద్ధ మంత్రులు రాముడికి సమస్కరించారు. రాముడు వారిని ప్రియమైన మాటలతో పలకరించి పరామర్శించాడు.

తరువాత కౌసల్యానందనుడు సుగ్రీవునీ, విభీషణునీ భరతుడికి పరిచయం చేశాడు. "ఇతను వానర రాజు. నాకు ఆప్త బంధువు ఇతను పులస్త్య బ్రహ్మ కుమారుడు. రణభూమిలో నాకు ముందుండి శత్రువులను సంహరించాడు." అని తెలియజేశాడు.

భరతుడు సుగ్రీవ, విభీషణులను గౌరవించి, పిమ్మట లక్షణ స్వామికి నమస్కరించాడు. సౌమిత్రి అతనిని వాత్సల్యంతో లేవనెత్తి ఇంద్రజిత్తు దెబ్బల వల్ల బండబారి ఉన్న తన వక్షస్థలానికి హత్తుకున్నాడు.

అంతట రాముని ఆజ్ఞ ప్రకారం వానర వీరులంతా మానవ రూపాలు ధరించారు. మదపుటేనుగుల మీద ఎక్కారు, పర్వతాలు ఎక్కి కూచున్నట్లుగా సంతోషం పొందారు.

రాముని ఆనతి ప్రకారం విభీషణుడు, అతని అనుచరులు వారి వారికి తగిన రథాలు అధిరోహించారు. రాముడు తమ్ములతో మరల కామగమనం గల పుష్పకవిమానం ఎక్కాడు. రాత్రివేళ మెరుపు తీగెలతో మెరిసిపోయే మేఘమండలం పైకి గురు, బుధులతో ఎక్కినట్లుగా లక్ష్మణ, భరతులతో ఆ పుష్పకం అధిరోహించాడు.

అప్పటివరకూ విమానంలోనే ఉన్నది సీత! జగత్ప్రళయానంతరం విష్ణుదేవుడు ఉద్ధరించిన భూదేవిలా, శరత్కాల మేఘపంక్తుల నుండి వెలికి వచ్చిన చంద్రరేఖలా ప్రకాశిస్తున్నదామె. వదినెగారికి భరతుడు భక్తితో నమస్కరించాడు. రావణుడు ప్రణయకలాపం సాగించాలన్న ఉత్సుకతతో సీత పాదాలపై పడి వేడుకోబోయినప్పుడు సీత నిరాకరించింది. అటువంటి జానకి చరణాలను, అన్న వలెనే తాపసిగా ఉండి ఆయనను అనుసరించడంలో జడలు కట్టిపోయిన భరతుని శిరస్సు తాకడంతో అవి రెండూ ఒకదాని నొకటి పావనం చేసుకున్నట్లయినాయి!

అంతట పురజనులు వెంట రాగా పుష్పకవిమానం మెల్ల మెల్లగా ప్రయాణం సాగించింది. ఆ విధంగా వారు అరక్రోసు దూరం వెళ్ళారు. అయోధ్యాపట్టణం సమీప మందలి ఉపవనం చేరుకున్నారు. అక్కడ శత్రుఘ్నుడు వారి కోసం విడిది ఏర్పాట్లు చేయించి ఉంచాడు. రామభద్రుడు తన పరివారంతో అక్కడ బస చేశాడు.

# 14

**త**రువాత రామ లక్ష్మణులు తమ తల్లులైన కౌసల్యా, సుమిత్ర లను సందర్శించారు. పతి వియోగం వల్ల వారు మిక్కిలి దయనీయమైన స్థితిలో ఉన్నారు. తమకు ఆధారమైన చెట్టు కూలిపోగా నేల వ్రాలిపోయిన లతల వలె ఉన్నారు వారు.

శత్రువులను నిర్జించి వచ్చిన రామ లక్ష్మణులు తమ పాదాలు అంటి నమస్కరిస్తున్నప్పటికీ కన్నీటివల్ల కౌసల్యా సుమిత్రల చూపు మందగించి వారికి తమ కుమాళ్ళు కనిపించలేదు. అయితే సుఖప్రదమయిన స్పర్శను బట్టి తమ కొడుకులు వచ్చారని ఆ తల్లులు గుర్తించారు. వెంటనే వారికి ఎక్కడలేని ఆనందం కలిగింది. హిమవత్పర్వతం నుండి స్రవించే చల్లని జలాలు, వెచ్చని

గంగా సరయూ జలాలను ఛేదించినట్లుగా వారి చల్లని ఆనందాశ్రువులను ఛేదించివేశాయి.

రాక్షసులతో జరిగిన యుద్ధంలో అయిన గాయాలు ఇంకా రామ లక్ష్మణులకు మానలేదు. కుమారుల శరీరాలను తల్లులు పదే పదే తడిమి చూచారు.

అంతట జానకి భర్తతో అత్తలకు నమస్కరించింది. వారి పాదాలకు ప్రణమిల్లుతూ "భర్తకు ఎక్కడలేని కష్టాలకు కారకురాలనైన సీతను, దౌర్భాగ్యురాలను!" అని పలికింది.

కౌసల్య, సుమిత్రలు కోడలిని ఆదరంతో "లే అమ్మా లే. నీ పాతివ్రత్యం ప్రభావం వల్లనే తన తమ్ముడితో సహా నీ భర్త మహాకష్టాలను గడచి గట్టెక్కాడు" అని పలికి దగ్గరికి తీసుకున్నారు.

తల్లుల ఆనందభాష్పాలతో రాఘవుడికి అభిషేకం మొదలైంది. పిమ్మట మంత్రులు సకల పుణ్యతీర్థాల నుండి బంగారు కలశాలతో జలాలు తెప్పించి రాఘవుని శిరస్సున అభిషేకించారు. రాక్షసులు, వానరులు కూడా అన్ని దిక్కులకూ వెళ్ళి సముద్రాల నుండి, సరస్సుల నుండి, నదీ నదాల నుండి జలాలు తెచ్చారు. వింధ్య పర్వతంపై మేఘాలు వర్షించినట్లుగా ఆ పుణ్యజలాలు విష్ణువగు రాముని శిరమున కురిశాయి.

తాపసి వేషంలో కూడా మనోహరంగా ఉండే శ్రీరాముడిప్పుడు మహారాజ వేషంలో రెట్టింపు సౌందర్యంతో ప్రకాశించాడు. అంతట రాఘవేంద్రుడు మంత్రులతో, పరిజనులతో, సైన్యంతో, వానర రాక్షసానుచరులతో బయలుదేరి అయోధ్యానగరంలో ప్రవేశించాడు.

పట్టణమంతా రకరకాల అలంకారాలతో, నూతన శోభతో వెలిగిపోతున్నది. పందిళ్ళు వేశారు. పచ్చని తోరణాలు కట్టారు. లక్ష్మణ

శతృఘ్నులు చెరి ఒక వైపున ఉండి చామరాలు వీస్తుండగా, భరతుడు శ్వేతఛత్రం పట్టగా, జానకీదేవితో రథంలో కూర్చుని రామచంద్రుడు నగర ప్రవేశం చేశాడు. ఉన్నతమైన మేడలలో నుండి పురకాంతలు లాజలు వర్షంలా కురిపించారు.

అత్తలు చేసిన అలంకారాలతో సాక్షాత్తూ లక్ష్మీదేవి వలె రాముని ప్రక్కన కూర్చుని ఉన్న సీతాదేవిని అయోధ్యా పురకాంతలు మేడల కిటికీల గుండా తలలు బయటపెట్టి అదేపనిగా విరగబడి చూశారు. అక్కడ నుండే ఆమెకు నమస్కారాలు చేశారు. అనసూయాదేవి తనకు ఇచ్చిన శాశ్వత పరిమళం గల అంగరాగం అలదుకుని ఉన్నది జానకి.

అంతట రాముడు తన వారందరికీ తగిన వసతులు, విడుదులు విడివిడిగా ఏర్పాటు చేయించాడు. తాను తండ్రిగారి భవనంలో కన్నీరు కారుస్తూ ప్రవేశించాడు. అక్కడ కైకేయి వద్దకు వెళ్ళాడు. చేతులు జోడించి "అమ్మా! నీవు చేసుకున్న పుణ్యం వల్లనే మా నాయనగారు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. స్వర్గపదం చేరుకున్నారు!' అని పలికాడు.

తరవాత సుగ్రీవాది వానర వీరులకూ, విభీషణాది రాక్షస మిత్రులకూ అనేక రకాల భోగవస్తువులు తెప్పించి ఇచ్చాడు. అవి చూచి వారు ఇంతటి అపురూప వస్తువులు ఎక్కడివా అని ఆశ్చర్యచకితులైనారు.

అంతట అగస్త్యుడు మున్నగు మహర్షులు రాఘవుని అభినందించడానికై అయోధ్యకు విచ్చేశారు. రావణుడు పుట్టినది మొదలు రాముని చేత మరణించే వరకూ గల అద్భుత కథ ఆ మహర్షులు చెప్పగా రాఘవుడు ఆలకించాడు. పిమ్మట వారు వెళ్ళిపోయారు.

తరువాత సుగ్రీవాదులు పదిహేనురోజుల పాటు అయోధ్యలో సుఖంగా గడిపారు. అయితే, ఆ పక్షం రోజులూ ఒక్క క్షణం వలె గడచిపోయింది

వారికి. అంతటి సౌఖ్యం, ఆనందం అనుభవించారు వారు. అటుపిమ్మట వారు తమ తమ నెలవులకు బయలుదేరారు. అప్పుడు రాఘవుడు జానకిచేత వారందరికీ తగు మర్యాదలు – గౌరవ సన్మానాలూ చేయించాడు. అమూల్యమైన కానుకలు ఇప్పించి గౌరవించాడు. ప్రేమతో, ఆదరంతో వారిని వీడ్కొలిపాడు. స్వర్గలోకానికే ఒక దివ్యాలంకారమై, రావణునికి ప్రాణసమానమైన, సంకల్ప మాత్రం చేతనే సిద్ధించే టటువంటి పుష్పకవిమానాన్ని రాముడు మరల కుబేరునికి పంపించివేశాడు.

ఆ విధంగా రాఘవుడు తన తండ్రి దశరథమహారాజు ఆనతి ప్రకారం అరణ్యవాసం ముగించి, మరల తన రాజ్యాన్ని పొందినవాడై ధర్మంగా ప్రజలను పరిపాలించాడు. ధర్మార్థకామముల యందు వలె, తన ముగ్గురు తమ్ముల ఎడల సమానమైన ప్రేమ చూపాడు. ఆరు ముఖాలతో ఆరుగురు కృత్తికల స్తన్యాన్ని గ్రోలిన కుమారస్వామిలా, ముగ్గురు తల్లుల నుండి సమానమైన ప్రేమాదరాలను పొందాడు.

మహారాజు అయి ఉండి కూడా రాముడు ప్రలోభం పెట్టుకోలేదు. అతని పాలనలో ప్రజలకు భయం లేదు. ఆపద లేదు. దుఃఖం లేదు. ఈతి బాధలనేవి లేనేలేవు. ప్రజలు సకల సౌఖ్యాలూ పొందారు. ఎప్పటికప్పుడు ప్రజల కష్టనిష్ఠూరాలు విచారిస్తూ వారి అవసరాలు తెలుసుకుంటూ కన్నబిడ్డల్లా ప్రజలను పాలించాడు. జానకితో భోగాలు అనభవించాడు.

చిత్రవిచిత్ర మందిరాలలోనూ, మనోహరములగు ఉద్యాన వనాల లోనూ సీతారాములు విహరిస్తూ తాము వనవాసం చేసిన రోజులు జ్ఞాపకం తెచ్చుకునేవారు. దండకారణ్యంలో తాము అనుభవించిన కష్టాలు తలపునకు తెచ్చుకునేవారు. అయితే, ఆ జ్ఞాపకాలు దుఃఖానికి బదులు సుఖాన్నే కలిగించేవి వారికి! అవి వారికి తీయని తలపులుగా ఉండేవి!

అంతట సీతాదేవి గర్భవతి అయింది, ఆమె దేహం తెలుపెక్కింది, ముఖం పాలిపోయింది. పాలుమాలిక, బద్ధకం ఏర్పడ్డాయి. మనిషి చిక్కింది. ఈ లక్షణాలన్నీ ఆమె గర్భం ధరించినదని చెప్పకయే చెపుతున్నాయి. భర్త పలకరిస్తే ఏదైనా అడగబోతే సిగ్గుతో కుంచించుకుని పోయేది.

ఒకనాడు రాముడు – జానకిని తన తొడపై కూర్చోబెట్టుకున్నాడు. జానకి రంగుమారిన తన స్తనాల కొనలు చూచుకుంటూ సిగ్గుతో తలవాల్చుకుని ఉన్నది.

అప్పుడు రాముడు "సీతా! ఇప్పుడు నీకు ఏమి కోరిక ఉన్నదో చెప్పు. తీరుస్తాను" అని అడిగాడు.

గంగాతీరమందిలి తపోవనాలు సందర్శించాలని ఉన్నదని సీత చెప్పింది!

జానకి ఇలా తన కోర్కె తెలుపుతున్న సమయంలోనే రాముని సందర్శనార్థం ఒక చారుడు వచ్చాడు. అతని పేరు భద్రుడు.

రాముడు చారుడితో కలిసి తన భవనం చివరి అంతస్తులోకి వెళ్ళాడు. ఆ దివ్య ప్రాసాదం ఆకాశం అంటుతున్నట్లున్నది. అక్కడ రాముడు నిలుచుని ఒక్క మాటు ఆయోధ్యాపట్టణాన్ని యావత్తూ కలయచూచాడు. తన పట్ల ముదితలా కనిపిస్తున్నదా మహానగరం. సకల వస్తు సంపదతో సమృద్ధమైన అంగళ్ళుగల రాజమార్గాలనూ, ఓడలు ప్రయాణం చేస్తూ నేత్రపర్వం కావిస్తున్న సరయూనదినీ, పురజనులు విలాసంగా విహరిస్తూ కళకళ లాడుతున్న నగరోద్యాన వనాలనూ కళ్ళారా చూచి ఎంతో సంతోషించాడు రాఘవుడు.

తరువాత చారుడు భద్రుని చూచి "భద్రా! నీవు రహస్యంగా అన్ని విషయాలూ కనిపెడుతూ ఉంటావు కదా! నన్ను గురించి అయోధ్యా పుర వాసులు ఏమనుకుంటున్నారు ? పరిపాలనను గురించి ఏం చెప్పుకుంటు న్నారు, నీ నోటితో చెపితే వినాలని ఉంది. చెప్పు భద్రా ?" అని అడిగాడు.

భద్రుడు రాఘవుని ఎదుట సవినయంగా చేతులు కట్టుకుని నిలుచుని ఉన్నాడు. మహారాజు ప్రశ్నకు అతను వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. ఏదో సందేహిస్తున్నట్లు, భయపడుతున్నట్లూ కనిపించాడు.

అది గమనించిన రాఘవుడికి మరింత ఆసక్తి కలిగింది. విషయం చెప్పమని గుచ్చి గుచ్చి అడిగాడు. ప్రభువు బలవంత పెట్టడం చేత ఇక తప్పదని భద్రుడు తలవంచి ఇలా బదులు చెప్పాడు :

“ప్రభూ! ఏలినవారి పరిపాలనను ప్రజలంతా ఎన్నో విధాల మెచ్చుకుంటున్నారు. కాని....కాని...”

భద్రుడు చెప్పలేక నిలిచిపోవడం చూచి రాముడు “కాని – ఏమిటి భద్రా ? చెప్పు ? సందేహించకు” అన్నాడు.

అప్పుడు భద్రుడు “ఏమున్నది దొరా! పట్టణంలో ఒకచోట మాత్రం, ఎక్కడో రాక్షసుడి చెరలో కొన్నాళ్ళున్న మహారాణిగారిని గురించి దుర్భాష లాడడం ఈ పాడు చెవులతో విన్నాను ప్రభూ” ....అని తెలియజేశాడు.

ఆ మాట వినగానే రామభద్రుని హృదయం వేయి వ్రక్కలైంది. వినరాని ఈ మాటలు విని కూడా విననియట్లే ఊరుకునేదా ? లేక ఏ పాపమూ, ఏ దోషమూ లేని అర్ధాంగిని విడిచిపెట్టేదా ? ఏం చేసేది ? అని రెండు విధాలైన ఆలోచనలు వచ్చి రాముడు ఉక్కిరి బిక్కిరి అయినాడు. ఏం చేయాలో తోచక మనస్సు ఊగిసలాడింది. అయితే, తుదకు ఒక నిశ్చయానికి వచ్చాడు. భార్యనే పరిత్యజించి తనకు వచ్చిన అపవాదు తొలగించుకోవాలనుకున్నాడు. అవును, సజ్జనులకు గౌరవ ప్రతిష్టలే ముఖ్యం, సుఖాలు కావు.

తన కిలాంటి అపవాదు రావడం వల్ల రాఘవుడి మనసు మనసులో లేదు. చంద్రబింబంలా ఎల్లప్పుడూ కళకళలాడుతూ ఉండే ఆయన ముఖం

ఇప్పుడు కళావిహీనమై ఉన్నది. అంతట రాముడు తన ముగ్గురు తమ్ములనూ పిలిపించాడు. లక్ష్మణ భరత శత్రుఘ్నులు వచ్చారు. చిన్నబోయి ఉన్న అన్నగారి ముఖం చూచి ఇదేమిటా అని తెల్లబోయారు. వారికేమీ అర్థం కాలేదు. అంతట రాఘవుడు తమ్ములతో ఇలా అన్నాడు :

"పేరు ప్రతిష్ఠలకు ఖ్యాతి గడించిన సూర్యవంశం మనది. మచ్చలేని వంశం మనది. అలాంటి వంశానికి ఇప్పుడు నా వల్ల మచ్చ వచ్చింది. మేఘాల నుండి వచ్చే శీతగాలి వల్ల అద్దంపై మసక ఏర్పడినట్లు లోకుల నుండి అపవాదు వచ్చింది. ఈ చెడ్డ పేరు నీటిమీద నూనె బొట్టులా మన నగరంలోని ప్రజలందరిలో పాకిపోతున్నది. మదపుటేనుగు ఒక కట్టుకొయ్యకు తలొగ్గి, కట్టుబడి ఉండలేదు. అలాగే నేనూ వంశానికి వచ్చిన ఈ అపవాదుకూ, అప్రతిష్టకూ తలవంచి నిలువలేకుండా ఉన్నాను! మీ వదినె నేడో రేపో బిడ్డను కననున్నది. అయినప్పటికి నేను దయదలచడం లేదు. ఈ అపవాదు పోగొట్టుకోడానికై, మునుపు తండ్రిమాట ప్రకారం రాజ్యాన్ని పరిత్యజించినట్లే. ఇప్పుడు జానకిని వదలిపెట్టదలచాను. మీ వదినెలో ఏ దోషమూ లేదని నాకు తెలుసు. కానీ లోకాని కేం తెలుసు. లోకుల నుండి వచ్చిన అపవాదు నేను భరించలేను. భూమి నీడ పడి చందమామలో మచ్చ ఏర్పడింది. కానీ లోకం చంద్రుని కాంతి గురించి కాక అతనిలో మచ్చను గురించే చెప్పుకుంటుంది. అలాగే సీత విషయం కూడా, ఈ అపవాదు పోగొట్టుకుంటేనే నేను బ్రతుకుతాను! మరి, నేను బ్రతికి ఉండాలంటే మీరీ మాటకు ఎదురు చెప్పకూడదు...!"

సీత విషయంలో రాఘవుడిలా అతి క్రూరమైన నిర్ణయం చేయడం చూచి తమ్ములెవరూ మారుమాట చెప్పడానికి సాహసించలేకపోయారు. ఆయనను అభినందించడానికి కూడా ఎవరికీ ధైర్యం చాలలేదు.

సత్యసంధుడు, మూడు లోకాలలో కీర్తి పొందినవాడూ అయిన రామచంద్రుడు ఇలా పలికి, ఎన్నడూ తన మాట జవదాటని లక్ష్మణుని వంక చూచాడు.

"తమ్ముడూ, లక్ష్మణా!" అని దగ్గరికి పిలిచాడు. "మీ వదినె గర్భవతి. గర్భిణీ స్త్రీలకు సహజంగా ఎన్నో కోరికలు పుడతాయి. ఇప్పుడామె తపోవనాలు సందర్శించాలని కుతూహల పడుతున్నట్లు చెప్పింది. కనుక ఆ నెపంతో నీవు ఆమెను రథంమీద అడవులకు తీసుకుని వెళ్ళు. వాల్మీకి ఆశ్రమం చెంత దిగవిడిచి రా!' అని ఆజ్ఞాపించాడు.

అలనాడు తన తల్లి విషయంలో పరశురాముడు తండ్రి ఆజ్ఞను శిరసావహించినట్లే ఈనాడు లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞను ఔదల దాల్చాడు. అవును, బుద్ధిమంతులు పెద్దల ఆజ్ఞను గురించి వితర్కం చేయరు.

పాపం, జానకికి అసలు విషయం తెలియదు. భర్త తన కోర్కె తీరుస్తున్నాడు కదా అని సంతోషించింది. లక్ష్మణుడు వదినెగారిని రథం మీద ఎక్కించాడు. అయోధ్య నుండి బయలుదేరాడు. సుమంతుడు గుర్రాలు తోలుతున్నాడు. రథం వేగంగా పోతున్నది.

త్రోవలో చక్కని దృశ్యాలు ఎన్నో కనిపించాయి. సీత అవి చూచి "ఆహా! నా భర్త నా కోర్కె తీర్చారు!" అని లోలోపల ఆనందిస్తున్నది. అంతేకాని లోకాపవాదుకు వెరచి ఆయన తన్ను పరిత్యజించాడని ఆమె ఎరుగదు.

లక్ష్మణుడు కూడా వదినెగారికి అసలు విషయం చెప్పలేదు. అవును, ఇంతటి దుఃఖవార్త ఆమెకెలా తెలియజేస్తాడు? అయినా సీతకు అనుమానం కలుగనే కలిగింది. ఆమెకు ఎన్నో అపశకునాలు కనిపించాయి. కుడికన్ను అదిరింది. ఆమె గుండె గుబగుబ లాడింది. ముఖం వాడిన తామరపువ్వులా

అయింది. తన భర్తకూ, ఆయన తమ్ములకూ ఎలాంటి ఆపద రాకూడదని, శుభం కలగాలని మనసులోనే దేవుని ప్రార్థించుకున్నది.

అంతట వారు గంగాతీరం చేరుకున్నారు. "పరమ పావని అయిన సీతను అరణ్యంలో విడిచిపెట్టవద్దు. ఈ కార్యం చేయడం తగదు" అని లక్ష్మణుని గంగావాహిని అలలు అనే తన హస్తాలతో వారిస్తున్నట్లుగా కనిపించింది.

సారథి సుమంతుడు రథాన్ని నిలిపాడు. లక్ష్మణుడు సీతను రథం నుండి ఒక ఇసుక తిన్నె మీద దించాడు. నిషాదుడు ఒక పడవ తీసుకుని రాగా అందులో వదినెగారిని ఎక్కించి, తానూ ఎక్కాడు. తన కర్తవ్యం, నిర్వర్తించినట్లుగా లక్ష్మణుడు సీతతో గంగానదిని దాటాడు. అవతలి ఒడ్డున వదినెను దింపాడు.

ఇక అప్పుడు అతనికి నోట మాట రాలేదు. లక్ష్మణుని వాలకం చూచి జానకి కలవరపడింది. సౌమిత్రి చివరకు ఎలాగో, విశ్వప్రయత్నం మీద గొంతు పెకల్చుకుని, పొంగి పొరలి వస్తున్న దుఃఖాన్ని లోలోపల దిగమ్రింగుకుంటూ, కన్నీరు తుడుచుకుంటూ అసలు విషయం చెప్పాడు. మహోత్పాతం సంభవించినప్పుడు కారుమేఘం, శిలావర్షం కురిపించి నట్లుగా, రామాజ్ఞను ఆమెకు ఎరుకపరిచాడు.

కర్ణకఠోరమైన ఆ మాటలు చెవిన పడగానే జానకీదేవి అవమానం అనే సుడిగాలికి లత వలె కంపించిపోయింది. ఆమె ధరించిన అలంకారాలు ఆభరణాలు జలజల నేలరాలినవి. మొదలు నరికిన చెట్టులా తన తల్లియైన పుడమిపై ఒరిగిపోయింది.

అయితే, ఇక్ష్వాకువంశ సంజాతుడూ, పుణ్యచరిత్రుడూ అయిన శ్రీరాముడేమిటి ? నిన్ను విడిచిపెట్టడమేమిటి ?, అని అంటున్నట్లుగా భూదేవి, తన కుమార్తె సీతకు తనలో ప్రవేశం ఇవ్వకపోయింది.

మూర్ఛపోయి పడివున్న వదినెగారికి సౌమిత్రి శైత్యోపచారాలు చేసాడు. తెలివి రానంత వరకూ ఆమెకు దుఃఖం తెలియలేదు. తరవాత స్పృహ వచ్చింది. అప్పుడామె మనసు తుకతుక ఉడికిపోవడం మొదలు పెట్టింది. ఆ తల్లి పడిన వేదనా, పొందిన దుఃఖమూ వర్ణనాతీతం.

అయితే, అంతటి దుఃఖంలో కూడా ఆ సాధ్వీ, తన భర్తను పల్లెత్తుమాట అనలేదు. ఏ పాపమూ లేని తనను భర్త నిష్కారణంగా పరిత్యజించినప్పటికీ ఆమె, పతిని నిందిస్తూ ఒక్క పలుకైనా పలుకలేదు. పైగా తననే నిందించు కున్నది. తన దురదృష్టాన్ని నిందించుకున్నది. తను పాపాత్మురాలనని, తను నోచిన నోము లిట్టివని తన్ను తానే పదే పదే దూషించుకున్నది.

లక్ష్మణుడు ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు. సమీపంలో ఉన్న వాల్మీకి మహర్షి ఆశ్రమానికి వెళ్ళమని చెప్పాడు. ఆశ్రమానికి త్రోవ ఎరిగించాడు.

"తల్లీ! ఏం చేసేది ? అన్నగారి ఆజ్ఞను తిరస్కరించలేని పరాధీనుణ్ణి నేను, నన్ను క్షమించమ్మా!" అని పలికి తల వంచుకున్నాడు లక్ష్మణుడు.

మరిదిపై అణుమాత్రమైన కోపం లేదు. పైగా అతన్ని దయతో చూచింది.

"నాయనా! బాధపడకు. నీ మీద నాకు ఏ మాత్రం కోపం లేదు. అగ్రజుడైన దేవేంద్రునిచే విష్ణువులా మీ అన్నగారిచే నీవు పరతంత్రుడవు నాయనా! నాకు తెలుసు. అత్తగార్లు ముగ్గురికీ నా నమస్కారాలని చెప్పు. నా గర్భంలో ఉన్న తమ కుమారుడి సంతానానికి శుభం కోరవలసిందిగా నేను మరీ మరీ వేడుకుంటున్నానని వారికి విన్నవించు నాయనా!" అని పలికింది.

పిమ్మట సీత, తన భర్త రామచంద్రమూర్తికి తన మాటలుగా ఇలా చెప్పమని సౌమిత్రిని కోరింది :

"అలనాడు అందరూ చూస్తుండగా అగ్నిప్రవేశం చేసి పరిశుద్ధురాలైన నన్ను, ఇప్పుడెవరో లోకులమాట విని పరిత్యజించడం గొప్పదైన మీ వంశానికి తగిన పనేనా ? అయినా దయాసముద్రులైన రామభద్రులు బుద్ధిపూర్వకంగా నన్ను ఇలా విడిచిపెట్టారని నేను అనుకోను. పూర్వజన్మలో నేను చేసుకున్న పాపమే నాకీ మహాకష్టానికి కారణమై ఉంటుంది. పూర్వం మీరు రాజ్యలక్ష్మిని కాదని నన్ను తీసుకుని అడవులకు వెళ్ళారు. అలాంటి నేను ఈనాడు ఆ రాజ్యలక్ష్మి ఇంటికి చేరుకోవడం వల్ల, ఆమె నన్ను ఉండనీయక వెళ్లగొట్టి ఉంటుంది. మీ ఎడబాటు వలన దుస్సహంగా ఉన్న ఈ జీవితాన్ని ఇప్పుడే విడిచిపెట్టి ఉందును – కానీ నా గర్భంలో మీ సంతానం ఉన్నది. అందువల్ల ప్రసూతి ప్రమాదం నుండి బయటపడగానే, తపస్వినిగా జీవితశేషం గడుపుతాను. వచ్చే జన్మలో కూడా నేను మీకే భార్యను కావాలని కోరుకుంటున్నాను! కనుక మీతో నాకెన్నడూ ఎడబాటు కలుగదు. వర్ణాశ్రమ రక్షణ రాజులకు మనువు విధించిన ధర్మం కాబట్టి తక్కిన అందరు తపస్సులను రక్షిస్తున్నట్లే, ఇప్పుడు కూడా నన్ను మీరే రక్షిస్తూ ఆశ్రయం లేని నాపై దయ దలుస్తు ఉండవలసినది."

సీతాదేవి ఇలా శ్రీరాముడికి చెప్పిన సందేశాన్ని విని సౌమిత్రి, ఆమె పాదాలకు నమస్కరించాడు. ఆమె వద్ద సెలవు పుచ్చుకుని అక్కడ నుంచి మరల అయోధ్యకు పయనమైనాడు.

కనుచూపు మేర దాటిపోయేవరకూ లక్ష్మణుని చూస్తూ అలాగే నిలుచున్నది జానకి. అతను కంటికి కనిపించకుండా పోగానే దిక్కులేని దాని వలె భయంతో వివశురాలై బిగ్గరగా రోదనం చేయడం మొదలుపెట్టింది.

సీతాదేవి ఏడుపు విని నృత్యం చేస్తున్న నెమళ్ళు ఆగిపోయినవి. చెట్లు కూడా శోకిస్తున్నట్లు పూలు రాల్చాయి. లేళ్ళు నోట కరచుకుని ఉన్న

దర్భపోచలను అలాగే విడిచిపెట్టినవి. ఆ విధంగా ఆ వనం యావత్తూ సీత దుఃఖంలో పాలుపంచుకుని శోకించినట్లు కనిపించింది.

ఆ సమయంలోనే వాల్మీకి మహర్షి, కుశలు, సమిధలు సేకరించుకోడానికై అడవిలోకి వచ్చాడు. జానకి ఏడుపు విన్నాడు. పూర్వం బోయవాని బాణానికి తెగిపడిన పక్షిని చూడగానే ద్రవించినట్లుగా ఆయన హృదయం ద్రవించింది. ఆనాడు శోకమే శ్లోకంగా రూపొంది ఆదికవితను వెలువరించినట్లుగా, ఇప్పుడా మహాకవి సీత రోదనం వినిపిస్తున్న దిక్కునకు నడచి వచ్చాడు. శీఘ్రమే ఆమె ఉన్న చోటుకి చేరుకున్నాడు.

మహర్షిని చూచి సీత కన్నీరు తుడుచుకుని ఆయన పాదాలకు ప్రణమిల్లింది. ఆమె గర్భవతి అని గుర్తించాడు వాల్మీకి. ""సుపుత్రా ప్రాప్తిరస్తు!" అని దీవించాడు.

పిమ్మట "వైదేహీ! నీవు నమస్కరించగానే, లోకోపవాదుకు వెరచి, భర్త నిన్ను పరిత్యజించాడని తెలుసుకున్నాను. విచారించకమ్మా నీ విప్పుడు నీ తండ్రి ఇంటికే వచ్చావు. శ్రీరాముడు లోకకంటకులైన రాక్షసులను సంహరించాడు. సౌజన్యానికి మారుపేరు అతను. అయినప్పటికీ అకస్మాత్తుగా నిన్ను ఇలా విడిచిపెట్టి, కళంకం తెచ్చుకున్నాడు. అతని మీద కూడ కోపం వస్తూనే ఉంది. అయినా చూడమ్మా! గొప్ప కీర్తికలవాడైన నీ మామ దశరథుడు మాకు స్నేహితుడు. మహాజ్ఞాని అయిన నీ తండ్రి జనకమహారాజు మాకు ఆప్తుడు. నీవా పతివ్రతలలో అగ్రగణ్యువు. ఈ మూడింటివల్ల నిన్ను నేను సర్వవిధాల కాపాడవలసి ఉన్నది.

"మునిజనుల సంసర్గం చేత ఈ వనంలో క్రూరమృగాలు కూడా సాధువులుగా ఉంటాయి. కనుక నీ కిక్కడ ఎలాంటి భయం లేదు. నీవు యథేచ్ఛగా సంచరించవచ్చు. ప్రసూతి సమయంలో నీకు ఎలాంటి కష్టమూ

కలుగకుండా చూస్తాను. పుణ్యప్రదమగు తమసానదిలో స్నానమాడి సైకత స్థలాలలో బలిక్రియలు నిర్వర్తించుదువుగాని. దాని వలన నీకు మనశ్శాంతి లభించగలదు. ఇక్కడ మునికన్యలు నీకు సపర్యలు చేస్తారు. నీకు కావలసిన ద్రవ్యాలన్నీ తెచ్చి ఇస్తారు. ఇక్కడి చెట్లకూ, మొక్కలకూ నీళ్ళుపోసి పెంచుతూ ఉండు. నీ గర్భస్థ శిశువు కూడా అలాగే పెరుగుతాడు!" అని చెప్పాడు.

వాల్మీకి మహర్షి ఇలాంటి మాటలు చెప్పగా విని జానకి, ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. పిమ్మట ఆయన సీతను వెంటబెట్టుకుని సాయంకాలం వేళకు తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాడు.

అక్కడ యజ్ఞవేదికల ప్రక్కన లేడిపిల్లలు పడుకుని ఉన్నాయి. మృగాలన్నీ ఎవరికీ అపకారం చేయకుండా శాంతంగా తిరుగాడుతున్నాయి. అమావాస్య నాడు పితృదేవతలు ఆరగించగా మిగిలిన సన్నని చంద్రకళను ఓషధులలో చేర్చినట్లు జానకిని వాల్మీకి తన ఆశ్రమంలో మునికన్యల మధ్య చేర్చాడు!

సీత రావడం చూచి తాపసకాంతలు చాలా సంతోషించారు. ఆమెను ప్రేమతో ఆదరించారు. వారు ఆమెకు ప్రత్యేకంగా ఒక పర్ణశాలలో వసతి ఏర్పాటు చేశారు. సీత ఆ పర్ణశాలలో ఉంటూ నారచీరలు ధరించి, నిత్యం దేవపూజ, అతిథిపూజ చేస్తూ ఒక తాపసి వలెనే రోజులు గడిపింది. కేవలం భర్త సంతానాన్ని కాపాడే నిమిత్తమే ఆమె జీవించి ఉన్నది!

ఇక్కడ ఇలా ఉండగా, అక్కడ అయోధ్యలో సీతా వియోగం వల్ల శ్రీరాముడు పరితపించి పోతున్నాడు. వదినెగారిని వనంలో విడిచి వచ్చానని లక్ష్మణుడు అన్నగారికి విన్నవించుకున్నాడు. ఆ మాట వినగానే రామచంద్రుడు పుష్యమాసంలో చంద్రుడు మంచుబిందువులు రాల్చినట్లు కళ్ళ నుండి దుఃఖాశ్రువులు రాల్చాడు!

లోకుల నుండి వచ్చిన అపవాదు భరించలేక, వంశ ప్రతిష్ట పాడవుతుందేమోనన్న భయం చేత రాముడు జానకిని అడవులకు పంపాడే కాని మరో

కారణం వ్లల కాదు. తన మనోపీఠం నుండి మాత్రం ఆమెను వెళ్ళగొట్టలేకపోయాడు!

అయినా ధీశాలి అయిన రాఘవుడు మరల సతీవియోగ దుఃఖాన్ని లోలోపల దిగమ్రింగాడు. అప్రమత్తతతో వర్ణాశ్రమ ధర్మాలను రక్షిస్తూ ప్రాణాలను నిలపుకోడానికి మాత్రమే అవసరమగు భోగాలు అనుభవిస్తూ పరమశాంతుడై ఎప్పటి వలె ప్రజలను పాలిస్తూ వచ్చాడు.

అక్కడ వాల్మీకి ఆశ్రమంలో సీత, తన భర్త మరొక భార్యను చేపట్టలేదని, తన ప్రతిరూపం దగ్గర లేకుండా యజ్ఞం చేయడని విని, పతివియోగ దుఃఖాన్ని ఎలాగో భరించగలిగింది.

## 15

**వై**దేహిని విడిచిపెట్టిన తరవాత శ్రీరామచంద్రుడు ఒక్క వసుంధరను మాత్రమే అనుభవిస్తూ వచ్చాడు. ఆ సమయంలో యమునా తీరమందలి మహర్షులను లవణుడనే రాక్షసుడు బాధించసాగాడు. ఆ రాక్షసుడు తమ యజ్ఞయాగాదులకు భంగం కలిగిస్తూ ఉండడం చేత ఋషులు రాఘవుని వద్దకు వచ్చి మొరపెట్టుకున్నారు.

"రామచంద్రా! నీ వున్నావు కదా అని మేము యజ్ఞయాగాదులు నిశ్చితంగా చేసుకుంటున్నాం. కానీ లవణాసురుడు మా తపశ్చర్యలకు విఘ్నం కలిగిస్తున్నాడు. శాపాయుధులమైన మేము బ్రహ్మతేజస్సుతో ఆ రక్కసుని మదం అణచగలవారమే. అయితే, సమర్థుడవైన నీ వంటి ప్రభువు ఉండగా, ఇలాంటివాటికి ఋషుల తమ తపస్సును వ్యయం చేయరు. విష్ణ్వంశ సంభూతుడవైన నీవు ధర్మరక్షణ కోసమే కదా ఈ పుడమిపై అవతరించింది!' అని వారు వేడుకున్నారు.

శరణాగత వత్సలుడగు రాఘవుడు మునుల కష్టాలు తీరుస్తానని మాట ఇచ్చాడు. ఆ మహర్షులు లవణాసురుని సంహరించడానికి ఉపాయం చెప్పారు.

"రామా! ఆ లవణుడు శూలాన్ని ధరించి ఉండగా వానిని ఎవరూ జయించలేరు కాబట్టి వాడి దగ్గర శూలాయుధం లేని సమయం కనిపెట్టి సంహరించాలి" అని తెలియజేశారు.

అప్పుడు రాఘవుడు తన తమ్ముడైన శత్రుఘ్నుని పిలిచాడు. లవణాసురుని వధించి పేరు సార్థకం చేసుకోమన్నాడు. తన వంశంలో తను ఒక్కడే కాక తన తమ్ములు కూడా మహాశూరులని లోకానికి తెలియడం కోసమే రాముడు ఈ పనిని శత్రుఘ్నుడికి అప్పగించాడు.

అంతట శత్రుఘ్నుడు అన్నగారి ఆజ్ఞ ప్రకారం లవణాసురుని పై యుద్ధానికి బయలుదేరాడు. రాముడికి నమస్కరించి , దీవన లందుకుని రథం ఎక్కాడు. అతనికి సహాయంగా పెద్ద సైన్యం వెంట వెళ్ళింది. మహర్షులు త్రోవ చూపుతుండగా తేజస్వి అయిన శత్రుఘ్నుడు సైన్యంతో లవణాసురుని పై యుద్ధానికి వెడుతూ, వాలఖిల్యులను గూడిన అంశుమంతుని వలె ప్రకాశించాడు!

త్రోవలో వాల్మీకి మహర్షి ఆశ్రమం వద్ద శత్రుఘ్నుడు విడిది చేశాడు. అప్పుడు వాల్మీకి తన తపోమహిమ వల్ల అమూల్యమైన వస్తు సంచారాలు, విశిష్టమైన భోజన పదార్థాలు సమకూర్చి శత్రుఘ్నునకు అతిథి మర్యాదలు చేశాడు.

ఆ రాత్రే వాల్మీకి ఆశ్రమంలో సీత ఇద్దరు మగ శిశువులను కన్నది. తన ప్రభువుకు పుత్రసంతానం కలిగిందని తెలిసి శత్రుఘ్నుడు చాలా

సంతోషించాడు. మరునాడు ఉదయం మహర్షి వద్ద సెలవు పుచ్చుకుని మరలా ప్రయాణం సాగించాడు.

ఆ విధంగా శత్రుఘ్నుడు తన సేనతో ప్రయాణం చేసి లవణాసురుని పట్టణమగు మధూపఘ్నం చేరుకున్నాడు. ఆ సమయంలో లవణుడు అడవి నుంచి అనేక జంతువులను వేటాడి తెస్తున్నాడు.

కుంభీనసి కుమారుడైన లవణాసురుడు పొగలా నీల లోహితచ్ఛాయ కలిగి ఉన్నాడు. ఎర్రని మంటల వంటి రాగి వెంట్రుకలు కలిగి భయంకరంగా కనిపిస్తున్నాడు. వాడి శరీరం నుండి కొవ్వు కంపు వస్తున్నది. వాడి వెంట రాక్షసమూక ఉన్నది. జంగమ రూపంలో ఉన్న చితాగ్ని వలె గోచరిస్తున్నాడు!

ఆ సమయంలో లవణుని వద్ద శూలాయుధం లేకపోవడం గమనించి శత్రుఘ్నుడు, తక్షణమే అతని త్రోవకు అడ్డు నిలిచాడు. అవును, శత్రువు ఆయువు పట్టు ఎక్కడున్నదో తెలుసుకుని దెబ్బకొట్టే వాడికి విజయం తథ్యం!

తన ఎదుట నిర్భయంగా నిలచిన శత్రుఘ్నుని చూచి లవణుడు "ఓరీ! ఎవడవు నీవు ? సరిగ్గా నా భోజన సమయానికి వచ్చావు! బ్రహ్మ నిన్ను నాకు ఆహారంగా పంపి ఉంటాడు!" అని హుంకరించాడు.

తుంగమొక్కను పెరికినట్లుగా ఒక మహావృక్షాన్ని పెరికాడు. శత్రుఘ్నుని పై విసిరాడు. అయితే రాముని తమ్ముడు ఆ వృక్షాన్ని మధ్యలోనే తన వాడి బాణంతో తునాతునకలు చేశాడు. తను వేసిన వృక్షం అలా వ్యర్థం కావడం చూచి లవణుడు కోపంతో మండిపడ్డాడు. యమధర్మరాజు ముష్టిలా ఉన్న ఒక పెద్ద కొండరాతిని ఎత్తి శత్రుఘ్నుని పై విసరబోయాడు. అంతలోనే శత్రుఘ్నుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి ఆ పాషానాన్ని పొడి పొడి చేశాడు.

అప్పుడు లవణుడు ప్రళయకాల రుద్రుని వలె భయంకరాకారుడై కుడి చెయ్యి పైకి ఎత్తి, కొండగాలికి తాళవృక్షం ఎగసివచ్చినట్లుగా శత్రుఘ్నుని

పైకి వచ్చాడు. అయితే శత్రుఘ్నుడు తృటికాలంలో వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించగా అది ఆ రక్కసుని గుండెలు చీల్చివేసింది. లవణుడు పెద్ద పెట్టున హాహాకారం చేస్తూ కొండవలె నేల కూలిపోయాడు. శత్రుఘ్నుని వైష్ణవాస్త్రం వల్ల పుడమి కంపించింది. అయితే మహర్షుల కంపము పోగొట్టింది!

ఆ క్షణంలో ఆకాశం నుండి పక్షులు గుంపులు గుంపులగా వచ్చి లవణాసురుడి కళేబరం పై వాలాయి. శత్రుఘ్నునిపై దివ్యపుష్పాలు రాలాయి! లవణాసురుని ఇలా వధించిన శత్రుఘ్నుడు, ఇంద్రజిత్తును చంపిన లక్ష్మణునకు తాను తగిన తమ్ముడనని అనుకుని సంతోషించాడు. మహర్షులు అతని పరాక్రమాన్ని ఎన్నో విధాల కీర్తించారు. అయితే, పొగడ్తలు ఇష్టం లేని శత్రుఘ్నుడు తల వంచి వారికి నమస్కరించాడు. వినయ సంపత్తి వల్ల అతని పరాక్రమం మరింత వన్నెతో ప్రకాశించింది.

అంతట శత్రుఘ్నుడు ఆ యమునాతీరంలో మధుర అనే సుందరమైన నగరం నిర్మించాడు. దివ్యభవనాలతో, ప్రాకార గోపురాదులతో, సకల సంపదలతో భూలోక స్వర్గంలా ఉన్న ఆ పట్టణంలో శత్రుఘ్నుడు తన రాజప్రాసాదంపైకి ఎక్కి ఒక్కసారి చుట్టూ కలయ చూచాడు. చక్రవాక పక్షుల సముదాయంతో, భూదేవికి బంగారు నగలుగల జడలా ఉన్న యమునానది అతనికి కనిపించింది! అతను ఎంతో ఆనందించాడు.

అక్కడ ఆశ్రమంలో సీతాదేవి పుత్రులకు వాల్మీకి మహర్షి యథావిధిగా జాతకర్మాది సంస్కారాలు నిర్వర్తించాడు. దశరథుడిపైన, జనకుడి పైన తనకు గల స్నేహవాత్సల్యం చేత ఆయన జానకి పుత్రులకు ఏ లోపమూ కలగనివ్వలేదు. ఆ కవలపిల్లలు, కుశలవలముచేత తల్లి కడుపు నుండి వేరు చేయబడినవారు కావటం వల్ల వారికి కుశుడు, లవుడు అని పేర్లు పెట్టాడు.

శైశవదశ గడచిన తరవాత ఆ బాలకులకు వేదం ఉపదేశించాడు. తరవాత తాను రచించిన రామాయణ కథ గానం చేయడం వారికి నేర్పాడు.

కుశలవులా కథ నేర్చుకొని తల్లి ఎదుట మనోహరంగా గానం చేస్తూ వచ్చారు. జానకి రామకథ వింటూ భర్త వియోగ దుఃఖాన్ని కొంత మరచిపోయేది.

ఇక్కడ సీత ప్రసవించిన సమయంలోనే అక్కడ త్రేతాగ్నుల వంటి భరత లక్ష్మణ శత్రుఘ్నులకు కూడా వారి వారి భార్యలందు ఇద్దరేసి పుత్రులను పొందారు. శత్రుఘ్నుడి కుమాళ్ళు శత్రుఘాతి, సుబాహువు. శత్రుఘాతికి మధురానగరాన్ని, సుబాహువునకు విదిశానగరాన్ని అప్పగించాడు. శత్రుఘ్నుడు తరవాత తాను మరల అయోధ్యకు పయనమైనాడు.

అయోధ్యకు తిరిగి వస్తూ మధ్యలో వాల్మీకి ఆశ్రమం ఎదురైనప్పటికీ, ఆయన ప్రశాంతికి పదే పదే భంగం కలిగించడం మంచిది కాదని శత్రుఘ్నుడు ఆ ఆశ్రమంలోకి వెళ్ళకుండా నేరుగా ప్రయాణం సాగించాడు.

లవణాసురుని జయంచి వస్తున్నాడని తెలిసి అయోధ్యాపురవాసులు నగరవీధులన్నీ వైభవంగా అలంకరించి జయజయ ధ్వానాలతో శత్రుఘ్నునికి స్వాగతం పలికారు.

పురజనుల గౌరవమర్యాదలు అందుకుంటూ శత్రుఘ్నుడు అయోధ్యలో ప్రవేశించి, కొలువుతీర్చి ఉన్న రామచంద్రుని సందర్శించాడు. లవణాసురుని సంహరించిన తమ్ముని చూడగానే రాఘవుడు, కాలనేమిని వధించిన విష్ణుమూర్తిని చూచి దేవేంద్రుడు సంతోషించినట్లుగా సంతోషించాడు. అతనిని అభినందించాడు.

ప్రయాణంలో విశేషాలు తెలుపమని రాముడు అడుగగా, తాను అయోధ్య నుండి బయలుదేరినది మొదలు తిరిగి వచ్చే వరకూ జరిగిన సంగతులు అన్నగారికి వినిపించాడు శత్రుఘ్నుడు. అయితే, వదినెగారికి కుశలవులు జన్మించిన విషయం మాత్రం అన్నకు చెప్పలేదు. ఈ కుమాళ్ళను

తండ్రికి అప్పగించే సమయం వచ్చేదాకా, విషయం రహస్యంగా ఉంచమని వాల్మీకి ఆజ్ఞాపించడం చేత శత్రుఘ్నుడు అలా చేశాడు.

అంతట ఒకనాడు రాఘవుడు నిండు సభ తీర్చి ఉండగా ఒక గ్రామం నుండి బ్రాహ్మణుడొకడు సభాద్వారము చెంతకు వచ్చి నిలుచున్నాడు! అతని చేతుల్లో ఒక మృతబాలకుడున్నాడు! బ్రాహ్మణు డా బాలుని అక్కడ క్రింద పడుకోబెట్టాడు. పెద్ద పెట్టున రోదనం చేయడం మొదలు పెట్టాడు.

"ఓ, భూదేవీ! నీవు దశరథ మహారాజు చేతి నుండి జారిపోయి రాముడి చేత చిక్కావు. మిక్కిలి కష్టాలపాలైనావు. భూమాతా! నీకు ఎంతటి దుస్థితి సంభవించిందమ్మా!" అని ఇలా బ్రాహ్మణుడు శోకించడం చూచి రాఘవుడి మనసు చివుక్కు మన్నది. అతని దుఃఖానికి కారణం ఏమిటో అడిగి తెలుసుకున్నాడు. విషయం తెలియగానే ఎక్కడేని సిగ్గుతో కుంచించుకు పోయాడు. ఆ బ్రాహ్మణ బాలుడు అకాల మృత్యువాత పడ్డాడు.

అవును ఇక్ష్వాకు రాజుల పాలనలో ఇలాంటి అధర్మం జరగడానికి వీలు లేదు. అప్పుడు ధర్మరక్షకుడైన రాఘవుడు ఆ బ్రాహ్మణుని "స్వామీ! ఒక్క ముహూర్తకాలం నన్ను క్షమించి ఓపికతో ఉండండి" అని వేడుకున్నాడు.

ఆ విధంగా ద్విజుని శాంతింపజేసి బాలుని మరణానికి కారణభూతుడైన వానిని శిక్షించాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే పుష్పకవిమానాన్ని తలచుకున్నాడు. మరుక్షణంలోనే ఆ దివ్య విమానం వచ్చి ఆయన ఎదుట నిలిచింది. రాముడు ఆయుధాలు ధరించి విమానం ఎక్కాడు.

అప్పుడు ఆకాశవాణి ఇలా పలికింది, "రామచంద్రా! నీ ప్రజలలో ఒకడు అపకారం చేశాడు. అతన్ని కనుగొని శిక్షించు."

ఈ పలుకులు విని రాఘవుడు పుష్పకవిమానంపై తన రాజ్యంలో అన్ని దిక్కులా ప్రయాణం చేశాడు. ఒకచోట ఒకడు ఘోరంగా తపస్సు చేస్తూ

ఉండడం రాముడికి కనిపించింది. అక్కడ విమానం ఆపి అతన్ని విషయం అడిగి తెలుసుకున్నాడు.

తపస్సు చేస్తున్న వ్యక్తి తాను శంబూకుడనే ఒక శూద్రుడననీ, స్వర్గ ప్రాప్తికై ఇలా చేస్తున్నాననీ చెప్పాడు. ఆనాటి వర్ణాశ్రమ ధర్మం ప్రకారం శూద్రుడు అట్టి తపస్సుకు అర్హుడు కాడు. అతని దోషం వల్లనే బ్రాహ్మణ పుత్రుడు అకాల మరణం పొందడం జరిగింది. అందువల్ల వెంటనే అతన్ని శిక్షించడానికి రాముడు ఖడ్గం తీశాడు. శంభూకుని కంఠం నరికివేశాడు. రాఘవుని చేతిలో మరణించిన శంబూకునకు, తపస్సు వల్ల కూడా సాధ్యం కాని పరమపదం లభించింది.

అంతట రాఘవుడు అక్కడ నుంచి అయోధ్యకు బయలుదేరాడు. త్రోవలో చంద్రునితో కూడిన శరదృతువులా మహాతేజస్సుతో ప్రకాశిస్తున్న అగస్త్యమహర్షిని సందర్శించాడు. అగస్త్యుడు రామునికి సకల మర్యాదలు చేసి గౌరవించాడు. పూర్వం సముద్రుడు తనకు సమర్పించిన దివ్యరత్నా భరణాన్ని రాఘవునకు కానుకగా ఇచ్చాడు. దాశరథి ఆ దివ్యాలంకారాన్ని కంఠసీమ అలంకరించుకుని అయోధ్యకు తిరిగి వచ్చాడు.

మృతుడై ఉన్న బ్రాహ్మణపుత్రుడు అప్పటికే మరల జీవించడం వల్ల బ్రాహ్మణుడు అమితానందం పొంది ఉన్నాడు. రాముని చూడగానే ఆ భూసురుడు ఆయనను అనేక విధాల స్తుతించాడు. లోగడ తాను పలికిన నిందా వాక్యాలకు మన్నించమని వేడుకుని, కుమారునితో నిజవాసానికి వెళ్ళిపోయాడు.

తరువాత రామభద్రునకు అశ్వమేధయాగం చేయాలని సంకల్పం కలిగింది. వెంటనే అందుకు అవసరమగు ఏర్పాట్లన్నీ చేశాడు. యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు.

దాశరథి అశ్వమేధయాగానికి పూనుకున్నట్లు తెలియగానే భూమి మీద గల రాజులంతా, మేఘుడు వర్షధారలు కురిపించినట్లుగా అమూల్య కానుకలను, వస్తు సంపదలను తెచ్చి సమర్పించారు. విభీషణాది దానవులూ, సుగ్రీవాది వానరులూ కూడా అపారంగా ధన ద్రవ్యాలు తెచ్చి ఇచ్చారు. ఆ యజ్ఞానికి భూలోకంలో నుండే కాక, స్వర్గములో ఉండే మహర్షులు కూడా వచ్చారు. మహర్షులతో అయోధ్య, అప్పుడే లోకాలను సృష్టించిన బ్రహ్మ దేవుని శరీరంలా ప్రకాశించింది.

సమస్త లోకాలూ ప్రశంసించేటట్లుగా శ్రీరాముడు, సీతను వదలి పెట్టి కూడా రెండవ భార్య లేకుండానే యజ్ఞం ప్రారంభించాడు. సీతాదేవి బంగారు ప్రతిమను తన ప్రక్కన ఉంచుకుని యజ్ఞ దీక్షితుడైనాడు. ఎప్పుడూ యజ్ఞాలకు విఘ్నం కలిగించే రాక్షసులు ఇప్పుడు స్వయంగా యాగ రక్షణకు రాడం చేత, శ్రీరాముని యాగం నిర్విఘ్నంగా సాగుతున్నది.

ఆ సమయంలో గురువర్యులైన వాల్మీకి మహర్షి ఆదేశానుసారం లవ కుశులు అయోధ్యకు వచ్చారు. మహర్షి రచించిన రామాయణ కథను అక్కడక్కడ గానం చేస్తూ నగరంలో సంచరించారు. కథా, రామకథ. కవిత్వమా, వాల్మీకి మహర్షిది. గానం చేసేవారా, కిన్నర కంఠకులు లవ కుశులు! ఇక ఆ కావ్యగానం ఏ శ్రోత హృదయాన్ని ఆకర్షించకుండా ఉంటుంది?

"ఎవరో బాలకులు మహా తేజస్సుతో వెలిగిపోతున్నారు. చూడ ముచ్చట గొలుపుతున్నారు. రామకథను మధురాతి మధురంగా గానం చేస్తున్నారు!" అని అయోధ్యా పురవాసులు చెప్పుకోగా విన్నాడు రామభద్రుడు. వెంటనే వారిని తన సమక్షానికి పిలిపించాడు. వారి రూపు రేఖలు కళ్ళారా చూచి ఆనందించాడు. పాడమన్నాడు. వారు పాడారు. రాముడు చెవులు దొప్పలు చేసుకుని విన్నాడు. పరవశుడైనాడు.

ఒక్క రాముడే కాదు. ఆ సభలో వారంతా ఆ గాన మాధుర్యానికి తన్మయులైనారు. అందరి కనుల నుండి అశ్రువుల రాలాయి. ఉషఃకాలమున మంచు బిందువులు రాల్చిన వనస్థలిలా శోభిల్లింది ఆ సభ!

ఆ బాలకులలో అచ్చంగా రాముని పోలికలు అచ్చు గ్రుద్దినట్లు కనిపిస్తున్నాయి. రెప్ప వాల్చకుండా వారిని చూచారు. ఒకరు చెప్పవలసిన అవసరం లేకుండానే ఆ బాలకులు రాముని కుమాళ్ళని ప్రజలు అనుకున్నారు. అయితే అలాంటి కుమాళ్ళపట్ల రాముడు ఎందుకు ఉపేక్షాభావం వహించాడా అని ఆశ్చర్యపోయారు. వారి గాన మాధుర్యం కన్నా ఇదే వారికి ఎక్కువ విస్మయం కలిగించే విషయం అయింది.

చివరకు రాఘవుడు ఆ బాలకులను "నాయనలారా! ఈ కథ రచించిన కవి ఎవరు? మీ కిది ఎవరు నేర్పారు!" అని ప్రశ్నించాడు.

అందుకు లవకుశులు, ఇది వాల్మీకి మహర్షి రచించాడనీ, ఆయనే తమకు నేర్పాడనీ తెలియజేశారు.

అప్పుడు రాముడు తన తమ్ములను వెంటబెట్టుకుని వాల్మీకి మహర్షి సమీపానికి వెళ్ళాడు. భక్తితో నమస్కరించాడు. పిమ్మట తన రాజ్యం యావత్తూ ఆ మహర్షికి ధారపోశాడు.

అంతట పరమ దయాళువైన వాల్మీకి మహర్షి "రాఘవా! ఈ బాలకులు ఎవరో కాదు. సీతాదేవి పుత్రులు. నీ కుమాళ్ళే సుమా! వీరినీ, జానకిని పరిగ్రహించు!" అని పలికాడు.

ఆ మాటలు వినగానే రాముడు నిలువునా నీరైపోయాడు. "తండ్రీ ! మీ కోడలు నా కళ్ళ ఎదుటనే అగ్నిలో ప్రవేశించి పరిశుద్ధురాలయినది. అయినప్పటికీ దుర్మార్గుడగు రావణుడు చేసిన అకార్యం కారణంగా లోకులు

సీత పాతివ్రత్యాన్ని విశ్వసించలేదు. కాబట్టి జానకి మరొకసారి తన శీలాన్ని ప్రజల సమక్షాన ఋజువు పరచుకోవలసి ఉన్నది. ఆమె అలా చేస్తే, కుమాళ్ళతో కూడా ఆమెను స్వీకరిస్తాను.” అని చెప్పాడు.

రాముడు ఇలా చెప్పగానే వాల్మీకి తన శిష్యులను ఆశ్రమానికి పంపి, సీతను అక్కడికి రప్పించాడు. సీత యజ్ఞశాలకు వచ్చింది. అప్పుడ రాముడు తన యజ్ఞకార్యాదులను అలా నిలిపి ఉంచి, ముందు అయోధ్య పురవాసులను అక్కడ సమావేశపరిచాడు. తరవాత చేయవలసిన కార్యం చేయించడానికి వాల్మీకి మహర్షిని రప్పించాడు.

మహర్షి సర్వసంస్కార యుక్తమైన సావిత్రితో సూర్యుని వలె, పుత్రసహిత అయిన జానకితో తేజస్సంపన్నుడైన రాముని వద్దకు వచ్చాడు.

సీతాదేవి కాషాయ వస్త్రం ధరించి ఉన్నది. భర్త పాదాలపైననే దృష్టి నిలిపి ఉన్నది. అలా మూర్తీభవించిన శాంతి దేవత వలె ఉన్న సీతను చూచినంత మాత్రాననే ఆమె దోషరహిత అనీ, పరమ పవిత్రురాలనీ అంతా అనుకున్నారు. ప్రజలందరూ తలలు వాల్చి, పండి ఒరిగిన వరి మొక్కలవలె నిలుచుండి పోయారు.

అప్పుడు వాల్మీకి మహర్షి సీతతో “అమ్మా! నీ భర్త సమక్షములో, ఈ ప్రజలకు నీ ప్రవర్తన విషయమై ఎలాంటి సందేహం లేకుండా చెయ్యి!” అని పలికాడు.

ఈ మాట వినగానే జానకి భూమి వంక చూస్తూ “తల్లీ! పృథ్వీ! నేను మనోవాక్కాయ కర్మలలో భర్తను తప్ప అన్య పురుష సంపర్కం లేని పతివ్రతనైతే తక్షణం నన్ను నీలో చేర్చుకో!” అని పలికింది.

సీత ఇలా పలికిందో లేదో, భూమి పటపట బ్రద్దలయింది. ఒక పెద్ద బిలం ఏర్పడింది. దానిలో నుంచి కనులు మిరుమిట్లు గొలిపే ఒక

కాంతి వలయంపైకి ఎగసి వచ్చింది. ఆ వలయంలో ఆదిశేషుని పడగలపై సింహాసనమున ఆసీనురాలై ఉన్న భూదేవి సాక్షాత్కరించింది.

భర్త వైపే చూస్తున్న సీతను భూదేవి అందుకుని తన తొడపై కూర్చోపెట్టుకున్నది. అంతే! అదృశ్యురాయింది. పగిలిన భూమి మూసుకున్నది, బిలం పూడిపోయింది.

అయోధ్యావాసులంతా హాహాకారాలు చేశారు. భూదేవి తీసుకు వెళ్ళిన సీతను తిరిగి తీసుకురావడానికై రాముడు ధనుస్సు అందుకున్నాడు. కాని, బ్రహ్మ అక్కడ ప్రత్యక్షమైనాడు.

"రామా! భూమాతపై కోపించకు. ఇది ఇలా జరగవలసిందే!" అని పలికాడు.

రామచంద్రుడు విధాతకు తలొగ్గి శాంతించాడు. యధావిధిగా అశ్వమేధ యాగాన్ని పూర్తిచేశాడు. యజ్ఞానికి వచ్చిన మహర్షులకు, రాజులకు తన ఆప్తులకు – అందరికీ అమూల్యమైన కానుకలు సమర్పించి సన్మానించాడు. వారి వారి నివాసాలకు పంపించి వేశాడు.

తరువాత సీతపై తనకు గల ప్రేమానురాగాలను కుమాళ్ళపై మళ్ళించుకుని, ఎప్పటివలె తన కార్యక్రమాలలో నిమగ్నుడైనాడు.

పిమ్మట రాముడు, యధాజిత్తు విన్నపం మన్నించి సింధు రాజ్యాన్ని భరతుడికి అప్పగించాడు. సింధుదేశంలో తనను ఎదిరించిన గంధర్వులను భరతుడు యుద్ధంలో ఓడించాడు. వారు ఆయుధాలు వదలి వీణలు ధరించారు!

పిమ్మట భరతుడు – తక్షుడు, పుష్కుడు అను తన ఇరువురి కుమారుల పేర రెండు పట్టణాలను నిర్మించాడు. యుక్త వయస్కులయిన తన కుమాళ్ళకు రాజ్యాభిషేకం చేసి ఆ పట్టణాలలో ఉండడానికే నియమించాడు. తాను మరల రామచంద్రుని సన్నిధికి వచ్చాడు.

అలాగే లక్ష్మణుడు తన కుమారులగు అగంద, చంద్రకేతులకు కారాపథ దేశం అప్పగించాడు.

తరువాత కౌసల్య, కైక, సుమిత్రలు మరణించగా రాముడు, తమ్ములతో కలిసి తల్లులకు ఉత్తరక్రియలు యధావిధిగా నిర్వర్తించాడు.

ఇలా ఉండగా ఒకనాడు యమధర్మరాజు ఒక మునివేషంలో రామచంద్రుని దర్శించడానికి అయోధ్య వచ్చాడు. రాముని సమీపించి "మహా రాజా! నేను నీతో ఒంటరిగా మాట్లాడవలసిన పని ఉండి వచ్చాను. మనం మాట్లాడుకుంటూ ఉండగా మరెవ్వరూ రాకూడదు. ఒకవేళ ఎవరైనా వస్తే వారిని నీవు త్యజించవలసి ఉంటుంది!" అని చెప్పాడు.

శ్రీరాముడు అందుకు సమ్మతించాడు. తరవాత వారిరువురూ ఒక ఏకాంతమందిరంలోకి వెళ్ళారు. అప్పుడు మునిరూపంలో ఉన్న యముడు, రాముడితో "రామా! నేను యముడను. ఇక నీవు స్వర్గలోకానికి రావలసిన దని బ్రహ్మదేవుని ఆజ్ఞ. అది వినిపించడానికి నేను ఇక్కడికి వచ్చాను" అని పలికాడు.

లోపల వారిరువురూ ఇలా సంభాషించుకుంటున్న సమయంలోనే శ్రీరాముని సందర్శిచడానికై దుర్వాసమహర్షి అక్కడికి వచ్చాడు. ద్వారం చెంత కావలి ఉన్న లక్ష్మణుడు మహర్షిని సవినయంగా ఆహ్వానించి రామభద్రుడు, అత్యవసరమైన పనిలో ఏకాంత మందిరమున ఉన్నాడని, ఇప్పుడు ఎవరూ లోపలికి వెళ్ళారాదని, కొద్దిసేపు నిరీక్షిస్తూ ఉండమని మహర్షిని వేడుకున్నాడు.

అయితే, నిరీక్షించడానికి దుర్వాసుడు సమ్మతించ లేదు. అప్పుడే రాముని చూడాలన్నాడు. తన రాక ఆయనకు తెలుపమని చెప్పాడు. కోపిష్టి అయిన దుర్వాసుని శాపానికి భయపడి సౌమిత్రి లోపలికి వెళ్ళాడు. అన్నగారి

శపథం తెలిసినప్పటికీ విధిలేక రహస్యమందిరంలో ప్రవేశించాడు. దుర్వాస మహర్షి ఆగమనాన్ని గురించి రాముడికి తెలియజేశాడు. ఇక ఒక్క క్షణమైనా అక్కడ నిలువకుండా ఎకాఎకి సరయూనదికి వెళ్ళాడు. అన్నగారి ప్రతిజ్ఞకు భంగం రాకూడదని నిశ్చయించుకున్న వాడై, ఆయన వియోగాన్ని భరించలేక పరితపిస్తూనే సరయూనది జలాలలో ప్రవేశించాడు. యోగం పట్టి దేహత్యాగం చేశాడు. ఆ విధంగా లక్ష్మణుడు అగ్రజుని కంటె ముందే ప్రాణాలు విడిచి రాముని కీర్తి లోకంలో సుప్రతిష్ఠితం కావించాడు.

లక్ష్మణుడు దివంగతుడైనాడని విన్నాడు రాఘవుడు. తనలోని నాల్గవ అంశం అలా వెళ్ళిపోగా, అప్పుడు రాముడు మూడు పాదాలతోనే ఉన్న ధర్మదేవత వలె తొట్రుపాటు చెందాడు. వెంట వెంటనే అన్ని ఏర్పాట్లూ చేసి తన కుమారులు – కుశుని కుశావతీ నగరానికి, లవుని శరావతీ నగరానికీ పట్టాభిషిక్తులను కావించాడు. పిమ్మట భరత, శత్రుఘ్నులతో అగ్నిని చేతపట్టుకుని, అయోధ్య వదలి ఉత్తరదిశగా వెళ్ళిపోయాడు.

పతిమీది ప్రేమచే గృహత్యాగం చేసినట్లు అప్పుడు అయోధ్య కూడా రామభద్రుని వెంబడించింది!

రామచంద్రమూర్తి సంకల్పం గ్రహించిన సుగ్రీవుడు, విభీషణుడు కూడా ఆయన్ను అనుసరించారు. రాముడు వెళ్ళిన మార్గమంతా ప్రజల కన్నీటి ధారలతో తడిసి ఉన్నది.

రాముడు అలా వెడుతుండగా ఒక దివ్యవిమానం వచ్చి ఆయన ఎదుట నిలిచింది! రాముడు తన తమ్ములతో ఆ విమానం ఎక్కాడు. ఆశ్రితుల యందలి వాత్సల్యం చేత ఆయన, తన వారందరికీ సరయూనదినే స్వర్గానికి నిచ్చెనగా చేశాడు! అందరూ సరయూనదిలో ప్రవేశించి ఒకరినొకరు పట్టుకుని, నెట్టుకొని స్నానం చేస్తున్నట్లుగా జలాలలో మునిగి స్వర్గలోకం చేరుకున్నారు.

ఆ విధంగా వారు గోప్రతరణం వలె సరయూనదిలో క్రుంకులిడి స్వర్గానికి వెళ్ళిన ప్రదేశం గోప్రతరణం అను పుణ్యతీర్థమై, భూలోకంలో ప్రసిద్ధి గాంచింది!

ఆ రీతిగా రావణాది రాక్షస మూకలను సంహరించి, దేవతల కార్యం నెరవేర్చి విష్ణ్వంశ సంభూతుడగు శ్రీరాముడు సమస్త లోకాలూ వ్యాపించి ఉన్న తన శరీరంలో తిరిగి తానే ప్రవేశించినట్లు స్వర్గధామం చేరుకున్నాడు. దక్షిణదిశన లంకాధీశుడైన విభీషణుడు, ఉత్తర దిశన వాయుపుత్రుడైన హనుమంతుడు రెండు కొండల వలె ఉండి రామభద్రుని కీర్తి చంద్రికలను లోకాలలో విస్తరింపజేశారు!

# 16

**కు**శుడు, లవుడు ఆదిగా గల రఘువీరులు ఎనిమిది మంది శౌర్య పరాక్రమాలలోనూ, సద్గుణ సంపత్తిలోనూ తమ తండ్రులకు సమానులై, సూర్యవంశపు రాజుల కీర్తిని లోకంలో సుస్థిరం చేశారు. ఆ అన్నదమ్ములు రాజ్యపాలనలో మిక్కిలి సమర్థులనిపించుకున్నారు. ప్రజలకు ఏ లోటూ రాకుండా పరిపాలన సాగించారు. ఏ విషయంలోనూ వారు వైఫల్యం అనేది ఎరుగరు.

ఆ అన్నదమ్ముల మధ్య పొర పొచ్చులు లేవు. ఎలాంటి వైషమ్యాలు లేవు. చెలియలికట్ట దాటని సముద్రంలా వారు తమ తమ రాజ్యభాగసీమలను దాటకుండా అన్యోన్యంగా ఉంటూ వచ్చారు. వారు లోకానికి అష్టదిగ్గజాల్లా వెలుగొందుతున్నారు.

ఇలా ఉండగా ఒకనాటి అర్థరాత్రి కుశమహారాజు తన శయన మందిరంలో పడుకుని ఉన్నాడు. అంతా నిద్రపోతున్నారు. నిశ్చల నిశ్శబ్ధంగా ఉన్న సమయం అది. అప్పుడు కుశునకు ఎందుకో మెలకువ వచ్చింది.

చూచేసరికి అతని కళ్ళ ఎదుట ఒక యువతి కనిపించింది! బహుకాలంగా చూర దేశమందున్న కళత్రంలా, అంతకు మునుపు ఎన్నడూ చూడని స్త్రీ ఆమె. ఆశ్రితవత్సలుడూ, శత్రుంజయుడూ, దేవేంద్ర సమానుడూ అయిన కుశునకు సాధారణ రాజ్యలక్ష్మి వంటి ఆ యువతి జయం పలికి చేతులు జోడించింది.

మందిరద్వారాలన్నీ మూసి ఉండగా, అద్దంలో ప్రవేశించిన నీడలా లోపలికి వచ్చిన ఆ యువతిని చూచి కుశుడు ఆశ్చర్యచకితుడైనాడు. పాన్పుమీద లేచి కూర్చుని ఆమెని ఇలా అడిగాడు.

"తరుణీ!ఎవతెవు నీవు ? తలుపులన్నీ మూసి ఉండగా, నా మందిరంలోకి ఎలా రాగలిగావు ? నిన్ను చూస్తే మంచుసోకిన పద్మంలా దీనంగా కనిపిస్తున్నావు! నీ వేదో యోగశక్తి కలదానివని నేను అనుకోడం లేదు. ఓ, పరిశుద్ధురాలా! నీ వెవరి భార్యవు ? ఇలా నిశిరాత్రి వేళ ఒంటరిగా నా దగ్గరికి రావడానికి కారణం ఏమిటి ? రఘువంశ సంజాతులు పరస్త్రీ విముఖులని నీకు తెలియదా ?"

కుశుడు ఇలా ప్రశ్నించగా, అందుకు ఆ స్త్రీ ఇలా సమాధానం చెప్పింది:

"మహారాజా! మీ తండ్రి రామచంద్రుడు స్వర్గానికి వెళ్ళిపోయాడు. వెడుతూ వెడుతూ పురజనులందరినీ తన వెంట తీసుకుని వెళ్ళాడు. అలా భర్తను కోల్పోయిన అయోధ్యా నగరాధి దేవతను నేను! సత్పరిపాలన వల్ల నిత్యోత్సవం గల అలకానగరాన్నీ, అమరావతినీ అధిగమించిన నేను, సమర్థుడవగు సూర్యవంశ ప్రభువువు నీ ఉండగానే ఇప్పుడు దీనావస్థకు లోనై ఉన్నాను! నాథుడు లేనందున ఇప్పుడు నా నివాసభవనాలన్నీ శూన్యములై ఉన్నాయి. ప్రాకార గోపురాదులు శిథిలమైపోయాయి. సర్వత్రా అంధకారం

ఆవరించి ఉన్నది. పశ్చిమ సముద్రాన సూర్యుడు అస్తమించగా, పెనుగాలికి చెల్లాచెదురైన మబ్బులు గల దినాంతము వలె ఉన్నాను నేను! రాత్రివేళల్లో దీపకాంతులతో ప్రకాశిస్తూ, అభిసారికల కాలి అందెల మనోహర ధ్వనులతో ఆకర్షణీయంగా ఉండే, నా రాజమార్గం ఇప్పుడు పాడుపడి ఉన్నది. అక్కడ ఇప్పుడు నక్కలు భయంకరంగా అరుస్తూ మాంసఖండాల కోసం వెదుకు తున్నవి! అంగనలు తమ మృదుహస్త కంకణాలతో కదలించగా, తరంగ మృదంగ ధ్వనులు వెలువరించే దిగుడు బావులలో జలాలు ఇప్పుడు, అడవిదున్నల కొమ్ముల తాకిడికి భయంకరంగా ఘోషిస్తూ మలినములై ఉన్నవి.

“మనోజ్ఞంగా ఆడే నెమళ్ళు ఇప్పుడు, ఉద్యానవనాలు పాడుపడి పోగా చెట్లను ఆశ్రయించి, నృత్యం మాని, అడవిలో కార్చిచ్చు రవ్వలకు పింఛాలు కాలిపోగా అడవి నెమళ్ళకంటె హీనస్థితిని పొంది ఉన్నాయి! విలాసినుల పాదాల పారాణిచే గుర్తులు పడివుండే దివ్యభవనాల మెట్లు ఇప్పుడు, మృగాలను చంపిన పులుల నెత్తుటి అడుగుల జాడలతో నిండి ఉన్నాయి! చిత్ర విచిత్ర అలంకారాలతో శోభిల్లుతూ, తొండాలకు అందించిన తామరతూండ్లు తింటూ పద్మవనాలలో విహరించే ఏనుగులు ఈనాడు అడవిసింహాల పంజా దెబ్బలకు కుంభస్థలాలు పగిలిపోగా, దైన్యం పొంది ఉన్నాయి!

“భవన, ప్రాకార, గోపుర స్తంభాదులందు చెక్కిన సుందర ప్రతిమ లిప్పుడు రూపు చెడి పూర్తిగా మాసిపోయి ఉన్నాయి. వాటిపై పాములు పారాడు తున్నాయి. ఆ సర్పాలు విడిచే కుబుసములే ఆ ప్రతిమలకు రవికల వలె ఉంటున్నాయి. ఏనాడో మేడలకు వేసిన వెల్లలు ఇప్పుడు పూర్తిగా మాసిపోయి నల్లబడి ఉన్నాయి. వాటిపై గడ్డి మొలిచింది. వాటిపై ఇప్పుడు చంద్రకిరణాలు ప్రతిఫలించడం లేదు. ఒకప్పుడు ఉద్యానవనాలలో తరుణులు పూలమొక్కల తీగలను మృదువుగా వంచి పూలు కోసేవారు. ఇప్పుడా పూల మొక్కలు,

లతలు ధ్వంసమైనాయి. ఆ ఉద్యానవనాలన్నీ అడవికోతులకు ఆలవాలంగా ఉంటున్నాయి. పగటివేళ మగువల ముఖవిలాసాలుగాని, రాత్రివేళ దీపకాంతిగాని ఎరుగక, ఆఖరుకు పొగ కూడా రాజని రాజభవనాల కిటికీలు ఇప్పుడు, సాలెపురుగులు గూళ్ళు పెట్టగా, ఆ అల్లిక దారాలే కిటికీ తెరలుగా ఉంటున్నాయి. సరయూ జలాలను ఈనాడు చూస్తే ఎవరికైనా కడుపు తరుక్కుని పోతుంది ప్రభూ! ఇప్పుడక్కడ పూజలు లేవు. యజ్ఞాలు లేవు. స్నానవేదికలు అంతకన్నా లేవు. మహారాజా! ఇది నా పరిస్థితి. ఇప్పుడైనా నీవు ఈ తాత్కాలిక రాజధానిని వదలిపెట్టు. కారణసంభూతమైన మానవరూపాన్ని వదలి, నిజమైన పరమాత్మ స్వరూపాన్ని చేపట్టిన నీ తండ్రి రామచంద్రమూర్తి వలె, నీవు తిరిగి నీ వంశీకుల రాజధానీ నగరమైన నన్ను చేరవలసినది.”

ఈ విధంగా అయోధ్యానగరాధి దేవత చెప్పగా విన్నాడు కుశుడు. అతనికి ఎంతో ఆనందం కలిగింది.

“దేవీ! నీ ఇష్టప్రకారమే చేస్తాను.” అని చెప్పాడు. ఆమె సంతోషించింది. అదృశ్యురాలైంది.

ఆ మరునాడు కుశమహారాజు కొలవు తీర్చాడు. క్రిందట రాత్రి జరిగిన అద్భుతాన్ని గురించి బ్రాహ్మణోత్తములకు తెలియజేశాడు. తమ వంశీకుల నగరదేవత స్వయంగా వచ్చి రాజును అలా అర్థించినందుకు వారు చాలా సంతోషించి, రాజును అభినందించాడు.

అంతట కుశమహారాజు కుశావతీ పట్టణాన్ని వేదవిదులగు బ్రాహ్మణోత్తములకు ధారపోశాడు. అంతఃపుర స్త్రీలనూ, దాసదాసీజనాన్ని, పరివారాన్ని వెంట పెట్టుకుని మేఘములతో కూడిన వాయువులా అయోధ్యకు ప్రయాణమైనాడు. కుశుడు అలా ప్రయాణం చేస్తున్నప్పుడు ఏనుగులు క్రీడా పర్వతాలవలెనూ, రథాలే గృహాల వలెనూ, పతాకాలు ఉద్యానవనాల వలెనూ

కనిపించి, ఆయన రాజధానీ నగరమే నడచిపోతున్నదా అనిపించింది! అపారమైన ఆ రాజు సైన్యం, అప్పుడే పొడిచిన చంద్రుని చూచి చెలియలికట్ట చేరడానికై పొంగే సముద్రంలా పొడగట్టింది! ఆ సేన భారాన్నిభూదేవి తట్టుకోలేక విష్ణు దేవుని రెండవ పదాన్ని ఆశ్రయించడానికి వెడుతున్నట్లుగా భూమి నుండి ధూళి లేచి ఆకాశం దాకా వ్యాపించింది. కుశావతి నుండి అయోధ్య వరకూ విస్తరించి ఉన్న దా సేన.

కుశుని సేన ప్రయాణం చేసినంత లెక్కా, ఏనుగుల మదజలధార వల్ల మార్గం యావత్తూ తడిసి బురద అయింది. గుర్రపు గిట్టలవల్ల ఆ బురద మరింత చిందరవందరైంది. వింధ్య పర్వత ప్రాంతపు మార్గాలలో ఆ సేన వెడుతున్నప్పుడు పెద్ద ధ్వని పుట్టింది. కొండగుహలు ప్రతిధ్వనించాయి. గైరికాది ధాతువుల వల్ల రథచక్రాల అంచులు ఎరుపెక్కాయి. భేరీ మున్నగు వాయిద్యాల ఘోషలు మిన్ను ముట్టాయి. ఆ విధంగా కుశమహారాజు మార్గంలో కిరాతులు తనకు సమర్పించే కానుకలు అందుకుంటూ తన సైన్యంతో వింధ్య పర్వత పంక్తిని అతిక్రమించాడు. తరవాత ఏనుగుల బారును వంతెనగా చేసి గంగానదిని దాటాడు. పూర్వం తమ వంశీకులైన సగరపుత్రులు కపిల మహర్షి కోపాగ్నికి భస్మమైపోగా, వారికి స్వర్గప్రాప్తి కలిగించిన ఆ గంగాభవానికి భక్తితో మ్రొక్కాడు.

ఇలా కొన్నాళ్ళు ప్రయాణం సాగించి సరయూ నదీతీరం చేరుకున్నాడు. అక్కడ రఘువంశపు రాజులు నిరంతరం యజ్ఞ యాగాదులు చేసి యజ్ఞ వేదికలందు వందలాది యూపస్తంభాలు ప్రతిష్ఠించి ఉన్నారు. కుశమహారాజు వాటిని సందర్శించాడు. అప్పుడు సరయూనదీ తరంగాల పై నుండి, అయోధ్యానగర ఉద్యానవనాల నుండి వచ్చిన చల్లని గాలి అతనికి ప్రయాణ బడలిక తీర్చి ఆహ్లాదం కలిగించింది.

అంతట నగరం వెలుపల తన సేనావాహినిని తగు ఏర్పాట్లతో విడిది చేయించాడు. పాడుపడి ఉన్న పట్టణాన్ని బాగుచేయడానికి శిల్పులను పంపాడు.

వారు తగిన ఉపకరణాలతో వెళ్ళి, వేసవి ఎండకు బీటలు వారిన నేలను, మేఘాలు వాన జల్లులతో తడిపినట్లుగా అయోధ్యానగరాన్ని మరల సర్వవిధాలయిన అందచందాలతో తీర్చిదిద్దారు! వాస్తు శాస్త్రజ్ఞులు దేవాలయ గోపురాదులను నిర్మించారు.

పిమ్మట కుశమహారాజు, నగరానికి నాలుగు దిక్కులా బలులు సమర్పించి, పూజాదికాలు నిర్వర్తించాడు. అంతఃపుర కాంతలతోను, పరివారంతోను కాముకుడు కాంతా హృదయంలో ప్రవేశించినట్లు రాజ భవనంలో ప్రవేశించాడు! పరిజనులందరికీ వారి పదవులకు తగినట్లుగా మందిరాలు ఏర్పాటు చేయించాడు. తిరిగి గజశాలలు, అశ్వశాలలు, రథశాలలు అవతరించాయి. రాజమార్గం సకల వస్తు సంభరితమగు అంగళ్ళతో కళకళ లాడింది.

ఆ విధంగా అయోధ్యా పట్టణం సమస్త అలంకారాలూ తాల్చిన అంగనామణి వలె శోభిల్లింది. మరల ఆ నగరానికి పూర్వపు వన్నె, వైభవం వచ్చాయి. కుశమహారాజు తన పూర్వులు చూపిన మార్గంలో ప్రజలను పాలిస్తూ వచ్చాడు. అతను కుబేరుని సంపదలను గాని, ఇంద్రుని పదవినిగాని కోరలేదు.

ఇలా ఉండగా గ్రీష్మ ఋతువు ప్రవేశించింది. దక్షిణాయనం దగ్గర పడడం వల్ల ఉత్తరదిశాకాంత ఆనందంతో చల్లని భాష్పాలు రాల్చినట్లు మంచు కరిగి ప్రవహించింది. పగలు వేడిహెచ్చింది. రాత్రి చిక్కి సన్నబడింది. ఆ విధంగా పగలూ – రాత్రీ, ప్రణయకలహం వల్ల విడిపోయిన దంపతుల వలె ఉన్నాయి. క్రమక్రమంగా దిగుడు బావులలో నీరు తరిగి పోయింది. తరుణులు జలయంత్రాల నుండి ఎగసిపడే నీళ్ళతో చల్లనై, మంచి గంధపు నీటితో కడిగిన చంద్రకాంత శిలావేదికలపై పడుకుని గ్రీష్మతాపం చల్లార్చుకున్నారు. అప్పుడు కుశమహారాజుకు,తన కాంతలతో కూడి సరయూనదిలో జలక్రీడలాడ వలెనని బుద్ధి పుట్టింది.

నదీతీరంలో పూజలు చేయించాడు. మొసళ్ళు మొదలగు జల జంతువులను కనిపెట్టి ఉండడానికి బెస్తవారిని నియమించాడు. ఎలాంటి అపాయం లేని ప్రవాహ ప్రదేశంలో కుశుడు తన ప్రియురాండ్రతో కలిసి జలక్రీడలు ప్రారంభించాడు.

రాజకాంతలు కర కంకణాలు, కాలి అందెలు మ్రోగుతుండగా ఒయ్యారంగా మెట్లు దిగి వచ్చి నదిలో ప్రవేశించినప్పుడు, ఆ మనోహర ధ్వనులకు నదిలోని రాజహంసలు ఉద్విగ్నతను పొందాయి. ఒకరిపై ఒకరు నీళ్ళు చిమ్ముకుంటూ, ఎకసక్కెములాడుకుంటూ, పకపక నవ్వులతో హాయిగా జలక్రీడలాడుతున్న అంతఃపుర కాంతలను చూచి పడవలో కూర్చుని ఉన్న కుశమహారాజు ముచ్చటపడ్డాడు. పడవలో తన ప్రక్కన నిలిచి విసనకర్రతో మెల్లగా విసురుతున్న బోయకాంతతో ఇలా అన్నాడు :

“మా అంతఃపుర స్త్రీల జలకాలవల్ల వారి అంగరాగం కలిసిన ఈ సరయూనదీ ప్రవాహం, సంధ్యా కాలమందలి ఆకాశంలా రంగురంగులు తాలుస్తున్నది! భారమైన జఘనాలు, స్తనాలు కలిగి సులువుగా తిరగలేకుండా ఉన్న ఈ అంగనామణులు, ఇప్పుడు కేవలం ఉత్సాహం వల్లనే ఇలా ఒకరినొకరు త్రోసుకుంటూ అతి ప్రయాసతో జలక్రీడా విహారం చేయగలుగు తున్నారు! చూచావా ? ఈ పూబోడులు అరచేతులతో నీటిని చరుస్తున్నారు. అప్పుడు ముత్యాల వంటి నీటితుంపరలు ఎగిరి వచ్చి వారి చనుగుబ్బలపై పడుతున్నాయి. అందువల్ల వారు తమ కంఠాలలో ధరించిన ముత్యాలపేర్లు తెగిపోతూ ఉండడం గమనించకుండా ఉన్నారు.

లోతుగా ఉండే వీరి నాభిని ఆవర్తాలతో పోల్చవచ్చు. అలాగే వీరి కనుబొమలకు అలలు సాటివస్తాయి! వీరి స్తనాలు చక్రవాక పక్షులజంట అనవచ్చు! ఇలా ఈ కాంతల అవయవాలన్నింటికీ ఈ జలంలోనే ఉపమానాలు

సంభవించడం చిత్రంగా లేదూ ? జలక్రీడలో వీరు చేస్తున్న గల గల ధ్వనులకు నదీతీరాన గల నెమళ్ళు పురులు విప్పి ఆడుతున్నాయి.

“తమపై నీరు చిమ్మిన చెలులపై తాము తిరిగి గర్వంతో నీళ్ళు చిమ్ముతూ ఉన్నారీ సుందరాంగులు. అలా నీళ్ళలో తడిసిన వీరి ముంగురులు ఇప్పుడు వంకులు తిరగడం లేదు. పైగా ముఖాన ధరించిన తిలకం కలిసి ఆ ముంగురుల నుండి ఎర్రని నీటిబొట్లు రాలిపడుతున్నాయి. కొప్పులు వీడడం వల్ల ఈ రమణుల శిరోజాలు చిందరవందరంగా చెవులపై పడుతున్నాయి. చెవులకు ధరించిన ముత్యాల కమ్మలు చిక్కుపడుతున్నాయి. జలక్రీడ వల్ల వీరి ముఖాలు ఇంత అస్తవ్యస్తంగా ఉన్నా చూడ ముచ్చటగానే ఉన్నాయి సుమా.”

ఇలా పలికి కుశమహారాజు తాను కూడా పడవ దిగి నీళ్ళలోకి వచ్చాడు. కాంతలతో కలసి తాను కూడా జలక్రీడలాడసాగాడు. అప్పుడతని మెడలోని రకరకాల రత్న హారాలు కదులుతూ కాంతులు వెదజల్లాయి. తొండంతో తామరతూండ్లు పెళ్ళగించి పైకి ఎత్తి, ఆడ ఏనుగులతో జలక్రీడలాడే గజరాజులా కుశమహారాజు రమణులతో జలక్రీడ లాడాడు! తమ మధ్య అతను ఉన్నందున ఆ కాంతలు మరింత శోభతో వెలుగొందారు. సహజంగా ప్రకాశం కల మణులు మిక్కిలి కాంతి వెదజల్లే ఇంద్రనీలమణితో కూడి ఉంటే ఎలా ఉంటాయో, కుశుని కూడిన ఆ మగువలు ఇప్పుడలా ఉన్నారు! వారంతా అతని చుట్టూ చేరి ప్రేమతో అతని మీద రంగు రంగుల నీళ్ళు చల్లారు. ఆ రాజు గైరికాది ధాతురస ప్రవాహాలు గల పర్వతరాజులా వెలుగొందాడు.!

నిజకాంతలను గూడి సరయూనదిలో విహరిస్తున్న కుశమహారాజు వియద్గంగా వాహినిలో అప్సరసలను గూడి విహరించే దేవేంద్రుని వలే శోభిల్లాడు!

ఇలా అతను జలక్రీడోత్సవానందంలో మునిగి ఉండగా ఒక విషయం జరిగింది. మహారాజు చేతినుండి చైత్రాభరణం జారి నీళ్ళలో పడి పోయింది! పూర్వం రామచంద్రుడికి అగస్త్య మహర్షి ఇచ్చా డా దివ్యాభరణాన్ని. రాజ్యంతో పాటు ఈ ఆభరణాన్ని కూడా రాముడు తన కుమారుడైన కుశునకు ఇచ్చాడు.

అయితే జలక్రీడల సంతోషంలో తన ఆభరణం జారిపోయిన సంగతి కుశమహారాజు గమనించలేదు. జలక్రీడలు చాలించి ఒడ్డుకు వచ్చి, దుస్తులు మార్చుకునే లోగానే, తన భుజం మీద చైత్రాభరణం లేక పోవడం చూచాడు. వెంటనే అతని గుండెలు గుభిల్లుమన్నాయి. భరించలేని బాధ కలిగింది. కారణం ధనం పోయినదే అని కాదు. అది దివ్యాభరణం. అది ధరించిన వారికి ఎప్పుడూ విజయమే. పైగా ఆ నగ తన తండ్రి శ్రీరాముడు ప్రీతితో తనకు ఇచ్చినది. అందువల్లనే ఇప్పుడది కనుపించక పోయేటప్పటికి కుశుడు అంతగా బాధపడవలసి వచ్చింది.

అంతట కుశమహారాజు నీళ్లలో సంచరించడంలో నేర్పరులైన వారిని పిలిపించాడు. తన చైత్రాభరణాన్ని వెదికి తేవలసినదిగా ఆజ్ఞాపించాడు. వారు నది యావత్తూ గాలించారు. కానీ ఆభరణం ఎక్కడా కనిపించలేదు. వారు మహారాజు వద్దకు వచ్చి "ప్రభూ! మేము శాయశక్తులా నీళ్ళలో వెదికాము. ఎంత ప్రయత్నించినా ఏలిన వారి ఆభరణం దొరకలేదు. కాని ఒక్క విషయం – ఈ నదీజలాలలో అట్టడుగున కుముదుడనే నాగరాజు సంచరిస్తున్నాడు. బహుశా అతనే ఈ ఆభరణం అపహరించి ఉంటాడు. సందేహం లేదు" అని విన్నవించారు.

ఈ మాట వినగానే సీతా తనయుడికి ఎక్కడలేని ఆగ్రహం వచ్చింది. ధనుస్సు ఎత్తి ఎక్కుపెట్టాడు. తన ఆభరణాన్ని అపహరించిన నాగరాజుపై ప్రయోగించడానికి దారుణమైన గరుడాస్త్రాన్ని వింట సంధించాడు.

అప్పుడు సరయూ నదిలో నాగుడున్న మడుగులో పెద్ద పెట్టున అలలు లేచాయి. నీరు నలువైపులా చిందరవందర అయింది. వేటగాండ్రు త్రవ్విన గోతిలో పడినట్టి అడవి ఏనుగులు ఆక్రోశించినట్లు ధ్వని పుట్టింది. నాగరాజు కుముదుడు నీళ్ళన్నీ చెల్లాచెదురు చేసుకుంటూ బయటికి వచ్చాడు. పాల సముద్రాన్ని మథించినప్పుడు లక్ష్మీదేవితో పాటు పారిజాతం వెలువడినట్లుగా కుముదుడు ఒక చక్కని నాగకన్యను తీసుకుని మరీ వచ్చాడు! అమూల్యమైన మణులు కానుకలుగా తెచ్చాడు.

అలా వచ్చిన నాగరాజును చూచి కుశుడు తన గరుడాస్త్రాన్ని ఉపసంహరించాడు. అప్పుడు నాగరాజు శిరస్సు వంచి సవినయంగా మహారాజుకు నమస్కరించాడు.

"ప్రభూ! నీవు కార్యాంతరమున మనుష్య రూపం ధరించినట్టి విష్ణుదేవుని అవతారమని నాకు తెలుసు. తెలిసి కూడా నీకు కోపం తెప్పించే పని చేస్తానా ? నీవు జలక్రీడ లాడేటప్పుడు నీ దివ్యాభరణం జారిపోయింది. ఈ అమ్మాయి బంతి ఆడుకుంటూ అది ఎగసిపోగా, దాని కోసం చేయి చాచి ఉన్న సమయంలో నీ ఆభరణం ఈ పిల్ల చేతికి చిక్కింది. ఇదిగో నగ! ధరించండి! ఈ పిల్ల నా చెల్లెలు! చిరకాలంగా నిన్ను సేవించడానికి కుతూహలపడుతున్నది. ఈమెను పరిగ్రహించండి. ఈమె చేసిన అపరాధానికి అదే ప్రాయశ్చిత్తం!" అని పలికాడు.

ఇలా చెప్పి కుశమహారాజుకు చైత్రాభరణం సమర్పించాడు. కుశుడు చాలా సంతోషించాడు. "నాగరాజా! నీవు మా ఆప్తకోటిలోని వాడవు–" అని సంభావించాడు. అంతట నాగరాజు తన సోదరి అయిన కుముద్వతిని కుశ మహారాజు కిచ్చి వైభవంగా పెళ్ళి చేశాడు. కన్యతో పాటు అనేక రకములైన అమూల్య కానుకలు కూడా సమర్పించాడు. కుశుడు కుముద్వతిని పరిణయమాడినప్పుడు దేవదుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది.

ఆ విధంగా త్రిభువన ప్రభుని పుత్రునితో నాగుడికీ, తక్షకుని కుమారుడైన కుముదునితో కుశుడికీ బంధుత్వం ఏర్పడడం వల్ల నాగలోకానికి గరుత్మంతుని భయం పోయింది.

## 17

**కొం**తకాలం గడిచింది. రాత్రి కడపటి జాములో బుద్ధికి, నిర్మలత్వం కలిగినట్లుగా కుశమహారాజుకు కుముద్వతి యందు ఒక కుమారుడు జన్మించాడు.

అతిథి అను పేరుగల ఆ బాలుడు లోకోత్తరుడై, సూర్యుడు తన సంచారంతో ఉత్తర దక్షిణ దిక్కులను పవిత్రం చేసినట్లుగా తండ్రి వంశాన్ని, తల్లి వంశాన్ని కూడా పావనం చేశాడు.

కుమారుడికి కుల విద్యలన్నీ నేర్పి, పిదప యుక్త వయస్సు రాగానే పెళ్ళి చేశాడు. ధర్మబుద్ధిలోనూ శౌర్య పరాక్రమాలలోనూ అన్ని విధాల తనతో సమానుడైనట్టి కుమారుని చూచి కుశమహారాజు తాను కృతార్థుడైనట్లుగా భావించుకున్నాడు.

రఘువంశపు రాజులకు మొదటి నుండీ కూడా దేవేంద్రుడికి అవసరమగు సమయాలలో సహాయపడుతూ ఉండడం మామూలు. దుర్జయుడనేవాడు పేరుకు తగినట్లుగా, దుర్జయుడై ఇంద్రుని బాధిస్తూ వచ్చాడు. అప్పుడు దేవనాధుడు కుశమహారాజు సహాయం అర్థించాడు. తన వంశాచారాన్ని పాటించి కుశుడు ఇంద్రునికి తోడ్పడ్డాడు. దుర్జయుడితో భయంకరంగా యుద్ధం చేసి అతన్ని సంహరించాడు. అయితే ఆ యుద్ధంలో తాను కూడా వీరమరణం పొందాడు.

అప్పుడాయన భార్య కుముద్వతి, వెన్నెల చంద్రునితో చేరినట్లుగా సహగమనం చేసి భర్తతో చేరిపోయింది. వారిరువురూ స్వర్గధామం

అలంకరించారు. కుశుడు ఇంద్రుని ప్రక్కన అర్థసింహాసనం అలంకరించగా, కుముద్వతి శచీదేవికి ప్రాణసఖియై స్వర్గభోగాలు అనుభవించింది.

దేవతల కోసం యుద్ధానికి వెడుతూ కుశమహారాజు చెప్పిపోయిన మాట ప్రకారం ఇక్కడ మంత్రులు అతిథిని రాజ్యాభిషిక్తుని చేశారు. అతని పట్టాభిషేకానికై ప్రసిద్ధులగు శిల్పులు నాలుగు స్తంభాలు గల ఒక ఉన్నత విమానాన్ని నిర్మించారు. ఆ విమానంలో భద్ర సింహాసనంపై అతిథిని కూర్చోబెట్టి కలశాలతో సకల పుణ్యతీర్థాల నుండి తెప్పించిన జలాలతో అతన్ని అభిషేకించారు.

కుశనందనుడు అతిథి రాజ్యాభిషిక్తుడైన సమయంలో అనేక శుభ శకునాలు పొడగట్టాయి. దేవదుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. వేద మంత్రాలతో పురోహితులు అతని శిరసున అభిషేక జలధారలు క్రుమ్మరిస్తున్నప్పుడు ఆ జలధారలు శివుని శిరము నుండి గలగల ప్రవహించే గంగావాహిని వలె కనిపించింది! వందిమాగధులు స్తోత్రపాఠాలు చదివారు. ముత్తయిదువలు మంగళహారతులు పట్టారు. ఇలా పట్టాభిషిక్తుడైన అతిథి బ్రాహ్మణోత్తములకూ, పురోహితులకూ భూరిదక్షిణలు సమర్పించాడు. యజ్ఞయాగాది కర్మలకై అపారంగా ధనం ఇచ్చాడు. వారి శుభాశీస్సులు పొందాడు. అంతేకాదు, శిక్ష పడిన అపరాధులను క్షమించాడు. చెరసాలలో ఉన్నవారిని విడుదల చేయించాడు. బరువులు మోసే వృషభాలను స్వేచ్ఛగా విడిచిపెట్టాడు. గోవులకు అదోహం ప్రసాదించాడు. పంజరాలలోని పావురాలకు, చిలుకలకు, గోరువంకలకు – ఇంకా రకరకాల పక్షులకు శాశ్వతంగా స్వేచ్ఛా జీవనం అనుగ్రహించాడు.

తరువాత అతిథి తన భవనాంతరంలో గల దంతపీఠంపై ఆశీనుడైనాడు. అప్పుడు, అలంకారాలు చేయడంలో నేర్పరులయిన దాసదాసీలు

అతనికి వివిధరకాల అలంకారాలు చేశారు. అతని కేశాలకు పరిమళభరితమగు అగరుధూపాలు వేసి తడి ఆర్చారు. పిమ్మట పలురకాల అలంకార వస్తువులతో అలంకారం చేయటం మొదలుపెట్టారు. జుట్టు పైకి దువ్వి ముత్యాలహారాలు చుట్టారు, పూలమాలలు కట్టారు. కేశాపాశానికి కొసన మిక్కిలి ప్రకాశవంతమగు పద్మరాగమణిని అలంకరించారు.

కస్తూరి కలిసిన మంచిగంధం దేహమంతా పూశారు. తరవాత గోరోజనంతో పత్రరచన చేశారు. అటుపైన రకరకాల సొమ్ములు, ఆభరణాలు పెట్టి చీనిచీనాంబరాలు కట్టబెట్టారు. ఇప్పు డా రాజు మరింత శోభతో వెలుగొందాడు.

బంగారపుటద్దం చేతబట్టుకొని అతిథి మహారాజు తన అలంకారాలు చూచుకున్నాడు. అప్పుడా అద్దంలో అతని ప్రతిబింబం సూర్యోదయ కాలంలో మేరుపర్వతంపై ప్రతిఫలించిన కల్పవృక్షపు నీడలా ప్రతిఫలించింది.

తరువాత తెల్లగొడుగు, చామరాలు పట్టుకుని రెండువైపులా సేవకులు నడుస్తూ ఉండగా మహారాజు సభాభవనంలో ప్రవేశించాడు. సుదర్శనతో పోటీపడే సభాభవనం అది! ఆ భవనంలో తండ్రి కూచునే భద్రసింహాసనంపై ఆశీనుడయినాడు. సభామండపంలోని సకల సామంతరాజుల శిరోరత్నాల కాంతులతో ఆ సింహాసనం నీరాజితమవుతున్నది. ఉజ్వలంగా ప్రకాశించే మేలు కట్లున్నాయి దానికి.

శ్రీవత్స లాంఛనమగు ఆ దివ్యసభను అతిథి భూపాలుడు అలంకరించినప్పుడు, కౌస్తుభమణి తాల్చిన మహావిష్ణువు వక్షస్థలంలా ప్రకాశించింది. ఎల్లప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, ఆప్యాయతతో ప్రసంగించే ఆ రాజును చూడగానే ప్రజలకు విశ్వాసం అనేది ఆ రూపం ధరించినట్లు తోచింది.

సకల భోగభాగ్యాలతో వెలుగొందే అయోధ్యానగరాన్ని అతిథి మహారాజు క్రమేణా అపరస్వర్గంలా చేశాడు. అతని శిరస్సు పై ఉన్నతంగా ప్రకాశించే స్వేతచ్ఛత్రం, భూదేవికి పూర్వపు రాజుల వియోగ దుఃఖాన్ని పోగొట్టింది. మొదట పొగ పుట్టిన పిమ్మట అగ్నిజ్వాల వస్తుంది. అలాగే సూర్యుడు ఉదయించిన తరువాత గాని అతని కిరణాలు లోకంలో వ్యాపించవు. కానీ అతిథి మహారాజు విషయంలో – అలా జరగలేదు. అతని తేజస్సు, గుణగణాలు రెండూ ఒకేసారి సమపాళ్ళలో వెలుగొందడం విశేషం.

శరత్కాలంలో నక్షత్ర సమూహంతో సహా ధ్రువుని అనుసరించే రాత్రుల వలె, అయోధ్యా పురకాంతలంతా, కళ్ళు ఇంతింత చేసి ప్రీతిగా చూస్తూ ఆ ధరణీకాంతుని అనుసరించారు. పూజా సమయాలలో నగర దేవతలు కూడా ఆ రాజు సన్నిధిలో సాక్షాత్కరిస్తూ వచ్చారు.

భద్రపీఠం పై పడిన పట్టాభిషేక జలం ఇంకా తడైనా ఆరకముందే అతిథి భూపాలుని శౌర్య ప్రతాపాలు సముద్రాల వరకూ విస్తరించాయి. అవును– అతనికి రెండురకాల మహత్తర ఆయుధాలున్నాయి. ఒకటి కుల గురువయిన వసిష్ఠులవారి మంత్రశక్తి, రెండవది దివ్యాస్త్ర శక్తి. ఈ రెండూ సిద్ధించినప్పుడు ఇక అతిథికి లోకంలో అసాధ్యమైనది ఏమున్నది కనుక ? అంతటి ధర్మమూర్తి మరెక్కడా ఉండడని పేరు పొందాడతను. న్యాయవిచారణ చేసేటప్పుడు నేరంపై వాది ప్రతివాదుల వాదనలు స్వయంగా ఆలకించేవాడు. ఏ మాత్రం సంశయానికి ఆస్కారం లేకుండా వ్యవహారం పరిష్కరించేవాడు. అతిథి మహారాజు చెప్పే తీర్పులు ఉభయ పక్షాలవారికి సంతృప్తి కలిగించేవి. విచారణానంతరం నేరస్తులను కూడా ప్రీతివచనాలతో, కారుణ్య పూరితమైన దృష్టులతో అనుగ్రహించేవాడు.

కుశమహారాజు కాలంలో సుఖశాంతులు అనుభవించిన ప్రజలు అతిథి భూపతి కాలంలో అవి మరింత పరిపుష్టి చెందగా సంపూర్ణ సౌఖ్యానందాలు

అనుభవించారు. ఆ సత్యసంధుడు ఎన్నడూ ఆడినమాట తప్పలేదు. అడిగినది లేదనలేదు. ఇచ్చివేసినది మరల పుచ్చుకొనలేదు. అయితే శత్రురాజులను జయించి వారిని పదభ్రష్టులను చేసి కూడా తిరిగి క్షమించి వారి పదవులు వారికి ఇచ్చివేయడం వల్ల మాత్రం అతను భగ్నవ్రతుడైనాడు.

యౌవనం, రూపసంపద, ఐశ్వర్యం – ఈ మూడింటిలో ఏ ఒక్కటి ఉన్నా నరనాధులకు మదమెక్కుతుందని పెద్దలంటారు. కానీ  ఈ మూడు ఉండి కూడా అతిథిభూపతి గర్వాతిరేకమూ, మదోన్మత్తత – అనునవి లేకుండా ప్రజాభిమతానికి తలవంచి రాజ్యపాలన చేశాడు.

అతిథి ఒక్క బాహ్యశత్రువులనే కాదు, అంతకంటె ప్రబలమగు అంతశ్శత్రువులను కామ క్రోధాది అరిషడ్వర్గాన్ని సునాయాసంగా జయించాడు! సహజంగానే చపలచిత్త అయిన లక్ష్మి కూడా, నికషోపలంపై స్వర్ణరేఖ వలె, సౌజన్యమూర్తి అగు అతని యందు సుప్రతిష్ఠితమై ఉండి పోయింది.

అతిథి రాజ్యంలో అతనిచే నియుక్తులగు చారులు ఎల్లప్పుడూ ప్రతి విషయాన్ని వేయికళ్ళతో కనిపెట్టి ఉండేవారు. కనుకనే ఆ రాజుకు అగోచరమగు సంగతి ఏదీ ఉండేది కాదు. అవును. మబ్బు లేని సూర్యుడికి కనిపించని దేముంటుంది కనుక ? మను ధర్మశాస్త్రం చెప్పినట్లుగా రాత్రీ, పగలూ – ఏ వేళ ఏది చేయవలెనో అది చేస్తూ వచ్చాడు. తన కర్తవ్యాన్ని ఏనాడూ విస్మరించలేదు. ఎట్టి పరిస్థితులలోనూ మనోవైకల్యం పొందలేదు. ఏ క్షణంలోనూ ప్రమత్తుడై ఉండలేదు. ఏ రోజూ అతని కార్యానికి విఘ్నం అన్నది కలుగలేదు.

ఒకరి సంగతి ఒకరికి తెలియనివ్వకుండా శత్రువుల విషయమూ, స్నేహితుల విషయమూ కూడా ఎప్పటికప్పుడు చారుల వల్ల తెలుసుకుంటూ

ఉండటం చేత అతిథి భూపాలుడు ఎల్లవేళలా మేల్కొని ఉన్నవాడే అయినాడు! అతని కోటలు, బురుజులు, దుర్గాలు దుర్భేద్యమైనవి! శత్రువులు కన్నెత్తి అయినా చూడరానివి! అయిన్పటికి ఆ శౌర్యవంతుడు, శత్రు భయంతో ఎన్నడూ ఆ దుర్గాలను, సేనలనూ ఆశ్రయించినవాడు కాడు. అవును మరి సింహం కొండగుహలో నివసిస్తున్నదీ అంటే, తక్కిన మృగాలకు భయపడి కాదు.

ప్రజల శ్రేయస్సుకై అతను చేస్తున్న ప్రతి కార్యమూ కూడా వరి కంకులలోని ధాన్యము వలె, సఫలీకృతమయినప్పుడు మాత్రమే లోకానికి తెలిసేది! సముద్రుడు ఎంత పొంగినప్పటికీ, నదీముఖాలలోనే విజృంభిస్తాడు కాని చెలియలికట్ట దాటి రాడు! అలాగే అతిథిమహారాజు ఎంత ఉచ్ఛస్థితిలో ఉన్నప్పటికీ గర్వంతో పొంగిపోవడం గాని, వక్రమార్గం పట్టడం గాని ఎరుగడు! సర్వవిధాలా శక్తిమంతుడై ఉండి కూడా సులభంగా సాధించడానికి వీలున్న వారిపైననే దండయాత్రలు జరిపాడు. అవును మరి – వాయువు తోడయి ఉన్నా దావానలుడు జలాన్వేషణకు ఒడిగట్టడు ! అర్థమా, కామమూ – ఈ రెంటిలో ఒక దానికోసం ఒకదానిని బాధించడం లోక సహజం! అయినా అతను అర్థాన్ని కోరి కామాన్ని కాని, కామాన్ని కోరి అర్థాన్ని కాని బాధించి ఎరుగడు! అతి దుర్బలులైన స్నేహితులు ఏ మాత్రం సహాయపడలేరు. అలాగే వారు అతి బలవంతులై ఉంటే ఎప్పుడూ అపకారం చేయకుండా ఉండరు! ఈ నీతి తెలిసినవాడు కనుకనే అతిథిభూపతి తన మిత్రులను ఎల్లప్పుడు మిక్కిలి బలహీనులూ, మిక్కిలి బలవంతులూ కాకుండా మధ్యమశక్తి కలవారినిగా ఉంచుతూ వచ్చాడు. తల బలమెంతో శత్రుబలమెంతో విచారించి దేశకాలాదులను గమనించి తనకు విజయం తథ్యమని నిశ్చయించుకున్న పిదపనే అతను దండయాత్రలు సాగించేవాడు. శత్రువుది పైచెయ్యి అని తేల్చుకున్నప్పుడు అలాంటి పని తలపెట్టేవాడు కాడు.

అలాగే రాజనీతిలో మరొక ముఖ్యమైన విషయం ఉన్నది. కోశాగారం నిండుగా ఉంటేనే ప్రజలు రాజును ఆశ్రయిస్తారు. లేనిచో అతన్ని ఏ మాత్రం లక్ష్యపెట్టరు. కనుకనే అతిథి బొక్కసంలో ధనాన్ని కూడబెట్టి ఉంచేవాడు. అవును మరి – మేఘాలలో జలం ఉంటేనే చాతకపక్షులు దరి చేరతాయి! ఇతరుల బలహీనతలను కనిపెట్టేవాడు. తన బలహీనతలు మాత్రం ఎవరికంటా పడకుండా జాగ్రత్త వహించేవాడు! తండ్రి కుశమహారాజు అభివృద్ధి చేసిన సైన్యాన్ని అతిథి తన శరీరంతో సమానంగా చూచుకున్నాడు. అందువల్లనే ఆ మహారాజు శక్తి, సర్పరాజు తలపైవున్న మణిలా ఎవరూ హరించజాలనదిగా ఉన్నది! అయితే ఆ నీతికోవిదుడు మాత్రం అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్లుగా పగవారి శక్తిని ఆకర్షించి ఆకట్టుకుంటూ వచ్చాడు!

ఆ రాజు పాలనలో వర్తకులూ, వ్యాపారస్తులూ ఎలాంటి భయమూ ఎరుగరు. వారు అడవులలో ఉద్యానవనాలలో లాగా, మహానదులలో దిగుడు బావులలాగా, మహా పర్వతాలలో స్వంత ఇండ్లలోలాగా స్వేచ్ఛగా సంచరించారు. మునుల తపస్సుకు అంతరాయం కలుగలేదు. ప్రజల ధనద్రవ్యాలకు దొంగల భయం లేదు. ఆ విధంగా అతను అన్నింటిలో రాజభాగమైన ఆరవపాలు పొందగలిగాడు. గనుల నుండి రత్నాలూ, పొలాల నుండి పంటలూ వనాల నుండి ఏనుగులను సృష్టించడం ద్వారా పృధ్వీ, ఆ రాజు పరిపాలనా దక్షతకు తగిన ప్రతిఫలం ఇచ్చినట్లయింది.

వ్యూహాలూ, పన్నుగడలు తెలిసి ఉండి కూడా అతిథి శత్రురాజులతో ధర్మయుద్ధమే చేస్తూ వచ్చాడు. కనుకనే ఆ రాజు యెడల జయలక్ష్మి, అభిసారికా ప్రవృత్తిని అవలంభించినది! గంధగజం తన మదగంధంతోనే తక్కిన గజాలను భంగపరుస్తుంది. అలాగే ఆ రాజు తన ప్రతాపంతోనే వైరులను భంగపుచ్చుతూ వచ్చాడు. యుద్ధం అనేది అరుదుగా సంభవిస్తూ వచ్చింది.

వృద్ధి పొందిన తరువాత చంద్రుడు మరల క్షీణిస్తాడు. సముద్రుడు కూడా అంతే! అయితే అతిథి భూపతికి మాత్రం వృద్ధి అనంతరం క్షీణత అనేది కలగలేదు. ఎప్పుడూ అతనికి వృద్ధే. దారిద్ర్యంతో అలమటిస్తున్న పండితులు ఆ మహారాజును యాచించి, సముద్రుని యాచించిన మేఘాల వలె ఇష్టార్థసిద్ధిని పొందారు! ప్రశంసనీయమైన పనులు ఎల్లప్పుడూ చేస్తున్నా, అతను ప్రజల పొగడ్తలు విని ఎన్నడూ పొంగిపోలేదు. పైగా ఆ పొగడ్తలకు సిగ్గుపడేవాడు! కనుకనే అతని కీర్తి అంతకంతకూ వర్ధిల్లింది. అతన్ని చూస్తేనే చాలు, ఎంతటివారికీ తత్త్వోపదేశం పొందినట్లుండేది. అప్పుడే ఉదయించిన సూర్య దర్శనం లాంటిది అతిథిమహారాజు దర్శనం! కలువపూవులలో సూర్య కిరణాలూ, పద్మాలలో చంద్రకిరణాలూ ప్రవేశించ లేవు. కానీ అతిథిభూపాలుని గుణాలనే కిరణాలు సర్వత్రా ప్రవేశించి ప్రకాశించాయి.

కొన్నాళ్ళకు అతిథిమహారాజుకు అశ్వమేధయాగం చేయాలని సంకల్పం కలిగింది. అందుకోసం దిగ్విజయయాత్ర చేయాలనుకున్నాడు. ఒక ధర్మ కార్యం కోసం చేసినపని కనుక అతను ఇతరులను లొంగదీసుకోవలసి వచ్చినప్పటికీ, అది ధర్మ కార్యమే అయింది. ధర్మచ్యుతితో ఏ కార్యమూ సాధించలేదతను. ఆ విధంగా, కుశపుత్రుడు అశ్వమేధ యాగం చేసి రాజాధిరాజు అయినాడు. ఇంద్రాది దేవతలకు ప్రీతిపాత్రుడైనాడు. దిక్పాలకులు నలుగురూ అతనిని అయిదవ దిక్పాలకునిగా పృథ్వ్యాది పంచభూతములకు తోడు అతనిని ఆరవ భూతంగా, సప్తకుల పర్వతాలకు తోడు అతనిని ఎనిమిదవ పర్వతంగా ఎంచుకుని దేవకోటి అతనిని కీర్తించింది.

ఇంద్రుని ఆజ్ఞ దేవతలంతా శిరసావహించినట్లు భూమండలంలో రాజులంతా అతిథి చక్రవర్తి ఆజ్ఞను ఔదల దాల్చారు! అశ్వమేధయాగం పూర్తి అయిన తరువాత అతను ఋత్విక్కులను భూరి దక్షిణలతో సత్కరించి, కుబేరుడనే పేరు తన విషయంలో సామాన్యమైనదే అన్నట్లు వ్యవహరించాడు.

దిక్పాలకులు నలుగురూ నిరంతరం ఆ రాజును సేవిస్తూ వచ్చారు. ఇంద్రుడు సకాలంలో వర్షాలు కురిపించాడు. యముడు మృత్యు రోగాది బాధలు లేకుండా చేశాడు. వరుణుడు సముద్ర ప్రయాణీకులకు క్షేమం కలిగించాడు. కుబేరుడు ధనసమృద్ధిని సమకూర్చాడు.

# 18

**అ**తిథి భూపతికి నిషధ రాజకుమార్తె యందు ఒక కుమారుడు జన్మించాడు. అతని పేరు నిషధుడు. బాగా వానలు కురియగా పండిన పైరును చూచి సంతోషించినట్లు, వంశాభివృద్ధికై కలిగిన ఆ కుమారుని చూచి అతిథి ఎంతో సంతోషించాడు. బహుకాలం రాజ్యభోగాలు అనుభవించిన పిదప, రాజ్యభారాన్ని కుమారునిపై మోపి తాను స్వర్గలోకం చేరుకున్నాడు.

నిషధుడు కూడా తండ్రి, తాత, ముత్తాతల వలెనే మహాశౌర్య వంతుడు, పరాక్రమశాలి. ధర్మజ్ఞుడు అయి ఈ పుడమిని పాలించాడు.

నిషధునికి నలినాక్షుడు అను కుమారుడు జన్మించాడు. అతను అగ్నితో సమాన తేజస్సు కలవాడై తండ్రి తరవాత రాజ్యానికి వచ్చాడు. గజరాజులా వైరుల బలాన్ని అణచి వేశాడు. అతని కీర్తి ఆకాశం వరకూ వ్యాపించింది.

నలినాక్షుడికి నభుడనేవాడు జన్మించాడు. నీలమేఘశ్యామల దేహం అతనిది. అతను జనులకు కనువిందుచేస్తూ వారి ప్రశంసలు అందుకుంటూ వచ్చాడు. నలినాక్షు డాతనికి ఉత్తర కోసల రాజ్యానికి పట్టం కట్టి, వృద్ధాప్యమున తాను వానప్రస్థానికి వెళ్ళిపోయాడు.

తరువాత నభరాజుకు పుండరీకుడనే పుత్రుడు పుట్టాడు. తండ్రి అనంతరం అతను రాజ్యానికి వచ్చాడు. పుండరీకుడు శత్రువులకు అజేయుడై పుడమిని పాలించాడు. అతని ధనుష్టంకారం వింటేనే శత్రువుల గుండెలు

అవిసిపోయేవి. అలాంటి పుండరీకుడికి క్షేమధన్వుడు జన్మించాడు. అతనికి యుక్త వయస్సు వచ్చి రాజ్యపాలనకు అర్హుడు కాగానే, పుంరీకుడతనికి భూభారాన్ని అప్పగించి తాను తపోభూములకు వెళ్ళి పోయాడు.

క్షేమధన్వుని పుత్రుడు దేవానీకుడు. రణరంగంలో అనీకినుల ముందు వీర విహారం చేసే దేవానీకుడికి భూలోకంలోనే కాక దేవలోకంలో కూడా ప్రఖ్యాతి లభించింది. దేవానీకుని కుమారుడు అహీనగుడు. అతను సమర్థుడే కాక మాటకారి. అతని ప్రియవచనాలకు శత్రువులు కూడా లొంగిపోయేవారు! అతని మధుర వాక్కులకు మృగాలు కూడా ఆకర్షింపబడేవి. అతను హీనులతో ఎన్నడూ పొత్తు ఎరుగడు. యౌవనంలో కూడా ఎలాంటి దుర్వ్యసనాలకూ వశుడు కాలేదు. అతను తండ్రి తరువాత రాజై కోసల రాజ్యాన్ని ఎదురు లేకుండా ఏలాడు. అతను తన పరాక్రమం వల్ల నాలుగు దిక్కులతో కూడిన భూమండలాన్ని అంతా శాసించాడు.

అహీనగుని తరువాత అతని సుతుడు పారియాత్రుడు రాజ్యానికి వచ్చాడు. ఉన్నత శిరస్సుచే అతను పారియాత్రాన్ని మించినవాడు. అతనికి శీలుడనే కుమారుడు పుట్టాడు. శీలుడు నిజంగా ఉదారశీలుడు, విశాలవక్షుడు. శత్రువులను చీల్చి చెండాడే శౌర్యం అతనిది. అతన్ని లోకం ఎన్నో విధాల పొగిడింది. వేలెత్తి చూపడానికి వీలులేని సత్ప్రవర్తన అతనిది. అలాంటి కుమారుడికి పట్టం కట్టి పారియాత్రుడు తాను చరితార్థుడైనట్లు ఎంచుకున్నాడు.

అయితే, రాగరక్తుడైన పారియాత్రుడికి ఇంకా రాజభోగాలపై ఇచ్ఛ పోలేదు. విలాసినులు ఇంకా ఆయన సుందర రూపాన్ని కోరుతూనే ఉన్నారు, అయినా ఎంతకాలం? జరాదేవి అతన్ని చూచి అసూయ పడింది! అతనికి వృద్ధాప్యం వచ్చింది. అంతట శీలుడే సకల రాజ్యభారాన్ని వహించాడు.

శీలుడి కుమారుడు ఉన్నాభుడు. లోతైన నాభి అతనిది. సకల రాజలోకానికి అతను నిజంగానే నాభిప్రదేశం వలె శోభిల్లాడు. ఉన్నాభుని కుమారుడు వజ్రనాభుడు. తండ్రి అనంతరం రాజై మూడు లోకాలలోనూ ప్రసిద్ధి కెక్కాడు. వజ్రనాభుడు ఇంద్రునితో సమానమైన తేజస్సు కలవాడై రణరంగమున వజ్రఘోషుడై వెలుగొందాడు.

వజ్రనాభుని నిర్యాణానంతరం అతని సుతుడు శంఖణుడు పుడమికి నాథుడైనాడు. శత్రునిబర్హాణలో అతనికి అతనే సాటి! ఆ ప్రతాపశాలిని రత్నగర్భ అయిన ఈ పృథ్వి అమూల్య రత్నాలు కానుకలుగా సమర్పించి సేవించింది.

శంఖణుని తరువాత అతని కుమారుడు వ్యుషితాశ్వుడు రాజైనాడు. అతని కాలంలో అశ్వసంపద అపారంగా వృద్ధి పొంది సముద్రతీరాలలో అతను అశ్వికులైన సైనికులను నిలిపి తన పేరు సార్థకం చేసుకున్నాడు. వ్యుషితాశ్వుడు విఘ్నేశ్వర భక్తుడు. గణపతిని పూజించి విశ్వసహుడనే కుమార రత్నాన్ని కన్నాడు.

విశ్వసహుడు రాజై అనేక సంవత్సరాలు భూమిని పాలించాడు. అతని కుమారుడు హిరణ్యనాభుడు. అతను హిరణ్యాక్ష వైరి యగు విష్ణుమూర్తి అంశతో జన్మించినవాడు. విశ్వసహుడు అతనికి రాజ్యం అప్పగించి తాను నారచీరలు ధరించి అడవులకు వెళ్ళిపోయాడు.

సూర్యవంశానికి చంద్రతుల్యుడైన ఉత్తర కోసల దేశాధిపతి హిరణ్య నాభునికి కౌసల్యుడనే సుతుడు జన్మించాడు. చందమామలా ఆ బాలుడు సకల లోకాలకి ఆనందం కలిగించాడు. కౌసల్యుడు రాజై ప్రజలను పాలిస్తున్నప్పుడు అతని కీర్తిచంద్రికలు బ్రహ్మలోకం వరకూ వ్యాపించాయి. పిమ్మట తన కుమారుడు బ్రహ్మిష్ఠుని రాజ్యపదవిలో నియమించి కౌసల్యుడు తాను బ్రహ్మపదం అందుకోడానికై వెళ్ళిపోయాడు.

బ్రహ్మిష్ఠుడు బ్రహ్మవేత్త, కులదీపకుడు. అతని పాలనలో ప్రజలు బాధలనేవి ఎరుగరు. అతనికి పుత్రుడనే సత్పుత్రుడు పుట్టాడు. దానివలన సంతానవంతులలో శ్రేష్ఠడనిపించుకున్నాడు బ్రహ్మిష్టుడు! తరువాత బ్రహ్మిష్టుడు తన కుమారునిపై రాజ్యభారం మోపి తాను మోక్షగామి అయినాడు. త్రిపుష్కరాది తీర్థాలు సేవిస్తూ తుదకు స్వర్గలోకం చేరుకున్నాడు.

పుత్ర మహారాజుకు తన అర్ధాంగి యందు లోకోత్తరుడైన సుతుడు జన్మించాడు. పుష్యపూర్ణిమ నాడు జన్మించిన ఆ బాలుడు పుష్యరాగం వంటి మేని ఛాయ కలవాడు కావడం చేత అతనికి పుష్యుడని పేరు పెట్టారు! రెండవ పుష్యనక్షత్రంలా వెలుగొందే ఆ కుమారజననంతో ప్రజలంతా పరిపూర్ణ పుష్టిని పొందాడు.

పుష్యుడికి యుక్త వయస్సు రాగానే పుత్రుడు అతనికి రాజ్యం అప్పగించి తాను పారమార్థిక చింతనలో నిమగ్నుడైనాడు. పుత్రభూపాలుడు జైమిని మహర్షికి శిష్యుడయినాడు. ఆ మహర్షి వద్ద యోగవిద్య అభ్యసించి జన్మరాహిత్యం చేసుకున్నాడు.

పుత్రుని అనంతరం రాజ్యానికి వచ్చి పుష్యుడు కొంతకాలం ప్రజారంజకంగా పరిపాలన చేశాడు. తరువాత అతని కొడుకు ధ్రువసంధి రాజైనాడు. అతను చాలా ఉత్తముడు. శత్రువులు కూడా సద్గుణరాశి అయిన అతన్ని ద్వేషించి ఎరుగరు.

ధ్రువసంధికి సుదర్శనుడనే పుత్రుడు జన్మించాడు. ఆ కుమారుడు పురుటిలో ఉండగానే ధ్రువసంధి వేటకై వెళ్ళి అక్కడ సింహం వల్ల మరణించాడు. అప్పుడు మంత్రులు, పురజనులు ఎంతో దుఃఖించారు. రాజ్య రమణి అనాథ కాకుండా ఉండడానికై అందరూ యోచన చేసి పసివాడైన సుదర్శనుని రాజుగా చేశారు. ఆ బాలరాజు ఆధారంగా నిలచిన రఘువంశం,

నెలబాలునితో కూడిన ఆకాశంలా, సింహప్పిల్లతో కూడిన అడవిలా, మొగ్గతొడిగిన తామరతీగలా భాసించింది.

అయితే సుదర్శనుడు తండ్రి అంతటి వాడవుతాడని అప్పుడే అంతా అనుకున్నారు. అవును మరి – మేఘం మొదట్లో చిన్న తునకలా ఉండి, తరువాత గాలి వల్ల దిక్కులన్నీ నిండుతుంది!

ఆరేండ్ల వాడైన సుదర్శనుడు రాజవేషంలో ఏనుగు ఎక్కి, మావటివాని సహాయంతో రాజవీధిలో వెడుతూ ఉంటే, పురప్రజలంతా చూచి అతని తండ్రిగారిని చూచినట్లే భావించుకునేవారు! ఆ బాలుడు బంగారు సింహాసనంపై కూర్చున్నప్పుడు చూడముచ్చట వేసేది! సామంత రాజులు ఆ చిన్నారి చక్రవర్తి పాదాలకు తలలు వంచి నమస్కరించేవారు. రఘువంశపు రాజుల పట్ల తమ శ్రద్ధాభక్తులు వ్యక్తం చేసేవారు. అవును – చక్రవర్తి చిన్నవాడైతేనేం ? పెద్దవాడైతేనేం ? ఇంద్రనీలమణి చూడడానికి చిన్నదే – కాని ప్రకాశంలోనూ, ప్రభావంలోనూ గొప్పది! అలాగే ఆ రాకుమారుడు వయస్సులో బాలుడైనా, తేజస్సులో మిన్న అయి మహారాజు అనడానికి తగి ఉన్నాడు.

ఇరువైపులా భృత్యులు నిలచి చామరాదులు వీస్తూ ఉంటే ఆ బాలరాజు ముంగురులు నాట్యమాడేవి! అయినా ఆ పసివాడు ఏది పలికితే అది ఆజ్ఞగా శిరసావహించేవారు రాజోద్యోగులు. ఆ మాటకు ఎక్కడా తిరుగు ఉండేది కాదు. తిలకం దిద్దిన ముఖాన బంగారుపట్టం కలిగి, చిరునవ్వులు ఒలకపోస్తూ, ముద్దులు మూటకట్టుతూ శత్రువుల ముఖాలను తిలక రహితంగా చేసేవాడు! కుసుమకోమల దేహుడైన ఆ కుమారునికి సొమ్ములు, ఆభరణాలు, అలంకారాలు బరువుగా ఉండేవి! అయినప్పటికీ అతను భూభారాన్ని మాత్రం అనాయాసంగా భరించాడు!

బాల సుదర్శనుని వక్షస్థలం లక్ష్మీదేవి విశ్రమించదగి నంతగా విస్తరించ లేదు! అయినప్పటికీ శ్వేతచ్ఛత్రం నెపంతో రాజ్యలక్ష్మి ఆ బాలుని సిగ్గుతో కౌగలించుకున్నట్లు కనిపించింది! ఆ బుడుతని భుజం వింటి నారి పోటులకు కాయలు కాచలేదు. కత్తి పిడిని తాకనైనా తాకలేదు! అయినప్పటికీ వసుంధర అతని భుజాన్ని ఆశ్రయించి సురక్షిత అయింది.

రోజులూ, సంవత్సరాలూ గడిచాయి. సుదర్శనుడు పెరిగి పెద్ద వాడైనాడు, అతని అవయవాలు ఇప్పుడు పుష్టిగా ఎదిగాయి. వాటితో పాటు అతని బుద్ధి కూడా వికసించింది. గుణాలు కూడా వృద్ధి పొందాయి. పుట్టకముందే సకల విద్యలూ నేర్చినట్లుగా సుదర్శనుడు గురువులకు ఏ మాత్రం శ్రమ లేకుండానే వేద వేదాంగాలూ, శస్త్రాస్త్రవిద్యలూ! క్షత్రియో చితమైన రాజనీతి నేర్చుకుని సకల కళాపారంగతుడైనాడు!

విద్యలన్నీ ఎంత సులభంగా నేర్చుకున్నాడో అంత సులభంగానే ప్రజలను వశపరచుకున్నాడు సుదర్శనుడు! అతనికిప్పుడు యౌవనం వచ్చింది. యువతులు రెప్ప వాల్చకుండా దృష్టి నిలిపి చూడదగినదీ, మన్మథుడనే తరువుకు పువ్వు వంటిదీ. అనురాగమనే చిగురు కలదీ. మానవులందరికీ సహజమైనదీ. సమస్త అవయవాలలోనూ అంకురించి, ఆభరణాలన్నిటికీ ఆభరణం లాంటిదీ, మొట్టమొదటి విలాస స్థానమైనదీ, మధురమైనదీ అయిన యౌవనం రాగానే సుదర్శనుడికి వివాహం చేయాలని మంత్రులు సంకల్పించుకున్నారు. దేశ దేశాల రాజకన్యల చిత్రపటాలు తెప్పించి అతనికి చూపించారు. అతనికి నచ్చిన  కన్యలతో వివాహం జరిపించారు.

# 19

సుదర్శనుడు రాజ్యరమణితో పాటు నిజరమణులను కూడి సకల భోగాలూ అనుభవించాడు. వయస్సు చెల్లిపోగా తన కుమారుడు అగ్నివర్ణుడికి రాజ్యం అప్పగించి తాను నైమిశారణ్యానికి వెళ్ళిపోయాడు. సమస్త భోగాలూ త్యజించిన ఆ రాజు, తపోవనాలలో తీర్థస్నానాలనే పన్నీటి జలకాలుగా భావించాడు! దర్భల పాన్పులనే హంసతూలికా తల్పాలుగా ఎంచుకున్నాడు. పర్ణశాలలనే పసిడిమేడలుగా తలచాడు! ఆ విధంగా అతను కఠోరవ్రతుడై తపస్సు చేసి తుదకు మోక్షపదం అందుకున్నాడు.

తండ్రి సుదర్శనుడు ఇచ్చిపోయిన రాజ్యాన్ని అగ్నివర్ణుడు సిద్ధాన్న వలె హాయిగా అనుభవించాడు! శత్రువులందరినీ తండ్రే జయించి, రాజ్యాన్ని నిష్కంటకంగా చేసి ఉండడం చేత రాజ్యపాలనలో అగ్నివర్ణుడికి ఎలాంటి కష్టం లేకపోయింది. తండ్రి ఆర్జించినది అనుభవించడమే అతని వంతు అయింది. తన వంశీకుల మర్యాదలను అతిక్రమించకుండా అతను కొంతకాలం రాజ్యం చేశాడు. తరువాత పరిపాలనా బాధ్యతలు మంత్రులకు అప్పగించి తాను కేవలం భోగాలలో మునిగి తేలుతూ వచ్చాడు.

విలాసవతుల సన్నిధానమే అగ్నివర్ణ మహారాజుకు లోకమై పోయింది. అహోరాత్రులు వారితో క్రీడిస్తూ సమస్త రాచకార్యాలూ విస్మరించాడు! స్త్రీ సంపర్కం లేకుండా అతను ఒక్క క్షణం కూడా నిలువలేకపోయాడు! ఆ విధంగా అతను అతికాముకుడయి రతికేళిలో మునిగి తేలుతూ వచ్చాడు.

ప్రజల కష్టసుఖాలు విచారించలేదు. తనను దర్శించ వచ్చిన జనులకు ముఖమైనా చూపలేదు, మంత్రులు, ఆప్తులు వచ్చి ఇది తగదని ఎన్నో విధాల చెప్పారు. బ్రతిమాలారు. అప్పుడు మాత్రం అగ్నివర్ణ మహారాజు విధిలేక ఒక్కసారి, తన భవనం గవాక్షం గుండా తన పాదం ప్రజలకు చూపాడు

అప్పుడే పొడిచిన సూర్యుని లేత కిరణాలు సోకినట్టి తామరలాగా, ఎర్రగా ఉన్న అతని కోమల చరణాన్ని తిలకించి, అతనిపై అభిమానం గల ప్రజలు నమస్కారాలు చేశారు.

ఆ రాజు, యౌవనం పొంగులెత్తే సుందరాంగుల గుబ్బచనుల తాకిడికి చలించే తామరపూలతోనూ, శృంగార మందిరాలను ముంచివేసే నీళ్ళతోనూ విలసిల్లే దిగుడుబావులలో జలక్రీడ లాడేవాడు. ఆ స్నానాల వేళ రమణుల కన్నుల కాటుక నీళ్ళలో కరిగిపోయేది. వారి పెదవులకు గల పాటలవర్ణం మాసిపోయేది. అయినా తరుణులను చూసి అతనెంతో ఆనందించేవాడు. ఆడ ఏనుగుల గుంపుతో కూడిన గజరాజు పద్మాల కొలనులో ప్రవేశించినట్లుగా అగ్నివర్ణ మహారాజు తన ప్రియురాండ్రతో కలిసి తీయని సువాసనలు వెదజల్లే పానప్రదేశాలకు వెళ్ళేవాడు. అక్కడ ఏకాంతంగా యువతుల ముఖాసనాన్ని పానం చేసేవాడు.

అతని అంకమున ప్రియురాలు లేని క్షణముండదు! స్వయంగా వీణ వాయించేవాడు. అతని పాటకు అనుగుణంగా నర్తకీమణులు నాట్యం చేసేవారు. వారి ఆటకు అనువుగా అతను స్వయంగా మృదంగం వాయిస్తాడు. అప్పుడా రాజు మెడలోని ముత్యాలహారాలు, ఇతర ఆభరణాలు. హస్తకంకణాలు అటూ ఇటూ కదులుతూ అభినయం చేస్తున్నట్లుండేవి.

అలా నృత్యం చేసి, అలసిపోయిన నర్తకీమణులను అతను దగ్గరికి తీసుకుంటాడు. వారి ముఖాలపై పోసిన చిరు చెమటలను స్వయంగా తుడిచి వారి పెదవులను తనివితీరా ముద్దాడేవాడు. ఇలా ఆ మహారాజు దేవేంద్రుని, కుబేరుని మించిన భోగజీవితం అనుభవిస్తూ వచ్చాడు. ఆ సరసజ్ఞుడు నిత్య యౌవనుని వలె, ఎప్పటి కప్పుడు నూతన భోగద్రవ్యాలను అనుభవించాలని అభిలషించేవాడు.

ప్రియురాండ్రు కూడా ఆ రసిక ప్రియుని ఎన్నో విధాలైన శృంగార చేష్టలతో ఆనందింపజేసేవారు. వారు ఒకసారి తమ్ము మోసగించావని అతనిని వ్రేళ్ళతో బెదిరిస్తారు. ఒకప్పుడు అతని వంక చురచుర చూస్తారు. మరొకసారి తమ బంగారు మొలనూళ్ళతోను, చీర కొంగులతోను అతన్ని బంధించి ఉంచుతారు. అయితే విలాసవతులు విధించే ఈ శిక్షలన్నీ ఆ శృంగారలోలుడు ప్రీతిపూర్వకంగా భరిస్తూ వచ్చాడు.

ప్రియురాండ్రు తమ వంతుల ప్రకారం ప్రతిరాత్రీ అతని వద్దకు దూతికలను పంపేవారు. ఆ భోగి వారిని వెంబడించి ఏకాంత భోగమందిరాలకు వెళ్ళేవాడు. ఒకవేళ ఆ రాజుతో ఆనాడు తమకు సంయోగం కలుగదేమోనని భయంతో కామినులు దీనంగా ఆక్రోశించేవారు. తను పరిణయమాడిన రాణులతో భోగించవలసి వచ్చినప్పుడు ఆ రసికజన మనోరాముడు, ఇక తనకు వేశ్యాంగనల పొందు లభించదేమోనని దిగులు పడేవాడు! ఆరాటం తీరక ఆ వారకాంతల చిత్రపటాలు లిఖిస్తూ ఎలాగో కొంత సంతృప్తి పడేవాడు.

ఈ సమయం మరల రాదన్నట్లు తమ భర్త మరల ఎటు వెడతాడోనని భయపడుతున్నట్లు, సవతులపై అసూయ పట్టలేనట్లు అంతఃపుర కాంతలు, వసంతోత్సవాలని సాకుపెట్టి కామోద్రేకంతో అతనిని కూడి కాముక క్రీడల తేలియాడేవారు.

అయితే రాజు తమ వద్దకు వచ్చినప్పుడు, అతను మరెవతెనో కలిసి వచ్చాడన్న గుర్తులు చూసి ప్రియురాండ్రు కోపం తెచ్చుకునేవారు. ఆ ఖండిత నాయికల హృదయావేదనను చల్లార్చటానికి అతను ప్రయత్నించేవాడు. వారు అతనితో ఆవేళ సుఖించి సంతుష్టి చెందేవారు. కానీ అతను మరల వేశ్యలతోనే విహరించడం చూచి వారు మిక్కిలి పరితపించేవారు.

నిద్రలో కూడా ఆ మహారాజు పియురాంద్రను గురించి కల వచ్చినట్లు కలవరిస్తాడు! ప్రక్కనున్న ప్రేయసికి సవతిపై ఎక్కడలేని మత్సరం పుట్టుకుని వచ్చేది. అయితే ఆమ అతనితో నీ విలా చేశావని తగవులాడదు. కప్పుకున్న వస్త్రం కన్నీటితో తడిసిపోయేటట్లు ఏడ్చేది. అలక చూపేది. అతను బ్రతిమాలినా, చేతి కంకణాలు చిట్లిపోయేటట్లు అతన్ని త్రోసివేసి రతికేళికి సమ్మతించేది కాదు.

ప్రియురాంద్రను కలుసుకోడానికై అగ్నివర్ణమహారాజు దూతికల వెంట పొదరిండ్లకు వెళ్ళేటప్పుడు కామోద్రేకం పట్టలేక మార్గ మధ్యంలో దూతికలతోనే సంభోగ సౌఖ్యాలు అనుభవించేవాడు. అంతఃపుర కాంతలు చూస్తారేమోనని ఒక వైపు లోపల భయం పీడిస్తున్నప్పటికీ అతను మన్మథోద్రేకానికి తాళలేక అలా చేసేవాడు! అయితే ఆ దూతికను అతను తన ప్రియురాలి పేరుపెట్టి పిలిచేవాడు. 'ఆహా! ఇన్నాళ్ళకు నీవు నాకు లభ్యమైనావు. నా కోర్కె నేటికి తీరింది!' అని పలవరించేవాడు.

ఆ శృంగార లోలుడు క్రితం రాత్రి ఎలాంటి సంభోగసుఖం అనుభవించినదీ మరునాడు ఉదయం, ఆయన పాన్పు చూస్తే చాలు, తెలుస్తుంది! అతను నిద్ర లేచేటప్పటికి ముఖాన తిలకం చెరిగిపోయి ఉంటుంది. పూలదండలన్నీ నలిగి వాడిపోయి చెల్లాచెదురుగా పాన్పుపై పడి ఉంటాయి. మొలనూలు ముక్కలు ముక్కలుగా తెగి పడి ఉంటుంది! పాన్పుపై అంతటా పారాణి గుర్తులు కనిపిస్తాయి.

ప్రియురాంద్ర పాదాలకు స్వయంగా పారాణి దిద్దుతాడతను. అప్పుడా కాంతల చీరలు జారిపోతాయి. వారి జఘన ప్రదేశాలు కానవస్తాయి. అప్పుడతను మోహతాపాన్ని భరించలేడు. అందువల్ల పారాణి చక్కగా దిద్దలేక, మధ్యలోనే ముగిస్తాడు. మన్మథ వికారంతో ప్రియురాంద్ర అధరాలు ముద్దాడుతాడు, వారు చేతులు అడ్డం పెడుతున్నా ఆగక వారి కోక ముడులు విప్పివేస్తాడు.

ప్రియురాండ్రు నిలువుటద్దాల ముందు నిలుచుని, తమ అవయవాలపై సంభోగ చిహ్నాలను చూచుకుంటూ లోలోపల మురిసిపోతారు! అప్పుడా వనితాలోలుడు వారికి తెలియకుండా, రహస్యంగా వెనుక నుంచి వచ్చి, వారి వెనకాల నిలుచుంటాడు. అద్దంలో అతని నీడ చూసి పాపం, వారు చెప్పలేనంత సిగ్గుతో కుంచించుకుని పోతారు. తలలు వాల్చుకుంటారు.

తెల్లవారే వేళ అతను పాన్పు దిగి వెళ్ళిపోయేటప్పుడు ప్రియురాండ్రు అతన్ని సులభంగా వెళ్ళనిచ్చేవారు కాదు. అతన్ని తమ వైపు త్రిప్పుకుని, మెల్లగా తమ చేతులు అతని కంఠాన్ని చుట్టివేశేవారు. అతని పాదాలను తమ పాదాలతో నొక్కిపట్టి, కడసారి ముద్దు ఇమ్మని బ్రతిమాలేవారు. ప్రియురాండ్ర సంభోగ చిహ్నాలే ఆ రాజుకు పెట్టని ఆభరణాలయినాయి. రాజ చిహ్నాల కంటె అవే ఆ రాజుకు అన్ని విధాల తగి ఉన్నట్ల కనిపించేది.

ఒక్కొక్కప్పుడు ఏదో అత్యవసరమైన కార్యం ఉన్నదని సాకు చెప్పి ఆ రాజు వెళ్ళిపోతూ ఉంటే ప్రియురాండ్రు అతని ముంగురులు పట్టుకుని నిలుపుతారు.

"ప్రియా! ఎందుకీ నటన ? నీవు ఎక్కడికి వెళ్ళేది మాకు తెలుసులే. నీ రహస్య వర్తనాలు మేము ఎరుగనివి కావులే" అని దెప్పిపొడుస్తారు.

రతికేళిలో అలసిపోయిన రమణులు, కంఠసూత్రం అనే ఆలింగన క్రియ నెపంతో అతని విశాల వక్షస్థలంపై వాలిపోతారు. ఆ విధంగా తమ చన్నులతో అతన్ని గట్టిగా నొక్కుతారు. ఆ స్తనాలకు అలదుకున్న చందనం అతని వక్షస్థలానికి అతుక్కుంటుంది.

"మహారాజు రాత్రివేళ రహస్యంగా ఏ ప్రియురాలి వద్దకో వెడుతున్నాడు" అని దూతికలు కనిపెట్టి చెప్పగా విన్న ప్రియురాండ్రు ఆగలేక వెంటనే అతని జాడ కనుక్కొని ఎదురుగా వెడతారు.

'మన్మథాకారా! మమ్మల్ని విడిచి ఎక్కడికయ్యా వెడతావు ? నీకిది న్యాయమేనా ?' అని అడ్డగిస్తారు.

కలువపూల కొలను రాత్రివేళ చంద్రకాంతి అనుభవిస్తూ మేల్కొన్నట్లు కళకళ లాడుతుంది. పగలు రాగానే నిద్రిస్తున్నట్లు ముడుచుకుని పోతుంది. అలాగే ఆ రాజు కూడా రాత్రిళ్ళు చంద్రవదనాలతో సుఖిస్తూ మేల్కొంటాడు. పగళ్ళు అలసిపోయి నిద్రపోతాడు!

ఆ రాజశేఖరుని దంతక్షతాల వల్ల పెదవులు గాయపడి బాధపడుతున్న ప్రియురాండ్రకు ఊరుపీడనం కూడా కలిగించాలన్నట్లు వీణ తొడపై పెట్టుకుని వాయించమని అడుగుతాడతను. అప్పుడా తరుణులు "ప్రియా! అన్నీ తెలిసి కూడా మమ్ములనిలా బాధిస్తా వెందుకు ?" అని బ్రతిమాలుతారు. అతనివంక కోపపు చూపులు ప్రసరింపజేస్తారు. కోపంలో ఆ కోమలాంగులు మరింత అందంగా కనిపిస్తా రా రాజు కళ్ళకు!

ఏకాంతమందిరాలలో ఆంగిక, సాత్విక, వాచికాలనే మూడు విధాల అభినయరీతులతో ప్రియురాండ్రు, మనోహరంగా నృత్యం చేస్తుంటే అతను పరవశుడై ఈ లోకాన్నే మరచిపోతాడు. ఆప్తులతో, మిత్రులతో సభ తీర్చి నాట్యాచార్యులతో గోష్ఠి జరుపుతాడు.

వర్షాకాలం వస్తే చాలు, ఆ కళా ప్రియుడు కుటజ పుష్పమాలలు, అర్జున పుష్పహారాలు ధరిస్తాడు. కడిమిపూల పరాగం అంగరాగంగా అలదుకుంటాడు. ప్రియురాండ్రతో కలిసి మయూరాలు నృత్యం చేసే మనోహర క్రీడా శైలములందు విహరిస్తాడు. రతివేళ ప్రేయసి అలుకతోను, ప్రణయకోపం తోను పెడముఖం పెట్టి ఉంటే ఆ రాజు అంత తొందరపడి ఆమెను అనునయించడానికి ప్రయత్నించడు! ఆమే తన కౌగిట్లోకి రావాలని ఆశిస్తాడు.

శరద్రాత్రులలో దివ్యములైన భవనాల పై అంతస్తులలో శరచ్చంద్ర చంద్రికా శోభను తిలకిస్తూ విహరిస్తాడు. ఆ శరద్రాత్రులలో వెన్నెల ఆ ప్రభువుకు సురతశ్రమను పోగొట్టేది. భవనం గవాక్షం గుండా సరయూనదిని వీక్షించేవాడు. హంసల బారులే మొలనూలు వలె, సైకతస్థలాలే జఘనసీమ వలె ఉంటూ తన ప్రియురాండ్ర విలాసాన్ని అనుకరిస్తున్న ఆ సరయూనదిని చూచి అతను ఎంతో ఆనందం పొందేవాడు.

ఆ హేమంత వెన్నెల రాత్రులలో పొదరిండ్ల మధ్య ప్రియురాండ్రు దాగి ఉంటారు. అతను వారిని వెదుక్కుంటూ వస్తాడు. ఎప్పుడెప్పుడు వారి పోకముడులు విప్పుదామా అని అతను ఆతృతపడతాడు. వారు మాత్రం అతనిని పిలువరు. అయినా అగరువత్తుల పొగను బట్టి, పైటల మర్మర ధ్వనిని బట్టి, మొలనూళ్ళ చప్పుడును బట్టి వారున్నచోటు అతను ఇట్టే కనిపెడతాడు. ప్రియురాండ్రు కూడా అతని ఎడబాటును ఇంచుక సేపయినా సహించలేక, అతనిని వెదుక్కుంటూ వస్తారు.

ఉద్యానవనాలలో ప్రియరాండ్రను ప్రక్కన కూచోబెట్టుకుని ఉయ్యాల లూగుతాడు ఆ రాజు. అయితే, పెద్ద ఊపు వచ్చినప్పుడు పడి పోతామేమోనన్న భయంతో వారు అతన్ని గట్టిగా కౌగలించుకుంటారు. అది అతనికెంతో ఆనందం కలిగిస్తుంది.

ఆ విధంగా అగ్నివర్ణమహారాజు ఒక్క వసంతంలోనే కాక అన్ని ఋతువులలోనూ, ఆయా కాలాలకు తగిన వేషమూ, అలంకారాలూ తాల్చి ప్రియురాండ్రతో సుఖిస్తూ వచ్చాడు. ఎంత సుఖించినా అతనికి కామం అధికమవుతున్నదే కాని తరుగుట లేదు! ఆ రాజు ఇలా పరిపాలనా విషయాలు ఏ మాత్రం పట్టించుకోకుండా మన్మథరాజ్యాన్ని మాత్రమే ఏలుతున్నప్పటికీ తేజస్వి కావడం వల్ల పరరాజు లెవరూ అతని రాజ్యం ఆక్రమించడానికి

సాహసించలేదు. అయితే ఆయన ఆరోగ్యాన్ని మాత్రం ఒక మహావ్యాధి ఆక్రమించుకున్నది! భోగలాలసుడయి ఏండ్ల తరబడి నిరంతరం స్త్రీ సంభోగ సుఖాలలో మునిగి తేలుతూ రావడం వల్ల అగ్నివర్ణ మహారాజుకు, చంద్రుడికి దక్ష శాపం సంభవించినట్లు, ఘోరమైన క్షయవ్యాధి సంభవించింది!

ఇంతటి భయంకరమైన వ్యాధిచిహ్నాలు తన వంటి మీద ప్రత్యక్షంగా కనిపిస్తున్నప్పటికీ, శృంగార ప్రియుడయిన ఆ మహారాజు వైద్యుల మాట వినలేదు! వారి సలహాలు లక్ష్యపెట్టలేదు. ఆ రాజు దేహం చిక్కిపోయింది. తెల్లగా పాలిపోయింది. దారుణమైన వ్యాధి అతని సర్వావయవాలనూ పట్టి పీడించింది.

అగ్నివర్ణమహారాజు ఇలా క్షయరోగ పీడితుడు కాగా, అప్పుడు రఘువంశం ఒక్క కళ మాత్రమే మిగిలిన చంద్రుడు గల ఆకశంలా అయింది. గ్రీష్మఋతువులో బురద మాత్రమే మిగిలిన మడుగు లాగాను, వత్తి కాలిపోతూ కొస మాత్రమే మిగిలిన దీపపాత్రలాగాను కనిపించింది ప్రశస్తమైన రఘువంశం.

మహారాజు ఆరోగ్య పరిస్థితిని గురించి ప్రజలంతా మిక్కిలి ఆందోళన చెందుతున్నారు. అయితే, మంత్రులు మాత్రం ఆ విషయం బయటికి పొక్కనివ్వలేదు.

"సంతానం లేని మహారాజు ఇప్పుడు, సంతాన ప్రాప్తికోసం పూజలు, జపాలు చేస్తున్నారు!" అని ప్రజలకు చెప్పారు.

కానీ అగ్నివర్ణుడికి సంతానం లేదు. అసంఖ్యాకంగా స్త్రీలతో కూడి ఉన్నప్పటికీ పుత్రప్రాప్తికి నోచుకోలేదు. దీపశిఖ గాలి తాకిడికి తట్టుకోలేనట్లు, ఆ దారుణ రోగబాధ అతను తట్టుకోలేకపోయాడు! గాలికి దీపం ఆరినట్లు, ఆ రోగం ఆ రాజు ప్రాణాలను హరించివేసింది!

అప్పుడు మంత్రులు మాత్రం ప్రభువు మరణవార్త బయటికి పొక్కనివ్వలేదు. రాజు రోగశాంతికై దేవతారాధన జరుగుతున్నదని సాకు చెప్పారు. రాజప్రాసాదంలోని ఉపవనంలోనే రాజు కళేబరానికి రహస్యంగా అగ్ని సంస్కారం జరిపించారు.


తరువాత అమాత్యులంతా ఆలోచించి పౌరులలోనూ, జానపదుల లోనూ ముఖ్యులైన వారు కొందరిని రప్పించి ఒక సభ జరిపారు. అప్పటికి రాజు భార్యలలో ఒకామె గర్భవతిగా ఉన్నట్లు రూఢిగా వారు తెలుసుకున్నారు. ఆ రాణికే ఈ రాజ్యం అప్పగించాలని సభలో తీర్మానించారు.

మహారాజు మరణానికి శోకతప్తమై ఉన్న రాణి, కనక కుంభముల నుండి జాలువారిన పట్టాభిషేక జలధారతో చల్లబడి సంప్రీతి పొందినట్లు కనిపించింది.

అగ్నివర్ణమహారాజు ధర్మపత్ని అయిన ఆ మహారాణి ప్రజల అభీష్టానుసారం, రాజ్యపరిపాలనా బాధ్యత స్వీకరించింది. శ్రావణ మాసంలో నాటే విత్తనాన్ని భూమి భరించినట్లుగా, గర్భభారాన్ని, రాజ్య భారాన్ని వహించింది. ఏ నాటి నుంచో తమ కొలువులో ఉన్న వృద్ధ మంత్రులనూ, రాజోద్యోగులనూ అండగా చేసుకుని, వారి ఉపదేశాలు పాటిస్తూ భర్త విడిచిపెట్టి పోయిన కోసల రాజ్యాన్ని పరిపాలిస్తూ వచ్చింది.

**- సమాప్తం -**

































జయంతి
పబ్లికేషన్స్
విజయవాడ-2